
# సద్గురు సుభాషితాలు



సద్గురు జగ్గీవాసుదేవ్

ఎమెస్కో

# సద్గురు సుభాషితాలు



సద్గురు జగ్గీ వాసుదేవ్

**సద్గురు సుభాషితాలు**
'స్వాతి' సపరివార పత్రిక సౌజన్యంతో...
సద్గురు జగ్గీ వాసుదేవ్

# ఆశపడే ముందు...

భారతీయ జీవిత మూల్యాలు ఆధ్యాత్మికతలో నిక్షిప్తమై ఉన్నాయి. భావలేమి ఆధ్యాత్మికత జీవన మూల్యాన్ని పెంపొందించుకోడానికే కాదు, ప్రశ్నించడానికీ అవకాశాన్ని కల్పించింది.

జీవితంలో కొన్ని అవకాశాలు విశేషమైనవి తలవని తలంపుగా వచ్చి చేరుతాయి. ఈ అనుస్వజన అవకాశం నాకలా లభించిందే. ఈ సంకలనంలో 52 ఉపన్యాసాలున్నాయి. ప్రతి ఒక్కటి విశేషమైన అంశమే. మానవ 'జీవితంలో బాధలకు ఆధారం ఆశ' అన్న బుద్ధుడి ఆలచోన ఎందరినో ప్రభావితం చేసింది. సద్గురు జగ్గీ వాసుదేవ్‌గారి మాటల్లో చెప్పాలంటే, "అన్నిటినీ ఆశించు' అన్న మంత్రం మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. ఆశించటం అంటే తన గురించి తెలియకుండా అన్నీ తనకే దక్కాలనే దురాశను కానీ అత్యాశను కానీ సద్గురు బోధించడం లేదు. చేసే ప్రతి పని మీద మేధా పరిపూర్ణమైన ఆసక్తి అవగాహన ఇష్టం పెంపొందించుకుంటే ఆశ తానే పుడుతుందన్నది సద్గురు ప్రధానమైన బోధ. త్యజించడం కాదు ప్రధానం, దేనినైనా సాధించటం నేర్చుకోవాలి, గెలుపు కోసం మనిషి సరైన పంథాలో పయనిస్తే తగిన ప్రయత్నాలతో దేన్నైనా సాధించవచ్చు. మనిషి ప్రతి విషయాన్నీ ఎంతో జాగ్రత్తగా ఆలోచించి విశ్లేషించి మనసారా ఒక పనిని చేయాలన్న ప్రయత్నం వల్ల తప్పక గెలుపు పొందుతాడు.

మానవ మనస్సు విచిత్రమైంది. గెలుపు ఓటముల్ని ఒకేలా చూడలేదు. ఏ చిన్న గెలుపుకైనా ఆనందపడే మనిషి, ఓటమి ఎదురవగానే కుంగిపోతాడు. మానవుడి మనస్సులో ఎన్నో ప్రశ్నలు తలెత్తడం సహజం. అందులోనూ దేవుడున్నాడా? జాతకాలు నిజమా? దేవుడికి కోపం వస్తుందా? విధుల్ని నిర్ణయించేదెవరు? ప్రేమ అనేది నిజమా మాయా? అసలు ఏది సరి ఏది కాదు? కాలదేశాలను బట్టి దోషాలు మారుతుంటాయి కాదా. మరి ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఎవరు చెప్తారు. సద్గురు ఉపన్యాసాల్లో ఇటువంటి ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. దైనందిన జీవితంలో తలెత్తే ప్రశ్నలకు సమాధానాలను చెప్తూనే వ్యక్తి జీవితంలో ఏ విషయాల పట్ల ఆసక్తి చూపాలి, విజయపథంలో అడుగిడటానికి చేయాల్సిన వేంటి? వేయాల్సిన అడుగులు ఏంటి? అనేవి ఎంతో జాగ్రత్తగా ప్రతి అడుగూ సరి చూసుకోమని చేసే హెచ్చరికగా ఉంటాయి.

ఇన్ని వివరాలు చెప్పినా ప్రతి విషయం పట్లా ఆసక్తితో చేసే ప్రతి ప్రయత్నం మనఃపూర్వకంగా ఉంటే గెలుపు తప్పని సరి అని చెప్తున్న సద్గురు ఏ మతం పట్లా ప్రత్యేకమైన ఆసక్తిగానీ, ఏ సంస్కృతిపట్లా అభిమానంగానీ లేకుండా అన్ని విషయాల్నీ సమానంగా చూస్తూ చేసే పని పట్ల అభిమానాన్ని పెంచుకోమని నేర్పిస్తారు. ప్రతి విషయాన్నీ వివరించేటప్పుడు ఆసక్తి కలిగించాలని పిట్ట కథలుగా చెప్తూ మనిషిలోని ఇష్టాయిష్టాలకు, ఆశలకు, ఆవేశాలకు, స్వార్థానికీ అన్నింటికన్నా పైన తాను అనుకునేవన్నీ సరే, చెసేవన్నీ సరే అనీ ఎదుటివాళ్లు చేసేవన్నీ తప్పనీ అనుకునే మనసుకు ప్రతీకగా శంకరం పిళ్ళై అనే పాత్రను సృష్టించారు.

ధ్యాన లింగాన్ని రూపొందించి యోగాను మానవ జీవన పంథాగా మారుస్తూ, వివరిస్తూ, వివరిస్తూ ఏకతా భావనను పెంపొందిస్తున్న తీరు బోధపడుతుంది. మతాలు జాతులతో సంబంధం లేనిది ధ్యాన లింగం.

సాధారణంగా తప్పు అని భావింపబడుతున్న వాటినెన్నింటినో సద్గురు ప్రత్యేక కోణంలో చూస్తారు. అవన్నీ నేరాలు కావని ప్రతి విషయంలోనూ, ప్రతి ఒక్కరిలోనూ మంచిని చూడాలన్నదే సద్గురు భావన. ప్రతి విషయంలోనూ ఆసక్తి చూపినపుడు, మంచినే వెతికినపుడు అన్నీ బాగుంటాయని వీరి అభిప్రాయం.

సద్గురు తాను ఆధ్యాత్మిక వాదినంటూ ప్రజలనుండీ దూరంగా ఉండరు. ప్రజల మధ్యకు వచ్చి వారితో సహజంగా సంభాషించడం వీరి ప్రత్యేకత. ఇటీవల స్వాతి కోసం ఈ అనుసృజనను చేస్తుండగా ఒకసారి సేలం దగ్గర ఒక పల్లెలో ఉచిత ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సద్గురు జగ్గీ వాసుదేవ్ గారిని చూసే అవకాశం లభించింది. ప్రతి ఒక్కరి ప్రశ్నలకు స్పందించి గొప్ప విషయాల్ని కూడా సామాన్య ప్రజలకు అర్థమయ్యేలాగా చిన్న చిన్న ఉదాహరణలతో సులభమైన పదజాలంతో వివరించటం వీరి గొప్పతనం.

స్వాతిలో ఇటువంటి శీర్షిక ప్రవేశపెట్టడం పాఠకుల నాడి తెలిసిన స్వాతి బలరామ్ గారికే తగును. ఈ శీర్షిక విజయవంతమయిందనడానికి ఈ పుస్తక రూపమే ప్రబల సాక్ష్యం. ఈ ప్రయత్నంలో నాకు భాగాన్నిచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలతో...

**– డా॥ జె.వి. సత్యవాణి**
అసోసియేటు ప్రొఫెసర్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎల్.టి.టి
ద్రావిడ విశ్వవిద్యాలయం

# సద్గురు సుభాషితాలు

**హి**మాలయ సానువులు. ఎంతో దూరప్రయాణం తరువాత ఆ యువకుడు అక్కడ దిగాడు. అతని రెండు బట్టల మూటలను మోసుకొంటూ, కొండ ఎక్కడానికి, అక్కడున్న గాడిదల్ని బాడుగకు మాట్లాడుకున్నాడు.

"ఎక్కడికి వెళ్లాలి సాహెబ్?" గాడిదను నడిపేవాడు అడిగాడు.

"ఏదైనా ఒక మంచి ఆశ్రమానికి పద"

"ఎన్నాళ్లు వుంటారు?" అనడిగాడు.

"రోజులా? ఇక నా జీవితం ఇక్కడే గడపాలనుకున్నాను. నా భార్యా పిల్లలు, అమ్మ, నాన్న, వ్యాపారం అన్నీ వదిలిపెట్టి వచ్చేశాను. ఇదుగో నా మెడలోవున్న ఈ బంగారు గొలుసు కూడా నీకిచ్చేసి వెళ్లిపోతాను"

గాడిదను తోలేవాడు ఆశ్చర్యపోయాడు. “ఇంత చిన్న వయసులో మీకు ఇదెలా సాధ్యం అయింది?”

ఆ యువకుడి ముఖంలో కాస్త గర్వం తొణికింది.

“మా ఊరు వచ్చిన ఒక గురువుగారు చెప్పినటువంటి విషయం నన్ను లోతుగా ఆలోచింపచేసింది. కదిలించింది. ఆశలే దుఃఖాలకు మూలకారణమట. అందుకే అన్ని ఆశల్నీ త్యజించి వచ్చేశాను”

“అన్నీ వదిలేసి మరి ఈ మూటల్లో ఏం తెచ్చారు సాహెబ్?” అని అడిగాడతను.

“ఇక్కడ చలి ఎక్కువని చెప్పారు. కావాలంటే దగ్గర్లో అంగళ్లు కూడా వుండవుకదా! ఈ మూటల్లో నాకు కావలసిన కంబళ్లు తెచ్చుకున్నాను”

కంబళి వద్దని వదిలేయలేకపోయినా, ఆశను త్యజించానని చెప్పుకుంటున్న ఆ యువకుడిలాగే ఎందరో ఆశను గెలిచామనీ, త్యజించామనీ (చెప్పుకుని తిరుగుతుంటారు) చెప్పుకుంటున్నారు.

ఆశలేనిదే ఈ ప్రపంచం లేదు. ఆశ లేనిదే ఈ శరీరం ఉండదు. ప్రాణం నిలవదు. దేనినీ ఆశపడకూడదని ఈ ప్రపంచము ఎప్పుడూ మీకు చెప్పలేదు. ఆశను వదిలివేస్తే అంతా సరిగా ఉంటుంది అనుకోవడం కంటే మూర్ఖత్వం మరొకటి లేదు. ఆశను త్యజించాలని నిశ్చయించుకున్నాను అంటూ మీ మనసు మిమ్మల్ని మభ్యపెడుతుంది. సన్న్యాసం గురించి ప్రసంగిస్తుంది.

మనసు చాలా తంత్రాలు నేర్చినది. ఏదేదో చెప్పి మిమ్మల్ని నమ్మించి ఏమార్చగలదు. ఆ చాకచక్యం దానికుంది. అయితే మరి శరీరం మాటేంటి? గాలి చొరబడకుండా మీ నోరు, ముక్కు మూసుకుని వేడుక చూడండి. ఒక్క నిమిషం, లేదా రెండు నిమిషాలు శరీరం సహిస్తుంది. తర్వాత, బతకాలనే కోరిక మీలో పుట్టి బలం పుంజుకొని మీ చేతిని బలవంతంగా నెట్టివేస్తుంది.

పోగొట్టుకున్న క్షణాల్ని కలిపి ఆక్సిజన్‌ను త్వరత్వరగా పీల్చుకొంటుంది. ఆశలు లేవంటూ మీ మనసు చెప్పే తాత్త్వికమైన కబుర్లు మీ శరీరం దగ్గర ఏమాత్రం పనిచేయవు. ఎందుకంటారు, దానికి అబద్ధం చెప్పి ఏమార్చడం చేతకాదు. శరీరం మొత్తం గురించిన మాటలెందుకు? అందులోని ప్రతి ‘జీవకణం’ ఆశతోనే జీవిస్తుంది.



అతిథిగానైనాసరే ఒక రోగక్రిమి అందులోకి ప్రవేశించనీయండి. వెంటనే ప్రతి ఒక ‘జీవకణం’ ఆయుధాల్ని సిద్ధం చేసుకొని పోరు మొదలుపెడతాయి.

ఎందుకలా? ప్రపంచం బతకాలనే కోరిక దానికి నేర్పింది. ఇంకా లోతుగా తరచి చూస్తే, ఆశను త్యజించాలని అనుకుంటే అది కూడా ఆశేకదా?

మీ ఊరికి ఒక సన్న్యాసి వచ్చాడు. “నువ్వు సంపద మీద ఆశ పెంచుకున్నావు. అదే నీ దుఃఖానికి కారణం. భగవంతుడి మీద ఆశ పెంచుకో” అంటాడు.

నీ దగ్గర పదికోట్ల రూపాయలున్నాయనుకుందాం. భగవంతుణ్ణి నమ్మి మీ డబ్బంతా పేదలకు పంచి ఇచ్చేస్తే నిశ్చింత దొరుకుతుందా? రేపట్నించి ఈ దేశంలోని పేదవాళ్లలో మీరు కూడా కలుస్తారు అంతే!

డబ్బు ఉంటే ఏమేం చేయవచ్చు అన్నదైనా మీకు తెల్సు. భగవంతుడి వల్ల ఏమవుతుంది? ఏం కాదు అనే విషయంలో మీకు అనుభవం లేదు.

“సంతోషం కోసం ఆశ పడకు. స్వర్గం కోసం ఆశ పడు. అధికారం కావాలని ఆశ పడకు. ప్రశాంతత కావాలని ఆశపడు” అంటూ ఏవేవో సందేశాలు వస్తూనే ఉంటాయి.

శంకరన్ పిళ్ళైకి ఒకసారి తాళలేని నడుంనొప్పి వచ్చింది. డాక్టర్ ఎక్స్‌రేని వెలుతుర్లో పరీక్షించాడు.

“ఈ ఎక్స్‌రే చూశారా? మీ వెన్నెముక బాగా దెబ్బతింది. ఆపరేషన్ చేయాలి” అన్నాడు డాక్టర్.

“ఎంత ఖర్చవుతుంది డాక్టర్?”

“నా ఫీజు రూ. 25,000. ఆస్పత్రిలో ఆరువారాలైనా వుండి రెస్ట్ తీసుకోవాలి” అని చెప్పాడు డాక్టర్.

పిళ్ళైకి ఏం చేయాలో తోచలేదు. అంత డబ్బు ఎలా వస్తుంది. “ఇప్పుడే వస్తాను డాక్టర్” అంటూ ఎక్స్‌రే తీసుకుని ఎక్స్‌రే తీసిన వ్యక్తి దగ్గరకు వెళ్లాడు. అతనికి రూ. 25 ఇచ్చి “ఓ గంటలో నా వ్యాధి తగ్గిపోయేలా ఈ ఎక్స్‌రేని మార్చగలవేమో చూడు” అనడిగాడు.

అలాంటి ఎక్స్‌రేల్ని మార్చగలిగే సన్న్యాసులు లేక స్వాములే ఆశల్ని ఒకదాన్నుంచి మరొకదానికి మార్చుకోమని చెపుతారు. ఆయన కాకపోతే మరొక స్వామి రావచ్చు. ఆయన "సరే... ఆశను పూర్తిగా త్యజించనక్కరలేదు. కొద్దికొద్దిగా ఏదో కాస్త తక్కువ ప్రమాణంలో అయితే ఫర్వాలేదు" అంటూ అనుమతిస్తాడు.

"కావాలనుకుంటే... నేనింకా వజ్రాలు సంపాదించగలను, కానీ, నాకు ఇదే చాలు" అని ఒక వజ్రంతో తృప్తిపడితే మెచ్చుకోవచ్చు. అది సంతృప్తినీ, ఆనందాన్నీ ఇవ్వవచ్చు. అయితే, "నాకవన్నీ ఎక్కడ అందుతాయి? ఇదే చాలు" అంటూ తాత్వికంగా మాట్లాడి, నీ ఆశలరెక్కల్ని కత్తిరించుకుంటే, అది పిరికితనం.

"పక్కింటివాడు పేరాశగాడు. అయినా వాడికన్నీ లభిస్తున్నాయి. నేను ఆశపడుతున్నదే ఏదో కొంచెం. అదీ నాకు దక్కడం లేదు!" అనే బాధే మిగులుతుంది.

అందుకే చెప్తున్నాను. మీరు ఆశలు పెంచుకోండి. చాలా ఎక్కువ ఆశలు పెంచుకోండి. ఆ ధైర్యం కూడా లేకుండా, అల్పత్వం పెంచుకొని ఆశల్ని చంపుకుంటే, జీవితంలో మీరు దేన్నీ సాధించలేరు.

మీ జీవనస్థాయిని నిర్ణయించే ఆశల్ని గురించి మరింత వివరంగా వచ్చేవారం తెలుసుకుందాం.



## మరి ఆశ ఏది? అత్యాశ ఏది?

## ఒకరికి ఆశ అనిపించేదే, మరొకరికి అత్యాశగా అన్పించవచ్చు

మీ చుట్టూ జరిగే వాటిని గమనించండి. మీ మీదున్న ఆశవల్లే భూమి తన ఆకర్షణ శక్తినుపయోగించి, మిమ్మల్ని తనతోనే వుంచుకుంటోంది. సూర్యుని నుండి తగిన దూరంలో తనకంటూ ఒక దారిని ఏర్పరచుకొని, భూమి తిరుగుతోంది. ఆ దారిలో నుండి అది తొలగిపోకుండా, మధ్యలో ఉండే సూర్యుడు భూమిని ఆకర్షిస్తున్నాడు. ఏనాడైనా తన చుట్టూ ఉండే గోళాల మీద ఆకర్షణ పోతే ఏమవుతుంది?

ఒక్కసారి ఆలోచించి చూడండి. అర్థం అయ్యిందా...ఆశ లేకపోతే... ఈ ప్రపంచమే లేదు. మరి ఎందుకని మీ ఆశల్ని మాత్రం తగ్గించుకోవాలనుకుంటున్నారు? మీ కల్పనకు తగినట్లు వీలున్నంత దూరం మీ ఆలోచనల పరిధుల్ని విస్తృతపరిచి, చాలాచాలా గొప్పగా ఏర్పరచుకోండి. నక్షత్రాలకు గురి చూస్తేనే మనం వేసే బాణం

కనీసం కప్పుదాకానైనా వెళుతుంది. అయ్యో, అంత ఆశపడకూడదు. అంటూ విల్లును ఒంచుకొంటూపోతే బాణం మన కాలివేళ్లనే నరుకుతుందని గమనించండి...

అత్యాశపడమని నేను చెప్పడం లేదు. మీ ఆశలు ఉన్నంతగా వుండాలని అంటున్నాను. రెండింటికీ వున్న తేడాను జాగ్రత్తగా గమనించండి.

ఒకరోజు శంకరన్ పిళ్ళై రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. రైలు ఏ స్టేషన్‌లో ఆగినా శంకరన్ పిళ్ళై దిగుతాడు. దిగిన చోటే నిలుచుంటాడు.

రైలు బయలుదేరేటప్పుడు మళ్లీ ఎక్కుతాడు. ఇది చిన్న స్టేషన్, ఇది పెద్ద స్టేషన్ అనేం లేదు. రెండే నిమిషాలు ఆగే స్టేషన్‌లో కూడా దిగి ఎక్కుతున్నాడు.

ఎదురుసీట్లో ఉన్న ప్రయాణికుడి సస్పెన్స్ పెరిగిపోయింది. "మీరు చాలా అలసిపోయినట్టుగా వున్నారు. మీతో వచ్చినవాళ్లెవరైనా కనబడ్డంలేదా? పుస్తకాలో, నీళ్లో కొనుక్కోవాలా? ఎందుకిలా ప్రతీ స్టేషన్‌లోనూ దిగి ఎక్కుతున్నారు?" అని అడిగాడు.

శంకరన్ పిళ్ళై తలను అడ్డంగా బలంగా ఊపాడు. "అలాగేంకాదు. ఇటీవలే నాకు బైపాస్ సర్జరీ జరిగింది. దూరప్రయాణం మంచిదికాదని డాక్టరుగారు చెప్పారు. అందువల్ల ఈ ప్రయాణాన్ని చిన్నచిన్న ప్రయాణాలుగా మార్చుకోవాలని దిగి ఎక్కుతున్నాను!"

అన్నిటిమీదా ఆశ పెంచుకోవాలని సద్గురువే చెప్పారు కదా అని మీరు ఆశ పెంచుకోవటం ప్రారంభిస్తే... శంకరన్ పిళ్ళై డాక్టరు మాటల్ని అర్థం చేసుకున్నట్టే అవుతుంది. మరి ఆశ ఏది? అత్యాశ ఏది? ఒకరికి ఆశ అనిపించేదే, మరొకరికి అత్యాశ అనిపించవచ్చు.

బైక్ వున్న వ్యక్తి ఒకడు కారు కొనాలని అనుకుంటే దాన్ని ఆశ అంటారు. ఆ మాటే, ఒక ప్లాట్‌ఫారంమీద బతికేవాడు చెప్తేదాన్ని అత్యాశ అంటారు.

పోల్చి చూసుకుంటూ నిట్టూర్చే గుణం ఉన్నంత వరకూ, ఆ గడబిడ తప్పదు. నిజానికి మీ కోర్కెలు ఎక్కడ వేళ్లూనుతున్నాయో గమనించండి.

ఇంట్లో బామ్మలు కథలు చెప్పేటప్పుడు గమనిస్తే, 'ఒక రాకుమారుడు తన్ను ఎదిరించిన వాళ్లతో కష్టపడి యుద్ధం చేసి గెలిచి, ఏడు సముద్రాలు దాటి ఏడు



పర్వతాలు ఎక్కి ఇంకా ఎన్నెన్నో సాహసాలు చేసి, అందాల రాకుమారిని చెరవిడిపించి తీసుకువస్తాడు. ఆ తర్వాత వాళ్లు సుఖంగా జీవించారు' అంటూ కథ ముగిస్తారు.

సంతోషంగా, సుఖంగా జీవించడం ప్రారంభిస్తే కథ అయిపోయినట్టే! ఆ తర్వాత పోరాటాలు లేవు.

అయితే సంతోషం అనేది ఏది? పెళ్లి అంటే సంతోషం అనుకున్నారు. తర్వాత? పిల్లలు పుడితే అది సార్థకం అవుతుంది. అదే సంతోషం అనుకుంటారు.

పిల్లలు పుట్టారు. అయితే, "ఈ రోజు నేను ఇన్ని విధాల బాధపడుతున్నానంటే దానికి పిల్లలే కారణం" అని మనసు విరిగి బాధపడుతున్నారు!

కోటి రూపాయలు దక్కితే సంతోషం అనుకుంటారు. ఆ డబ్బు చేరింది. అయితే, అనుభవించడానికి అవకాశం లేదు. బ్రెడ్ ముక్కల్ని తింటూ మిగిలిన బిజినెస్ విషయాలు చూసుకుంటూ, కారులో కంప్యూటర్ మీద లెక్కలు వేసుకుంటూ టెన్షన్‌తో బతుకుతారు.

మంత్రిపదవి వస్తే సంతోషం అనుకుంటారు. వచ్చాక, ఎప్పుడు ఈ పదవి పోతుందో... ఎప్పుడు పోలీసులు వారెంటుతో వచ్చి తలుపులు తడతారో... ఎప్పుడు పగవాడి కత్తికి బలైపోతామో అని ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకుని బతకాలి.

ఇలాగే శంకరన్ పిళ్ళైకి ఒకసారి గట్టిచిక్కు వచ్చి పడింది. "చాలా రాయితీలు వస్తాయన్నారే!" అంటూ శంకరన్ పిళ్ళై మిలిటరీలో చేరాడు.

ఏదో పొరపాటువల్ల రెండు సైజులు తక్కువవున్న బూట్లు అతడికివ్వబడ్డాయి.

రోజూ ఆ బూట్లు తొడుక్కునేటప్పుడు కాలివేళ్లు ఒకదానితో ఒకటి మెలిపడుతున్నాయి. చిన్నవైన ఆ బూట్లు విప్పకుండా రోజంతా వేసుకునే ఉండటంవల్ల అతని పాదాలు నొప్పి చేశాయి. ఆ నొప్పిని తట్టుకోలేక శంకరన్ పిళ్ళై ఊరంతట్నీ శపించేవాడు.

"అధికారులతో చెప్పుకుంటే, సరైన సైజు బూట్లు ఇస్తారుకదా మిత్రమా! ఎందుకిలా రోజూ బాధపడతావు?" అని ఓ సైనికుడు అడిగాడు.

శంకరన్ పిళ్ళై తన కోపాన్నంతా బదులుగా ఇలా వెలిబుచ్చాడు. "నువ్వే చూస్తున్నావు కదా! రోజు ఎంత కఠినమైన కవాతులు... ఎముకులు సడలిపోయేలాగా

ట్రైనింగు. ఎన్నెన్ని పన్లు...? ఏం సంతోషమో చెప్పు? రాత్రి ఈ బూట్లు విప్పగానే 'హమ్మయ్య' అనుకుంటే ఎంత సంతోషమో తెల్సా? ఈ సైన్యంలో చేరినందువల్ల నాకు దక్కుతున్న ఒకే ఒక్క ఆనందం అదే, దాన్ని ఒదులుకోమంటావా?"

మీ ఆత్మసాక్షిగా చెప్పండి... శంకరన్ పిళ్ళై లాగా ఆనందాన్ని పణంగాపెట్టి, "ఎప్పుడెప్పుడు బూట్లు విప్పుదాం" అనే బెంగ మీకుమాత్రం లేదా?

సంతోషంగా సుఖంగా బతకాలన్నదే కదా మీ ఆశలన్నిటికీ ఆధారం. ఆ కోరిక మీ మనస్సులోతుల్లో దాగి లేదా? మీరు కోరుకున్నది దక్కుతుంది. అయితే, ఎందుకోసం అడిగారో అది ఆ సంతోషం మాత్రం దక్కడం లేదు! ఏం ఎందుకు? తప్పు ఎక్కడుంది?



## **నిరాయుధుల** మీద కత్తి ఎత్తడం వీరమా? వివేకమా?

**ఒక పూలమొక్క పెరగాలంటే, దాని పక్కనే కూర్చుని గమనిస్తామా?**
**సంగీత దర్శకుడి కొడుకు మెకానిక్ అవుతానంటే**
**ఆ తండ్రి తట్టుకోగలడా?**

ఆశతో పిల్లల్ని కన్నారే తప్ప, ఇప్పుడు వాళ్లవల్ల ఎన్నిపాట్లో కదా! వాళ్లు మీ కట్టుబాట్లు మీరిపోతున్నారనే చింత మిమ్మల్ని కుదిపేస్తోంది. మీ అబ్బాయి స్నేహితులతో కలిసి సిగరెట్ తాగేసి వస్తున్నాడు. మీరది తట్టుకోలేరు. "నువ్వు చేసిన పనివల్ల ఈ ఇంటి గౌరవమే పాడయిపోయింది" అని ముఖమంతా ఎర్రబరుచుకొని అతనిమీద ఎగిరిపడతారు.

అంతమాత్రాన అతగాడు సిగరెట్ మానేస్తాడా ఏదో ఒక  చీకటిసందులో నిల్చుని సిగరెట్ తాగేసి, వాసన రాకుండా నోట్లో ఏదైనా వేసుకొని నములుతూ వస్తాడు.

మీరు సిగరెట్ తాగడం తప్పని నేర్పాలనుకొన్నారు. కాని అబద్ధాన్ని, దొంగతనాన్ని అతనికి నేర్పారు. అతన్ని మార్చాలన్న ఉద్దేశంతో, కోపంగా ఏదో చెప్పారు. అధికారంతో అతన్ని కొంతకాలమే పట్టి ఉంచగలరు. అయితే మీకున్న నిజమైన అక్కర అతనికి అర్థం కాకుండాపోతుంది. అతనిలో మీరు ఎదురుచూసే మార్పు రాదు.

అతనిపై మొదటి నుంచి ప్రేమ చూపించుంటే, మీ మధ్యమంచి స్నేహబంధం ఏర్పడి ఉండేది. ఏది సరైనది, ఏది తప్పు అనే విషయాలను అర్థం చేసుకొనే తెలివితేటలు అతనికి అలవడి ఉండేవి. మీరు చెప్పేది అతని మంచికని తెలుకునేవాడు.

అలాకాక, అతనిపై మీ అధికారాన్ని చూపాలనుకుంటే మాత్రం ఏదైనా కష్టం వచ్చినప్పుడు మీ ఆలోచనలు అడగడానికి, చేయూత కోరడానికి జంకుతాడు.

శంకరన్ పిళ్ళై తన చెల్లెలి కొడుకు పుట్టినరోజుకు బహుమతిగా ఒక చవక తగరం డప్పు కొనిచ్చాడు.

ఒక వారం తర్వాత చెల్లెలి ఇంటికి వెళ్లినప్పుడు ఆ పిల్లాడు ముఖం ఇంత పెద్దది చేసుకొని పరిగెత్తుకొని వచ్చాడు. ‘‘మావయ్యా! నాకు వచ్చిన బహుమతులన్నిటిలోను నువ్వు ఇచ్చిందే సూపర్. దాంతో నేను సంపాదిస్తున్నాను కూడా తెలుసా!” అన్నాడు.

శంకరన్ పిళ్ళైకు చాలా గొప్పగా అన్పించింది.

“కచేరీల్లో పక్క వాద్యం వాయించడానికి ప్రయత్నిస్తున్నావా?” అల్లుణ్ణి అడిగాడు పిళ్ళై.

“అదేం కాదు మావయ్యా! అది వాయించకుండా ఉంటే అమ్మ రోజూ పదిరూపాయలిస్తోంది. తాతయ్య వారానికి 50 రూ/- ఇస్తానన్నాడు” అన్నాడు ఆ పిల్లాడు.

మిమ్మల్ని మూఢుల్ని చేసి తన పని తాను చేసుకొనిపోవడం మీ కొడుక్కు కూడా వచ్చు. అది అతడి తప్పుకాదు. అతన్నలాగ పెంచిన మీది.

ఒక విషయాన్ని బాగా అర్థం చేసుకోండి.

పిల్లలు మీ సొత్తు కాదు. ఈ ప్రపంచంలోకి ఒక కొత్త జీవి రావడానికి మీరు కారణమయినది మీకు గొప్పే కానీ, ఆ పిల్లలు మీ ఆస్తి కాదు.



పిల్లల్ని కొట్టడమనేది చాలా అసహ్యించుకోదగ్గ విషయం. ఆ పిల్లలు చేయి ఎత్తారనే కదా మీ చేయి లేచేది? నిరాయుధులమీద కత్తి ఎత్తడం వీరమా? వివేకమా?

శారీరకంగా మీనుండి తమను కాపాడుకోలేకపోవచ్చు ఆ పిల్లలు. కాని, పిల్లలు ఏ వంకలూ లేని కొత్త జీవాలు. జీవితంలో సుఖదుఃఖాలు చూడనివాళ్లు.

కపటం లేనివాళ్లు, మీకన్నా చాలా చక్కటి కొత్త ప్రపంచాన్ని చూసే అవకాశం ఉన్నవాళ్లు.

ఒక పూల మొక్క బాగా పెరగాలంటే, పక్కనే కూర్చుని దాన్ని పట్టిపట్టి చూస్తారా? చేయరు. దానికి కావలసిన ఎరువువేసి, తగినంత నీరు చేరేలా మాత్రం జాగ్రత్త పడతారు. ఆ చెట్టు తనంతట తనే పూస్తుంది.

పిల్లలూ అంతే వారిని జాగ్రత్తగా పెంచి పోషించండి. మీ ఆలోచనల్ని వాళ్లమీద రుద్దకండి. చాలు!

ఒక పెద్ద పారిశ్రామికవేత్త కొడుకు బిజినెస్‌లో ఆసక్తి చూపకుండా, గిటార్ వాయించుకొంటూ సంగీతం మీద ఆసక్తి చూపిస్తే ఆ తండ్రి తట్టుకోలేడు.

*బీర్బల్ కళ్లు మూసుకొని ఏవో మంత్రాలు చదువుతూండడాన్ని చూశాడు అక్బర్. అవి తనకూ చెప్పించమని అడిగాడు.*

*“రాజా! ఇవి జాగ్రత్తగా ఒక గురువు దగ్గరే నేర్చుకోవాలి” అన్నాడు బీర్బల్.*

*అయితే, అక్బర్-ధ్యానం చేయడం తెలిసివాళ్ల దగ్గర నేర్చుకోలేమా? గురుముఖత నేర్చుకోవాల్సిన అవసరం ఏమిటి?” అన్న ఉద్దేశంతో, రాజ్యాధికారంతో వేరొకరి దగ్గర నేర్చుకొని బీర్బల్‌కు చెప్పి చూపించాడు.*

*అది విన్న బీర్బల్ “పదాలన్నీ అవే రాజా! అయితే వాటిని గురువువద్ద నేర్చుకొన్నప్పుడే దానికి మహిమ” అన్నాడు.*

*‘‘పదాలు మారనప్పుడు అవి ఎవరు నేర్పిస్తేనేం” విసుక్కున్నాడు అక్బర్.*

*బీర్బల్ చప్పట్లు చరిచి కాపలావాళ్లను పిలిచాడు. “ఈ మూఢుణ్ణి పట్టుకెళ్లి చెరలో పెట్టండి” అని అక్బర్‌ను చూపించి ఉత్తర్వు ఇచ్చాడు. సిపాయిలు ఆశ్చర్యపోయారు.*

*బీర్బల్ మళ్లీ మళ్లీ ఉత్తర్వులిచ్చాడు. అక్బర్ దగ్గరకు ఎవరూ రాలేదు.*

*బీర్బల్ చర్యకు అక్బర్ కోపంతో “నన్ను చెరలో వేయడానికి మీరెవరు? వీరిని ముందు చెరలో పెట్టండి” అన్నాడు.*

*సిపాయిలు వెంటనే ఒక్క ఉదుటన బీర్బల్‌ను పట్టుకొన్నారు. అప్పుడు బీర్బల్ నవ్వుతూ “అవే పదాలు నేనన్నప్పుడు ఎవరూ లక్ష్య పెట్టలేదు. కాని మీరు అనగానే, వాటికెంత గౌరవం వచ్చిందో చూశార రాజా!” అన్నాడు.*

*గురువు దగ్గరే నేర్చుకోవాలన్న బీర్బల్ మాటల్లోని నిజాన్ని గుర్తించాడు అక్బర్.*

*మీకూ జవాబు దొరికిందనుకుంటాను.*

ఒక సంగీత దర్శకుడి కొడుకు సంగీతాభిరుచి లేకుండా ఆటోమొబైల్ షాప్‌లో స్క్రూలు బిగిస్తే అతడు తట్టు కోలేడు. ఎందుకు?

తన మరణానంతరం కూడా తన జ్ఞాపకంగా ప్రపంచంలో ఏదైనా ఉండి తీరాలనే అత్యాశ వారిది.

అందువల్లే పిల్లల్ని తమలాగే తయారుచేయాలని, తమ గుర్తుగా మిగిల్చిపోవాలను కొంటారు.

మీ తర్వాత మీ పిల్లలు కూడా అదే పిచ్చి పనే చేయాలని ఎందుకు కోరుకుంటున్నారు. మీ పిల్లలు మీరు చేయలేని సాహసాలను చేయవద్దా!

అలా కొత్త కొత్త దారులు తొక్కితేనే కదా ప్రపంచం ముందుకు సాగుతుంది.

అభిమానం, జాగ్రత్త వహించడం ఈ రెండే మీరు మీ పిల్లలకివ్వగలిగే అధికారం కాదు. మీ పిల్లలకు కోపం, అహంకారంలేని ఆనందమయ జీవితా న్నివ్వండి. సందేహించవద్దు. మీ కన్నా మీ పిల్లలు చాలా బాగుంటారు. అలా పెరిగే పిల్లలు ఎప్పుడూ తప్పు దారిలో అడుగిడరు. సందర్భవశాత్తూ అలా దారిమళ్లినా, త్వరలోనే తమ తప్పును తెలుసుకుని మీ దారిలోకే వస్తారు.



**సంతోషంగా ఉండాలంటే, ముందు స్వార్థం నేర్చుకోవాలి.**
**స్వార్థానికి కూడా పిసినారితనం వద్దు.**
**పూర్తిగా స్వార్థపరులై ఉండండి.**

మీకు ఆశ లేకపోతే ఈ వ్యాసంలోని మరో పంక్తి పైకి మీ చూపుపోదు. అంతెందుకు... నిలబడలేరు, నడవలేరు, ఏమీ తినలేరు.

"ఆశతో తింటున్నానని ఎవరు చెప్పారు? ఆకలేసి తింటున్నా"నని మీరొక వింత వాదనను మొదలుపెట్టవచ్చు. మంచి ఆకలివేళ ఓ బంధువు ఇంటికి వెళ్లారు. ఆకువేసి రుచికరమైన భోజనాన్ని వడ్డించారు. మీరు మొదటి ముద్ద నోటి దగ్గరకు తీసుకునేటప్పుడు, మిమ్మల్ని ఏదో తిట్టారు. మరొక ముద్ద దిగుతుందా?

మీ ఆకలి తీరలేదు. అయినా, తినలేకపోతున్నారు. ఎందుకని? తినాలన్న కోరిక చచ్చిపోయింది. ఆశతోకాక, అవసరం కోసమే ఏది చేసినా, అది పూర్తి

సంతోషాన్ని ఇవ్వదు. మీరు చేజేతులా తెచ్చి పెట్టుకొన్న కష్టాలవల్ల, సంతోషం కనపడకుండాపోతుంది.

సంతోషంగా ఉండాలంటే, ముందు స్వార్థం నేర్చుకోవాలి. స్వార్థానికి కూడా పిసినారితనం వద్దు. పూర్తిగా స్వార్థపరులై ఉండండి.

ఒకరోజు, శంకరన్ పిళ్ళై కొడుక్కి బాగా జ్వరం వచ్చింది. డాక్టరు వచ్చాడు. "ఇది అంటురోగక్రిముల వల్ల వచ్చిన జ్వరం. ఇప్పటికే మీ అబ్బాయి దీన్ని ఊరిలో ఎంతమందికి అంటించాడో? ఇంక ఆరోగ్యం బాగయ్యేదాకా బడికి పంపద్దు" అని హెచ్చరించాడు.

కొన్నాళ్లపాటు చికిత్స జరిగింది. ఆ అబ్బాయికి ఎలాగో జ్వరం తగ్గింది. డాక్టరిచ్చిన బిల్లులో ఉన్న మొత్తాన్ని చూసి శంకరన్ పిళ్ళై దెబ్బలాట మొదలుపెట్టాడు.

డాక్టరు వివరాలు చెప్పడం మొదలుపెట్టాడు. "తొమ్మిదిసార్లు మీ ఇంటికే వచ్చిమరీ సూదిమందేశాను. అదీ చాలా ఖరీదైన మందు!"అని.

శంకరన్ పిళ్ళై కోపంతో మండిపడ్డాడు. "నాతో పరాచికాలా? నా కొడుకు ఊరంతా జ్వరం పాకేలా చేయబట్టే కదా మీ ఆదాయం పెరిగింది? నిజానికి మీరే నాకు డబ్బివ్వాల్సిందిపోయి నన్నే డబ్బడుగుతారా?

ఈ రకంగా, 'ఏ సాకు దొరుకుతుందా? ఏ అవకాశాన్ని వాడుకొని ఊళ్లో వాళ్ల డబ్బును తన స్వంతం చేసుకొందామా? ఆదాయం పొందుదామా?' అని ఎంతోమంది స్వార్థంతో ఆలోచిస్తున్నారు. అలాంటి స్వార్థం కాదు నేను చెప్పేది నే చెప్పే స్వార్థం ఇంకా పెద్దది. 'ఈ చొక్కా నాది, ఈ ఇల్లు నాది' అంటూ కుంచించుకుపోయే స్వార్థాన్ని వదిలేయండి. 'ఈ ఊరు నాది, ఈ దేశం నాది, ఈ ప్రపంచం నాది' అంటూ అంతా మీదనే ఆసక్తిని పెంచుకోండి. అన్నీ మీ స్వంతం చేసుకోండి.

మీరొక టైలర్ కావచ్చు. ఆటోడ్రైవర్ కావచ్చు, డాక్టర్ కావచ్చు. కూరగాయలు అమ్మే అతను కావచ్చు. ఈ ప్రపంచమే మీదని మనసారా అనుకుంటే, అందులో ఉండే ప్రతి ఒక్కళ్లూ మీ వాళ్లైపోతారు.

ఆ తర్వాత, వాళ్లకోసం మీరు ఏదన్నా చేయాలంటే ఎలా చేస్తారు? మీ కోసం చేసుకొంటున్నట్లుగా అనుకుంటూ చాలా జాగ్రత్తగా చేస్తారు కదా!



అలా ప్రేమగా, ఇష్టంగా చేసేటప్పుడు ఆ పనితనం చాలా గొప్పగా ఉంటుంది. మీకు దక్కాల్సిన ఫలం దక్కుతుంది. ఒకవేళ మీరే వద్దనుకున్నా ఆ ఫలం తనంతట తానే మీ పాదాల వద్దకు వచ్చి చేరుతుంది.

ఎప్పుడూ వందశాతం ఆసక్తితో, సంతోషంగా ఏ పనైనా చేయండి. ఫలమే ఆనందం అనుకోకుండా, చేసే పనిని ఇష్టపూర్వకంగా చేయడం నేర్చుకోండి. మొదటిసారి విజయం లభించకపోతే మీకు నచ్చిన పని మరొకసారి చేసే అవకాశం లభించిందని సంతోషించండి. మీరొకసారి పరిపూర్ణంగా ఆ పనిని చేయండి. ప్రతీసారీ సంతోషమే దక్కుతుంది. బాధ ఉండదు.

ఆలోచించండి.. మీ ప్రతిభ ఎప్పుడు పరిపూర్ణంగా వెలువడుతుంది? మీరు సంతోషంగా ఉన్నప్పుడా? దుఃఖంతో ఉన్నప్పుడా? ఇష్టంగా ఒక పనిని చేసేటప్పుడు, విజయం లభించకపోవడం అంటూ ఉండదు.

అయితే కేవలం మీరు మాత్రం సంతోషంగా ఉంటే చాలదు. మీరు ఉండే చోటు, మీ చుట్టూ ఉన్నవాళ్లూ కూడా మీవల్ల సంతోషాన్ని పొందాలి. చుట్టూ ఉండేవాళ్లు సంతోషంగా మిమ్మల్ని స్వీకరించగలగాలి.

అడవిలో ఒక సింహం గర్వంగా నడుస్తోంది.

ఆ పక్కగా వెళ్తున్న ఒక కుందేలు పిల్లను పట్టుకుని, "ఏయ్ ఈ అడవికి రాజెవ్వరు?" అంది.

కుందేలుపిల్ల గజగజలాడిపోతూ "సందేహం ఏముంది ఇందులో? మీరే!" అంది.

సింహం ఆ కుందేలుపిల్లను విడిచి, ఒక నక్కను పట్టుకొని అదే ప్రశ్న అడిగింది. నక్క వణుకుతూ, "అన్నా నీకీ అనుమానం ఎందుకొచ్చింది? నువ్వు తప్ప మరెవ్వరు ఇక్కడ రాజుగా ఉండగలరు?" అంది.

ఆ తర్వాత దారిలో ఎదురైన మృగాలన్నీ వినయంగా మోకాళ్లమీద వంగి నమస్కరించి, సింహంతో, "మీరే మారాజు" అంటూ భయంతో అన్నాయి.

సింహం గర్వానికి హద్దుల్లేకుండాపోయింది. ఇంకా కొంచెం దూరం వెళ్లింది. అక్కడో ఏనుగుంది. సింహాన్ని లెక్కచేయకుండా ఆకుల్ని విరుచుకొని తినసాగింది.


సింహం ఏనుగు ఎదురుగా నిలబడి "ఏయ్ మూర్ఖుడా! ఎవర్రా ఈ అడవికి రాజు?" అని గర్జించింది.

ఏనుగు తల తిప్పి చూసింది. తొండంతో సింహాన్ని చుట్టి పైకెత్తింది. విసిరి నేలకేసి కొట్టింది. సింహం వెన్నెముక విరిగిపోయింది. "ఏమయ్యా! ఇప్పుడు నేనేం కానిది అడిగానయ్యా? నోటిమాటలతో చెప్పకూడదా?" అంటూ నొప్పికి తట్టుకోలేక బాధగా అడిగింది.

"ఇంకోసారి ఈ విషయంలో నీకే అనుమానం రాకూడదు. అందుకని అలా చేశాను" అంది ఏనుగు.

మీ చుట్టూ ఉండేవాళ్లు మిమ్మల్ని ఆనందంగా స్వీకరించకపోతే, సింహానికి ఎదురైన అనుభవం మీక్కూడా ఎదురుకావచ్చు. ఇలా ఎవరో మీకు నేర్పించేలోపు మీ జీవితాన్ని మీరే అందంగా తీర్చిదిద్దుకోండి. ఏది చేసినా దాని మీద పూర్తి ఆశతో, ఆసక్తితో చేయండి.





**దయచేసి మీ జీవితాన్ని మీ చేతిలోకి తీసుకోండి.**
**దేవుడి చేతికి ఇవ్వకండి.**

మీకు ఆనందాన్నిచ్చేది అని నమ్మి మీరు దేనిని స్వీకరించినా, దాంతోపాటు ఉచితంగా కొన్ని సవాళ్లు మీకు వచ్చి చేరతాయి.

అది కఠిన పరిశ్రమ కావచ్చు, ముమ్మరమైన పోటీ కావచ్చు, ఎదురు చూడని ఆటుపోటులు కావచ్చు అవి ఎలాంటివయినా సరే సంతోషంగా, ఆశతో స్వీకరించండి. మీరు ఎదగాలని నిజంగానే కోరుకుంటున్నట్లయితే, మీకు ఎదురైన కష్టాలను ఇష్టంగా ఆహ్వానించండి.

ఓడిపోయి, అందువల్ల నిరాశానిస్పృహలకు లోనైనవాళ్లు సాధారణంగా చెప్పేటటువంటి విషయం ఏంటో తెలుసా?

'నాకు కాలం కలిసిరావడంలేదు. నేను పిండి అమ్ముదామంటే పెనుగాలి వీస్తోంది. ఉప్పు అమ్ముదామనుకుంటే గాలివాన వస్తోంది' అని.

మీరు కావాలనుకున్నా, వద్దనుకున్నా ఈ ప్రపంచం మీ మీదకు కష్టాలను రెండు చేతులా విసరుతుంది. అది తప్పదు.

అటువంటప్పుడు వాటిని ఎదుర్కోవడానికి ఎందుకు భయపడతారు? కఠినమైన సందర్భాలు మీ జీవితంలో శాపం అనుకోవద్దు. నిజానికి అవి మీకు ఇవ్వబడ్డ వరాలు అని తెలుసుకోండి.

మీరు ఒక సినిమాకు వెళ్లారు. ఒకదాని వెనుక ఒకటిగా అందులో సంఘటనలన్నీ మీరు అనుకున్నట్లే జరిగితే, ఆ సినిమాను ఆసక్తితో చూస్తారా లేక బోర్ అంటూ లేచి బయటకు వెళ్లిపోతారా?

ఎదురుచూడని మలుపులే జీవితానికి కొత్త అందాన్నిచ్చి ఆసక్తిదాయకంగా మారుస్తాయి.

ఆ పరమాత్ముడితో ఒక సన్నకారు రైతు ఒకసారి బలంగా దెబ్బలాట వేసుకొన్నాడు.

"నీకు పైరు గురించి ఏం తెలుసు? నీకిష్టమైనప్పుడు వానను కురిపిస్తావు. ఆ కాలంలో గాలి వీచేలా చేస్తున్నావు. నీతో పెద్ద గొడవగా ఉంది. మాట్లాడకుండా ఆ పనులన్నీ ఒక రైతుకు అప్పగించరాదూ!" అన్నాడు.

భగవంతుడు వెంటనే "అలాగా! అయితే ఈనాటి నుంచి గాలి, వాన, ఎండ అన్నీ నీ అజమాయిషీలోనే ఉంటాయి" అంటూ వరమిచ్చి చక్కాపోయాడు.

ఆ రైతు ఆనందానికి అవధుల్లేవు.

ఋతువులు మారాయి. "వానా! కురవాలి" అన్నాడు రైతు.

కురిసింది. ఆగమనగానే ఆగింది.

తడినేలను దున్నాడు. కావాల్సిన వేగంతో గాలిని విసరమన్నాడు. విసిరింది. విత్తుజల్లాడు. గాలి, వాన, ఎండ అన్నీ ఆ రైతు మాట ప్రకారమే జరిగాయి. పైరు



పచ్చగా ఏపుగా పెరిగింది. ఆ పొలం చూడ్డానికి ఎంతో రమ్యంగా వుంది. కోతలకాలం వచ్చింది.

రైతు ఒక కంకి కోశాడు. గింజ నులిమి చూశాడు. అదిరిపడ్డాడు. లోపల ధాన్యం లేదు. ఉత్తి ఊక, మరొకటి, మరొకటి అంటూ అన్నీ కోసి చూశాడు. ఎందులోనూ ధాన్య లేదు. అంతా ఉత్తి ఊకమాత్రమే వుంది.

''హోరి దేవుడా!'' అంటూ కోపంగా ఎలుగెత్తి పిలిచాడు. "వాన, ఎండ, గాలి అన్నీ తగిన మోతాదుల్లోనే వాడాను, కాలాను గుణంగా, ఋతువులకి తగ్గట్లుగా. అయితే పైరు పాడయ్యిందే! ఏం? ఎందుకు?"

భగవంతుడు నవ్వాడు. "నా అధీనంలో గాలి బలంగా వీచేది. అప్పుడు అమ్మను కౌగిలించుకొనే పిల్లల్లా నారు వేళ్లు భూమిలోకి లోతుగా జొచ్చుకొని గట్టిగా పట్టుకొనేవి. వాన తక్కువైనా నీటికోసం వేళ్లను నాలుగు పక్కలకు పాకించేది. పోరాటం అంటూ ఉంటేనే చెట్లు తమను కాపాడుకోవడం కోసం బలంగా పెరుగుతాయి.

అన్ని వసతులు నువ్వే కల్పించేసరికి నీ పైరు సోమరిదయ్యింది. నవనవలాడుతూ పెరిగిందే తప్ప, ఆరోగ్యవంతమైన ధాన్యాన్ని అందించాలని దానికి తెలీదు".

"నాకు నీ గాలి, వాన, ఎండ వద్దు. నువ్వే ఉంచుకో" అంటూ రైతు దేవుడిచ్చిన వాటిని తిరిగిచ్చేశాడు.

*ఇంతమంది దేవుళ్లుండీ, ఇందరు మహాత్ములు పుట్టీ ఆకలి, బాధ, రోగాలు అన్నీ ఇంకా ఎందుకు? ఈ దేశంలోని ఆకలికీ, తిండి దొరక్కపోవడానికీ ఎవరు కారణం? ఏమాత్రం బాధ్యత లేకుండా జనాభాను పెంచింది మీరా? దేవుడా? లెక్కాపత్రం లేకుండా పిల్లల్ని కనిపారేసి, 'దేవుడిచ్చాడు' అని సిగ్గులేకుండా చెప్పకండి.*

*బుద్ధుడు, మహావీరుడు వంటి వాళ్లంతా జ్ఞానాన్ని పంచడానికి వచ్చారు. తిండి పెట్టడానికి కాదు. మరి మీకు కళ్లూ, కాళ్లూ, చేతులూ ఎందుకు? వాటిని సరిగా చక్కగా తెలివితేటలతో వాడుకుంటారనే కదా! దేవుడు అవన్నీ అమర్చి మిమ్మల్ని భూమి మీదకు పంపింది. అంటే తప్పు మీదే కదా!*

*మీరు మారేదాకా, ఏ భగవద్గీతవల్లా ఫలితం లేదు. ఏ మతమూ మిమ్మల్ని కాపాడలేదు. దేవుడికి దణ్ణం పెడుతూ ఆకాశంకేసి చూస్తూ నడిస్తే, తెరిచి ఉన్న కాలువ గుంటలోనే వెళ్లి పడాల్సిన పరిస్థితి వస్తుంది.*

*దయచేసి మీ జీవితాన్ని మీ చేతిలోకి తీసుకోండి. దేవుడి చేతికి ఇవ్వకండి.*

జీవితంలో అన్నీ చక్కగా అమరిపోతే, అంతకన్నా విసుగు, శూన్యం వేరే ఉండదు. కష్టాలు మిమ్మల్ని అదిమేసేటప్పుడే మీలో చాకచక్యం మరింత పెరుగుతుంది. సవాళ్లే మనిషికి  పరిపూర్ణతనిస్తాయి.

చీకటి అనే ఒక కష్టం ఉండబట్టే కదా విద్యుద్దీపం అనేది కనిపెట్టబడింది? ప్రయాణం కష్టతరం కాబట్టే కదా వాహనం యొక్క ఆవశ్యకత తెలిసొచ్చింది. వాటికో రూపం అంటూ ఇవ్వబడింది? ఎక్కడో దూరంగా ఉన్న వాళ్లతో మాట్లాడటం కష్టం కాబట్టేకదా, దూరశ్రవణ యంత్రం (టెలిఫోన్) రూపుదిద్దుకుంది?

మీకు కష్టాలనేవే లేకుండా ఉంటే మీ తెలివితేటల్ని మీరు ఎలా తెలుసుకోగలుగుతారు?

శంకర్‌పిళ్ళై కొత్త ఇల్లు కట్టుకోవాలనుకొన్నాడు. నిపుణుడు ఎన్నో రకాల ప్లాన్లు చూపించారు.

"కాదు, ఇది కాదు. నేను అనుకొంటున్నది 'వేరే లాంటిది' " అంటూ ఒక్కొక్క ప్లానునూ నిరాకరించాడు.

నిపుణులు విసిగిపోయారు. "మీ మనసులో ఏముందో చెప్పండి?" అని ప్రశ్నించారు.


ఒక పాత ఇత్తడి పిడిని ఒక బక్కెట్టులో నుంచి తీసి, "దీన్ని తలుపుకు సరిగా పట్టేలా పెట్టగలిగేలాంటి ప్లాను మీరు ఏదీ చూపించలేదు కదా!" అన్నాడు.

కష్టాలను ఎదుర్కొనే ధైర్యం లేదు.. అయితే, జీవితం మాత్రం హాయిగా అన్ని వసతులతో చక్కగా అమరాలి అనుకొనే వాళ్లు శంకర్‌పిళ్ళైలా పిడిపట్టుకుని రాజుగారి కోటలాంటిది కావాలని ఆశపడతారు.

ఎందుకని అన్నీ మీరనుకొన్నట్లే జరగాలి? ఏదో ఒకటి పెకలించుకొని బయటకు పోనీయండి. దానిని ధైర్యంగా ఎదుర్కొందాం, ఆసక్తితో మళ్లీ ప్రయత్నిద్దాం.

ఇంక సవాళ్లు ఎదురైతే వాటిని శపించకండి. వాటిని కూడా సంతోషంగా ఎదుర్కోండి.





**అపజయం జరిగినదాన్నిబట్టి వుండదు,**
**దాన్ని మీరెలా తీసుకుంటారన్నదాన్నిబట్టి వుంటుంది.**

మీ కోరిక ఏంటి? ఏది ముట్టుకున్నా, ఏది చేసినా విజయం మీదవ్వాలనే కదా? విదేశీ గూఢచారి సంస్థల్లో ఏం చెప్పి నేర్పిస్తారు? " 'గెలవాలి, గెలవాలి' అని మీకు మీరే పదేపదే చెప్పుకోండి. గెలుపును లక్ష్యంగా ఉంచుకునే ఒక్కో అడుగూ వేయండి" అంటారు.

ఈ ఆలోచన మీకు రక్తపోటు ఎక్కువవడానికే కారణం అవుతుంది. గెలుపునే తలుచుకుంటూ వుంటే అది లభిస్తుందా, లభించదా అన్న ఆలోచనవల్ల సందేహం వల్ల గాభరా, భయం, బెంగ మానసిక ఘర్షణ వంటివి ఎన్నో పెనుభూతాల్లా మీ నెత్తెక్కి కూర్చుంటాయి.

ఎవరు మంచివాళ్లు? ఎవరు చెడ్డవాళ్లు? ఆ తీర్పు చెప్పడానికి మీరెవరు? దేశ సరిహద్దుల్లో తుపాకి పట్టుకుని నిలబడ్డ సైనికుడు మీరు. పాకిస్తాన్ వీరులు పదిమందిని కాల్చి చంపారు. మీరు మంచివారా? చెడ్డవారా? భారత దేశం సైన్యం తరఫున మిమ్మల్ని మెచ్చుకుని మీకు మెడల్ ఇస్తారు. అదే పాకిస్తాన్ సైన్యానికి దొరికితే, చిత్రవధ తప్పదు. చేసిన పని ఒక్కటే! ఒకళ్లకు మీరు మంచివారు. మరొకళ్లకు మీరు చాలా మంచివారు. మరొకళ్లకు మీరు చాలా చెడ్డవారు. మిమ్మల్ని మీరు ఎవరితో పోల్చుకుంటున్నారో, సంబంధాన్ని ఏర్పరచుకుంటున్నారో దాన్నిబట్టే కదా మంచీచెడూ నిర్ణయించగలరు.

ప్రకృతి ఎప్పుడూ పక్షపాతం చూపించదు. ఒక చెట్టు ఉంది. ఒక పూజారి నీళ్లు పోసినా పువ్వులు పూస్తుంది. ఒక హంతకుడు నీళ్లు పోసినా పూలు పూస్తుంది. అయితే, మీరు ఎవరిని చెడ్డవాళ్లు అనుకుంటారో, వాళ్లమీద అయిష్టాన్ని పెంచుకుంటారు.

మొదట మానసికంగా వాళ్లనూ మీలో ఒకరిగా చూడటం ప్రారంభించండి. హ్రస్వ దృష్టితో ఎవ్వరినీ చెడ్డవాళ్లని తీర్మానించకండి.

లక్ష్యం మీద ఒక కన్ను పెడితే, వాడు సగం గుడ్డివాడు అవుతున్నాడు అంటుంది జెన్ వేదాంతం. మిగిలిన ఒక్కకన్నుతో ఏమాత్రం సాధించ గలం?

అలా సగం సగం మనసు పెట్టి ఏ పనీ చేయకండి, ఈ క్షణమే చేయాల్సిన పనిమీద మీ దృష్టంతా పెట్టి పూర్తిగా మనసు కేంద్రీకరించి చేయండి. ఎక్కువగా కష్టపడి ఫలితం పొందాల్సిన అవసరం లేకుండా, గెలుపు తేలికగా మీ స్వంత మవుతుంది. అర్థం చేసుకోండి.

మీరు మనస్సు కేంద్రీకరించి పనిచేయాలే తప్ప, కష్టపడవలసిన అవసరం లేదు. దీన్ని జెన్ తాత్త్వికంగా ఒక అందమైన సంఘటనతో వివరిస్తుంది.

సాన్‌సూ అనే ఒక జెన్ గురు వుండేవాడు. కత్తియుద్ధంలో ఆరితేరిన వాడు. ఆయన దగ్గరకు ఓ కొత్త శిష్యుడు వచ్చిచేరాడు. ''నన్ను కత్తియుద్ధంలో ఈ దేశంలోనే మొదటివాడుగా చేయగలరా?" అని అడిగాడు.

"దానికేం.. పది సంవత్సరాలలో నిన్ను అలా తయారుచేస్తాను" అన్నాడు గురువు.

"ఏంటి పదేళ్లా... అయిదేళ్లల్లో అలా తయారుకావాలి గురువా. కావాలంటే మిగిలిన వాళ్లకన్నా రెండింతలు ఎక్కువ కష్టపడడానికైనా నేను తయారు!"



"అలా అయితే ఇరవైఏళ్లు పడుతుంది" అన్నారు సాన్‌సూ. శిష్యుడు మరింత ఆశ్చర్యపోయాడు.

"చాలవంటే నాలుగింతలు ఎక్కువ కష్టపడతానన్నాడు" శిష్యుడు. "అలా చేస్తే నలభై సంవత్సరాలు అవుతుందే" అన్నాడు గురువు.

మిమ్మల్ని మీరు కష్టపెట్టుకోను, కష్టపెట్టుకోను – మీరు పొందాలనుకున్నది పొందడానికి చాలా ఎక్కువ కాలం పడుతుంది. ఇదే విషయాన్ని సాన్‌సూ ఆ శిష్యుడికి అర్థమయ్యే రీతిలో వివరించారు.

కష్టపడేవాళ్లకు కొన్నిసార్లు విజయం లభించవచ్చు. అయితే, ఆ సంతోషం దక్కదు. ప్రపంచంలోని అతి గొప్ప వైజ్ఞానిక రహస్యాలన్నీ శాస్త్రవేత్తలు తీరికగా ఉన్నప్పుడు కనుగొన్నవే. ఒక చెట్టుకింద ఊరికే కూర్చుని ఉన్నప్పుడే ఆపిల్ పండు కిందపడటం చూశాడు న్యూటన్. అప్పుడే భూమ్యాకర్షణ శక్తి గురించి కనుగొన్నాడు.

బాత్‌టబ్‌లో తీరుబడిగా స్నానం చేస్తున్నప్పుడే లెక్కించడంలోని సూత్రాల్ని కనుగొన్నాడు ఆర్కిమెడీస్.

టెన్షన్ లేకుండా పరిపూర్ణమైన ఆసక్తితో పనిచేసినప్పుడే, మేధస్సు తన పూర్తిశక్తితో పనిచేస్తుంది.

సరిగ్గా గమనించండి. గెలుపు గురించి ఆలోచిస్తూ, ఎక్కువ కష్టపడి ఆడే టీమ్ ఆటల్లో ఎక్కువగా ఓడిపోతూంటుంది. ఆటను హాయిగా ఒక అనుభవంలా అనుకునేవాళ్లు ఎక్కువగా గెలుస్తున్నారు.

గెలుపు... గెలుపు అంటూ మిమ్మల్ని కష్టపెట్టుకునేటప్పుడే శారీరకంగా, మానసికంగా మీరు త్వరగా బలహీనపడతారు. విజయం గురించిన చింతను వదిలేసి, మనస్సును నిశ్చింతగా ఉంచుకోండి. అప్పుడే మీ శరీరం హాయిగా తన పని తను చేసుకుపోతుంది.

అయితే, మీలో ఎక్కువ భాగం వ్యతిరేకంగా వున్నారా? మీ మనస్సు తీరుబడి లేకుండా ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటోందా? అందువల్ల శరీర వేగం తగ్గిపోతుంది.

ఇలాగే శంకరన్ పిళ్లై జీవితంలో ఓ వింత జరిగింది.

"ఇంటికి వెళ్లగానే మర్చిపోకుండా ఈ పని చేసేయాలి" అనుకుని రుమాలు ముడివేశాడు. అయితే ఇంటికి వెళ్లాక ఆ ముడి ఎందుకు వేశాడన్నది అతనికి గుర్తే రాలేదు. గాభరపడ్డాడు. బుఱ్ఱను తలకిందులు చేసుకున్నాడు. కాలుగాలిన పిల్లిలా తిరిగాడు. నెత్తి మొత్తుకున్నాడు. ఊహూఁ జ్ఞాపకమే రావడంలేదు.

"హాయిగా మాట్లాడకుండా పడుకోండి. ఏదైనా సరే రేపు చూసుకోవచ్చు" అంటూ వాళ్లావిడ సలహా చెప్పింది.

"కుదర్దు. ఏదో ముఖ్యమైన విషయమే అయ్యుంటుంది. అదేంటో గుర్తుకు రాకపోతే నిద్దరెలా వస్తుంది?" అంటూ మంచం మీద కూర్చునే ఉన్నాడు.

ఇదా... అదా... అంటూ బుర్రలో కొన్ని వందల ఆలోచనలు ఈగల్లా ముసురుతున్నాయి. రెండుగంటలవేళ విసిగిపోయి ఆ రుమాలును విసిరేశాడు. చటుక్కున గుర్తొచ్చింది. "ఇవ్వాళ 9 గంటలకల్లా పడుకోవాలి" అని గుర్తు చేసుకోవడం కోసం వేసిన ముడి అని.

గాభరాపడి బుర్రను పరుగుపెట్టిస్తే శంకరన్ పిళ్ళైకులాగే మీకూ జరుగుతుంది. విజయం గురించిన ఆలోచన వదిలేయండి. ప్రతిసారీ ఆసక్తితో పనిచేయండి. విజయం తనంతటతానే వచ్చి మీ తలుపు తడుతుంది.



**ప్రతి ఒక్కరినీ మీరు ఎదురుచూసే తీరులోకి**
**మార్చాలని అనుకోకండి.**
**అంతకన్నా, ఎదుటివాళ్లను అలాగే అంగీకరించడం నేర్చుకోండి.**

ఈ ప్రపంచంలో, మీ చుట్టూ ఉన్న వాళ్లతో మీ అనుబంధం ఎలా ఉందన్నది మీ జీవితాన్ని తీర్మానించడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. ఇక్కడ మీరు ఎన్నో ముఖాలను చూడవలసిరావచ్చు. ఒక చిన్న గదిలో మీతోపాటు మరొక సహ ఉద్యోగి పనిచేస్తుంటే, గొడవల్ని ఎదుర్కోవడం చాలా సులభం కావచ్చు. ఐతే, మీ ఉద్యోగంలో వెయ్యిమందితో మెలగాల్సివస్తే వినోదకరమైన సంఘటనలను ఎదుర్కోవాల్సి రావచ్చు.

మీరెంత ముఖ్యమైనవారైనా, అంతమందీ మిమ్మల్ని అర్థం చేసుకోవాలనుకుంటే, మీకు చాలా పెద్ద మార్పు ఎదురవుతుంది.

మిగతావాళ్లు మిమ్మల్ని అర్థం చేసుకోకపోవడంవల్ల ఇది జరగలేదు. మిగిలినవాళ్లను మీరు అర్థం చేసుకోకపోవడంవల్ల ఇది జరిగిందని తెలుసుకోండి.

నిజం చెప్పాలంటే ఎంతో దగ్గరవాళ్లనుకున్నచోట కొన్నిసార్లు ఏమారి వుంటారు.

ఒకసారి కోమాలోకి వెళ్లిపోయిన తన భర్తను, భార్య పక్కనే ఉండి కంటికి రెప్పలా జాగ్రత్తగా చూసుకుంది. భర్తకు స్పృహ వచ్చింది. భార్యను తన దగ్గరకు పిలిచాడు.

"నాకు కష్టాలొచ్చినప్పుడల్లా నువ్వు నాతోనే ఉన్నావు. నాకు ఉద్యోగం పోయినప్పుడు ఉత్సాహం పెంపొందించేలా మాట్లాడావు. నేను బిజినెస్ నష్టపోయినప్పుడు రాత్రి, పగలని చూడకుండా కష్టపడి సంపాదించావు. వివాదంలో ఓడిపోయాక కోర్టువారు ఇల్లు జప్తు చేసినప్పుడు కూడా బాధపడకుండా నాతోపాటు ఒక చిన్న ఇంటికి వచ్చి కాపురం పెట్టావు.

ఇప్పుడు ఆస్పత్రి పాలయ్యాను. ఇప్పుడూ నువ్వు నా పక్కనే ఉన్నావు. నిన్ను చూస్తే నాకేమనిపిస్తుందో తెలుసా? అంటూ బలహీనంగా అన్నాడు.

భార్య ఆనందంతో కన్నీళ్లు కారుతుండగా, మనసు కరిగిపోయి అతని చేతులు తన చేతుల్లో తీసుకుంది.

భర్త అప్పుడు ఆమెతో అన్నాడు... "నువ్వు నాతోనే ఉండబట్టే నాకే మంచీ జరగడంలేదేమోనని"

ఇలా పూర్తిగా వ్యతిరేకంగా ఎడ్డెమంటే తడ్డెమనేలా అర్థం చేసుకుని మాట్లాడేవాళ్లతో ఏ అనుబంధాన్ని పెంచుకుని ఎన్నాళ్లని మాత్రం ఉండగలం? బంధాల్ని ఎలా పెంచుకోవాలి? మనం ఎలా పెంచుకుంటున్నాం?

ఎంత దగ్గరవాళ్లైనా సరే ఒక ఎల్ల గీసుకుంటున్నాం. ఇద్దరిలో ఎవరు దాన్ని దాటినా మరొకరం యుద్ధభేరి మోగిస్తున్నాం. ఒక్కరైనా పోనీలే అని వదిలేసి మన్నిస్తేనేగా మరొకరు హాయిగా బ్రతకగలరు.

బంధువులు కావచ్చు, కూడా పనిచేసేవాళ్లు కావచ్చు, స్నేహితులు కావచ్చు, వేరే దేశస్థులు కావచ్చు, ఈ ప్రపంచంలో పుట్టిన వాళ్లల్లో ఎవరైనా కానీ... వాళ్ల దగ్గర మీకు నచ్చేటటువంటి గుణాలు కొన్ని, నచ్చనటువంటి గుణాలు కొన్ని తప్పక ఉంటాయి. రెండు రకాల గుణాల్నీ ఒకేలా అనుకునే మనస్సు ఉంటే, ఆ పరిపక్వస్థితి వస్తే, గొడవలంటూ ఏవీ ఉండనే వుండవు.

అలాకాకుండా మనకి కావాల్సినప్పుడు ఎదుటి వాళ్లను దగ్గరకు తీయడం, అక్కర్లేనప్పుడు దూరంగా విసిరేసేటంతవరకు ఏమారడం వల్ల, మానసిక ఘర్షణ కల్లోలం తప్పకుండా ఉంటాయి.



చుట్టూ ఉన్నవాళ్లంతా అద్భుతమైన వ్యక్తులు, ఒకటి రెండు సందర్భాల్లో వాళ్లు పిచ్చివాళ్లలా ప్రవర్తించవచ్చు. అలాంటి సంఘటనల్ని మీరు పెద్దగా లెక్కలోకి తీసుకోవలసిన అవసరం లేదు.

వాళ్లు మారాలని ఎందుకెదురు చూస్తారు? మీరే మారండి. ఎవరెవరిదగ్గర, ఎలా నడుచుకోవాలో, అలా నడుచుకోడానికి తయారుగా ఉండండి. ఎదుటివాళ్ల దగ్గర ఏది చెల్లుబాటవుతుందో అదే చేయండి.

ఒకసారి శంకరన్ పిళ్ళై ఓ తెరిచి వున్న మురికి కాలువలో పడిపోయాడు. ఎంత ప్రయత్నించినా బయటికి రాలేకపోయాడు. పెద్దగా "మంటలు మంటలు" అంటూ అరిచాడు.

చుట్టుపక్కలున్న వాళ్లందరూ గాభరాగా అగ్నిమాపకదళం సిబ్బందిని పిలిపించారు. వాళ్లు శంకరన్ పిళ్ళైను కాలువలోంచి బయటకు తీసి పడేశారు.

"మంట మంట అనరిచాడు కదా, ఎక్కడ నిప్పంటుకుంది?" అని అతన్నే అడిగారు.

"కాలువలో పడ్డానని అరిస్తే... మీరు వస్తారా? అందుకే మంట మంట అని అరిచాను" అని చెప్పాడు శంకరన్‌పిళ్ళై.

మీ ఇంట్లో వాళ్లందరూ మీలాగే ఉంటే ఏమవుతుందో ఆలోచించండి. అప్పుడు మీరు 'మూర్ఖుడా' అని ఎవ్వరిని తిట్టగలరు? ఎవరిని తెలివైనవాళ్లని మెచ్చుకోగలరు. అలా వుంటే అరగంటసేపు కూడా మీరు ఓర్చుకోలేరు.

ఇంట్లోనే ఇలా వుంటే, మరి ప్రపంచాన్నే మీలా మార్చాలనుకోవడం ఎంత మూర్ఖత్వం.

జీవితంలోని అందం, అందులోని వైవిధ్యంలోనే కదా వుంది? ప్రతి ఒక్కరినీ మీరు ఎదురుచూసే తీరులోకి మార్చాలని అనుకోకండి. అంతకన్నా, మీరు ఎదుటివాళ్లను అలాగే అంగీకరించడం నేర్చుకోకండి.

అలా చేస్తే, ఎదుటివాళ్లు మీ ఇష్టప్రకారం ఉండకపోయినా, మీ జీవితం మీ ఇష్ట ప్రకారం ఉంటుంది.

**మీరు** ఏ పనైనా గొప్పగా ఎప్పుడు చేయగలుగుతారు?
మరొకరితో పోల్చి చూసుకొని పరిగెత్తేటప్పుడా?
వివేచనతో వ్యూహరచన చేయగలిగినపుడా?

ఈ సమాజంలో మీరెలా ఎదిగారు? కన్నవాళ్లు, ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు అందరూ మీకు మంచి చేయాలనుకుంటూ ఏం చేశారు? మీ చుట్టూ ఉన్నవాళ్లతో పోల్చుకొని మిమ్మల్ని ఎప్పుడూ తక్కువగానే అనుకుంటూ వుంటారు.

ఇంకొకరికన్నా మిమ్మల్ని తక్కువచేసి చూపితే మీలో ఓ శక్తి పుడుతుందని, అది మిమ్మల్ని గెలుపువైపు నడిపిస్తుందనీ వాళ్లు అనుకుంటున్నారు.

మిమ్మల్ని గొప్పగా వికసించేలా చేయడానికి, వాళ్లకు వేరే ఏ దారీ తెలీదు. అలా మిమ్మల్ని మరొకరితో పోల్చడం ఏదో ఒక స్థాయిలో వాళ్లు మానేస్తారు.



అయితే, మరొకరితో పోల్చుకుని మిమ్మల్ని మీరే తరుముకెళ్లే స్థితినుంచి మీరు బయటపడలేరు.

ఒకసారి శంకరన్‌పిళ్ళై తన భార్యతో పెద్ద గొడవపడ్డాడు. చివరకు కోపంగా ఇల్లు వదిలి బయటకు వెళ్లిపోయాడు. మూడు రోజుల పాటు అక్కడా ఇక్కడా తిరిగాడు. నాలుగోరోజు పొద్దున్న ఒక ఫలహారశాలకు వెళ్లాడు. సప్లయర్‌ను పిలిచాడు.

“రాళ్లలా గట్టిగా ఉండే చల్లారిపోయిన ఇడ్లీ, నోట్లో పెట్టుకోలేని సాంబారు, నీళ్లపాలలో డికాషన్ కలిపిన కాఫీ” అని ఆర్డరిచ్చాడు. ఆ సప్లయిర్ ఆశ్చర్యపోయి “ఇదేం ఆర్డరండీ బాబూ...” అన్నాడు.

“నేను ఆకలేసి రాలేదు మిత్రమా! నాకు మా ఇల్లు గుర్తొచ్చింది” అన్నాడు శంకరన్‌పిళ్ళై.

ఇలాగే పాత అలవాట్లను సులభంగా వదులుకోలేక శంకరన్‌పిళ్ళై లాగా మీరు బాధపడుతున్నారు.

మరొకళ్లను గొప్పగా అనుకుని, వాళ్లనే లక్ష్యంగా ఎన్నుకుంటారు. మీరే మీతో సవాలు చేసుకొంటారు. లేని రెక్కల్ని కట్టుకుని ఎగరాలనుకుంటారు. ఎదుటి వాళ్లకన్నా ఉన్నతస్థానాన్ని అందుకోవాలని పోరాడి, పోరాడి ఆ స్థాయికి చేరుకుంటారు.

అంతలో మరొకరెవరో అంతకన్నా ముందుకెళ్లి మిమ్మల్ని వెక్కిరిస్తున్నట్టనిపిస్తుంది. మిమ్మల్ని ఆ స్థాయికి చేర్చుకోడానికి తగ్గ అవకాశం వైపు పరిగెత్తించేందుకు మీ చేతికి మీరే చర్నాకోలా అందించుకొంటారు.

ఇది ఎలాగుంటుందో తెలుసా? ఒక ఎలాస్టిక్ బెల్టును రెండు పక్కలా పట్టుకొని లాగినప్పుడు అది ఆ టెన్షన్ వల్ల రెండు చివరలా ఒకటవ్వాలని ప్రయత్నిస్తుంది. చేయి తీయగా రెండు చివర్లూ చటుక్కున ఒకదాన్నొకటి చేరుతాయి. ఆ తర్వాత? ఆ రెండు చివర్లూ కదలికను కోల్పోతాయి. మళ్లీ లాగి చివర్లను గట్టిగా పట్టుకుంటేనే ఆ ఎలాస్టిక్‌లో ప్రాణం ఉన్నదీ లేనిదీ తెలిసేది.

ఇలా బయట శక్తులకు లోనై, లక్ష్యాన్ని చేరాలని యత్నిస్తే, ఆ లక్ష్యం చేరుకున్నాక, ఆ తర్వాత ఏం చేయాలో తెలియక తికమకపడతారు.

మళ్లీ మరొక లక్ష్యాన్ని చూపి మిమ్మల్ని రెచ్చగొడితే తప్ప ఏ మాత్రం చలనంలేని వారైపోతారు.

రెండు పక్కలా పట్టుకొని లాగిన ఎలాస్టిక్ ఎన్నిరోజులు చక్కగా ఉపయోగ పడుతుంది. ఎప్పుడో ఒకప్పుడు తలవాల్చేస్తుంది. అది తప్పదు. ఆ తర్వాత మెల్లగా లాగినాసరే పుటుక్కున తెగిపోతుంది.

నిశ్చితాభిప్రాయం, స్థైర్యం లేనివాళ్లు కొందరు, ఇలాగే తమ లక్ష్యాన్ని చేరుకోడానికి బదులుగా, గుండె ఆగే పరిస్థితికి చేరి ఆస్పత్రిపాలవుతున్నారు.

జీవితమంతా మిమ్మల్ని మరెవ్వరో నడిపించాలని ఎందుకు కోరుకుంటున్నారు? స్థైర్యాన్ని కోల్పోయి ఎవరికో మీమీద అధికారాన్ని మీరెందుకు అప్పగిస్తున్నట్లు?

మీకు కొండెక్కాలన్న కోరిక వుంటే, కొండ ఎక్కే నేర్పును సంపాదించుకోవాలి. కాళ్లకు తగిన శక్తిని చేకూర్చుకోవాలి. అది వదిలేసి ఊరికే మరొకళ్లను చూసి మనస్సును గాభరా పెట్టినంత మాత్రాన ఆ గాభరా మిమ్మల్ని కొండ కొమ్మున చేరుస్తుందా?

మీరు ఏ పనైనా ఎప్పుడు గొప్పగా చేయగలుగుతారు? మరొకరితో పోల్చి చూసుకొని పరిగెత్తేటప్పుడా? వివేచనతో వ్యూహరచన చేయగలిగినవుడా?

వివేకంతో, నిదానంగా ఆలోచించి వ్యవహరించడం అనేది మీ కోర్కెలకు మీరు వేసుకునే అడ్డుకట్టకాదు. మీ ఎదుగుదలకు మీరు అడ్డుగా వేసుకునే ఆజ్ఞ అంతకంటే కాదు. అది మీ ఎదుగుదలకు, మీ అడ్డులన్నీ పోగొట్టి, మీరు కోరుకున్న దిశలో స్వతంత్రంగా ముందుకు సాగిపోవడానికి మీ అంతరాళాల్లో పుంజుకున్న శక్తి.

సంతోషంగా వుండటం ప్రకృతిపరమైన మీ లక్షణం అన్నది మరిచిపోవద్దు. ఎవరూ మిమ్మల్ని వెంటాడి తరిమే అవకాశం ఇవ్వకుండా నిశ్చింతగా ఉండండి.

మీరు ఎన్నుకున్న పనిలో, ఎప్పుడూ జాగరూకతతో వివేకంతో గెలుపువైపు అడుగేయండి. పూర్తిగా మనసు పెట్టి ఆ పని చేయండి. అప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకొనే శక్తి మీలో దాగి ఉందని గుర్తించగలుగుతారు. ఆ శక్తి మిమ్మల్ని లక్ష్యసాధన వైపు నడిపిస్తుంది.

మరొకరు చేరుకొన్న స్థానానికి మీరు చేరుకోలేకపోవచ్చు. అయితే, మీ శక్తికి తగ్గ ఎత్తుకు మీరు తప్పక చేరుతారు. అది మీకు తప్పక సంతోషాన్నిస్తుంది.



**మీకు కోపం ఎందుకు వస్తుందనుకుంటున్నారు?**
**అసలు ఈ కోపం అనే గుణం ఎవరిది?**
**అది ఎక్కడ ఉత్పత్తి అవుతుంది?**

మానో, పువ్వో, పురుగో... ఇవి మరొకళ్లని మార్చాలని ఏ మాత్రం ప్రయత్నాలు చేయవు. టెన్షన్ పెంచుకోవు. అందువల్ల అవి తమకు సహజమైన విధులను అవి చేసుకుపోతాయి. అయితే మనిషిమాత్రం తన అభిప్రాయాలను ఎదుటి వాళ్లమీద రుద్దాలని ప్రయత్నిస్తూ వుంటాడు. అందుకు అంగీకరించని వాళ్లతో అతని పోరాటం ప్రారంభమవుతుంది.

మీకు అస్సలు నచ్చని ఏ పనైనా ఎదుటివాళ్లు చేసేటప్పుడు, మీరు దాన్ని భరించలేరు. మీకు ఉన్న అధికారానికి లోబడి ఎదుటివాళ్లని కోప్పడతారు...

బెదిరిస్తారు... కొన్నిసార్లు దండించ వచ్చు కూడా. అప్పుడది మీకూ ఎదుటివాళ్లకూ మధ్య కొరివిపెట్టినట్లు అయి పోతుంది.

మీ కోపం ఒక బండమీద కావచ్చు, భగవంతుడి మీద కావచ్చు, స్నేహితుల మీద కావచ్చు. గురువు మీద కావచ్చు. ఎదుటివాళ్లవల్లే మీకు కోపం వస్తుందనుకుంటున్నారు కదూ? అయితే కోపం అనే గుణం ఎవరిది? అది ఎక్కడ ఉత్పత్తి అవుతోంది? బయటేనా?

లేదు. అది మీలోనే వేళ్లూని వుంది. దాన్ని మీరే మీలో తెచ్చిపెంచుకుంటున్నారు. మీ కోపాన్ని ఏదో గొప్ప శక్తిగా అనుకుంటున్నారు. దానివల్ల ఏదో సాధించవచ్చనే భ్రమలో దాన్ని ఒక పరికరంగా భావిస్తున్నారు.

అయితే ఆ పరికరాన్ని మీరు ఎదుటివాళ్ల మీద ప్రయోగించేటపుడు, అది వాళ్లని బాధ పెట్టేకన్నా మీకే కదా ఎక్కువ బాధ కలిగిస్తోంది కదా? అవునా?

కోపంగా ఉండేటపుడు బుద్ధి మందగించి ఆలోచనలు తారుమారు అవుతాయి. చేసే పనికి లభించే ఫలం కొన్నిసార్లు బాధాకరంగా మారు తుంది.

ఒక గులాబీ పూవు వుంది. అది అందంగా కన్పిస్తుంది. ఎవరికో ఒకరికి దాన్ని చూసి అసహ్యంతో వాంతివచ్చే పరిస్థితి ఏర్పడింది. తప్పు గులాబీదా, అతనిదా?

మీ కోపానికి అసలు కారణం మరెవరో కాదు మీరే అని గ్రహిస్తే ఆ కోపం ఎంత మూర్ఖత్వమైనదో మీకే అర్థమవుతుంది. ఇలా నేను చెప్పడంవల్ల. 'అసలు కోపమే లేకుండా ఉంటే తప్పు చేసేవాళ్లు ఎలా మారతారు?' అనే ప్రశ్న తప్పకుండా పుడుతుంది.

ఇలాగే ఒకసారి శంకరన్‌పిళ్ళై సంతకు వెళ్లాడు. అక్కడ ఓ గాడిద అతనికి నచ్చింది.

"అయ్యా! దీన్ని కొట్టి, తిట్టి పని చెప్పకండి. మెల్లగా చెప్తే అదే అర్థం చేసుకుంటుంది" అన్నాడు అమ్మినవాడు.

'అహా! ప్రేమగా చెప్తే అర్థం చేసుకొనే గాడిదా?' అని శంకరన్ పిళ్ళైకి ఆశ్చర్యం వేసింది. దాంతో ఎక్కువ వెల ఇచ్చి గాడిదను కొనుక్కొచ్చాడు.



మరునాడు శంకరన్‌పిళ్ళై గాడిద దగ్గరకు వెళ్లి దాన్ని ''రారాకన్నా పనికిపోదాం'' అంటూ ప్రేమగా పిలిచాడు. గాడిద కదల్లేదు.

శంకరన్‌పిళ్ళై గాడిదనెంతో ముద్దుచేశాడు. బతిమాలాడు. కానీ గాడిద ఏ మాత్రం కదలకుండా అలాగే ఉండిపోయింది. అమ్మిన వ్యాపారిని తీసుకొచ్చాడు. వాడు ఓ కర్ర తీసుకొని గాడిదను ఒకటిచ్చుకున్నాడు. వెంటనే గాడిద లేచి పనికి సిద్ధమయ్యింది.

శంకరన్‌పిళ్ళైకి కోపం వచ్చింది.

''మొండిగాడిదను కూడా నేనింత దెబ్బకొట్టలేదు. అలాంటిది ప్రేమగా చెప్తే వింటుందని అబద్ధం చెప్పి నన్ను మోసం చేసి ఈ గాడిదను నాకు అన్యాయంగా అంటగట్టాడు" అంటూ విసుక్కొన్నాడు.

"అయ్యా! ఇప్పుడు కూడా అదే మాట చెప్తున్నాను ప్రేమగా చెప్తే ఈ గాడిద వింటుంది. అయితే ముందు మన దారికి తెచ్చుకోవడానికి ఇలా ఒకటి, రెండు దెబ్బలు అవసరమవుతాయి'' అన్నడా వ్యాపారి.

*నేను కరుణ చూపించినా ఎదుటివాళ్లు మూర్ఖంగా అది నా చేతికానితనంగానే కదా అనుకొంటున్నారు? మీరు గొప్ప సంస్కారి అనే ఆలోచన ఎప్పుడు వస్తుంది? ఎదుటివాళ్లను నీచంగా గుర్తించి భావించినపుడేకదా?*

*ఎదుటివాళ్ల పట్ల కరుణ చూపించమని గొప్పలు చెప్పుకునేటప్పుడే, మీలో క్రౌర్యం దాగి ఉండి కూడా దాన్నే బయటపడనివ్వలేదు అనే అహమే కదా మీలో కన్పిస్తోంది?*

*ఎదుటివాళ్లను క్షమించామని గుండెలు చరుచుకొంటే, వాళ్లను దోషులుగా చూశారన్న విషయం బోధ పడటంలేదా?*

*మీ పట్ల ఎదుటివాళ్లు కృతజ్ఞత చూపించాలనుకోవడం వాళ్లను మీరు ఉపయోగించుకోవాలన్న నీచమైన కోరికతో కాదా?*

*మీలో ఉండే మృగానికి అప్పుడప్పుడూ కరుణ, క్షమ, కృతజ్ఞత అనే రంగురంగుల దుస్తులు వేసి, బయట ప్రపంచానికి చూపించుకుంటున్నారు. ఇందులో గొప్పేముంది?*

*తనను ఇతరులకన్నా గొప్పగా అనుకొనే భావం ఎప్పుడూ గొప్పదనాన్ని ఆపాదించదు. నేను వేరు. అతడు వేరు కాదు.*

*ఉన్నదాన్ని అందరం ఉన్నంతలో పంచుకోడానికి వచ్చాం అన్న విషయం అర్థమయి ఆ సంస్కారం వచ్చేదాకా, మంచి గుణాలని మీరనుకొంటున్నవన్నీ మీ బలహీనతలే!*

ఒక్కోసారి ఎదుటివాళ్లని దారిలోకి తెచ్చుకోవడానికి ఒకటి, రెండు దెబ్బలు అవసరం కావచ్చు. అయితే అందుకు కోపం తెచ్చుకోవలసిన అవసరం ఏమిటి?

మీ చేతికింద పనిచేసేవాళ్లు చాలామంది ఉండొచ్చు. ఉద్యోగ విధుల్లో క్రమశిక్షణ పాటించనపుడు మీరు ఊరికే వుండవలసిన అవసరం లేదు, ఉండలేరు కూడా. కొన్ని కఠినచర్యలు తీసుకోవలసిరావచ్చు.

మొదటినుంచీ మీరు వాళ్లతో ప్రేమగా మాత్రమే వ్యవహరించి వుంటే, వాళ్లకు మీ మీద పూర్తి నమ్మకం ఏర్పడి వుంటుంది. అత్యవసరమై, మీరు బాధపడుతూనే అలాంటి ఒక చర్య తీసుకోవలసి వచ్చిందని వాళ్లు అర్థం చేసుకుంటారు. అందువల్ల మీమీద వున్న అభిమానం ఏమాత్రం తగ్గదు, గౌరవం పోదు.

ఐతే మీ అధికారాన్ని చూపెట్టుకోవడం కోసం ఎదుటి వాళ్ల కష్టంతో సంతోషాన్ని పొందడం కోసం మీరు చర్య తీసుకొంటే మాత్రం వాళ్లు మీ మీద కక్ష కడతారు. ప్రతీకారం తీర్చుకోవడానికి ఎదురు చూస్తారు.

చరిత్రలో అధికారంతోనే మరొకళ్లని ఏలుకోవాలన్న ప్రయత్నం జరిగినపుడల్లా ఎన్నో విప్లవాలు వచ్చాయి. మీరే చెప్పండి... మిమ్మల్ని తన అధికారంతో ఏలుబడిలో ఉంచుకోవాలనేవారు మీకు నచ్చుతారా? భుజం మీద చెయ్యివేసే స్నేహితులు నచ్చుతారా?

మనిషన్నాక ఒక్కోసారి, ఒక్కోచోట, ఒక్కో విధంగా నడుచుకోవలసి వుంటుంది. ఐతే మీరు మీలోని మంచితనాన్ని, అభిమానాన్ని పోగొట్టుకోకుండా హెచ్చరికగా వుండండి. అప్పుడు ఎవరికీ బాధా కలిగించకుండా మీ లక్ష్యాన్ని మీరు చేరుకోగలుగుతారు.



**మీకు మీ బాస్‌లాగా అన్నింటినీ సంఘటితం చేయగల శక్తివుందా?**
**ఉంటే నా నైపుణ్యం ఎప్పుడు గుర్తించబడుతుంది?**
**నేను ఎప్పుడు ఉన్నతస్థాయికి చేరుకుంటానని అనుకుంటున్నారా?**

నన్ను చూడటానికి ఓ అసిస్టెంట్ డైరెక్టర్ వచ్చాడు. "నాకున్న తెలివితేటలు, చాకచక్యంలో పావు భాగం నా డైరెక్టరుకు లేవు. అయితే, ఆయన కింద నేను పనిచేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితి ఎప్పటికి మారుతుంది?" అని వేదనతో అడిగాడు.

చాలామందికి బాస్‌పై ఇలాంటి భావాలుంటాయి. మీపై అధికారిగా ఒకరుంటే, మీకన్నా ఏదో ఒక విషయంలో గొప్ప వాళ్లనే కదా అర్థం? అది బుద్ధివల్ల కావచ్చు... పరపతివల్లకావచ్చు... లంచమిచ్చి ఆ స్థాయికి చేరుకోగలిగిన సమర్థత కావచ్చు. ఎలాగైతేనేం, ఆ చాకచక్యం మీకు లేదు కదా?

మీ పై అధికారి అయినంత మాత్రాన అతను చేసేవన్నీ సరైనవే కాకపోవచ్చు. అలాగే, ఆ స్థానంలో మీరున్నంత మాత్రాన ప్రతి పనీ మీరు అతనికన్నా చక్కగా చేసేవారని గ్యారంటీ ఉందా? లేదుకదా? ఈ సందర్భంగా ఒక తమాషా కథ జ్ఞాపకం వస్తోంది.

అమెరికాకు ఓసారి పోప్ వచ్చారు. ఆయన కోసం ఖరీదైన పెద్ద అందమైన కారు వచ్చింది. పోప్ అప్పటిదాకా అలాంటి కారులో ప్రయాణం చేయలేదు. దేశీయ రహదారిలోకి రాగానే ఆ కారుని నడపాలనే కోరిక ఆయనలో కలిగింది. కాస్త తటపటాయించినా, పోప్ అడిగేసరికి ఆ డ్రైవర్ కాదనలేకపోయాడు. పోప్ కారు నడపడం ప్రారంభించగానే సంతోషం పట్టలేకపోయారు.

మంచి శక్తిమంతమైన ఇంజన్ కనుక వెంటనే వేగం పుంజుకుంది. రహదారిలో అనుమతించబడ్డ వేగంకన్నా ఎక్కువ వేగంగా వెళుతున్న పోప్ కారును చూడగానే పోలీసుల వాహనాలు ఆ కారు వెనుకబడ్డాయి.

ఒక సమయంలో పోప్ నడుపుతున్న కారును పోలీసులు అడ్డుకొని ఆపారు. విధి నిర్వహణకు వెళ్లిన పోలీసు అధికారి పోప్‌ను చూడగానే వెనక్కి తగ్గాడు. పక్కకు చేరి మెల్లగా పై అధికారితో మాట్లాడాడు.

"సార్.. ఓవర్ స్పీడ్ కేసు ఒకటి... అయితే, కారులో ఉన్నవారిని బుక్ చేయాలంటే భయంగా ఉంది!"

"ఏం? ఆయన కెనడీ ఫ్యామిలీకి చెందిన వ్యక్తా?"

"కాదు సార్"

"పోనీ క్లింటన్ బంధువా?"

"కాదు సార్!"

"మరి, జార్జి బుష్‌కు బంధువా?"

"కాదు సార్! వెనుక కూర్చున్న వి.ఐ.పి. ఎవరో తెలియడం లేదు కానీ, అతని డ్రైవర్ మాత్రం పోప్!"

ఇలాగే వుంటుంది... ఎవరు ఎక్కడ కూర్చున్నారన్న దాన్నిబట్టి వాళ్ల అంతస్థులు వుంటాయి. ఏ మాత్రం చాకచక్యం లేకుండా అతడాచోటుకు వస్తే మాత్రం ఎన్నాళ్లో అక్కడ ఉండలేడు. అందువల్ల దాన్ని గురించి మీరు ఎక్కువగా ఆలోచించనవసరంలేదు.



మీరు ఒక స్టెనోగ్రాఫ్ అనుకోండి. "నా బాస్‌కు టైప్ రైటర్‌లో ఏ అక్షరం ఎక్కడుందో కూడా తెలీదు. నా ఖర్మ నేను ఆయన దగ్గర పనిచేయాల్సి వస్తోంది" అని మీరు బాధ పడితే ఏం ప్రయోజనం?

ఒక సూపర్‌వైజర్, కార్మికుడు చేసే ఏ పని కూడా అతనికన్నా చక్కగా చేయలేనివాడై వుండవచ్చు. అయితే, అందరి సంఘటితశక్తినీ ఏకం చేసి ఒక పని సాధించడంలో అతడు గొప్పవాడై వుంటాడు.

మీకున్న చాకచక్యం మీ బాస్‌కి కొన్ని పనుల్లో లేకపోవచ్చు. అయితే, అన్నిటినీ సంఘటితం చేయగల మీ బాస్ శక్తి మీకుందా? ఉంటే, మీ ఎదుగుదలను ఎవ్వరూ ఆపలేరు. ఆ కంపెనీ కాకపోతే మరొక కంపెనీలో మీకు తగ్గ గొప్ప ఉద్యోగం మీకు లభిస్తుంది.

కాబట్టి మీ అధికారిపై గొణగడం మానండి. పూర్తిగా మనస్సు కేంద్రీకరించి మీ చాకచక్యం అంతా ఉపయోగించి పనిచేయండి. మీరు లేకుండా మీ కంపెనీలో ఏ పనీ జరగదు అనే స్థితి రానివ్వండి. అధికారం మీరు అడక్కుండానే మీ హస్తగతం అవుతుంది.

మీ బాస్‌కన్నా మీకు నైపుణ్యమెక్కువ అని మీ కంపెనీ నిర్వాహకులకు తెలిసినపుడు, అతన్ని ఆ పదవిలో ఎందుకుంచుతారు? మిమ్మల్నే కదా ఆ పదవిలో నిలుపుతారు? అది ఆలోచించకుండా, అతన్ని గురించి మీలో మీరే బాధపడుతూ వుంటే, మీరు పూర్తిధ్యాసతో ఏ పనీ చాకచక్యంతో నెరవేర్చలేకపోతారు. మీరు లేకుండా కంపెనీ బాగా నడుస్తుందనే పరిస్థితి వస్తుంది. ఏ క్షణంలోనైనా మీ బాస్ మిమ్మల్ని గెంటేయవచ్చు.

జీవితంలో సాధించి చూపించినవాళ్లెవరూ, మరొకరి మీద పుకార్లు లేవదీసుకొంటూ కాలాన్ని వ్యర్థం చేయలేదు. వాళ్ల శక్తియుక్తుల్ని పూర్తిగా వాడుకొన్నారు. కాబట్టి వాళ్లు అంత ఎత్తుకు ఎదగగలిగారు.

ఎలాంటి స్థితిలోనూ మీమీద పూర్తి నమ్మకం ఉంచండి, మీ శాయశక్తులా పనిచేయండి. మీకు తగిన ఉన్నత స్థానానికి మీరు తప్పక చేరుకొంటారు. మీ ఎదుగుదలను అప్పుడు ఎవ్వరూ ఆపలేరు.

**సాధారణంగా వేయిమంది చేసేదే మీరూ చేస్తారు.**
**అలా కాక స్వయంగా ఏదైనా చేయడానికి సాహసిస్తే ఏమవుతుంది?**
**మీ జీవితంలో ఓ కొత్తమార్పును ఆహ్వానిస్తే ఏం జరుగుతుంది?**

మీరు కోరుకున్న ఎన్నింటినో, పొందగలమో లేదోనన్న భయంతో చేజార్చుకొన్నారు. కొత్తమార్పులు చేయ యత్నించే ధైర్యం లేక ఎన్నో అవకాశాల్ని పోగొట్టుకొన్నారు.

ఈ రోజుల్లో సంగీతం, చిత్రలేఖనం వంటి అందమైన కళల్ని బోధించే కళాశాలల్ని వలవేసి వెతకాల్సి వస్తోంది. అయితే, వీధికో వైజ్ఞానిక కళాశాల వెలసే రోజులు మాత్రం దగ్గర్లోనే ఉన్నట్టున్నాయి.



ప్రతి ఏటా లక్షలు లక్షలుగా తయారవుతున్న ఇంజనీర్‌లకు ఉద్యోగాలు దొరుకుతున్నాయో లేదోగానీ, ఆ చదువు తమ పిల్లలకివ్వాలని మాత్రం తల్లిదండ్రులు తపించిపోతున్నారు. ఎందుకిలా?

ఒక కాలఘట్టంలో ఆ చదువు పూర్తిచేయగానే ఉద్యోగం దొరికేది. దాంతో, అదే ప్రపంచంలోకెల్లా గొప్ప పందెం అనుకొని తమ పిల్లల్ని పందెంలో కాచే పగడకాయలు చేసి తల్లిదండ్రులు తిప్పడం ప్రారంభించారు. వాళ్ల గురించి చెప్పాలంటే, మానవ శరీరంతో ఉన్నా మనసు పరిపక్వతలో మాత్రం గొర్రె స్థాయినుంచి ఎదగలేదన్నమాటే! చుట్టూవున్న వేయిమంది చేసేదే చేస్తారు, స్వయంగా ఏదైనా చేయడానికి సాహసించరు.

రాత్రి, పగలు అని లేకుండా ఇదే విషయం చెప్పి, చెప్పి పిల్లల బుద్ధిని కూడా మందగింపచేస్తారు.

నేను ఇంజినీరింగ్ చదవడం గురించి మాత్రమే చెప్పడం లేదు. ఏ శాఖ అయినా సరే, మీరు ఏరికోరి దాన్ని స్వీకరిస్తే, అది ఆహ్వానించ తగ్గదే. బ్రతుకు తెరువుకోసం, ఆ విభాగాన్ని ఎంచుకొంటే మాత్రం, మీ జీవితాన్ని పాడుచేసుకున్నట్లు కాదా? ఇది నాకు తగినదా? అవసరమా, ప్రపంచానికే మాత్రం పనికొస్తుంది అని ఆలోచించకుండా, అందరూ ఎక్కి దూకే ఆ కొండ కొమ్మునుంచి దూకడానికా ఇన్ని మెట్లు ఎక్కి ఈ స్థితికొచ్చారు.

ఈ సందర్భంగా నాకొక కథ గుర్తుకొస్తోంది.

అనగనగా ఓ జ్యోతిష్యుడు. రాజుకు మరణగండం వుంది అని చెప్పాడు. వెంటనే రాజు ఏ ఫిరంగిగుండూ తొలచనివిధంగా కోటగోడల్ని నాలుగడుగులు మందాన కట్టించి, కోటచుట్టూ అగడ్త మరింత లోతుగా తవ్వించాడు. రెండు కిటికీల్ని వదిలేసి మిగిలిన అన్నింటినీ గాలి కూడా చొరకుండా మూయించాడు. నమ్మకస్తులైన వందమంది సిపాయిల్ని తలుపు బైట కాపలాపెట్టాడు. ఆ తలుపు దాటి రాజు అడుగు బైట పెట్టలేదు.

ఒకరోజు యథాలాపంగా రాజు కిటికీ దగ్గర నిలబడ్డాడు. అప్పుడు అక్కడున్న ఓ బిచ్చగాడు రాజును చూసి పడీపడీ నవ్వాడు. రాజు కోపంతో మండిపడి వాణ్ణి

పట్టుకురమ్మని సైనికులను ఆజ్ఞాపించాడు.

కోటకున్న కాపలాలన్నీ దాటి బిచ్చగాడు లోపలికి తీసుకొనిపో బడ్డాడు సైనికులచేత. అప్పుడు కూడా ఆ బిచ్చగాడు నవ్వడం మాత్రం ఆపలేదు.

"ఎందుకు నవ్వుతున్నావో చెప్పు లేదా నీ తల తెగిపోతుంది..." కోపంగా బెదిరించాడు రాజు.

"ఆ రెండు కిటికీలు మాత్రం ఎందుకు తీసి ఉంచావు? తలుపులు వేసుకునివుంటే మాత్రం వచ్చే ఆపదలు రాకుండా పోతాయా" అని బిచ్చగాడు నవ్వసాగాడు.

"మూర్ఖుడా! అవి కూడా వేసేస్తే నేను ఊపిరాడక చచ్చిపోతాను" అన్నాడు రాజు.

''ఇప్పుడు మాత్రం ఏ మయ్యింది? నువ్వు ప్రస్తుతం బతుకుతున్నది కూడా సమాధిలోనే కదా! అయితే ఈ సమాధికి తలుపులూ, కాపలా వాళ్లూ ఉన్నారు. అదే కదా తేడా?" అన్నాడు బిచ్చగాడు నవ్వుతూ!

మీకూ అదే చెప్తున్నాను. కొత్తగా దేన్నైనా ప్రయత్నించే ధైర్యంలేనపుడు, మన బతుక్కి అర్థం ఏముంది? ఏ ఆపదా లేని సురక్షితమైన చోటే కావాలనుకొంటే, హాయిగా సమాధిలోనే విశ్రాంతి తీసుకోవచ్చే!

*మనిషి తనలోని దైవాన్ని గుర్తించడానికే మతాలు పుట్టాయి. అయితే, జరిగిందేమిటి? మతాలు మనిషిలోని దైవత్వాన్ని గుర్తులేకపోయినా ఫర్వాలేదు. మానవత్వాన్నే మరచిపోవడానికి కదా కారణమయ్యాయి. ఈనాడు ప్రతి మతం ఒక్కొక్క రాజకీయ పార్టీలా నడుచుకుంటున్నాయి. మీరు ఏ మతానికి చెందుతారో ఆ పార్టీలో చేరి పోతున్నారు. మీ పార్టీని కాపాడుకోవాలన్న కోరిక మీకు తెలీకుండానే మీలో పెరిగిపోతుంది. దాంతో వేరే పార్టీకి చెందిన వాళ్లవల్ల మీ పార్టీకి ఆపద కలుగుతుందే మోనని భయపడతారు.*

*భయం తర్వాత దౌర్జన్యమే కదా! అందువల్ల, పోరుకు సిద్ధం. వ్యక్తిగతంగా ఎవరు మీ స్నేహితులో వాళ్లతోనే, మతాన్ని అడ్డు పెట్టుకుని పోరాడుతున్నారు.*

*ప్రతి వ్యక్తీ ప్రశాంతతనీ, ఆనందాన్నే కోరుకుంటాడు. అయితే ఒక గుంపుకు చెందిన వ్యక్తిగా గుర్తించుకునేటప్పుడు, ఆ వ్యక్తిలోని ఆధారభూతమైన మంచితనం జారిపోతోంది. ఈ అజ్ఞానం తొలగిపోయేదాకా, మతం వల్ల మానవుడికి ఆపదే! ప్రశాంతత ఉండదు.*



జాగ్రత్త పేరుతో మన చుట్టూ గోడలు కట్టుకొంటే, మనం జీవంతో బతకలేం. అలా ప్రాణాన్ని పూడ్చేసి, ఈ శరీరాన్ని మాత్రం 60-70 సంవత్సరాలపాటు ఈడ్చుకుంటూ తిరగకపోతేనేం? తీరం వదలి వెళ్లే ధైర్యం లేక, తీరాన్నే పడవ నడిపేటట్టయితే, రేవును చేరడమనేది అసాధ్యం. పడవ పాడయిపోతుంది.

మీరు ఎదురుచూడని విధంగా, ప్రతి పుటలోనూ ఏదో ఒక గగుర్పాటు కలిగించే మార్పులుంటేనే కదా ఒక సస్పెన్స్ కథను ఎంతో బాగుందని మెచ్చుకొంటారు. అయితే, జీవితం మాత్రం ఏ మార్పులు లేకుండా, డీలాగా అలాగే సాగాలని కోరుకొంటారేం?

యవ్వనంగా ఉండాలంటే బలమైన శరీరం మాత్రం చాలదు, దృఢమైన మనస్సు కూడా కావాలి!

కాబట్టి జీవితంలో ఎదురుచూడని వాటిని కూడా ధైర్యంగా ఎదుర్కోండి! ఆ తెగువనూ, ధైర్యాన్నీ మీరు యోగా నేర్చుకోవడం వల్ల సాధించవచ్చు.

**అక్షరాల్ని, అంకెల్ని కనుగొన్నది మనిషే.**
**మరి ఆ మనిషి భవిష్యత్తును అవే నిర్ణయిస్తాయా?**
**మన తెలివితేటల్ని, చాకచక్యాన్ని నమ్మి బిజినెస్ చేయాలా?**
**లేక అంకెల్ని నమ్మి చేయాలా**

నన్ను చూడాలని ఒక వ్యాపారవేత్త వచ్చాడు. తన బిజినెస్ కార్డు ఇచ్చాడు. కొంచెంసేపు నాతో మాట్లాడి బయలుదేరేటప్పుడు కాస్త తటపటాయించాడు. "సద్గురూ! నాతో మాట్లాడేటప్పుడు మధ్యమధ్యలో రమియాన్... రమియాన్ అన్నారు. ఆ మంత్రానికి అర్థం ఏంటి?" అని వినయంగా అడిగాడు.

నేను ఆశ్చర్యపోయాను. వెంటనే అతనిచ్చిన కార్డు చూపించాను. "అందులో Rehmean అని రాసుంది. అది నీ పేరే కదా" అని అడిగాను.



"కాదు గురూ! నా పేరు రామన్. దాన్ని ఆంగ్లంలో ఇలా రాస్తే మంచిదని ఓ న్యూమరాలజిస్టు మార్పించాడు!"

నాకు నవ్వు ఆగలేదు.

అక్షరాల్ని, అంకెల్ని కనుగొన్నది మనిషే! అవి మనిషి భవిష్యత్తును ఎలా నిర్ణయిస్తాయి?

మీ తెలివితేటల్ని, చాకచక్యాన్ని నమ్మి బిజినెస్ చేస్తారా? లేక అంకెల్ని నమ్మి చేస్తారా? అదెంత పిచ్చితనం?

మీకు 1 అంకె లాభదాయకం అని ఎవరైనా చెప్పారనుకోండి ఒక కన్ను పొడిచేసుకుంటారా! ఒక కాలు, ఒక చేయి తెగ్గొట్టుకుంటారా? ఇదేం వెఱ్ఱితనం?

శంకరన్‌పిళ్ళై ఒకసారి తాగేసి గొడవ మొదలుపెట్టాడు. న్యాయస్థానానికి తీసుకెళ్లారు.

న్యాయాధిపతి విసుగ్గా "మళ్లీ మళ్లీ కోర్టుకు వస్తున్నావే, సిగ్గువేయడం లేదూ? నిన్ను అని ఏం ప్రయోజనం? అంతా నీ తాగుడువల్ల" అన్నాడు.

వెంటనే శంకరన్‌పిళ్ళై "మీకైనా నిజం తెలిసింది. నా పెళ్లాం విస్కీనేం అనదు. నన్నే అంటుంది" అన్నాడు.

కొంతమంది అంతే. ఎవరిమీద తప్పు మోపేద్దామా అని చూస్తుంటారు. ఓడిపోతే జాతకాన్ని, జ్యోతిష్యాన్ని తోడు తెచ్చుకోవడమేనా? మీ చేతకానితనాన్ని వాళ్లు వాడుకొంటున్నారు కదా! ఓటమికి కారణం నిజంగా మీ తెలివితక్కువతనం కాదా!

నా దగ్గర ఒక పాత మారుతి కారు ఉండేది. ఒకాయన దాన్ని కొనాలని తెగ ఉబలాటపడ్డాడు.

"స్వామీజీ! మీ కారు నెంబరు నాకు చాలా అచ్చి వస్తుంది. మీరెంత వెల చెప్పినా నేను కొంటాను" అన్నాడు.

"ఏ అంకె? రిజిస్ట్రేషన్ నెంబరా? ఇంజిన్ నెంబరా?" నవ్వుతూ అడిగాను. అతను తత్తరపడ్డాడు.

తర్వాత వెళ్లి తన జ్యోతిష్యుణ్ణి అడిగి వచ్చాడు.

"రిజిస్ట్రేషన్ నెంబరే ముఖ్యంట. ఏవేవో లెక్కలు వేసి మరీ చెప్పాడు. జ్యోతిష్యుడు చెప్పిన తేదీ నాడు, ఆ సమయానికి రూ. 99,999 తెచ్చి ఇచ్చాడు."

"చెప్పిన వెలకు ఒక రూపాయి తక్కువగా ఉందని నన్ను అపార్థం చేసుకోవద్దు. ఇది నాకు అచ్చివచ్చే సంఖ్య'' అంటూ ఆ రూపాయి తగ్గినందుకు బదులుగా ఒక గొప్ప వస్తువుని బహుమతిగా ఇచ్చి వెళ్లాడు.

''ఇవన్నీ ఎలాగన్నా ఉండనీండి... ఆ కారులో చాలా భాగాలు డీలాపడిపోయాయి. ముందు నడిపి చూసుకోండి... నచ్చితే సరే" అన్నాను.

తనకు అచ్చివచ్చే అంకే ముఖ్యమని ఆ కారును తీసుకువెళ్లాడు. ఒకే ఒక్క నెలలో అతను ఆ కారును అమ్మేశాడు. కారణం తెలుసా?

ఒకరోజు అతను కారు తోలుతున్నప్పుడు ముందు సీట్ స్ప్రింగ్ ఊడి వెనక్కు వాలి పోయాడట. వెనకనుంచి ఏదో దుష్టశక్తి తన్ను లాగేసిందని అనుకున్నాడు.

వెంటనే ఆ కారు అమ్మేశాడట.

కారు తీసుకెళ్లేటప్పుడు అతను కొట్టిన కొబ్బరికాయకు ఫలంలేదు. టైర్లకింద నలిపిన నిమ్మకాయలూ దండగే! ముఖ్యంగా, అతనికి అచ్చివచ్చే అంకె అతన్ని కాపాడలేక వదిలేసింది. రోజులు, వారాలు, అంకెలు ఇవన్నీ మన అవసరాల కోసం మనం ఏర్పరచుకొన్నవి. అవా మన జీవితాన్ని నిర్ణయించేవి.

**జాతకాలు కలిశాయా లేదా అని చూడకుండా పెళ్లిళ్లు చెయ్యవచ్చా?**

*మీతో కలిసి బతకబోయేవాళ్లను మీరు కదా జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. మీ జీవితాన్ని జ్యోతిష్యం, జాతకం అంటూ ఎందుకని మరొకరి చేతుల్లో పెడతారు.*

*గళ్లు చూసి అతను చేసిన పెళ్లిళ్లలో ఎన్ని విపత్తులుగా పరిణమించాయో మీకెప్పుడైనా చెప్పాడా? మీ భర్తతో గొడవలొస్తే నక్షత్రాలు కారణమని మీ భార్యతో హాయిగా బతకలేకపోతే గ్రహాల్ని కారణం అంటారు.*

*దాంపత్యం సరిగా అమరకపోతే దానికి పట్టింపులు ఎక్కువగా ఉన్న ఇద్దరే కారణం. ఎక్కడో ఉన్న తొమ్మిది గ్రహాలు కాదు.*

*భార్యాభర్తలు మానసికంగా ఒకరితో ఒకరు కలిసిపోతే తమ బతుకును సరిగా నిర్ణయించుకుంటే... రోజులేం చేస్తాయి? నక్షత్రాలు, గ్రహాలుమాత్రం ఏం చేస్తాయి?*



అతనిలాగే అన్నింటికీ శకునాలు చూసేవాళ్లు ఈ లోకంలో ఎందరో ఉన్నారు. ప్రాణాలతో ఉన్న మీరు చేసే మూఢత్వాలకు ప్రాణంలేని గ్రహాల్ని కారణం అంటే ఎలాగ? అదెంత చేతకానితనం?

మిగిలిన గ్రహాల ప్రభావం అంతో ఇంతో భూమి మీద ఉంటుంది. అయితే, మానసిక స్థైర్యం కలవారిని మాత్రం ఈ గ్రహాలు ఏం చేయలేవు.

ఏదో సాధించాలన్న ఆశతో జ్యోతిష్కుడి దగ్గరకు వెళ్తారు. గెలుపు తప్పదని అతను చెప్పగానే మీ ప్రయత్నంలో బలం ఉండదు. గెలుపు సందేహమే అని చెప్పినా ప్రయత్నాలు మానుకొంటారు. ఆ మాత్రానికి మరి జ్యోతిష్కుడి దగ్గరకు వెళ్లటం ఎందుకు?

ఏ పనైనా సగం సగం చేస్తే ఫలితం ఎలాగుంటుంది? ఆశపడ్డది లభించాలంటే మీ చాకచక్యాన్ని పెంపొందించుకోవాలి. ఆటలో ప్రవేశించకుండానే ముగింపు తెలుసుకోవాలని ఆశపడవద్దు. మీ చర్యలకు మీరే బాధ్యత వహించే ధైర్యం పెంపొందించుకోండి.

**మీరొక పోటీలో పాల్గొంటున్నారు.**
**ఎదుటివాడు మీకన్నా బలహీనుడయితే అతన్ని సునాయాసంగా ఓడించగలుగుతారు.**
**కాని అతను మీకంటే బలవంతుడయితే?**

బయట ఒకటే టపాకాయల చప్పుడు. కారణం ఏంటి అని ఒకతణ్ణి అడిగాను. ఎవరో ఒక నటుడి సినిమా ఫెయిలైందట. మరొక నటుడి అభిమాన సంఘం టపాసులు కాల్చి సంబరం చేసుకొంటున్నారట. ఇదేం పిచ్చితనం? ఫుట్‌బాల్ ఆటకు వెళ్తారు. మీకు ఎదురు అదే ఒక జట్టు ఉంటుంది. ఆ జట్టు మీకన్నా గట్టిదయితే, మిమ్మల్ని గోల్ వేయనివ్వదు. మీరు కాస్త ఏమరితే తాము గోల్ చేసేస్తారు. అందువల్ల ఆ జట్టు మీకు పగవారని మైదానం నుంచే తరిమేస్తారా? ఏంటి? ఎదురుగా మరోజట్టు



లేకపోతే, మీరనుకున్నప్పుడు బంతి తీసుకొని వెళ్లి గోల్ చేయవచ్చు. అక్కడున్న రెండు స్తంభాలకు నడుమ బంతిని తన్ని గోల్ చేయవచ్చు.

అయితే అది ఫుట్‌బాల్ అవుతుందా? లేక ఎలాగైనా గెలవాలని, మీతో సమానంకాని అప్పుడే నేర్చుకొంటున్న పిల్లల్తో మీరు పోటీ చేయగలరా?

యమకుచి కరాటేలో ఎనలేని వీరుడు. ఎన్నో పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకొన్నవాడు. ఒకసారి తన గురువునే ఎదిరించాల్సి వచ్చింది, ఒక పోటీలో! తనకు తెలిసిన అన్ని విధానాల్లోను ప్రయత్నించాడు యమకుచి, కాని గురువును గెలవలేకపోయాడు. కొంచెం కొంచెంగా తన ఓర్పు పోగొట్టుకున్నాడు.

కోపంలో తప్పుపట్టు పట్టడంవల్ల గాయాలు అయ్యాయి. అదే ఫలం. పోటీ అవగానే గురువుకు నమస్కరించి తన ఓటమికి కారణం అడిగాడు.

"నువ్వు నన్నెలా చూసావు నాయనా?"

"పోటీ అన్నాక గురువు, ఏంటి? మీ బలహీనతల్ని గుర్తించి ఎలాగైనా మిమ్మల్ని పడేయాలనుకొన్నాను గురూ! కానీ, అది నా వల్ల కాలేదు".

గురువు నేలమీద ఒక గీత గీసాడు.

"దీన్ని చిన్నదిగా చేయాలంటే ఏం చేస్తావు?"

"ఇదే గీత చెరపలేని విధంగా ఏ బండమీదో ఉంటే?" యమకుచికి సమాధానం తెలీలేదు.

గురువుదాని పక్కన దానికన్న పెద్ద గీత గీసాడు.

"ఇప్పుడు మొదటి గీత చిన్నదయిపోలేదా? ఎవరినైనా గెలవాలంటే వాళ్లను తక్కువచేయకు! అంతకన్న నీ చాకచక్యాన్ని పెంచుకో! నీకోసం ఆడు. ఎదుటివాడిని ఓడించాలని ఆడకు" అని చెప్పాడు.

యమకుచికి తెలివి వచ్చింది.

మీరు ఏ శాఖలోవున్నా, ఏ విభాగంలో ఉన్నా, పోటీని ఎదుర్కోవాలి. మీతో పోటీ చేస్తున్నవాళ్లను మీ ఎదురుగా చూడకండి, మీ నిశ్చింతపోతుంది.

*భగవంతుడికి దగ్గరవ్వాలంటే దైవనందిన చర్యలన్నీ చీదరించుకుని మీలా అన్నిటినీ సన్యసించాలా?*

*నా బట్టలు నేను ఉతుక్కుంటాను. అది రోజు పని కాదా! చెట్లకు నీళ్లుపోసి పెంచు తున్నాను... నా వంట నేనే చేసుకొంటాను... ఇవన్నీ చీదరించుకో వలసినవేనా? ఇవన్నీ వదిలేసి ఈ లోకంలో ఎలా బతకడం?*

మీరు రాజకీయాల్లో ఉండవచ్చు. లెక్కలు, పద్దులు రాసేవారు కావచ్చు. పెద్ద వ్యాపారవేత్త కావచ్చు. వీధులూడ్చేవారు కూడా కావచ్చు. ఈ లోకంలో బతకాలంటే కొన్ని పనులు చేయక తప్పదు. వాటిని తక్కువగా అనుకొని చీదరించుకోవడం వల్లే గొడవంతా!

మీకు చాలా నచ్చే పని ఏదో దాన్ని మనసారా చేస్తే, భగవంతుడికి దగ్గరగా ఉన్నారనే అర్థం. మరొకరిలా బతకాలి అనుకుని, అక్కర్లేని బాధల్ని మనసులో పెట్టుకుని బెంగ పడుతుంటే అది మిమ్మల్ని కృంగదీస్తుంది.

దారిలో నడుస్తున్నారు. ముందు వెనుకలు తెలియని ఒకరు మీ దగ్గరకు వచ్చి, 'మూర్ఖుడా' అని మీకే వినిపించేలా అనేసి, వెళ్లిపోయాడు. మీకు కోపంతో రక్తం మరిగిపోతుంది. అలా అన్నవాడు మీకన్నా బలహీనుడైతే దెబ్బలాడ తాడు. అదే మరి బలవంతుడైతే?

పొద్దున్నే లేచి కిటికీ తెరుస్తారు. అతడు మీ ఇంటికేసి చూస్తూ నిలుచున్నాడు. అతడు ఇప్పుడేం చేయనక్కరలేదు. మీ మీద ఉమ్మక్కర్లేదు. రాళ్లు విసరక్కర్లేదు. ఊరికే నిలుచుని ఉంటే చాలు. మీకు కోపం వస్తుంది కదా. మీ పనులన్నీ తలక్రిందులవుతాయి కాదా!

అతడు బలవంతుడో... బలహీనుడో... అయినా, అన్నట్టుగా మిమ్మల్ని మూర్ఖుణ్ణి చేసి చూపించాడు కదా?

మీ స్నేహితులకు కూడా ఈ శక్తి లేదే?

ఎవరినైనా మీరు మీకు పోటీ అనుకోగానే వాళ్లు బలవంతులవడం మీరెప్పుడైనా గమనించారా?

బాగా అర్థం చేసుకోండి... మీరు ఇక్కడ ఎవరితోనూ పోరాడడానికి రాలేదు. ఒకరిని ఓడించామనుకుంటే... మరొకరు తలెత్తుతారు. దాంతో మీ చాకచక్యం మిమ్మల్ని పైకి తీసుకుపోవడానికి తోడ్పడకుండా, ఎదుటివాళ్లను ఓడించడంలోనే పాడయిపోతోంది.



ఎదుటివాళ్లను శత్రువుగా అనుకోవద్దు.

అసూయకు, భయానికి చోటిస్తే మీ చాకచక్యం నశించిపోతుంది. అందుకు మీరు వేసే ప్రతి అడుగూ మీ కోసమే అయివుండనీయండి. మరొకరి చెడువైపు వద్దు. అప్పుడే మీరు అనుకునే శిఖరాన్ని అందుకునే దాకా మీ పయనం ఆనందమయమవుతుంది.

మీ చాకచక్యమంతా బయల్పడేలా చేసే పనే గెలుపుకు కారణమవుతుంది. అందుకు మీ మనసు, శరీరం – రెండింటి శక్తి అవసరం. వాటిని పూర్తిగా ఉపయోగించడం నేర్చుకోవాలి.

**దైవం దగ్గర వేడుకొన్న తర్వాత కూడా ఆ పని జరుగుతుందో లేదోననే అనుమానం మీకుంటే? మీ మనసులో ఆ పోరాటం ఉంటే... వ్యతిరేక భావాలు మీలో ఎలా పోతాయి? ఆశపడ్డవన్నీ ఎలా నెరవేరతాయి?**

అనుకున్నది జరగాలంటే మీకేంకావాలో ముందు బాగా తెలియాలి... దృఢమయిన నిశ్చయం కావాలి! మీలో చాలామందికి ఏం కావాలో అడగడం కూడా తెలియదు. వెతుక్కోడం అసలు తెలీదు. ఏది వద్దో చెప్పడం మాత్రం తెలుసు.

'నాకు ఓటమి రాకూడదు. వ్యాపారంలో నష్టం రాకూడదు. దీన్ని పోగొట్టుకోకూడదు' అంటూ హద్దులనూ, కూడదులనూ ఎక్కువగా అనుకొంటారు.

మీరు దేనిమీదయినా ఆశపడతారో, దాన్ని ముందు మీ మనసులో దానికో రూపం కల్పించండి. అప్పుడే అది నిజంగా రూపుదిద్దుకొంటుంది! ఒక ఇల్లు



కట్టాలనుకుంటే, మనసులో దాన్ని కట్టి పూర్తిచేసి, కాగితం మీద గీసి, దిద్దిన తర్వాతేకదా నిజంగా దానికో రూపాన్నిస్తున్నారు. పునాదులు తవ్వేటప్పుడే మనసులో ధైర్యం లేకుండా, "ఇది నా వల్ల అవుతుందా?" అనే సందేహంతో ప్రారంభిస్తే, మీ ఇల్లు కల్పనలో కూడ పూర్తవదు. "భగవంతుడా, నాకిది కావాలి" అని మనఃస్ఫూర్తిగా ప్రార్థించే కొందరికి, ఆశపడ్డది దక్కినస్థితి మీరు చూసే ఉంటారు. భగవంతుడా! వచ్చి అది చేసిపెట్టాడు?

యుద్ధభూమికేసి తన సైన్యాన్ని నడుపుతున్నాడు ఒక సైన్యాధిపతి. దారిలో అతన్ని ఒక చారుడు కలిశాడు. "దళపతీ! మనదగ్గర వెయ్యిమంది వీరులే ఉన్నారు. మన ఎదురుసైన్యంలో పదివేలమంది వున్నారు. మనం మాట్లాడకుండా శరణుకోరదాం' అన్నాడు.

విషయం తెలియగానే వీరులందరూ ధైర్యం కోల్పోయారు. ఆ విషయం గమనించి వాళ్లందరినీ దగ్గర్లో ఉన్న అమ్మవారి ఆలయానికి రమ్మన్నాడు దళపతి–

"బలవంతుడైన శత్రువును మనం గెలవగలమా అన్న విషయాన్ని దైవానికే వదిలేద్దాం! దైవసన్నిధిలో ఈ నాణేన్ని ఎగరేస్తాను. బొమ్మపడితే అమ్మవారు యుద్ధం చేయమని అనుజ్ఞ ఇచ్చిందని అనుకుందాం! బొరుసుపడితే ఇలాగే వెనక్కి తిరిగి వెళ్లిపోదాం" అంటూ నాణేన్ని ఎగరేశాడు దళపతి.

బొమ్మపడింది. వీరులందరూ చాలా ఉత్సాహపడ్డారు. యుద్ధానికి వెళ్లారు. వాళ్లకన్నా పదిరెట్లు ఎక్కువ వున్న శత్రువుల్ని చావగొట్టారు. గెలిచి తమ దేశానికి తిరిగి వెళ్లారు. దారిలో అదే అమ్మవారి గుడికి మళ్లీ వెళ్లారు, అమ్మవారికి కృతజ్ఞతలు చెప్పడానికి.

దళపతి అప్పుడే తన వద్ద ఉన్న నాణేన్ని తీసి చూపించాడు. దానికి రెండుపక్కలా బొమ్మే ఉంది.

దైవమే చెప్పిన తీర్పు అన్న నమ్మకంతో వీరులు ఎలాగా గెలుపు తమదే అన్న నమ్మకంతో వున్నారు. వాళ్లలో వేరే ఆలోచన లేదు. అందువల్ల గెలవగలిగారు.

ఆ రకంగా దైవం మన మనస్సును దృఢపరుచుకోవడానికి ఒక చక్కని పరికరం మాత్రమే!

అలా కాకుండా దేనికైనా వెళ్లి గుడిలో వేడుకొంటే పనులు జరిగిపోతాయా? భగవంతుడి మీద ఇసుమంత కూడా సందేహం లేని పరిపూర్ణమైన నమ్మకం మీకుందా? కల్లాకపటం లేని ఆ గుణం ఉంటేనే వ్యతిరేక ఆలోచనలు రావు... ఆశపడ్డవన్నీ దక్కుతాయి.

భగవంతుని మీద ఒక కన్నూ, బయటవదిలేసిన చెప్పులమీద ఒక కన్నూ అనే మీరు భక్తి కలిగి వుంటారంటే, భగవంతుడిని నమ్ముతున్నానని మిమ్మల్ని మీరే మోసం చేసుకొంటున్నారని అర్థం. ఆ దొంగనమ్మకం మీ పనులు సాధించుకోడానికి ఏమాత్రం సరిపోదు.

దైవం దగ్గర వేడుకొన్న తర్వాత కూడా ఆ పని జరుగుతుందో లేదోననే అనుమానం మీకుంటే, మీ మనసులో ఆ పోరాటం ఉంటే... వ్యతిరేకభావాలు మీలో ఎలాపోతాయి? ఆశపడ్డవన్నీ ఎలా నెరవేరతాయి?

శంకరన్ పిళ్ళై ఒకసారి చాలాదూరం నడిచి ఎదురుచూడని విధంగా స్వర్గంలోకి అడుగుపెట్టాడు.

అతడికి విపరీతమైన ఆకలి. నీరసంగా అన్పించి ఒక చెట్టుకింద కూర్చున్నాడు. అది కోరినవన్నీ తీర్చే కల్పవృక్షం. అది తెలీకుండానే 'ఇప్పుడు నాకు కడుపునిండా తిండి దొరికితే ఎంత బాగుంటుంది' అనుకున్నాడు.

మరుక్షణంలో కోరుకున్న పదార్థాలన్నీ బంగారు పళ్లాల్లో ఎదురుగా వచ్చి అమరాయి. కోరిన పళ్లరసాలన్నీ బంగారు గిన్నెల్లో అమరాయి.

కడుపునిండగానే నిద్ర వచ్చింది. 'మంచి మంచం ఉండివుంటే' అనుకొన్నాడు. ఒక అందమైన మంచం పరుపుతో సహా అతనిముందు ప్రత్యక్షమైంది.

అతనికి వెంటనే భయం వేసింది.

"అనుకోగానే అన్నీ ఎలా జరుగుతున్నాయి. ఇదేమన్నా పిశాచాలుండేచోటా' అని అనుకున్నాడో లేదో అతన్ని పిశాచాలు చుట్టుముట్టుకొన్నాయి.

'అయ్యో! ఈ పిశాచాలు నన్ను చంపేస్తాయేమో!' అని అతడు అనుకోవడం తడవుగా అవి అతన్ని చంపేసి తినేశాయి. శంకరన్ పిళ్ళై గతి చూశారా?



మీ ఆలోచనలు వ్యతిరిక్తంగా ఉంటే, ఈ గతే పడుతుంది. మీ మనసులో కావలసినదానికోసం ఆశపడే గుణం ఒకటి ఉంటే, నమ్మకంలేని భయపెట్టే ఆలోచనలు వేయి వుంటాయి.

మీ ఆశల్ని, సంతోషాన్ని అధికం చేసుకొనే మీ శక్తిని మీరే తక్కువ చేసుకోవడం ముందర మానండి.

కోరికల్ని తీర్చే కల్పవృక్షాన్ని వెతుక్కొని మీరు ఏ అడవికీ వెళ్లనక్కర్లేదు. మీ ఆలోచనలు తీవ్రతరంగా ఉంటే, మీ మనస్సు స్థిరంగా ఉంటే, అదే వరాలిచ్చే వృక్షం అవుతుంది. ఆలోచనలవల్ల ఏర్పడే బలమైన భావతరంగాలకు ఆ శక్తి ఉంటుందని శాస్త్రవేత్తలు కూడా ఒప్పుకుంటున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత మా ఆయనకు అప్పుడప్పుడూ జ్వరం వస్తోందే, ఎందువల్ల?

పసితనంలోనే తగని ఆలోచనాధోరణి పెంపొందించుకొంటాం. ఆడుకొంటున్న పసిపాపనెవ్వరూ పట్టించుకోరు. కాని కొంచెం జ్వరం రాగానే కుటుంబం మొత్తం ఆ పాప చుట్టూనే వుంటారు.

పసితనంలో అప్పుడప్పుడూ అనారోగ్యంపాలు కావడానికి చుట్టూ ఉన్నవాళ్లే కారణం.

వాళ్లకు తగిన ఆరోగ్యచర్యలు తీసుకోండి. మందులివ్వండి. మంచి పుష్టికరమైన తిండి పెట్టండి. అంతేకాని, మరీ బంధించకుండా స్వతంత్రంగా ఆడుకోనివ్వండి. మరీ జాగ్రత్తగా పొత్తిళ్లల్లో పెట్టుకొని పెంచితే, మన గమనం తమకేసి తిప్పుకోవాలనిపించినప్పుడల్లా వాళ్లు అనారోగ్యంపాలయ్యేలా చేస్తుంది.

వయసుమీదపడ్డా ఈ అలవాటు పోదు. ఉద్యోగ విరమణ పొందగానే ఎవరూ తమను పట్టించుకోవడం లేదనిపిస్తుంది. అందువల్లే అప్పుడప్పుడూ జ్వరం వస్తుంది. ప్రపంచం ఆరోగ్యవంతంగా వుండాలంటే అనారోగ్య కారణాల్ని పెంపొందించకండి.

## కోరిక తీవ్రతరమైనదైతే కోరిందాన్ని పొందగలమా లేదా అనే ఆలోచన ఎందుకు?
## ఒక కోరిక నిన్న తీరలేదంటే, ఇక నెరవేరనే నెరవేరదని ఏ ఆధారంతో చెప్పగలరు?

మీకేది కావాలన్న విషయంలో, మీకు మీరు సరైన నిర్ణయం తీసుకొంటే, మంచి పట్టుదల ఉంటే కోరిందాన్ని పొందడం సులభం.

కోరిక తీవ్రతరమైనదేతే కోరిందాన్ని పొందగలమా లేదా అనే ఆలోచన ఎందుకు? "మీరు లేచి నడవగలరా?" అంటే 'నడవగలన'నే అంటారు. "మీరు గాల్లోకి లేచి ఎగరగలరా?" అంటే "కుదరదు" అనే కదా అంటారు!

మీ ఈ రెండు సమాధానాల్ని ఇచ్చింది మీ అనుభవాలే కదా! ఒక కోరిక నిన్న తీరలేదంటే, ఇక నెరవేరనే నెరవేరదని ఏ ఆధారంతో చెప్పగలరు? వందేళ్లకు ముందు



అమెరికాలో జరుగుతున్నది ఆ క్షణానికాక్షణం తెలుసుకోవాలని కోరుకుంటే జరిగేది కాదు. కానీ, ఎవరో ఒకళ్లు అలా తీవ్రంగా కోరుకోబట్టే కదా మనకు టెలివిజన్ వచ్చింది.

జర్మన్‌కు చెందిన ఒట్టోలి లియంత్రా అనే విజ్ఞానవేత్త ఎగరలేం అన్న విషయాన్ని అంగీకరించలేకపోయాడు. అతడే మొట్టమొదటిసారి ఎగిరే పరికరాన్ని కనిపెట్టాడు. ఆ సంతోషాన్ని తన దేశ ప్రజలతో పంచుకోవాలనుకున్నాడు. ఓ రోజును నిర్ణయించుకుని అందరి ముందూ ఎగిరి చూపిస్తానని మాటిచ్చాడు.

అయితే, జర్మన్ చర్చిల్లోని ఫాదర్‌లు కోపంతో మండిపడ్డారు. 'దేవతలు మాత్రమే ఆకాశంలో ఎగరగలరు. ఒక మానవుడు అలా గాల్లో ఎగరడం దేవతల్ని కించపరచడమే' అని ఒట్టోలి లియంత్రా తయారుచేసిన విమానాన్ని రాత్రికి రాత్రే తగలబెట్టేశారు.

ప్రపంచ చరిత్రలో మతగురువులెందరో ఇలా దైవానికి తాము ప్రతినిధులమని చెప్పుకొంటూ చేసే తమ వ్యాపారానికి అడ్డురావచ్చనే భయంతో ఇలా ఎన్నో ప్రయత్నాల్ని చిగుళ్లలోనే తుంపిపారేశారు.

ఒట్టోలి అక్కడితో ఆగిపోలేదు. మళ్లీ ఓ కొత్త విమానాన్ని తయారు చేయడానికి అతడికి నాలుగేళ్లు పట్టింది. ఐతే ఆ లోపే రైట్ సోదరులు తయారుచేసిన విమానం గాల్లో ఎగిరి ఓ కొత్త చరిత్రను సృష్టించింది.

మనిషి ఎగరడం సాధ్యమా అన్న ఆలోచనతో, సందేహంతోనే గడిపి ఉంటే ఒట్టోలినో, రైట్ సోదరులో ఎవరూ విమానాన్ని కనుక్కోగలిగేవారు కాదు! ఈనాడు కొన్ని గంటల్లో ప్రపంచంలో ఈ పక్కనుంచి ఆ పక్కకు వెళ్లగలిగే అవకాశం మనకుండేది కాదు.

'పరిణామక్రమంలో కోతి తోకపోయి మనిషి పుట్టాడు' అని డార్విన్ అన్నది నిజమే. తోక రాలిపోయింది కానీ, కోతిపోలేదు, మనిషి మనసులోనే తిష్టవేసుకొని ఉండిపోయింది. సందర్భానుసారంగా అటూ, ఇటూ గెంతుతూ మనస్సును ఒక స్థితిలో ఉండనీయక, దేనిమీదా లక్ష్యం లేకుండా చేస్తోంది. గమనించారా?

ఆ కోతిని దగ్గరకు రాక, మనస్సును నిశ్చలంగా ఉంచుకోగలిగిన కొందరే ఈ ప్రపంచంలో ఇన్నిమార్పులు తీసుకురాగలిగారు.

జరగదు, కుదరదు, దొరకదు అని మీ ముత్తాతలు ముక్కు మూసుకుని కూర్చుని ఉంటే, మీరింకా చెట్ల కొమ్మలకు వేలాడుతూనే ఉండేవారు.

పురాణాల్లో చదివి ఉంటారు. ఈశ్వరుణ్ణి గురించి ఓ రాక్షసుడు కఠినమైన తపస్సు చేస్తాడు. ఆ తపస్సును భగ్నం చేయడానికి దేవతలు ఎంతో ప్రయత్నిస్తారు. గాలి కుదిపేస్తుంది. వాన ముంచెత్తుతుంది. క్రూరమృగాలు చికాకు పెడతాయి. రంభ, ఊర్వశిలు ప్రయత్నిస్తారు. ఎన్ని ప్రయత్నాలు జరిగినా, అతడు నిశ్చలంగా ఉండటం వల్ల ప్రకృతి అతనికి అణిగిపోతుంది. చివరకు తనకు కావలసిన వరాన్ని శివుడి దగ్గర్నుంచి పొందుతాడు.

నిశ్చలమైన ఆలోచనలున్న వాళ్లకు లభించాల్సిన ప్రతిఫలాన్ని ఆ దైవం కూడా ఆపలేదు.

మహాత్మాగాంధీ చాలా నిరాడంబరుడు. ప్రత్యేకించి ఏ విషయంలోనూ అత్యంత ప్రతిభావంతుడు కాదు. అయితే ప్రపంచమే అబ్బురపడి చూసేలాంటి దివ్యరూపం ఎత్తాడు. ఎవరూ చలింపచేయ లేకపోయిన బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఆయన గడగడ లాడించాడు.

**మతం మారడం అంటే...**

*మనిషి తనలోని దైవత్వాన్ని తెలుసుకోడానికీ, మనసు లోపలి పొరల్లోకి తొంగి చూసుకోడానికి మతాలు ఏర్పడ్డాయి. వీధుల్లో అమ్మకానికో, సంఖ్యా బలాన్ని పెంచుకోవడానికో ఏదైనా చేయడం మతం అన్పించుకోదు!*

*"నేను నమ్మే దైవాన్నే నువ్వూ నమ్ము లేదా నీ ప్రాణం తీస్తాను..." అంటూ కత్తి చూపెట్టి బలవంతపరచేది మతం కాదు.*

*పేదతనంతో మగ్గిపోతున్నవాళ్లకు తిండి పెట్టడం, చదువు నేర్పడం ఉన్నతమయినవే, అయితే తిండి ఆశ చూపెట్టి తన పక్కకు మరల్చుకోవడం ఎంత నైచ్యం?*

*ఆకలితో మాడిపోతున్నవాడికి అన్నమే పరబ్రహ్మం. దాన్ని నమ్మి అతడు మతం మారతాడే తప్ప, అతనికి ఈ కొత్తదైవం మీద పుట్టుకు వచ్చే నమ్మకమంటూ ఏం ఉండదు. తమ దైవం మీద నిజమైన నమ్మకం ఉన్న వాళ్లకు, ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంస్కృతిని విచ్ఛిన్నం చేసి తమ పక్కకు తిప్పుకోవాల్సిన అవసరం లేదు. ఏ మతపరంగానో తన్ను గుర్తించుకోవడానికి ప్రయత్నించేకన్నా ఓ ప్రత్యేక సంస్కృతితో తన్ను గుర్తించుకోవడాన్ని మనిషి గర్వకారణంగా భావించాలి.*



దాన్ని ఆయనెలా చేయగలిగాడు?

స్వీకరించిన బాధ్యతను మనసారా నెరవేర్చాలన్న ప్రయత్నమే అది. ఆయనకన్నా చదువు, ఆస్తి, చాకచక్యం ఎక్కువ ఉన్నవాళ్లు కూడా ఆయన్నే వెన్నంటి నడిచారు.

కారణం... చేయాలనుకొన్న దానిని సాధించాలని మహాత్మా సిత్థిరనిశ్చయంతో ఉండటమే!

చెరలో ఉన్నా ఆయన తన స్థిర సంకల్పాన్ని మార్చుకోలేదు. ఆయన స్థిరచిత్తాన్ని, నిశ్చయాన్ని ఏంచేయలేక చివరకు బ్రిటిష్ ప్రభుత్వమే తలవంచింది.

స్థిరచిత్తం కలవారు ఏదైనా సాధించగలరు.

దురదృష్టకరమైన విషయం ఏంటంటే, ఈ రోజుల్లో స్థిరనిశ్చయాలున్న వాళ్లంతా చెడు తలపు కలిగినవాళ్లే కానీ, మంచి ఆలోచనలున్నవాళ్లు లేరు. ఆ చెడు ఆలోచనలు ఆపదలకు కారణమవుతాయి.

తీవ్రవాదులు తాము అనుకొన్నది సాధించడానికి తమ ప్రాణాల్ని సైతం అర్పించడానికి తయారుగా ఉన్నారు. మహాత్మాగాంధీ కూడా తీవ్రవాదే! అయితే హింసను ఇసుమంతైనా ఆదరించని తీవ్రవాది. చెడు ఆలోచనలవైపు మనస్సును పోనీయని తీవ్రవాది.

ఎవ్వరూ చలింపచేయలేని స్థిరనిశ్చయ చిత్తులై మీరుంటే, కోరుకున్నదాన్ని తప్పక సాధించగలరు.

## మీ వద్ద వున్నవి ఇతరుల వద్ద లేకపోవడం మీకు సంతోషాన్నిస్తోందా?
## మీ సంతోషాన్ని ఎదుటివారి స్థితిగతులకు కుదువ పెడుతున్నారా?

ఓ సారి శంకరన్‌పిళ్ళైకు భగవంతుణ్ణి సందర్శించే మహాభాగ్యం కలిగింది. "నీకు మూడు వరాలు ఇస్తాను కోరుకో" అన్నాడు భగవంతుడు.

"ఏమైనా అడగవచ్చా?" అన్నాడు పిళ్ళై.

"అడుగు. అయితే, నీకు నా వరఫలంగా ఏది లభించినా నీ స్నేహితుడికి రెండింతలు లభిస్తుంది" అన్నాడు భగవంతుడు.

శంకరన్ పిళ్ళై ఆనందంగా ఇంటికెళ్లాడు. 'భగవంతుడా రాజభవంతిలాంటి ఇల్లు కావాలి' అనుకున్నాడు. మరుక్షణం రంగు వేసిన అతని ఇల్లు గొప్ప రాజభవంతిగా



మారిపోయింది. కిటికీలోంచి చూసినప్పుడు, అతని స్నేహితుడి ఇల్లున్నచోట రెండు భవంతులున్నాయి. శంకరన్‌పిళ్ళైకు కాస్త బాధ అనిపించింది. 'పోనీలే. నాతో హాయిగా వుండడానికి ఓ ప్రపంచసుందరి కావాలి' అనుకున్నాడో లేదో అతని మంచం మీద ఒక అద్భుత సౌందర్యవతి వెలిసింది.

శంకరన్‌పిళ్ళై ఆత్రుతను అణచుకోలేకపోయాడు. కిటికీలోంచి స్నేహితుడి ఇంటికేసి చూశాడు. అక్కడ బాల్కనీలో ఇద్దరు అందగత్తెలు స్నేహితుడితో సరసాలాడుతున్నారు. అది చూసి శంకరన్‌పిళ్ళై సహించలేకపోయాడు. మూడో వరాన్ని కోరుకున్నాడు. 'భగవంతుడా నా ఒకన్ను పోయేలా చూడు' అని.

తన వద్ద వున్నవి పక్కవాడికి లేకపోతేనే శంకరన్‌పిళ్ళై లాంటి వాళ్లకు సంతోషం. అలా వాళ్లు వున్నవి కూడా పోగొట్టుకుని బాధపడతారు.

మీరో కారు కొంటారు. సంతోషమే! అయితే, ప్రక్కింటి వాడు మీకన్నా ఖరీదైన కారు కొనగానే మీ ఆనందం తుస్సుమంటుంది. వేయి ఏళ్లకు ముందు మనిషికి కారు లేదు. అయితే, తన ఆవుకన్నా పక్కవాడి ఆవు ఎక్కువ పాలిస్తే వీడి మనస్సు కుతకుతలాడేది. ఆవుకు బదువుగా ఇప్పుడు కారు వచ్చిందేతప్ప, మనషి బాధ మాత్రం ఎప్పుడూ ఇప్పుడూ మారిందా? లేదే!

మనిషి కొన్ని శతాబ్దాలుగా తన సుఖాలకోసం, ఈ భూమిని తలక్రిందులుగా మార్చేస్తున్నాడు. మిగిలిన జీవితం గురించి కించిత్తైనా చింతే లేకుండా పురుగు పుట్ర, జంతువుల చోటును ఆక్రమించుకున్నాడు. మాను, గుట్ట, పుట్ట వేటినీ వదల్లేదు. నేల, నీరు, గాలి అన్నిటినీ విచ్చలవిడిగా వాడుకుని మంచిగాలిని పీల్చుకోవాలన్నా కుదరని పరిస్థితి తెచ్చిపెట్టుకున్నాడు.

ఇదంతా ఎందుకు చేస్తున్నట్టు? తనకు ఆనందం కలుగుతుందనే కదా?! తన ఆనందం కోసం భూమినే అతిగా చేసి ఆడుకోనివ్వండి. తప్పు లేదు. ఐతే, సంతోషాన్ని కాస్త కూడా పొందడం చేతకానివాడై లోకంలో పడి, భూమిని మరొక విధంగా ఉపయోగిస్తూ, దాన్ని నాశనం చేసే అధికారం మనిషికి ఎవడిచ్చాడు?"

నాకు ఓ అత్తయ్య వుండేది. చాలా ఆధునిక భావాలు కలిగినది. లేడీస్ క్లబ్‌లో చాలా పేరున్న వ్యక్తి. గొప్పగా అలంకరించుకునేది. విమల అనే మరొక ఆమె వుండేది.

ఒకరోజు నేను మీటింగు నుండి వచ్చేసరికి మా అత్త 'ఓ' అని ఏడుస్తూ వుంది. 'ప్రెసిడెంట్ ఎలక్షన్‌లో ఓడి పోయిందా? కారుకేదైనా యాక్సిడెంట్ అయిందా?' అనుకుని ఆమె దుఃఖానికి కారణం అడిగాను.

''విమల నామీద కక్ష సాధించింది'' అని చెప్పి మళ్లీ అదే ట్యూన్‌లో ఏడవడం ప్రారంభించింది.

అత్త ఓ కొత్త నెక్లెస్ ధరించి మీటింగుకు వెళ్లింది. ఎవరైనా అడిగితే ఆ వజ్రాల గురించి ఎలా వర్ణించి చెప్పాలో కూడా ఆలోచించుకుని వెళ్లింది. అయితే, ఏ ఒక్కరూ నెక్లెస్ గురించి పట్టించుకొనేలేదు. అత్తయ్య దాన్ని తట్టుకోలేకపోయింది. విమలవల్లే అలా జరిగివుంటుందనీ, ఆమే కారణమని ఆమెను తిట్టిపోసింది.

అత్తయ్య అంత వెలపోసి ఆ నెక్లెస్ కొన్నదేమో తన ఆనందం కోసమే. అయితే, మౌనంగా ఎక్కడో కూర్చొని ఓ విమల ఆ ఆనందాన్ని కొల్లగొట్టగలిగింది. ఇదేమన్నా బావుందా? మీ జీవితంలో కూడా ఇలాంటి సందర్భాలు ఎదురుకావచ్చు. మీ కోరిక ఏంటి? సంతోషంగా వుండటం. అయితే, తప్పు ఎక్కడ జరిగింది?

ఇంత చదువుకుంటేనే సంతోషం, ఇంత సంపాదిస్తేనే ఆనందం. ఇతరులు అసూయపడేలా నగలు దిగేసుకుంటేనే తృప్తి అంటూ నిబంధనలు ఏర్పరచుకోకండి.

**స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ తప్పా?**

*యవ్వనంలో ఉన్న స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ వద్దన్నా ఏర్పడుతుంది. మీరు దాని నుంచి తప్పించుకోవాలనుకున్నా అది సాధ్యం కాదు. అది ప్రకృతి సహజం. తప్పా, ఒప్పా అని ఆలోచించాల్సిన అవసరం లేదు.*

*పాశ్చాత్య దేశాల్లో ఫ్రీ సెక్స్ అనేదొకటి ప్రారంభమైంది. కుటుంబం, కట్టుబాట్లు అనేవి ఏమీ లేకుండా, సంతోషంగా వుండాలను కొంటున్నారు. యవ్వనంలో ఇది చాలా సంతోషదాయకంగానే ఉంటుంది. అయితే, వయసు మళ్లిన తర్వాత సరైన ప్రేమానుబంధాలు లేక, ఎందరో మానసిక వైకల్యానికి లోనవుతున్నారు. వారి పరిస్థితి దయనీయంగా, బాధాకరంగా ఉంది.*

*బాధ్యతల్ని అంగీకరించలేక ఊరికే సెక్స్‌ను మాత్రం అనుభవిస్తూ తిరిగిన వీళ్లవల్ల ఒక తరం అంతా అనాథలైపోయారు.*

*శారీరక అవసరాల్ని దాటి ఈ జీవితం నడవాల్సిందెంతో వుందని మర్చిపోవద్దు. మరీ కోరికల్లో చిక్కుపడ్డా కష్టమే! జీవిత లక్ష్యం నుంచి మీ మనస్సుని చెదరనీయకుండా సుఖాల నీండా ఆసక్తి చూపండి తప్పుకాదు.*



మీ కోర్కెల నిశ్చితరూపం తెలీకుండా, బయటి పరిస్థితులను మార్చినా నిశ్చింత రాదు.

అంటే, నెక్లెస్ మీద కోరిక తప్పా? కారు కావాలనుకోవడం తప్పా? అంటే కానేకాదు. దేనిమీదైనా ఆశ పెంచుకోవచ్చు. అది సహజం. కానీ సంతోషమే మన కోరికలన్నిటికీ ఆధారమని మరిచి, ఆశకు మారు రూపాలుగా మీరెన్నుకున్న నెక్లెస్, కారు మొదలైన వాటిల్లో చిక్కుపడకండి. మీ సంతోషాన్ని ఎదుటివారి మాటలకు, వారి స్థితిగతులకు కుదువపెట్టకండి. అలా చేయగలిగినప్పుడు ఈ ప్రపంచాన్నే మీ దారిలో పెట్టుకోగలరు.

## ఏ వృత్తిని స్వీకరించాలో నిర్ణయించుకునే శక్తి సామర్థ్యాలు మీకు లేవా?

ఓ వయసు రాగానే సంపాదించాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఏ వృత్తిని చేపట్టినా మరొకటి అంతకన్నా గొప్పదేమో అనిపిస్తుంది. దాంట్లోకి మారకూడదా అనీ అనుకుంటాం. ఒక దాన్నుంచి మరోదానికి మనస్సు మారడంవల్ల దాని లక్ష్యం గొప్ప స్థితి నుంచి జారిపోతూనే వుంటుంది.

"సంగీతం అంటే నాకిష్టం. కానీ, ఈ పాడుపొట్ట కోసం ఏదోక ఉద్యోగానికి వెళ్లక తప్పదు కదా" అన్నాడు యువకుడు. అతడు ఎలాంటి పనికెళ్లాలి? సంగీత వాయిద్యాలను అమ్మే అంగట్లో తుడిచే పనైనా ఒప్పుకోవాలికదా!

ఆ పనయినా నూటికి నూరుపాళ్లు సంతృప్తితో చయడానికి తయారుకావాలి. ఇలా పూర్తిగా తన్నుతాను అర్పించుకుని, ఏ పని ప్రారంభించినా, అతడెంత ఎత్తు



ఎదగాలో, అంతకన్నా మరింత ఎత్తుకు ఎదుగుతాడు. ఏ వృత్తి స్వీకరించాలో నిర్ణయించుకునే శక్తి సామర్థ్యాలు మీకు లేవా? ఓ పని చేయండి. ఇప్పుడు చేస్తున్న పనిలో మిమ్మల్ని మీరు పరిపూర్ణంగా అర్పించుకోండి.

పూర్తిగా అర్పించుకోవడమంటే ప్రాణం, హృదయం రెండింటినీ ఆ పనిలో లీనం చేయడం. చేసేది ఏదైనా నూరుపాళ్లు నమ్మకంతో చేస్తే, మీలోని స్ఫూర్తి మిమ్మల్ని సరైన దారిలోకి మళ్లిస్తుంది. సంతోషంగా పని చేస్తున్నట్లయితేనే, మీరు పూర్తిగా మీ శక్తిని వినియోగించగలరు. బలవంతంగా ఇష్టంలేకుండా చేస్తే, రక్తపోటు, అల్సరు, ఏవేవో మానసిక వ్యాధులు ఆహ్వానం లేకుండానే వచ్చి చేరతాయి.

శంకరన్‌పిళ్ళై రైల్లో వెతుకు తున్నాడు. చక్కటి సీటు దొరికింది. హాయిగా కూర్చున్నాడు. అప్పుడు కూడా తననెత్తి మీదున్న మూటను కిందికి దింపలేదు.

టికెట్ కలెక్టర్ వచ్చాడు. ఆహార పదార్థాలు అమ్మేవాడు వచ్చాడు. తలమీద మూటతో పిళ్ళై ఏం చేయలేకపోతున్నాడు. కూడా పయనిస్తున్న వాళ్లలో ఒకరు, "అయ్యా! మూట పెద్దదిగా వుంది కదా! దింపటానికి ఏమన్నా సహాయం కావాలా?" అన్నారు.

"అదేం అక్కర్లేదు" అన్నాడు.

"మూటలో అమూల్యమైన గొప్పగొప్ప వస్తువులున్నాయన్నమాట. దొంగల భయం వల్ల కింద దింపకపోతే మూట కిందపెట్టి దానిపైన మీరు కూర్చోవచ్చే!"

"అదేంకాదు... అన్నీ పాతబట్టలే!"

"మరెందుకు ఆ మూటను మోస్తున్నారు?"

"నా భారాన్ని ఈ రైలు మీద ఎందుకు మోపాలి? అని అనుకొంటున్నాను" అన్నాడు.

శంకరన్‌పిళ్ళైలా భారాన్ని దింపుకోవడం కూడా చేతకాని వారు ఏ పనిని సక్రమంగా చేయగలరు? కుటుంబం మొత్తాన్ని భారంగా భుజాలమీద మోస్తున్నట్టుగా డీలాపడి బతికేవాళ్లు ఏం సాధించగలరు?

దయచేసి మీ మనస్సులోని భారాన్ని కిందకి దింపి పెట్టండి. చేసేపనిని సంతోషంగా చేయండి.

### చేసే వృత్తిలో ఎదగాలంటే ఏ దైవాన్ని పూజించాలి?

*“చెప్తే... ఆ గుడికెళ్తారు. అక్కడ దేవుడితో నేరుగా మీకు మీరుగా మాట్లాడలేరు. అక్కడున్న పూజారిని ఆ దేవుడికి ఏజెంటుగా భావిస్తారు. ఓ పదిరూపాయలు హారతి పళ్లెంలో వేస్తారు. మీ పేరు, నక్షత్రం, విలాసం చెప్పి ఆ ఏజెంటు భగవంతుణ్ణి పిలుస్తాడు.*

*‘ఈ బుద్ధిమంతుడు నిన్ను నమ్మి పది రూపాయలు ఖర్చుపెట్టాడు. అతని బిజినెస్‌ను జాగ్రత్తగా చూసుకో’ అంటాడు.*

*భగవంతుడు వస్తాడా? ఈ లోకంలో ఎలాంటి పనికిరాని మూర్ఖుడు కూడా పది రూపాయలకు బిజినెస్‌ను చూసుకోడు.*

*మీరు సంతోషంగా సమర్పించే తలనీలాల కోసం, హుండీలో వేసే చిల్లర డబ్బుల కోసం మీ జీవిత పర్యంతం మీ బిజినెస్ చూసుకోడానికి భగవంతుడేమైనా పిచ్చివాడా?*

*మనిషిని భగవంతుడు ఎంత గొప్ప అద్భుతమైన యంత్రంగా తీర్చిదిద్ది భూమీదకు పంపాడు? ఆయన చేయవలసింది అంతా, ఎప్పుడో చక్కగా నెరవేర్చాడు.*

*బాబూ! ఇక మిగిలింది మీ ప్రయత్నం! మీ చాకచక్యాన్ని ఆధారంగా చేసుకుని బరిలోకి దూకాల్సిన పరిస్థితి ఇది. ఇప్పుడు భగవంతుణ్ణి పిలిస్తే ఎలా? కోటి రూపాయలిచ్చినా భగవంతుడు మీకోసం తన చిటికెన వేలు కూడా కదల్చడు. జాగ్రత్తగా మీ వ్యాపారం చేసుకునే సత్తా మీకు లేకపోతే ఆ వ్యాపారం మాత్రం మీకు ఎందుకు చెప్పండి?”*

‘మీరు వెళ్లే రైలు నాలుగు గంటలు ఆలస్యంగా బయలు దేరుతుంది’ అని చెప్పారనుకోండి. ప్రపంచం మునిగిపోయినట్టు పెద్ద వాళ్లంతా ముఖం ముడుచుకొని కూర్చుంటారు. కూర్చున్న ఆ కొన్ని గంటలు కూడా ముళ్ల మీదున్నట్టుగా అనుకొని, రైల్వేను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకొంటూంటారు.

అయితే, అదే రైలులో వెళ్లడానికి వచ్చిన పిల్లల్ని చూడండి. చేతికి దొరికిన ఏదోక చిన్న వస్తువును పట్టుకొని, హాయిగా ఆడుకొంటూ కాలం గడిపేస్తారు. అనవసరంగా వాళ్లు తమనుతాము బాధించుకోరు.

తమకు దొరికిన అవకాశాన్ని హాయిగా సద్వినియోగం చేసుకొంటారు. పెద్దల్లా బాధల్ని తెచ్చిపెట్టుకోకుండా హాయిగా గడిపేసుకొంటూంటారు.

మరి మీరో? ఆ కాసేపు సంతోషాన్ని పొందటానికి బదులు మిమ్మల్ని మీరే కష్టపెట్టుకుంటున్నారు. సంతోషాన్ని అనుభవించడం తెలీక కష్టపడుతున్నారు. అలా మీరు ఓడిపోతున్నారే? మనస్సుపై దుఃఖం, గాభరా ఏదీ ఆధిక్యత సంపాదించకుండా జాగ్రత్తగా ఏం చేయాలో అది మాత్రం చేయడం నేర్చుకోండి.

ఈ రైలుపోతే పోనీండీ, వేరే బస్సు ఎక్కవచ్చు. టాక్సీ పట్టుకోవచ్చు. వేరే వాహనమేదైనా వుందా అని చూడవచ్చు. ఏదీ దొరకని పక్షంలో ఎదురుచూడవలసిన సమయాన్ని హాయిగా, సంతోషంగా ఎలా గడపాలా అని ఆలోచించండి. అలా వుండండి, దుఃఖపడటం వల్ల మనస్సులోని భారం దిగదు. సంతోషంగా వుండే మనుషులు మాత్రమే ఏ పనినైనా హాయిగా, చక్కగా చేయగలరు.

**జీవితాన్ని అనుభవించడం అంటే ఏమిటని**
**మీరు ఎప్పుడైనా ఆలోచించారా?**
**మీ తెలివితేటలు, చాకచక్యం ఏవీ బయటపడకుండా**
**చేసిందే చేయడానికి మీరేమన్నా యంత్రమా?**

మీరు పుట్టినప్పటి నుంచే 'చెడ్డ అలవాట్లు నేర్చుకోకు, మంచి అలవాట్లు నేర్చుకో, చెడుకు లోను కావద్దు' అని అప్పుడప్పుడూ ఎవరో ఒకరు చెప్పడం వినే వుంటారు. నన్నడిగితే, మనస్ఫూర్తిగా కాక, కేవలం అలవాటుగా చేస్తే అది ఏదైనా సరే చెడ్డ అలవాటే!

పొద్దున్నే అలారం పెట్టుకొని లేస్తారు. గబగబా రోజువారీ పనులన్నీ చేస్తారు. స్నానం చేసి, టిఫిన్ తిని బస్సో, కారో, స్కూటరో ఏదో ఒకదాంట్లో ఆఫీసుకెళ్లిపోతారు.



సాయంత్రం వరకూ అక్కడా అలవాటైనపనే. పని పూర్తి కాగానే ఇంటికెళ్లి, తిని, పడుకొని, మళ్లీ లేచి... బండికి కట్టబడే ఎద్దు రోజూ ఆ బండిని లాక్కునివెళ్లి మళ్లీ తిరిగి వచ్చేలాగ, 40-50 ఏళ్లుగా ఇలా నీరసించిపోవడమే జీవితమా?

ఓ పెద్ద యంత్రానికున్న వందలాది చిన్నచిన్న చక్రాల్లో ఒకటిగా మీరు మారిపోతారు. పక్కనే వున్న చక్రం కాస్త చలనం కలగజేస్తుంది. అలాగే మీరు మీ పక్కనున్న చక్రాన్ని కదిలిస్తారు. మిగిలిన చక్రాలు తిరగడాన్నిబట్టే మీ చలనం కూడా వుంటుంది అనే దుస్థితికి మీరు వచ్చేస్తారు. మీరు ఒక పెద్దసంస్థ అధిపతి అయి వుండవచ్చు. అయితే అలవాట్లకు బానిసైతే, మీ స్వాతంత్ర్యం కూడా ఇలాగే పోతుంది.

శంకరన్‌పిళ్ళై ఓసారి సాయంత్రంపూట బాగా తాగేసి బార్ వదలి బయటకు వచ్చాడు. చాలాసేపైంది.

"ఎనిమిదికల్లా ఇంట్లో వుండాలన్నది నీ భార్య రూలే కదా!" అంటూ స్నేహితులు వేళాకోళం చేశారు.

శంకరన్‌పిళ్ళై చాలా గొప్పగా, "నో... నో... నాకు మా ఇంట్లో పూర్తి స్వాతంత్ర్యం వుంది" అని చెప్పుకొని, రొమ్ము విరుచుకొని ఇంటికెళ్లాడు.

గుమ్మంలోనే ఆపద కాచుకొని వుందని తెలుసుకొన్నాడు. భార్య బలహీనత అతనికి తెలుసు. చటుక్కున ఆమెను దాటుకొని లోనికి పరిగెత్తాడు. లావుగా వున్న అతని భార్య అతని వేగాన్ని అందుకొని పరిగెత్తలేకపోయింది. ఇల్లంతా తిరిగిన శంకరన్‌పిళ్ళై చివరకు మంచం కిందకు చేరుకున్నాడు. కాని అతని భార్య మంచం కింద దూరలేకపోయింది.

"నువ్వు మగాడివా? ఎలకవా? బయటికి రావయ్యా!" అని కోపంగా అరిచింది అతని భార్య.

శంకరన్‌పిళ్ళై హాయిగా సమాధానమిచ్చాడు. "నేనే ఈ ఇంటికి మహారాజును ఎక్కడ ఎలా పడుకోవాలో నిర్ణయించుకొనే అధికారం నాకుంది" అని.

శంకరన్‌పిళ్ళై లాగే మీలో చాలామంది స్వాతంత్ర్యంగా బతుకుతున్నట్లుగా భావిస్తూంటారు. అలాగని, తమనుతామే మోసం చేసుకొంటున్నారు.

**నా మనస్సుకు తృప్తి గలగడం లేదే?**

*అలాగా? ఓ పది నిముషాలు మీ మనస్సును కాస్త గమనించండి. అక్కడ పుట్టి పెరిగి మిమ్మల్ని ముంచెత్తే ఆలోచనల్ని ఏమాత్రం దాపరికం లేకుండా, ఓ కాగితం మీద పెట్టండి. కొంచెం కాలం గడిచాక మీ స్నేహితులకు చూపించండి. లేదా మీరే చదివినా సరే... ఇంకా మీకెందుకు పిచ్చి పట్టలేదా అన్న అనుమానం మీకే కలుగుతుంది.*

*ఇప్పుడు మీకు, మానసికరోగికి పెద్ద తేడా లేదు. ఒక్క సంతోషం, మీ పిచ్చిని సమాజం నిర్ణయించిన ఎల్లల్లోపే వుంచుకొన్నారు.*

*బయటకు కనపడకుండా దాచగలిగిన చాకచక్యం మిమ్మల్ని కాపాడుతోంది. మీ పిచ్చిని దాచుకోగల శక్తి మీకు వుండటం మీ బాధల్ని అంతం చేయదు.*

*మీ జీవితాన్ని గురించి సరైన అవగాహన లేకుండా, తనంతట తాను మీ జీవితం గడిచిపోతుంటే, మనస్సుకు ఎప్పటికీ తృప్తి ఏర్పడదు. ప్రతిక్షణాన్ని ఆనందంగా గడపండి. మనస్సు ఊరికే సంచలించడం మానేస్తుంది.*

మొట్టమొదటిసారి మీరు ఉద్యోగానికి వెళ్లినప్పుడు, ఏ కుర్చీ మీకు స్వర్గంగా అనిపించిందో, అదే కుర్చీ ఈరోజు మీకు గుండెజబ్బు, రక్తపోటు, అల్సరు మొదలగు వాటికి కారణమయ్యే నరకంగా మారింది.

ఉత్సాహకరంగా వుంటుందనే కదా ఈ పనికి కుదురుకున్నారు? అలవాటవగానే ఆనందాన్ని తప్ప మిగిలిన వాటినన్నిటినీ అనుభవిస్తున్నారేం?

పడవలో వెళ్లడానికి తెడ్డుపట్టిన వాడు పడవను వదిలేసి తెడ్డునే పట్టుకొని వేలాడినట్టయి పోయారేం?

మీ తెలివితేటలు, చాకచక్యం ఏవీ బయటపడకుండా చేసినపనినే చేయడానికి మీరేమన్నా యంత్రమా?

ఒక్క పుటను వందల జిరాక్స్ కాపీలు తీసిపెట్టుకొని, మళ్లీ మళ్లీ చదివినట్లు, మీ రోజుల్ని కాలెండర్లో చింపుకోవడమేనా జీవితం అంటే?

జీవించడం, పూర్తిగా జీవితాన్ని అనుభవించడం అంటే ఏమిటని మీరు ఎప్పుడైనా ఆలోచించారా?

ఏ రోజైనా పక్షులు నిద్రలేస్తూ చేసే కిలకిలరావాలు వింటూ వాటిలాగే మీరు ఆనందపడ్డారా? ఎన్నిసార్లు శరీరంలోకి ప్రతీ అంగుళాన్నీ ఒక్కోబొట్టు నీరు తడుపుతూంటే ఆనందంతో తుళ్లిపడ్డారు?



బండి నడిపేటప్పుడు ఏదో ఆలోచనల్లో పడిపోకుండా ఎన్నాళ్లు హాయిగా నడిపారు?

ఎంత రుచిగా వున్న భోజనమైనా మొదటి ముద్దే అనుభవించి తింటారు. మిగిలిన ముద్దల్ని చేయి తన అలవాటుగా నోటికి అందిస్తూపోతుంది. నోరు తన అలవాటు ప్రకారం దాన్ని నమిలి లోపలికి తోస్తూ వుంటుంది. నోట్లో వేసుకొన్న భోజనం ఆహారనాళం ద్వారా ఎలా లోపలికి దిగిపోతుందో ఒకనాడైనా గమనించారా?

ఎప్పుడూ ఆనందంగా వుండాలన్న మీ కోరికను మరచిపోయి, పనిలో చిక్కుకొని పోయారు.

వీటకన్నిటికీ సమయాన్ని పాడుచేసుకొంటారా అని మీరే ప్రశ్నిస్తారేమో? ఊరికే శ్వాసపీల్చి విడుస్తూ వుండటానికే ఈ భూమి మీదకు వచ్చారా? ప్రాణాన్ని నిలుపుకోవడానికి మాత్రమే అది పనికి వస్తుంది.

బతికి వుండటంవేరు. జీవించడం వేరు. ఒక్క క్షణం... ఒకే ఒక్క క్షణం పరిపూర్ణంగా జీవించాలన్న ఆలోచనతో జీవించి చూడండి... జీవన స్థితియే మారిపోతుంది.

## జీవితంలో ప్రతిక్షణాన్ని ఆనందంగా గడపలేరా? మనకు తెలియని స్వర్గ నరకాల గురించి బాధపడడం అవివేకం కాదా?

యవ్వనకాలంలో మీ జీవితంలో ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించుకొనేది ఏది? ప్రేమ. కళాశాలల్లో ప్రేమను చూశాను. వాళ్లు ఒకళ్లకోసం ఒకళ్లు పుట్టి పెరిగినట్లుగా కనిపిస్తారు. కళ్లలోనూ, మనస్సులోనూ సంతోషం ఉరకలు వేస్తుంది. ఆ ప్రేమ సువాసన వాళ్ల చుట్టూ ఎంతో దూరం వ్యాపిస్తుంది.

సంతోషంగా చెట్టాపట్టాలేసుకొని వాళ్లు తిరగడం చూస్తే ఇది ఆ మరణానంతరం అనిపిస్తుంది.

కన్నవాళ్లు, సమాజం, ఆచారవ్యవహారాలు అన్నిటినీ ఎదిరించి వాళ్లిద్దరూ పెళ్లి చేసుకొంటారు. అయిదారు సంవత్సరాల తర్వాత వాళ్లను చూస్తే కడుపులో దేవుతుంది.



జీవచైతన్యంతో, ఉత్సాహంతో ఉరకలు వేసిన వారే కళ్లల్లో ప్రాణాలు నింపుకొని తిరుగుతుంటారు. ప్రపంచాన్నే పోగొట్టుకొన్నట్లు అగుపిస్తారు.

ఎవరిని తలచుకొంటేనే ముఖంలో ఆనందం పొంగి పొర్లుతుందో, వాళ్లతోనేవున్నా ఎందుకో బాధ. వాళ్ల తోడే కొన్నాళ్లకి బాధకరంగా మారిపోతుంది.

ఎందుకిలా? లోతుగా ప్రేమలో కూరుకుపోయినపుడు గంటలు గంటలు ఎదురుచూస్తాం. అప్పుడు విసుగే రాదు. ఆకలి, ఎండ, వాన ఏదీ తెలీదు.

కోర్కెలు తీరిన తర్వాత, అక్కడా వ్యాపారం ప్రవేశిస్తుంది. ప్రేమను మూలధనంగా భావించి జీవితాన్ని ప్రారంభిస్తే త్వరలోనే విసుగు, వేదన, బాధ జీవితంలోకి ప్రవేశిస్తాయి. దాన్ని ఏమాత్రం అడ్డుకోలేం!

శంకరన్‌పిళ్ళై పార్కులో ఓ అందమైన అమ్మాయిని చూశాడు. పోయి ఆమె పక్కనే కూర్చున్నాడు.

ఆమె అక్కణ్ణించి వెళ్లిపోవాలని ప్రయత్నించగానే చటుక్కున ఆమె ముందు మోకరిల్లాడు.

“నిన్ను నా ప్రాణం కన్నా అధికంగా ప్రేమిస్తున్నాను. నువ్వు నన్ను కాదంటే ఇక్కడే ప్రాణం వదిలేస్తాను” అంటూ ఎంతో బాధగా అన్నాడు.

ఆమె అతని మాటలకు మైమరచిపోయింది. అతని ఒడిలో వాలిపోయింది. అంతకన్నా ఏం కావాలి? శంకరన్‌పిళ్ళై ఆమెతో తన కోర్కెలన్నీ తీర్చుకొన్నాడు?

సమయం 7:30 అయింది. శంకరన్‌పిళ్ళై తన చేతి గడియారం చూసుకొని చటుక్కున లేచాడు.

“నన్ను వదిలేసి ఎక్కడికీ వెళ్లకండి” అందామె.

“అయ్యో! ఈ రోజు త్వరగా వస్తానని నా భార్యకు మాటిచ్చాను” అన్నాడు శంకరన్‌పిళ్ళై.

“భార్యా? నన్ను యుగాలుగా ప్రేమిస్తున్నానని, కాదంటే చచ్చిపోతానన్నారే? నేనూ దాన్ని నమ్మానే?” అని ఆమె ఏడ్వడం ప్రారంభించింది.

“ఓసి పిచ్చిదానా! ప్రేమ అనేది ‘తెరుచుకోసెసేమ్’ అంటూ అలీబాబా చెప్పి సాధించుకొనే ఆ మంత్రంలాంటిది. అంతకన్నా మరేంలేదు” అంటూ ఆమెను చీదరించుకుని అక్కణ్ణించి వెళ్లిపోయాడు.

శంకరన్‌పిళ్ళైలా వుంటే దానికి ప్రేమ అని పేరు పెట్టగలమా? స్త్రీ పురుషులు నేనిదిస్తాను... నువ్వదిస్తావా.. అంటూ ఒప్పందం ఏర్పరచుకొనేదా ప్రేమంటే!

మీకు సమాజంలో ఓ తోడు కావాలి. అది శారీరకం కావచ్చు. మానసికం కావచ్చు, ఆర్థికం కావచ్చు, అయితే, ఇలా ఏదో ఒకటి ఆశించి వచ్చే ప్రేమ ప్రేమవుతుందా?

పెళ్లి సామాజికంగా ఓ తోడుకోసమే అనే భావనతో ఆ పవిత్రబంధాల అర్థాన్ని నాశనం చేసినవాళ్లున్నారు. ఈ ఏర్పాటువల్ల ఏవేవో వసతులు లభించవచ్చు.

ఆనందం మాత్రం లభించదు. తరతరాలుగా ఈ అన్యాయం జరుగుతూనే ఉంది.

బర్మాకు చెందిన ఓ సిపాయి, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సైనికదళంలో ఉద్యోగం మానేసి, వేరే ఒక ఉద్యోగానికి వెళ్లిపోయాడు.

నిజానికి, అతడు యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నది పదిపదునైదు నిమిషాలు మాత్రమే!

"ఓ పక్క నుంచి అమెరికా బాంబులు వేస్తోంది. మరో పక్కనుంచి జపాన్ బాంబులు వేస్తోంది. ఎటుచూసినా తూపాకీ పేలుళ్లే! ఫిరంగుల ఘోష, ఆకశంలో నల్లని పొగమంటల నాల్కలూ" అంటూ కొత్తగా పరిచయమయ్యే వారందరితోనూ ఆ 15 నిమిషాల యుద్ధాన్ని గంటలతరబడి వివరించి చెప్పేవాడు.

"యుద్ధం తర్వాతేం చేశారు?" అని ఎవరైనా అడిగితే, "సేల్స్ ఎగ్జిక్యూటివ్" అని మిగిలిన 25 ఏళ్ల గురించి ఒకే మాటలో చెప్పేవాడు. అంటే, అతను జీవితాన్ని పూర్ణంగా, మనసారా జీవించింది ఆ 15 నిమిషాలే!

ఆ తీవ్రతే ప్రేమలో పడ్డవారిలోనూ కనిపిస్తుంది. అందువల్లే ప్రేమ గురించి మాట్లాడితే ముసలివాళ్ల ముఖంలో కూడా ఓ వెలుగు కనిపిస్తుంది.

అటువంటి ప్రేమను పరస్పరం సహాయపడుతున్నట్లుగా అంటే మ్యూచువల్ బెనిఫిట్ స్కీముగా భావించకండి. ప్రేమ వ్యాపారం కాదు. మాయ కూడా కాదు. నిజానికి అదొక ఉన్నతమైన భావన.



## ప్రేమాభిమానాలను కాదని ఆస్తి, అంతస్తులే జీవితలక్ష్యం అనుకోవడం అవివేకం కాదా?

ఇరవయ్యేళ్లు వస్తే చాలు 'పప్పన్నం' ఎప్పుడు పెడతావ్? అనడగడం సాధారణమై పోయింది. చదువు, ఉద్యోగాలు పెళ్లి కూడా మన సమాజంలో ఓ అంతర్భాగమైపోయింది. పెళ్లి తనకు అవసరమా కాదా అని ఆలోచించకుండా ఎవరో చేస్తున్నారు అని చేసేసుకుని, తర్వాత ఏదో బ్రతుకే మన్న వాళ్లల్లా బాధపడేవాళ్లే ఎక్కువ! మీరు మాత్రమే కాదు... మీరు ఏం చేసినా సరే... ఆ తగ్గ ఫలితం ఏదో ఒకటి తప్పకుండా వుందని అర్థం చేసుకోవాలి.

వచ్చే ఫలితాల్ని ఎదుర్కోడానికి తయారైన తర్వాతే ఏ పనైనా సరే చేయడం మంచిది. పెద్దవాళ్లెవరూ తమకన్నా చిన్న వాళ్లకు ముఖ్యంగా పిల్లలకు కల్లాకపటం లేని ప్రేమను నేర్పించడం లేదు.

అయితే ఆడపిల్లల్ని కన్నవాళ్లుమాత్రం అత్తవారింట్లో ఎలా సర్దుకొనిపోవాలో తమ పిల్లలకు చెప్తూనేవుంటారు. ఇటువంటి తల్లిదండ్రులు తమ బాధ్యతను మరొకరికి అప్పచెప్తున్నామన్న ఉద్దేశంతోటే పెళ్లికొడుకును వెతుకుతారు.

శంకరన్‌పిళ్ళై కూతురు, పెళ్లికాకుండానే గర్భవతి అయింది. శంకరన్‌పిళ్ళై కోపం పట్టలేకపోయాడు. కూతుర్ని చావగొట్టాడు. కారణం ఎవరో చెప్పమని కోప్పడ్డాడు. ఆమె ఏడుస్తూ ఆ అబ్బాయి పేరు చెప్పింది. శంకరన్‌పిళ్ళై తన తుపాకీ తీసుకొన్నాడు. సరాసరి ఆ అబ్బాయి ఇంటికి వెళ్లాడు.

పెద్ద కోటలా ఉన్న ఆ ఇంటి తలుపుల్ని తన్నుకొని లోపలికి వెళ్లాడు. మంచం మీద పడుకొని ఉన్న అతడి కణతలకు తుపాకీని ఆన్చాడు. "తొందరపడకండి. మనం నిదానంగా కూర్చుని ఈ విషయం గురించి మాట్లడుదాం"మని బతిమాలాడు.

"నువ్వు పెద్ద బిజినెస్ మేన్ కావచ్చు. కానీ చిన్న పిల్లను ఏమార్చావు. నా చేతిలోనే నీకు ఈ రోజు చావు రాసి వుంది" అంటూ గర్జించాడు శంకరన్‌పిళ్ళై.

"అయ్యా! మీ అమ్మాయికి ఆడపిల్ల పుడితే పది లక్షలు ఇద్దామని నిర్ణయించుకున్నాను."

"మరి అబ్బాయి పుడితే?"

"ఇరవైలక్షలిస్తాను"

శంకరన్‌పిళ్ళై తుపాకీని మడిచి సంచీలో పెట్టుకొని అతడి ఎదురుగా చేతులు కట్టుకొని మెలికలు తిరుగుతూ– "ఒకవేళ బిడ్డ దక్కకపోతే నా కూతురుకు మరొక ఛాన్స్ ఇస్తారా సార్!" అని అడిగాడు.

ఆస్తి, అంతస్తు మాత్రమే లక్ష్యంగా పెళ్లిళ్లు చేసే వాళ్లకూ, శంకరన్‌పిళ్ళైకి పెద్ద తేడా లేదు.

ఆడపిల్ల అయినా సరే, మగపిల్లవాడైనా సరే... ఆస్తి, చేతినిండా జీతం... ఈ రెండే జీవితానికి ముఖ్యం అనుకోవడం బాధపడవలసిన విషయం కాదా? కుటుంబ పెద్దలు, చేసుకునేవాళ్ల మనసుకు నచ్చిందా లేదా అని కూడా చూడకుండా, అంతస్తును మాత్రమే పట్టించుకొని పెళ్లిళ్లు చేస్తున్నందువల్లే ఈ రోజుల్లో చాలా పెళ్లిళ్లు చేదు జ్ఞాపకాలుగా మారుతున్నాయి.



*నాకు సినిమాలంటే ఇష్టం. మా ఆవిడకు నచ్చదు. ఇందువల్ల అప్పుడప్పుడు గొడవలొస్తున్నాయి. ఏం చేయాలి?*

ఎందుకని పెళ్లి చేసుకున్నారు... సినిమా చుడ్డానికా? కాదుగా. హాయిగా బ్రతకడానికే కదా! ఒక చెట్టుకు పూసిన అన్ని పువ్వులూ ఒకేలా ఉండవు. లోకమంతా వెతికినా, మీ భార్యలాటివారు మరొకరు దొరకరు. ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించండి. మీకు నచ్చినవన్నీ ఆమెను చేయమని బలవంతపెట్టకండి.

సినిమా చూస్తే ఎంత? చూడకపోతే ఎంత? స్వంత ఇల్లయితే ఏం? కాకపోతే ఏం? పిల్లలుంటే ఎంత... లేకపోతే ఎంత? చిన్న చిన్న విషయాలకు బాధపడి, ఆమెను బాధపెట్టొద్దు.

మీ బాధల్ని పంచుకోడానికే ఆమెను పెళ్లాడారా? మీ ఆనందాన్ని రెట్టింపు చేసుకోడానికి కదా ఒకటయ్యారు? మీ ఇద్దరి సంతోషమే ప్రధానంకాని, సినిమాలు కాదు.

మీ దాంపత్య జీవితాన్ని మధురంగా, ఆనందమయం చేసుకోవడం ఎలా అన్నదానిమీద, పాశ్చాత్యదేశాల్లో ఇటీవల కొన్ని వందల పుస్తకాలు అచ్చయ్యాయి.

'రోజూ ఇన్నిసార్లు 'ఐ లవ్ యూ' అని చెప్పు... ఇన్నిసార్లయినా కనీసం ముట్టుకొని మాట్లాడు... రాత్రి పడుకోబోయేముందు ఇన్నిసార్లయినా ముద్దుపెట్టు..." అంటూ లెక్కలు చెబుతాయి ఆ పుస్తకాలు.

పుట్టిన బిడ్డకు తల్లి ఎన్నిసార్లు ముద్దుపెట్టాలని చెప్పడానికి అక్కడ మనుషులున్నారు. అవన్నీ చదువుకొని, ప్రతీదానికి వేళ్ల లెక్కపెట్టడం మొదలుపెడితే, ఒక్క వారంలో విచ్చానుపత్రిపాలు కావాల్సిందే! నిజంగా ఇష్టం అంటూ ఉంటే కౌగిలించుకోడానికీ, ముద్దు పెట్టడానికీ తగిన వేళను అదే మీకు నిర్ణయిస్తుంది.

ఓ దంపతుల 25 సంవత్సరాల పెళ్లి రోజు చాలా ఘనంగా, కోలాహలంగా జరుగుతోంది.

భర్త కళ్లల్లోంచి నీరు ధారాపాతంగా కారుతోంది. భార్య మనసు కరిగి అతన్ని దగ్గరకు తీసుకుంది.

"ఏంటండీ... నా మీద అంత ప్రేమా? ఎందుకింత ఉద్వేగం?" అని అడిగింది ఎంతో మురిపెంగా.

భర్త కన్నీళ్లు ఆపుకోడానికి ప్రయత్నిస్తూ అన్నాడు... "మనం హాయిగా ప్రేమించుకునే రోజుల్లో... మీ నాన్న జడ్జీగా ఉండేవారే.. గుర్తుందా?" అన్నాడు.

"అవును!"

"మన విషయం తెలియగానే ఆయన నన్ను వెతుక్కుంటూ వచ్చారు. 'నా కూతుర్ని పెళ్లి చేసుకోకుండా ఏమార్చావో.. ఓ పాతికేళ్లు కటకటాలు లెక్కపెట్టాల్సి వస్తుంది' అని బెదిరించాడు. ఆ బెదిరింపుకు నేను భయపడకుండా ఉండి వుంటే... ఈ రోజు నాకు శిక్ష పూర్తి అయి విడుదల లభించేదికదా!" అన్నాడు భర్త.

పెళ్లంటే ఇలాటి బాధేనా?

కాదు కానే కాదు! రెండు జీవచైతన్యాలు ఒక దాన్ని మరొకటి అర్థంచేసుకొని, జీవితాన్ని ఆనందమయం చేసుకోడానికి అదొక సందర్భం. నిజమైన ప్రేమను పంచుకోడానికి ఒక చక్కని అవకాశం!

అయితే పెళ్లి తర్వాత ఎదుటివారినుంచి ఏం పొందగలం అన్న ఆలోచన పెళ్లికి ఆధారమైతే, జీవితం కష్టాల కడలిగా మారిపోతుంది. కోర్టు దాకా వెళ్లకపోయినా, నాలుగు గోడల మధ్యే దాంపత్యం ఓడిపోతుంది. ఇరువురి మధ్యా అనురాగం తీయనిదై వుండాలంటే, అక్కడ ఆదాయం ఖర్చుల లెక్కలుండకూడదు.

తీవ్రభావనగా ప్రేమ తోడైతే, ఎత్తుపల్లాలు ఎదురైనా జీవితంలో దెబ్బతగలకుండా సుఖపయనం చేయవచ్చు.



**ఈ జీవితంలో వేరొకరిని తన ప్రాణంగా అనుకొని,**
**గౌరవంగా అభిమానంతో**
**తనలో కలిపేసుకోగలగడం కన్నా గొప్పతనం మరింకేమైనా వుందా?**

ఆశే దుఃఖానికి కారణం అని చెప్పేవాళ్లే మరొకటీ చెప్తారు. "ఎవరిమీదా, దేనిమీదా ఆపేక్ష పెంచుకోవద్దు. ఆ ఆపేక్షే ఎదుగుదలకు అడ్డవుతుంది" అని భయపెడతారు కూడా!

అపేక్షలతో జీవించడం అలవాటైన తర్వాత ఇలాంటి మాటలవల్ల తడబాటుకు గురవుతారు.

తల్లి, తండ్రి బిడ్డల బాధ్యతల్ని గురించిన ఆలోచనలు ఎక్కువైనపుడు, ఎలా వదిలించుకోవాలో తెలీక బాధ్యతలతో సతమతమవుతున్నప్పుడు, ఈ మాటల్ని మీకు తగిన అర్థాన్నిచ్చేలా మలచుకొంటారు. ఎవరికేం జరిగినా నాకేం అన్న నిర్లక్ష్యధోరణిని

పెంచుకొని, దాన్నే 'అపేక్షలేకపోవడం' అని భావిస్తూ, ఆ అర్థాన్ని సమన్వయించుకొని మిమ్మల్ని మీరే మోసపుచ్చుకొంటారు.

అపేక్షలుంటే ఎదుగుదల కష్టమని ఎవరన్నారు?

నేలమీద అపేక్ష పెంచుకొని మాను తన వేరుల్ని నేలలోకి బాగా దింపినపుడే, అది ఆరోగ్యంగా ఎదుగుతుంది. పలు పక్షులకు తావవుతుంది. గాలిలో ప్రాణవాయువును నింపుతుంది. కాయలను, పళ్లను ఇచ్చి తోడ్పడుతుంది. అదే వృక్షాన్ని నేలలోంచి వెలికి తీస్తే, అది నశించిపోతుంది. అలాగే మీరు కూడా.

ఎవరో ఏదో చెప్పారని మీ అపేక్షల్ని బలవంతంగా తెంపుకొంటే, మిమ్మల్ని మీరే తీవ్రంగా గాయపరచుకొన్న వారవుతారు. మీరు అపేక్షల్ని పెంచుకొనే గుణంకలవారైతే, ఆ గుణాన్ని ఎన్నటికీ మార్చుకోవద్దు. కనీసం మార్చుకోవాలని కూడా ప్రయత్నించవద్దు.

ఒకడు కప్పమీద పరిశోధనలు చేస్తున్నాడు. అతడు 'గెంతు' అంటే కప్ప గెంతేలాగ అలవాటు చేశాడు. పరిశోధనచేస్తూ, దాని ఒక కాలు తెగ్గొట్టి 'గెంతు' అన్నాడు. అది కష్టపడి మూడుకాళ్ల మీద గెంతింది.

తర్వాత మరో కాలును తెగ్గొట్టి 'గెంతు' అన్నాడు. అది ఎలాగో రెండు కాళ్ల మీద గెంతింది.

మరో కాలు కూడా తీసివేశాడు. ఒంటికాలుతోనూ ఎంతో కష్టపడి గెంతింది కప్ప. చివరగా ఆ నాలుగో కాలు కూడా తీసివేసి 'గెంతు' అన్నాడు. అది గెంతలేక ఎంతో జాలిగా అతనికేసి చూసింది. అతడు మళ్లీ మళ్లీ గెంతమని కప్పను ఆదేశించాడు. కాని కప్ప కదల్లేదు. అతడు పరిశోధనా ఫలితాన్ని రాశాడు. "నాలుగు కాళ్లు తీసివేస్తే కప్పకు చెవులు విన్పించవు!"

ఇలాగే కొందరు ఏదో జరిగితే, మరేదో అర్థంచేసుకొని, మరేదో అనుకుని నిర్ధారణకు వస్తారు.

అపేక్షిస్తే బాధలు ఎప్పుడు ప్రారంభమవుతాయి?

మీ కంటి ఎదురుగా మీ పిల్లవాణ్ణి బడికి తీసుకువెళ్లే రిక్షా బోర్లాపడితే, మీరేం చేస్తారు?



రిక్షా దగ్గరకు పరిగెడతారు. కిందపడిన మీ బిడ్డను వెతికి చేతుల్లోకి తీసుకొంటారు. పిల్లల ప్రేమ అంటే, మీరు ఎవరి పిల్లల్నైనా ఎత్తుకుని వుండాలి. అక్కడ పిల్లల మీద అపేక్షకంటే, మీ బిడ్డ అన్న దగ్గరితనమే మీచేత పని చేయిస్తుంది. 'నేను', 'నాది' అన్న భావనే అన్నిటికన్నా ముందుంటుంది.

ఒకరు స్నేహితులుగా దగ్గరివారుగా ఉన్నన్నినాళ్లూ అతని మీద ఎంతో ఇష్టంగా వుంటాం. భేదాభిప్రాయం వస్తే, అదే వ్యక్తిమీద మనకు ఏదో ఒక అయిష్టత ఏర్పడుతుంది. నిజానికి ఆ వ్యక్తిమీదా మీరు అపేక్ష పెంచుకొన్నది? కాదు, కేవలం అతను 'మీ స్నేహితుడు' అన్న భావాన్ని మీరు అపేక్షించారు. ఏ అనుబంధంలోనైనా సరే మిమ్మల్ని పక్కకుపెట్టి, ఎదుటి వ్యక్తిని మాత్రం ముందు నిలిపి అపేక్షించడం సాధ్యం కాదు.

> *కుటుంబాన్ని త్యజించి ఆధ్యాత్మికంలోకి దిగితే, అది కుటుంబానికి ద్రోహం కాదా? మీరు ఆధ్యాత్మికపథంలో ప్రవేశించడానికి దేనినీ వదులుకోవలసిన అవసరం లేదు.*
>
> *అయితే కుటుంబం మీకు వారసుల్ని ఇవ్వడానికీ, ఒకళ్లతో ఒకళ్లు అయిష్ట పూర్వకమైన బంధంలో ముడిపడి వుండాలి అనే తప్పనిసరి పరిస్థితి వస్తే, అక్కడ ఏ క్షణంలోనైనా భూకంపం రావచ్చు.*
>
> *అప్పటిదాకా భరించాలి అన్న ఆలోచనతోనే బంధుత్వాలు ముడిపడివుంటే, ఆ కుటుంబం దానంతటదే విచ్ఛిన్నమవుతుంది. అలాంటి వాటికి పరిపక్వతలేని వ్యక్తులే తప్ప ఆధ్యాత్మికం ఏమాత్రం కారణం కాదు.*

మిమ్మల్ని దృష్టిలో ఉంచుకొనే అపేక్షిస్తున్నారు. అలా చాలా చిన్న వృత్తపరిధిలో మిమ్మల్ని మీరు బాధించుకొన్నప్పుడు, అపేక్ష ఉన్నా కష్టమే, వదిలేసుకున్నా కష్టమే!

నా దగ్గర యోగా నేర్చువడానికి వచ్చేవాళ్లలో కొందరు, కొన్ని కొన్ని ప్రయోగాలు నచ్చడం లేదంటారు. వాళ్లకు ఓ కాగితం ఇచ్చి సరే మీకు నచ్చేవన్నీ ఒక పట్టికలా రాయండి' అంటాను. చాలాసేపు ఆలోచించి వారు రాసిన కాగితాన్ని నాకిస్తారు. అందులో ఒక అరడజను విషయాలు వుంటాయి.

"ఇంత అద్భుతమైన లోకంలో మీకు నచ్చినవి ఆరేడు విషయాలేనా?" అంటే గుడ్లప్పగిస్తారు.

"సృష్టిలో వున్న వాటినుంచి, అపేక్షల్నుంచీ దూరమై వుండటం స్వాతంత్ర్యం కాదు. అది ఎదుగదలా కాదు. అన్నింటినీ తనలోకి తీసుకొని విశ్వరూపాన్ని పొందటం నిజమైన ఎదుగుదల. గాలీ, వాసన ఒకదానిలో ఒకటి బాగా కలిసిపోయినప్పుడు, ఒక దాన్నుంచి మరొకదాన్ని విడదీయడం సాధ్యం కాదు.

మీరు ఒకరి మీద అపేక్ష పెంచుకొంటే, అలా ఒకటై పోవాలి. మీరు, ఎదుటివాళ్లు అంటూ విడదీసి చూడలేనంతగా, వాళ్లలో కలసిపోండి, అప్పుడు మరొకటి అనే గుర్తింపు ఏది? కలసి వుందామా? విడివిడిగా ఉందామా అనే ప్రశ్న ఎక్కడిది? దాన్ని అపేక్షించాలా వద్దా అనే ఆలోచనకు తావేది? దానివల్ల వచ్చే బాధలు ఏంటి?

ఈ జీవితంలో వేరొకరిని తన ప్రాణంగా అనుకొని, గౌరవంగా అభిమానంతో తనలో కలిపేసుకోగలగడం కన్నా గొప్పతనం వేరముంటుంది?

మీది అన్న భావాన్ని పక్కనపెట్టి, కొంచెం కొంచెంగా ప్రపంచం మీద అపేక్ష పెంచుకోవడం ప్రారంభిస్తే, మీ జీవితం పరిపూర్ణమవుతుంది.



## **వాస్తుకు** తగినట్లు ఇల్లు మార్చితే జీవితం మెరుగవుతుందా? శాస్త్రాలకు జీవితాన్ని అర్పించడం అవివేకం కాదా?

చిన్న వయసునుంచే మీలో కొన్ని బాధ్యతల్ని నింపివుంటారు. 'కొడుకును చదివించడం తండ్రి బాధ్యత, ముసలితనంలో తండ్రిని చూసుకోవడం కొడుకు బాధ్యత, మంచి విద్యార్థిని తయారుచేయడం ఉపాధ్యాయుడి బాధ్యత, చట్టాన్ని గౌరవించడం పౌరుడి బాధ్యత అంటూ చెప్పి, చెప్పి 'బాధ్యత' అనే పదాన్ని మీలో బలంగా నాటి వుంటారు.

బాధ్యత అనుకొని మీరు దేన్ని చేసినా మీకు అలుపే మిగులుతుంది. రక్తపోటు ఎక్కువవుతుంది.

ఓ రోజు తన చెప్పుల కర్మాగారానికి వచ్చాడు యజమాని. అక్కడ పని చాలా వేగంగా జరుగుతోంది.

"అయ్యా! పక్కవాళ్లు ఏం చేస్తున్నారు అని పట్టించుకోకుండా మీ పని మీరు సక్రమంగా చేసుకోవాలి అని అక్కడివాళ్లందరికీ నేర్పబడుతోంది" అని గర్వంగా చెప్పాడు అక్కడున్న ఓ అధికారి.

ఒక కార్మికుడు అట్టపెట్టెకి లేబుల్ అంటించి పక్కనున్నతనికేసి తోశాడు. అందులో అతను ఒక చెప్పు పెట్టాడు. ఆ పక్కనున్నతను దాన్ని మూసి అంటించాడు. పెట్టె అమ్మకానికి పంపే బండిలో పెట్టబడింది.

'ఇక్కడ ఏం జరుగుతోంది? చెప్పుల జతలే కదా ఖరారు చేస్తున్నాం? మరి ఒక్కచెప్పే ప్యాకింగ్ చేస్తున్నావేంటి?" యజమాని అడిగాడు.

"ఎడంకాలు చెప్పు పెట్టవలసినతను, ఇవ్వాళ సెలవు పెట్టాడు సార్! అయినా మిగిలినవాళ్లు తమ పని తాము చేస్తున్నారు" –అని అధికారి జవాబిచ్చాడు.

ఏ పనినైనా సంతోషంగా, హాయిగా చేయకుండా, బాధ్యత అనుకొని చేస్తే ఇంతే! అతి త్వరలో అయిష్టం, కలిగి యాంత్రికంగా మారిపోతారు.

ఎవరో చెప్పారని చేయకుండా, ఇష్టపడి చేస్తేనే ఏ తపన వుండదు. మీరూ ఎదగగలుగుతారు.

చాలామంది గెలుపు తమ శక్తి అనీ, ఓటమి విధివల్ల పడ్డదనీ భావిస్తారు. మీరు ఓ పరీక్షకు కడతారు.

చాలా బాగా రాసుకంటే, "గొప్పగా రాశానంటారు."

సరిగ్గా రాయలేదంటే...?

"సమయం చాల్లేదు" అంటారు.

"పాఠ్యభాగంలోలేని ప్రశ్నలు వచ్చాయి" అంటారు. లేదా వేరే కారణాలేవో వెతుకుతారు.

గెలుపును స్వంతదిగా చేసుకొని, దాని బాధ్యతను స్వీకరించే మన మనస్సు, తప్పు జరిగితే మాత్రం దానికి ఎవరిని కారణంగా పేర్కొందాం, ఎవరిమీదకు నెట్టేద్దాం అని ఆలోచిస్తూంటుంది. సాధారణంగానే, బాధ్యతలంటే బరువులు మోయడం



అనుకోని వాళ్లు అరుదుగా వుంటారు. లైటు ఎవరు వెయ్యాలి? కంచాన్ని ఎవరు కడగాలి? మంచినీళ్లు ఎవరు పట్టాలి, వంటి చిన్న చిన్న విషయాల్లో కూడా బాధ్యత ఎవరిదన్నమాట మీద కొన్ని సార్లు వాగ్వివాదాలు పెరుగుతుంటాయి.

శంకరన్‌పిళ్ళైకి, అతని భార్యకు వీధి తలుపు వేయాలన్నదానిమీద వాదన వచ్చింది. చాలాసేపు తర్కించుకున్నాక ఒక ముగింపుకు వచ్చారు.

"ఎవరు ముందు నోరు విప్పి మాట్లాడితే వాళ్లు లేచి తలుపువేయాలి!" అంతే, వాళ్లిద్దరి మధ్యా మాటలాగి పోయాయి. 'భోజనం వడ్డించు' అని శంకరన్‌పిళ్ళై అడిగినా, 'భోజనానికి రండి' అని అతని భార్య పిలిచినా, ఓడినట్టే. లేచి తలుపులు వేసే బాధ్యత తలకెత్తుకోవాల్సి వస్తుంది. అందువల్ల వాళ్లు భోజనాలు కూడా చేయకుండా అలాగే ఉండిపోయారు.

అర్ధరాత్రి కొందరు దొంగలు ఇంట్లో దూరారు. హాల్లో కూర్చున్న దంపతులు తమను చూసికూడా అరచి గోల చేయకుండా మౌనంగా ఉండటం చూసి, వాళ్లకు ఆశ్చర్యం కలిగింది. చేతికి అందినవాటినన్నిటినీ దోచుకున్నారు. అప్పుడు కూడా దంపతులు మాట్లాడలేకపోయేసరికి, ఒకడు ధైర్యం చేసి పిళ్ళై భార్య వజ్రాల దుద్దులు విప్పసాగాడు. అయినా ఆమె నోరు విప్పలేదు.

మరొకడు దగ్గరలో ఉన్న కత్తి తీసుకుని శంకరన్‌పిళ్ళై మీసాలు గొరకబోయాడు. శంకరన్‌పిళ్ళై అప్పటిదాకా మౌనం పాటించి, విధి లేక అన్నట్లు "సరే... సరే... నేనే లేచి తలుపు వేస్తాలే" అన్నాడు.


ఇదా బాధ్యత అంటే...? మీ చుట్టూ ఉన్నవాటిని మీకు తగినట్లుగా మార్చుకోవాలనుకొంటే, దాని బాధ్యతను కూడా మీరు తీసుకోవాలి. అప్పుడు ఓటమి వచ్చినా మీరు బాధపడకుండా ఉంటారు. ఆ ఓటమిని గెలుపుకు తొలిమెట్టుగా ఎలా మార్చుకోవాలో నేర్చుకుంటారు.

వాస్తుకు తగినట్లు ఇల్లు మార్చితే జీవితం మెరుగవుతుందా? కొండమీద ఓ రకం ఇల్లు, పల్లంలో అయితే వేరే రకం ఇల్లు, సముద్రతీరంలో అయితే మరొకరకం ఇల్లు. ఎక్కడ నివసిస్తున్నామో దానికి తగినట్లు ఇల్లు ఎలా కట్టాలో వాస్తుశాస్త్రం తెలియజేస్తుంది.

మంచి గాలి, వెలుతురు కోసం చెప్పబడ్డ శాస్త్రం నేడు బిజినెస్‌లో లాభాలు సంపాదించడానికి పనికొస్తుందంటే అది నమ్మలేనిది. అది సరదానా! వేడుకా! శాస్త్రాలు జీవితాలకు దారి చూపించడానికి ఏర్పడ్డవి. జీవితాన్ని వాటికి అర్పణం చేయడం చేతకాని పని.

మిమ్మల్ని మీరు మార్చుకోకుండా గుమ్మం తీసేసి కిటికీ పెట్టడమో, బాత్‌రూమ్ పగలగొట్టి వంటిల్లుగా మార్చడమో, చేయడమో చేస్తే, వసతిలో మార్పు రావచ్చు. బ్రతుకులో రాదు.





## లెక్క కట్టలేని మానవత్వం మీలో ఉండగా ఒకటికీ, రెండింటికీ బేరాలాడే మూర్ఖ వ్యాపారులా మీరు?

ఏది కోల్పోయినా అందులో ఎదగడానికి తగ్గ దారి వెతుక్కోవచ్చు. ఇటీవలే సముద్రం ఒడిలో, ఆదమరచిన నిద్రలో కాస్త ఒత్తిగిల్లింది భూమి. అంతే... సముద్రతీరంలో ఉండాల్సిన కొన్ని ప్రదేశాలు కనపడకుండా పోయాయి. రాక్షస అలలు ఎన్నో ప్రాణులను బలి తీసుకొన్నాయి.

సముద్రతీరంలో మరీ దగ్గరగా ఇల్లు కట్టుకోకూడదన్న విషయాన్ని ప్రజలు విస్మరించినందుకు బదులుగా కొన్ని వేల ప్రాణాలు అపరాధరుసుముగా తీసుకోబడ్డాయి. లక్షల్లో చేపలను అందించినపుడు మిత్రుడిగా గౌరవింపబడని కడలి, ఒక్కసారి కసిరేసరికి మాత్రం శత్రువుగా గుర్తింపబడింది.

కొత్త సంవత్సరం వచ్చేముందు ప్రజల్ని ఈ దుస్సంఘటన కదిల్చివేసింది. వెంటనే వచ్చిన పండుగల్ని జరుపుకోవాలా, లేక మనమూ ఆ బాధలో పాలుపంచుకోవాలా అన్నది అందరి మనస్సుల్లో మెదిలిన ప్రశ్న.

దుఃఖాన్ని అనుభవిస్తున్న వాళ్లతోపాటు మనమూ ఆ దుఃఖాన్ని అనుభవించాల్సిన అవసరం లేదు. అనారోగ్యంతో బాధపడుతున్నవారిని చూసుకోవాలంటే ఎవరి వల్లవుతుంది? ఆరోగ్యంగా వున్నవారివల్లే కదా! ఏదైనా కోల్పోయి బాధపడుతున్నవారిని దాన్నుంచి బయటకు తేవడం ఆనందంగా ఉన్నవాళ్లవల్లే కదా సాధ్యం!

ఏదో ఒకటి దక్కాలనే ఆలోచన ఉన్నవాళ్లకు జీవితంలో వెయ్యి దక్కినా, దక్కని ఆ వెయ్యినొక్కటో దానిమీదే వాళ్ల మనస్సుంటుంది. అటువంటి ఆనందం గురించి నేనేం చెప్పడం లేదు. సంతోషంగా ఉండటం అంటే టపాకాయలు కాలుస్తూ, అల్లరితో, కేరింతలతో ఉండటం అని ఎవరు చెప్పారు?

అభిమానాన్ని పంచడం ఆనందం. ఏడుస్తున్న వాణ్ణి ఓదార్చడం ఆనందం. పరితపిస్తున్న వాళ్లను కరుణతో దగ్గరకు తీసుకోవడం ఆనందం. అవసరంలో ఉన్నవాడికి మనసారా సేవచేయడం ఆనందం. సందర్భానికి తగినట్టుగా తనకు ఏ ఆపదా రాకుండా జాగ్రత్తగా మసులుకోవడం అసలైన ఆనందం.

ఆనందం పొందడంలోనే కాదు ఇవ్వడంలో కూడా వుంటుంది. ఆకలితో ఉన్నవాడికి ఆహారమే సరైన బలం అంటుంది విజ్ఞానశాస్త్రం. అయితే "ఆకలితో ఉన్నవాడు తన భోజనాన్ని మరొకడికి ఇస్తే, అది అతడికి మరింత శక్తినిస్తుంది" అని బుద్ధుడు అన్నాడు.

ఏటిలో బట్టలుతుకున్న రజకుడికి మిలమిలా మెరిసే రాయి ఒకటి కన్పించింది. అతను దాన్ని తీసి తన గాడిద మెడకు అలంకరించాడు.

బట్టలను ఇవ్వడానికి ఊళ్లోకి వెళ్లినపుడు ఆ రాయిని ఒక నగల వ్యాపారి గమనించాడు. "ఆ రాయి నాకివ్వు ఒక రూపాయి ఇస్తాను" అన్నాడు.

"ఐదు రూపాయలిస్తే ఇస్తాను" అన్నాడు రజకుడు.

వ్యాపారి 2-3 అంటూ బేరాలాడాడు. పక్క కొట్టు ఉన్నతను ఇదంతా చూసి 'ఒకటే మాట వెయ్యి రూపాయలిస్తాను' అని దాన్ని కొనుక్కున్నాడు.



మొదటి వ్యాపారి విసుగ్గా రజకునితో, "ఒరేయ్ మూర్ఖుడా! అది వజ్రంరా! లక్షకు పైగా ఖరీదు చేస్తుంది. వెయ్యికి అమ్మి మోసపోయావే" అన్నాడు.

"కావచ్చు. నాకు మాత్రం అది రాయి. దాని విలువ నాకు తెలీదు. నీకు దాని విలువ తెలిసి కూడా ఐదు రూపాయిలు ఇవ్వడానికి వెనుకాడి, దాన్ని పోగొట్టుకొన్న మూర్ఖుడివి నువ్వు" అంటూ అతను నవ్వాడు.

లెక్కకట్టలేని మానవత్వం మీలో ఉండగా దాన్ని వదిలేసి ఒకటికీ, రెండింటికీ బేరాలాడే మూర్ఖ వ్యాపారులు మీరు? ఏది కోల్పోయినా దాన్ని మనం ఎదగడానికి ఒక మార్గంగా మలచుకోవడమే గొప్పతనం. యాంత్రిక జీవనంలో పడి కొట్టుకుపోతూ మానవత్వాన్ని గుర్తుతెచ్చుకోడానికి దొరికిన సందర్భంగా దీన్ని భావించండి.

*కడలి ఇందరి జీవితాన్ని బలికొంటుంటే చూస్తూ ఊరుకునేవాడా దేవుడు. దైవం, ఆధ్యాత్మికం అంటూ ఎక్కువగా మాట్లాడి, మాట్లాడి ఇక్కడ మానవత్వం మరుపుకు వచ్చింది.*

*దైవత్వం ఒక పూలచెట్టు. అది విరియాలంటే దానికి తగిన ఎరువు వేయాలి. నిజమైన మానవత్వమే ఆ మంచి ఎరువు.*

*మానవత్వం నశించిపోయినచోట్లలో ఎన్ని గుళ్లు కట్టినా లాభం లేదు. ప్రకృతి వైపరీత్యాలు మీ మానవత్వం జీవించే వుందా అని తెలుసుకోడానికి పెట్టిన పరీక్ష అనుకోండి.*

*అన్నీ కోల్పోయినవాళ్లను, మీకు సంబంధం లేనివారిగా పక్కకు పెట్టకుండా మీ కుటుంబంలోని వారే అన్నట్టు ప్రేమగా చూడండి. మానవత్వం నుంచి దైవత్వానికి ఎదగడానికి మీకు దొరికిన సందర్భంగా దీన్ని అనుకోండి.*

చనిపోయినవారి ముఖాలు మీకు తెలీవు. అయినవాళ్లను మీకు చాలా ఆప్తులుగా కొద్ది నిముషాలు భావించండి. ఎక్కడో గడ్డకట్టుకుపోయివున్న మీ మానవత్వపు మమకారం నిద్రలేవడాన్ని గమనించండి.

అయినవాళ్లను పోగొట్టుకొని బాధపడుతున్న వాళ్లకేసి మీరు చూసే చూపులో ఇప్పుడు కరుణ తొంగి చూస్తుంది. కొద్దిరోజుల్లో ఈ దుఃఖం మరపుకు వచ్చి వాళ్లకు సరికొత్త ఆనందం కలుగుతుంది.

## **నాకు** సంబంధంలేని వ్యక్తి బాధ్యత నేనెందుకు నెత్తికెత్తుకోవాలనుకుని, చూసీ చూడనట్టు వెళ్లిపోతే మీకూ, ఆ దారి పక్కనున్న బండరాయికీ తేడా ఏమిటి?

జీవితంలో ఎక్కడో, ఎవరినో, ఏదో విషయాలలోనో ఎదుర్కోవాల్సి వస్తుంది. దానికి బాధ్యత వహించాలా అన్న ప్రశ్న మిమ్మల్ని తినేస్తూ వుంటుంది.

ప్రకృతి వైపరీత్యం వల్ల గుజరాత్‌లోని ఎన్నో కట్టడాలు నేలమట్టమయ్యాయి. తమిళనాడులో ఎన్నో ఇళ్లు నీటిలో కొట్టుకుపోయాయి. అప్పుడు ఎవరికో, ఏదో జరిగింది మనకేమని ఉండగలరా? దేశం మొత్తం బాధ్యత వహించాల్సిన తరుణాలు కావా అవి?

ఒక వ్యక్తి దెబ్బలు తగిలి ప్రాణాపాయస్థితిలో ఉంటే బాధ్యగల వారిగా మీరేం చేయగలరు? చికిత్స చేయడం తెలిస్తే, ప్రాథమిక చికిత్స చేస్తారు. కాదంటే ఆ



చికిత్స లభించేచోటుకు తీసుకెళతారు. అలా కాకుండా నాకు సంబంధంలేని వ్యక్తి బాధ్యత నాకెందుకు అనుకుని, చూసీ చూడనట్టు వెళ్లిపోతే మీకూ, ఆ దారి పక్కనున్న బండరాయికీ తేడా ఏంటి?

కొన్నిసార్లు సందర్భానుసారం, ఆ క్షణంలో ఏమీ చేయకుండా వుండటమూ బాధ్యతాయుతమైన ప్రవర్తనే అవుతుంది. ఐతే బాధ్యతల్ని స్వీకరించాల్సిన వేళల్లో ఆ పని చేయకపోవడం మీ ఉన్నతికి ఏ రకంగానూ తోడ్పడదు.

మీ స్వంత వ్యాపారం కాకపోవచ్చు. మనం కష్టపడి చేస్తే, ఎవరికో లాభంకానీ మనకేంటి అనిపించవచ్చు. దానికి ఆ పని చేయగల సామర్థ్యం మీకుందా లేదా మీరు తెలుసుకోవడానికి, అదీ మరొకరి పెట్టుబడితో పరీక్షించుకోవడానికి దొరికిన గొప్ప అవకాశం మీ స్వంత వ్యాపారం అనుకొని, దాన్ని ముందుకు నడిపించడానికి ప్రయత్నం చేయండి.

ఈ ప్రయత్నం వల్ల లాభం మీ యజమానికి మాత్రమే కాదు మీ చాకచక్యం కూడా పెరుగుతుంది.

అలాకాకుండా మరొకరి వ్యాపారమే కదా అని మీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ఆ వ్యాపారం త్వరలో నశించి మీకున్న ఆధారం కూడా లేకుండా పోతుంది.

***చిరునవ్వు నవ్వినా ముఖం తిప్పుకునే వాళ్ల పట్ల అభిమానంగా ఉండటం ఎలా?***

*ప్రేమించడం అనేది వ్యక్తిత్వం. దానిని వీధి వీధంతా ప్రకటించాల్సిన అవసరం లేదు.*

*మీరు అభిమానించటాన్ని ఎదుటివాళ్లు గుర్తించాలి అనుకుంటున్నారంటే, మీకు అనురాగ స్వరూపం సరిగా తెలియదన్నమాట, పూర్తిగా అర్థంకాలేదన్నమాట.*

*ప్రేమ ఎదురుచూడదు. ప్రతిఫలం ఆశించదు. ఎదుటివాళ్లూ మీ మీద ప్రేమ కలిగి వుండాలనే నిబంధన ఏమీలేదు. వెయ్యిమందికి సేవ చేసినా, ఇంట్లో ఇద్దరికే వండిపెట్టినా అదే ప్రేమను మీరు గుర్తించగలగాలి.*

*ప్రేమించగలగడం తెలివైన విషయమని మీకు తెలిసింది. ఇంకేం కావాలి?*

*కోపం తెప్పించే పని ఎదుటివాళ్లు చేస్తే "నీ కంటే నేను గొప్ప మూఢుణ్ణి" అని నిరూపించుకొనే పని మీరు చేయాలా? లేదు. "ముందు ఈ ప్రపంచంలో అందరూ ప్రేమించే మనసు కలిగివుండనీ, చివరగా నేను మారతాను" అంటూ మూర్ఖపు పట్టుదలతో ఇంకా అలాగే ఉంటారా?*

బాధ్యతతో చాకచక్యాన్ని పూర్తిగా ఉపయోగించి పనిచేసే కార్మికుడే, కాలక్రమంగా గొప్ప వ్యాపారవేత్త అయ్యాడని ఎందరో వ్యాపారవేత్తల గత చరిత్రలు చెప్తున్నాయి. బాధ్యతల్ని మరొకళ్లు మన నెత్తిన పెట్టినట్టుగా భావించకుండా, సంతోషంగా వాటిని స్వీకరించే ప్రయత్నం చెయ్యండి. మీ ఇబ్బందులు సగం తీరిపోతాయి.

హ్యాది అనే జెన్ గురువు ఒకాయన ఉండేవాడు. ఆయన ఎప్పుడూ భుజం మీద ఒక పెద్ద మూట పెట్టుకొని మోస్తూండేవాడు. అందులో ఏవేవో ఉండేవి. ప్రతి ఊరిలోనూ పిల్లల్ని చూసినప్పుడల్లా, అందులోంచి తీపివస్తువుల్ని తీసి తినిపిస్తూండేవాడు.

ఒకరోజు మరొక జెన్ గురువు ఎదురయ్యాడు.

"జెన్ అంటే ఏమి"టని ఆయన అడిగాడు.

హ్యాది తన మూటను కింద పారేసి నిలబడ్డాడు.

"జెన్ ఉద్దేశాలేమిటి?" అని రెండో ప్రశ్న అడిగాడు.

హ్యాది కింద పడేసిన మూటను పైకెత్తుకుని మళ్లీ నడవడం ప్రారంభించాడు. మూట తనది కాదని కింద పడేయగలగడం, సంతోషంగా ఆ భారాన్ని మోయగలగడం రెండూ చేయగలరని చెప్పక చెప్పాడు.

బాధపడకుండా బాధ్యతల్ని మోయగలిగితే, అది బరువవదు. మీ జీవితానికి మీరే బాధ్యులు. అందువల్ల ఎప్పుడూ బాధ్యతల్ని నిరాకరించండి. మొట్టమొదట బాధ్యతను ఒక చర్యగా భావించడం మానండి.

బాధ్యతను మానసికమైన భావనగా స్వీకరించండి. బాధ్యతాయుతమైన వ్యక్తిగా మీరు మారితే నిశ్చింత, ఆనందం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి.



## భగవంతుని పట్ల భక్తి చాలదా? భయం కూడా ఎందుకు? మీ ఇంట్లో డజన్లకొద్దీ తగిలించిన దేవుడి పటాలవల్ల మీ మనస్సులో బ్రతుకుమీద భయం పోతుందా?

నన్ను చాలామంది ఎక్కువసార్లు అడిగిన ప్రశ్న "దేవుడు ఉన్నాడా? లేడా?" అని. ఆదిమానవుడు భయంతో గజగజలాడాడు. చటుక్కున ఆకాశంలో మెరిసే వెలుగుచారలు, దడదడమని చప్పుళ్లు, ముంచెత్తేలా కురిసే నీరు, లెక్కకట్టలేని విశాలమైన ఆకాశం, ఎల్లలు తెలీని ఘోషించే సముద్రం... దేనికీ కారణం తెలీని మనిషి బెదిరాడు.

ఈ విశాల ప్రపంచం ముందు తానొక అణువునని తెలుసుకొన్నాడు. తనకు అర్థం కాని ఆ శక్తిముందు వినయంగా తలవంచి, తనను కాపాడమని వేడుకొన్నాడు.

**కొన్ని గుళ్లల్లో జనం ఎక్కువగా వుంటారు. కొన్నిచోట్ల దీపం పెట్టే దిక్కే ఉండదు. ఎందువల్ల?**

*మీరు దేవుణ్ణి అర్థం చేసుకోవడానికి గుడికి వెళ్లడం లేదు. మీ అత్యాశలన్నింటినీ ఆయన తీరుస్తాడనే అక్కడ కెళుతున్నారు. అందువల్ల భగవంతుడు అనే విషయంలో ఏ గుడి చక్కగా ఆ భావాన్ని అమ్ముడు చేయగలదో ఆ గుడికే ఎక్కువమంది జనం వస్తారు.*

*"ఈ గుడికి వెళ్లు పదిరూపాయలు వెయ్యి, ఇరవై వస్తాయి. ఆ దేవుడికి లాభం ఇంతిస్తానని మొక్కుకో! ఇక నీకు తిరుగు లేదు" అని సిఫార్సులున్న గుళ్లల్లోనేకదా గంటల తరబడి క్యూలో నిల్చొని దర్శనం చేస్తారు.*

*అలా వెల ఇచ్చి కొనగలమా దేవుడిని? అలాగైతే ఇంకా ఎక్కువ ఇస్తానని మరొకడు మొక్కుకుంటే, దేవుడు మిమ్మల్ని చేజార్చేస్తాడా?*

*మీరు మీ అవసరాల కోసమే గుడికి వెళుతున్నారు. ఫర్వాలేదు. అయితే కనీసం అందులోనైనా నిజాయితీగా ఉంటున్నారా? ఎందుకని దేవుడితోటే బేరం చేస్తారు?*

వానకు మొక్కాడు. సూర్యుడికి నమస్కరించాడు. ఆనాడే భయంతో అంగీకరింపబడ్డాడు దేవుడు.

పుట్టినప్పటి నుంచి మీ తల్లిదండ్రులు, ఈ సమాజం దేవుడున్నాడు అని చెప్పడం వల్లే కదా మీరూ దేవుడున్నాడని నమ్ముతున్నారు!? మీ కుటుంబంలో వాళ్లంతా ఏ దేవుడిని పూజిస్తారో, ఆ దేవుడిని మాత్రమే మీరు కూడా అంగీకరించగలుగుతున్నారు.

మీకు అలవాటైన పట్టుబట్టలూ, బంగారు ఆభరణాలతోనే కదా భగవంతుడు మీపై కరుణ చూపుతాడు. క్యాలెండర్లపై అచ్చువేసినట్లుకాక జీన్స్, జుబ్బాలతో వస్తే, అతణ్ణి భగవంతుడని అంగీకరిస్తారా?

ఏనుగుల లోకానికి వెళ్లి దేవుడెలా ఉంటాడని అడిగితే 'మాకన్నా పెద్దశరీరం, నాలుగు తొండాలతో ఉండేవాడే దేవుడు, అంటాయి. చీమను అడిగితే, ఆరు అంగుళాల పొడవుండే పెద్దచీమే దేవుడు అని చెప్తుంది.

తమ అనుమానాలూ, కష్టాలూ తీర్చుకోలేక ఎందరో, ఎదుటివాళ్ల కష్టాలను తీర్చడానికి తల్లడిల్లిపోతారు. భగవంతుడి విషయంలో మీకు ఏ అనుమానం లేదు. అందువల్ల ఎదుటివారు చెప్పినదాన్ని అలాగే నమ్ముతున్నారు. గుడికి ఎందుకెళు



తున్నారు? దేవుడిని తెలుసుకోడానికా? అది ప్రసాదించు... ఇది ప్రసాదించి కాపాడయ్యా..." అని అడగటానికే కదా!

మీ భగవద్భక్తి, విశ్వాసం చాలావరకు భయాన్ని, కోరికల్ని ఆధారం చేసుకుని ఏర్పడ్డవే కదా? మీ ఇంట్లో డజన్లకొద్దీ తగిలించిన దేవుడి పటాలవల్ల మీ మనసుకు బతుకుమీది భయం పోయిందా? భగవంతుణ్ణి ఇంటపెట్టి తాళం వేసుకుని వెళ్లాల్సివస్తోంది కదా!

భగవంతుడు మీ భయాలకు ఓ నిదర్శనప్రాయం ఉండబట్టే మీరు భయభక్తులనే పదాన్ని అంత ఇష్టపడుతున్నారు. భగవంతుడు ప్రేమస్వరూపుడు అంటే ఆయన పట్ల భక్తి చాలదా? భయం కూడా ఎందుకు?

ఈ రోజుల్లో భగవంతుణ్ణి తెలుసుకోలేనివారే మన గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు. అలాగంటే భగవంతుడు కేవలం ఓ కల్పనమాత్రమేనా?

ఆయన గురించి ఆలోచించక్కర్లేదా?

చిన్ని విత్తు భూమిమీద పడి మహావృక్షమవుతోంది ఎలా? ఈ విత్తునుంచి ఆ చెట్టే పుడుతుంది, ఈ పుష్పం పూస్తుంది అని శాసించింది ఎవరు? మీకు మించిన శక్తిని భగవంతుడు అనక ఏమని అందాం?

దేవుడున్నాడా? లేడా? ఇది తెలుసుకోవాలన్న కోరిక మీలో పుడితే, మీరు ఎవర్ని అడుగుతారు?

## నమ్మకాల ఆధారంగా కూర్చబడే కల్పనలను ఎందుకు నమ్మాలి? ఎదుటివారు చెప్పేవి గుడ్డిగా నమ్మడం మానలేరా?

దేవుడు ఉన్నాడని ఎవరో చెప్పారని నమ్మడం, లేడని ఎవరో అన్నారని అంగీకరించడం అవి తెలివితేటలు ఎలాగవుతాయి? దేవుడిని నమ్మడం, నమ్మకపోవడం దేవుడి గొడవ కాదు. అది పూర్తిగా నూటికి నూరుపాళ్లూ మీ గొడవే. రాముడున్నాడా? కృష్ణుడున్నాడా? జీసస్ వున్నాడా? అన్నదే ఆ గొడవ?

మీ అనుభవం ఏంటి?...

యూదులు దేవుడితో ప్రత్యేకమైన సంబంధం కలిగి వున్నామని చెప్తారు. వాళ్ల గురించి ఒక తమాషా కథ వుంది. యూదుల నాయకుడు జోష్వాగోల్డ్ వర్క్ సంవత్సరానికి ఒకసారి స్వర్గానికి వెళ్లి భగవంతుడితో కలిసి భోజనం చేసే హక్కును పొందాడు.



అలా ఓసారి భగవంతుడితో విందులో ఉన్నప్పుడు... ప్రతి ఏడూ ఏ మార్పూ లేకుండా బండరొట్టెలు వారికి పెట్టడం ఆనవాయితీ... "భగవంతుడా నా మనస్సును ఒక సందేహం పీడిస్తోంది" అని చాలా కష్టపడి రొట్టెలు నమలడం మొదలుపెట్టాడు జోష్వా.

"అడుగు నాయనా!"

"మీ సామ్రాజ్యంలో మీకు దగ్గరవాళ్లు మేమేనా, ఇంకా ఎవరైనా ఉన్నారా?" అని అడిగి రొట్టెముక్క మింగి దిగడానికి గొంతులో నీళ్లు పోసుకున్నాడు.

''అనుమానం వద్దు ఆ సౌలభ్యం మరెవ్వరికీ లేదు. అందువల్లే నిన్ను మాత్రమే భోజనానికి పిలిచాను..."

జోష్వా, చేతిలో ఉన్న రొట్టెను పడేసి లేచి, "ఎన్నాళ్లు మాకీ కష్టం? ఇంకెవరినైనా నీకు దగ్గరవాళ్లుగా చేసుకోకూడదా?" అని కోపంగా అడిగాడు.

ఇలాగైతే, భగవంతుడికి దగ్గర వాళ్లకే కదా ఆవేదన? వీళ్లు దైవం అనడంలోని గొప్పతనాన్ని అర్థం చేసుకోలేదు. దైవంపట్ల సరైన అనుభవం వీళ్లకు లేదు. అయినా దేవుడికీ, మిగిలినవారికీ మధ్య దళారీలుగా ఉంటూ వీళ్లు ఆదాయం వెతుక్కోవడం సహించలేనిది. భగవంతుడిని పూర్తిగా నమ్మి మీరు బతుకుతున్నారా?

కొందరున్నారు... దగ్గరవాళ్లకు ఆరోగ్యం బాగోలేదంటే వెంటనే దేవుడిని వేడుకుంటారు. ఒకవేళ వాళ్లు బతక్కపోతే, 'దేవుడు, అస్సలు లేదు' అని ఇంట్లో

***నిజానికి భగవంతుడికి ఎన్ని ముఖాలు***

*భగవంతుడు మీకంటే ఎంతో ఉన్నతుడిగా ఉండాలని మీరే ఆయనకి పదహారు చేతులు కల్పించారు. భగవంతుడికి నాలుగు చేతులు, ఆరు ముఖాలు మీరే ఏర్పరిచారు.*

*నిజం చెప్పండి... మీకెన్ని ముఖాలు? ఇంట్లో ఒక ముఖం, పనిచేసేచోట మరొక ముఖం, స్నేహితులతో వేరే ముఖం, శత్రువులతో వేరొక ముఖం, వీధివీధికీ మార్చుకోవడానికని ఎన్ని ముఖాలు దాచుకున్నారు? స్కందుడికన్నా మీకే ఎక్కువ ముఖాలున్నట్లు కాదా?*

*ముఖాలను లెక్కపెట్టి భగవంతుణ్ణి నిర్ణయించాలంటే, మీ రాజకీయ నాయకుల ముందు ఏ దేవుడూ నిలబడలేడు కదా!*

*మన పూర్వీకులు దైవానికి వివిధ రూపాలను చెప్పడానికి ఎన్నో కారణాలున్నాయి. వాటిని తెలుసుకోడానికి జ్ఞానం అవసరం. అవి తెలియకుండా, భగవంతుణ్ణి తెలుసుకున్నా మనుకుంటే, అది మీ అహంకారానికి ఎరవేయడమే.*

ఉన్న దేవుడి పటాలనన్నింటిని తీసిపారేస్తారు. తను కోరుకున్నది ఏదైనా జరగకపోతే, దేవుడే లేడనేస్తారు. మిమ్మల్ని పెంచిన విధానాన్నిబట్టీ, మీకు చెప్పబడ్డ విధానాన్నిబట్టే కదా మీరు భగవంతుణ్ణి నమ్ముతారు.

భగవంతుడున్నాడన్నది ఒక నమ్మకం. లేదు అన్నది మరొక నమ్మకం. ఉన్నాడా? లేడా? అన్నది మీకు తెలియదన్నదే అసలైన నిజం. నాకు తెలీదు అని ధైర్యంగా ఎప్పుడైతే ఒప్పుకుంటామో, అప్పుడే దేనిగురించైనా సరిగా తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

నమ్మకాల ఆధారంగా కూర్చబడే కల్పనల్ని ఎందుకని నమ్మాలి? భగవంతుణ్ణి గురించి తెలుసుకోవాలన్న కోరికవుంటే, ఎదుటివాళ్లు చెప్పింది గుడ్డిగా నమ్మే అలవాటు మానండి. భగవంతుడున్నాడా అని మీరే వెతకండి. మీ వెదుకులాట మీతోనే ప్రారంభించండి.

ఎల్లలులేని భగవంతుడు అనేవాడు అన్నిచోట్లా ఉన్నాడని తెలుసుకుంటే, అతడు మీలోనూ ఉండాలికదా? రూపాన్నికాక ఆ భగవత్ తత్త్వాన్ని ముందు మీలో వెతకండి. మీలోని దైవాన్ని గుర్తించి అనుభవిస్తే, ఆ తర్వాత ఆయన అన్నిచోట్లా వుంటాడని ఒప్పుకోవచ్చు.

ఒక్క విషయం సరిగా అర్థం చేసుకోండి.

తెలివిగా బతకడం తెలిస్తే, మీరు దైవం లేకుండా కూడా సుఖంగా బతకవచ్చు. బతుకు అంటే ఏంటో అర్థం చేసుకోకుండా, మూర్ఖంగా బతికేవారై ఉంటే పూజ గదిలో ఎన్ని దేవుళ్ల పటాలున్నా లాభంలేదు.



**ప్రపంచాన్ని ఏలాలనే కోరిక తప్పుకాదు. అందుకోసం మీరు శక్తివంచన లేని ప్రయత్నాలు చేస్తున్నారా? అలాచేస్తే ఫలితం దక్కుతుందా?**

ఒక విషయాన్ని తీర్మానించుకోండి. మీరు లోకాన్ని ఏలాలనుకొంటున్నారా? లేక ఒక బానిసలా బతికి మరణించాలనుకుంటున్నారా? ఎవరి దగ్గరా చేయి చాపకుండా, కోరినవన్నీ పొందగలదారులేవి? మొట్టమొదటిది మిమ్మల్ని మీరు ఓ పనికి పరిపూర్ణంగా అర్పించుకోండి.

మీ శక్తిని పరిపూర్ణంగా ఉపయోగించుకోకుండా, సరిగా దృష్టి పెట్టకుండా పనిచేయడం మొదలుపెడితే, మీ ప్రయత్నాలు ఎప్పుడూ ఫలించవు.

ప్రపంచాన్ని ఏలాలని కోరుకునే వాళ్లల్లో ఎందరో తమవంతు పరిపూర్ణమైన శక్తి వంచనలేని ప్రయత్నాలు చేయలేదు. అందువల్ల వీళ్ల శక్తియుక్తులు మహా అయితే

ఇంట్లో వాళ్లమీద అజమాయిషీ చేయడానికే సరిపోతున్నాయి. ఈ సందర్భంగా రెండో ప్రపంచయుద్ధం మీద వచ్చిన ఒక సినిమా కథ గుర్తుకొస్తోంది.

ఆంగ్లేయులు పాలిస్తున్న ఒక ఊరిలో ఫ్రెంచి వాళ్లు ఒక బాంబును కప్పిపెట్టి వెళ్లారని వార్త వ్యాపించింది. బ్రిటీష్‌సైన్యం, ఊరి ప్రజలు తొందరగా ఊరు ఖాళీచేసి వెళ్లిపోతారు. ఖాళీ అయిన ఆ ఊళ్లో మిగిలిపోయింది ఎవరూ గమనించకుండా, పిలవకుండా వదిలి వెళ్లిన కొందరు మూర్ఖులు మాత్రమే.

పాతిపెట్టబడ్డ బాంబు గురించి తెలియనివాళ్లు ఆ ఊళ్లో అక్కడా ఇక్కడా ఎక్కడబడితే అక్కడ తిరుగుతున్నారు. అడిగేవాళ్లు లేకపోవడం వల్ల "నువ్వే రాజు, నువ్వే మంత్రి, వీడే మేయర్" అంటూ ఎవడికి వాడు పదవుల్ని తీర్మానించుకొని ఆ ఊరును ఏలడం ప్రారంభించారు. కొన్ని వారాలు గడిచాయి.

ఇక బాంబు పేలదు అని జర్మన్ సైన్యం, బ్రిటీష్ సైన్యం ఊళ్లోకి ప్రవేశిస్తారు. ఒకళ్లమీద ఒకళ్లు కాల్పులు జరుపుకుంటారు. రాజనుకునేవాడు, "ఆగండి నన్నడగకుండా మీరిక్కడ యుద్ధం చేయకూడ"దంటూ బయటికి వస్తాడు. కాల్పుల్లో గుండు తగిలి కుప్పకూలిపోతాడు.

'రాజుగారు పోయారు. ఆ పదవి నాదే"నంటూ యుద్ధభూమికి మూర్ఖంగా ప్రవేశించిన మరొకడు గుండు తగిలి కుప్పకూలిపోతాడు. మత గురువునని ప్రకటించుకున్నవాడు, 'నా అనుమతి లేకుండా రాజు నడుచుకోవడంవల్లే ఈ అనర్థమంతా' అంటూ మధ్యలోకి రాబోతే అతడి కాలమూ తీరిపోయింది.

జరుగుతున్నది నిజమైన పోరని తెలియకుండా, ఒక్కొక్కడుగా బలి అవడం, ఆ చివరిక్షణాల్లోనూ తమ పదవి గురించి గొప్పలు చెప్పుకోవడం... కథ నడుస్తూ ఉంది. ఇది సినిమాలో కథే కాదు. నిజంగానే చాలామంది ఇలాగే ప్రపంచాన్ని ఏలడానికే పుట్టామనుకుంటూ ఉంటారు. శక్తియుక్తుల్ని పెంపొందించుకోకుండా లేనిపోని గొప్పలు చెప్పుకుంటారు. తమని తామే గొప్పగా అనుకుంటారు. ఆ కల్పనను పెంచుకుంటూ పోతారు.

ఉట్టికెక్కలేని వీళ్లు, స్వర్గానికి ఎక్కాలని అనుకుంటారు. ఇంట్లో ముసలితల్లి. భార్యాపిల్లల మీద అధికారాన్ని చలాయిస్తూనే ఆనందిస్తుంటారు.



ఏలాలనుకునేది ప్రపంచాన్ని, కాని దానికోసం తీవ్ర ప్రయత్నాలు ఏవీ చేయలేని వాళ్లు కొందరు. మరికొందరు ప్రపంచాన్ని గెలవాలనే తీవ్రమైన ఆశతో ఆడంబరంగా ప్రయత్నం ప్రారంభిస్తారు. మధ్యలో ఒకటి రెండు అడ్డంకులు వస్తే చాలు– "ఇదా... ఇది నాకెక్కడ దక్కుతుంది?" అని డీలా పడిపోయి దాన్ని వదిలేస్తారు.

మీకు కావలసింది ఏదని మీరు తీర్మానించుకుంటే, దానికి వ్యతిరేకమైన అభిప్రాయాల్ని ముందు ఏరిపారేయండి. మీ కోరికను, శక్తిని ఏకోన్ముఖం చేయండి. భూతద్దం ద్వారా వెలుగును కేంద్రీకరించినప్పుడు అది కాగితాన్నే కాల్చివేస్తుంది కదా! మీ తీవ్రమైన ఇచ్ఛ కూడా అలాంటిదే. ఎలాంటి అడ్డునైనా తొలగించుకుని, మీరు కోరిక దాన్ని తెచ్చి ఇస్తుంది.

పరిపూర్ణమైన ప్రయత్నంలో ఆలోచనల్లో తీవ్రత, పనిలో పూర్తి ఆసక్తి ఉంటేనే ప్రయత్నం ఫలిస్తుంది. తనకు కావల్సినదానికోసం తీవ్రంగా ప్రయత్నించినవారే ఫలితాన్ని సాధించగలుగుతారు.

### ఎక్కువ ఆశపడితేనే కదా అసంతృప్తి... కొంచెం కొంచెం ప్రయత్నించి తీర్చుకుంటే?

వాంగా అనే గొప్పచిత్రకారుడుండేవాడు. తాను కురూపిని అనే భావన అతన్ని ఎంతో బాధ పెట్టేది. అందువల్లే బొమ్మలు చాలా అందంగా వేసి సంతోషించేవాడు. ఏ స్త్రీ అతని రూపాన్నిష్టపడదు అని తెలీడంవల్ల, డబ్బిచ్చి స్త్రీలను రప్పించుకుని సుఖించేవాడు.

అలా వచ్చిన స్త్రీలలో ఒకామెకు–

"ఇంత డబ్బు తీసుకుని ఇతన్ని ఒక్కమాట కూడా మెచ్చుకోకుండా వెళ్తే ఎలా?" అన్పించింది. అదొక తప్పుగా తోచింది.

అందువల్ల ఆమె వాంగాతో "మీ చెవులు చాలా అందంగా ఉన్నాయి" అంది.


వాంగా సంతోషాన్ని పట్టలేకపోయాడు. తన రూపాన్ని మొట్టమొదటిసారిగా మెచ్చుకున్న ఆమెకో బహుమతి ఇవ్వాలనుకున్నాడు. ఆ మర్నాడు ఆమెకో పార్శిల్ వచ్చింది. విప్పి చూసిన ఆమె అదిరిపడి దాన్ని విసిరేసింది.

"నువ్వు మెచ్చుకున్న చెవులు తీసుకో..." అంటూ తన చెవులను కోసి పంపించాడు వాంగా. పూర్తిగా ఆశపడకుండా ముక్కలు ముక్కలుగా కోరుకుంటే అవి లభించినా అదురుపాటు, ఆశ్చర్యమే మిగులుతాయి.

నిప్పు వేడిని అనుభవిస్తేనే, నీటి చలువు తెలుస్తుంది. కష్టించి చెమటను కార్చినవాడే, విశ్రాంతిలోని సుఖాన్ని పూర్తిగా అనుభవించగలడు. కష్టపడకుండా తీసుకొనే విశ్రాంతికి మారుపేరు సోమరితనం.

ఈ లోకంలో బానిసగా కాకుండా ఒక అధికారిగా బతకాలనుకుంటే, ప్రతిక్షణం కష్టపడడానికి తయారుకావాలి. మేల్కొన్నా, నిద్రపోతున్నా ఈ అగ్ని ఇరవై నాలుగు గంటలూ మీలో మండుతూనే ఉండాలి.





**ఎవరి పట్ల ప్రతీకారం తీర్చుకోవాలని మీరు అనుకుంటున్నారో, ఆ వ్యక్తే చాలా మౌనంగా మీమీద ప్రతీకారం తీర్చుకుంటున్నాడు. ఈ విషయం మీకెప్పుడు తెలుస్తుంది?**

ఎవరో మీకు ఒక దుఃఖాన్ని కలిగించారు. వాళ్లు మీకు శత్రువులయ్యారు. కనీసం అంతే బాధను మీరు వాళ్లకు కలిగించకపోతే, వాళ్లముందు ఓడిపోయినట్టు మీరు అనుకుంటారు. ఆ అవమానాన్ని పోగొట్టుకోవడానికి అంతకంతా అతన్ని అవమానపరచాలని నిశ్చయించుకుంటారు. అందుకని మీ శక్తినంతా కూడగట్టుకుని ప్రయత్నిస్తారు. అది వీరమని అనుకుంటారు.

వ్యక్తిగతంగా మొదలయ్యే ఈ కోపం కుటుంబం, రాజ్యం, దేశం అంటూ పెరుగుతూపోతుంది. ఇప్పుడు ఎవరు ఎక్కువ శక్తిమంతులు... మీరా, మీరు శత్రువుగా భావించినవాళ్లా? ఒకరోజంతా మీరు ఎవరి గురించి ఎక్కువగా పట్టించుకుంటున్నారు. మీకు చాలా ఇష్టమైన వాళ్ల గురించా?... లేదే? మీ శత్రువు గురించే!

**ఆపదలో గుర్తురాని విషయం, తర్వాత నిదానంగా ఆలోచిస్తే ఎందుకు తోస్తుంది?**

*ఎప్పుడు విత్తువేయాలి, ఎప్పుడు దున్నాలి, ఎప్పుడు కలుపు తీయాలి, ఎప్పుడు కోత కోయాలి అన్నిటికీ ఒక సమయం ఉంటుంది. అలాకాక కాలం మీరిన తర్వాత చేసేపని సరైనదే అయినా తగిన ఫలాన్నివ్వదు.*

*ఒక ఆపదంటూ రాగానే ఆలోచన స్తంభించి పోవడం ఎందువల్ల, అని ఆలోచించండి?*

*మీరు, 'మనసు అంటే ఆలోచనలు చేసే ఒక యంత్రం' అని తప్పుగా అనుకుని, అలాగే దాన్ని పెంచుకున్నారు. అనుక్షణం ఏదో ఒకటి ఆలోచిస్తూ ఉండటంవల్ల, వందలాది ఆలోచనలు చిన్న చిన్న పురుగుల్లా ఎప్పుడూ పనిలేకుండా మీ మదిలో అటూ ఇటూ ఎగురుతూనే వుంటాయి. అలాకాకుండా మనస్సును పూర్తిగా మేల్కొనే వుండేలా మీరు ఆభ్యాసం చేయిస్తే, ఈ గొడవలేవీ ఉండవు.*

*అద్దం మీద దుమ్ము పేరుకుంటే, బింబం ఎలా స్ఫుటంగా కనిపిస్తుంది? మనస్సును తేలికగా, పూర్తి సిద్ధంగా ఉంచుకోవడానికి ఒకటే దారి– అది ధ్యానం మాత్రమే!*

మీ సంతోషాన్నంతటినీ ఒక్క క్షణంలో తొలగించగల శక్తిని మీరేకదా అతనికిచ్చారు? ఆ వ్యక్తికి బానిసలా, మీ ఆలోచనలెప్పుడూ అతని వెనుకేకదా వెళ్తున్నాయి? మీరు ఇష్టపడే వ్యక్తికి మీ మనసులో చోటిస్తున్నారో లేదో? మీరు శత్రువుగా భావించే వాళ్లకుమాత్రం మీరు పిలిచి సింహాసనం వేసి గుండెల్లో చోటిచ్చారు. కూర్చోబెట్టారు కూడా! అయితే, మీ శత్రువుకు ఎక్కువ గౌరవం ఇచ్చినది ఎవరో తెలుసా? మీరే!

వాళ్లకు మీ మనస్సులో చోటు ఇవ్వడం వల్ల మీకు మీరే పెద్ద ద్రోహిగా మారిపోలేదా?

ఎవరివట్ల ప్రతీకారం తీర్చుకోవాలని మీరు అనుకుంటున్నారో, ఆ వ్యక్తే చాలా మౌనంగా మీ మీద ప్రతీకారం తీర్చుకొంటున్నాడు.

ఈ విషయం మీకెప్పుడు తెలుస్తుంది?

ఉద్యోగం కోసం వెతుక్కుంటూ వెళ్లిన ఒక నేపాలీ, ఒక పాకిస్తానీ, ఒక భారతీయుడు ముగ్గురూ ఒకే ఇంట్లో బస చేశారు. ఆ ఊళ్లో తాగకూడదన్నది ఒక చట్టం. ఈ ముగ్గురూ రహస్యంగా తాగుతున్నప్పుడు, కావలి వాళ్లు చటుక్కున చుట్టుముట్టారు.



చట్టాన్ని మీరినందుకు ఒక్కొక్కరికి 20 కొరడా దెబ్బలు దండనగా విధించి, "ఈ రోజు నా నాలుగో భార్య పుట్టినరోజు. మీకు దండనలో ఏదన్నా వెసులుబాటు కావాలంటే ఇస్తాను అడగండి" అన్నాడు న్యాయాధికారి.

"దెబ్బలు తినడానికి ముందు నా వీపుకో తలగడ కట్టుకోడానికి అనుమతివ్వా"లని కోరాడు నేపాలి.

అది నెరవేరింది. ఎనిమిది దెబ్బలు ఓర్చుకున్నాక ఆ తలగడా కాస్తా చిరిగిపోయింది. మిగిలిన పన్నెండు దెబ్బలకు అతడి వీపు చర్మం చిట్లిపోయింది.

ఇది చూసిన పాకిస్తానీ, "నా వీపుకు రెండు తలగడలు కట్టుకోడానికి అనుమతించం"డని కోరాడు.

"నీకు?" అడిగాడు న్యాయాధికారి భారతీయుడిని.

"నాకు దండన రెండు రెట్లు చేయండి. అయితే, నా వీపుకు ఒక పాకిస్తానీని కట్టండి" అని అడిగాడు.

ఇతరులకు కష్టాన్ని కలిగించాలి అన్న ఆలోచన చేసేటప్పుడే మన జీవితపు గొప్పదనం నశించిపోతోందని తెలుసుకోవాలని ఈ కథ చెప్పాను.

పగ తీర్చుకోవాలను కోవడం ఒక జబ్బు. అది మీలో ప్రవేశిస్తే, మిమ్మల్ని తినేసి, ఏమీ మిగలనీయకుండా చేస్తుంది. ఎదురుగా వున్న అతన్ని ఎదుర్కొనే అవకాశం మీకు ఉంటుంది. అతడు, మీలోనే కూర్చుని అధికారం చలాయించడం మొదలుపెడితే, ఆ తర్వాత ఒక కొండమీద నుంచి కిందికి దొర్లించబడ్డ రాయి, మీరూ ఒకటే. మీ బతుకంతే. జరజరమని జారి, అక్కడా ఇక్కడా మోదుకుని, చివరకు పాతాళంలో పడక తప్పదు.

ఇక, మీ ఆనందాన్ని దోచుకోవడానికి బయటనుంచి ఒక శత్రువు ఎందుకు? మీరే చాలుకదా!

అలాకాకుండా, మీ సంతోషాన్ని చుట్టూవున్న పరిస్థితులకు బలిపెట్టకుండా, మీలో మీరే నిశ్చింతగా వుండే ప్రయత్నం చేస్తే మీ శక్తి పరిపూర్ణంగా ప్రకటితమవుతుంది. గెలుపు మీకే కైవసమవుతుంది. విజయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది.

**మీ మనసు ప్రశాంతంగా వుంటే చాలా చురుకుగా ఉండగలుగుతారు. మీ మనసు ప్రశాంతంగా వుండాలంటే మీరు ఏం చేయాలి?**

చాలామందిని పరిశీలనచేస్తే వాళ్లు 8 గంటలు పనిచేస్తే, అందులో అధికపక్షంగా 2–3 గంటలే వాళ్ల క్రియాశీలత వెలువడేలా పని చేస్తున్నారన్న విషయం తేలింది.

పెన్ను తీసుకోవడం, తెరవడం, మూసిపెట్టడం, పనేమీ లేకున్నా అటూఇటూ తిరిగిరావడం, కుర్చీ జరపడం, వేలికొనల్ని పరీక్షించుకోవడం మొదలైన మనస్సు నిలువరించుకోలేరన్న విషయాన్ని నిరూపించుకునే పనుల్నే తమకు తెలియకుండా చేస్తూ కాలాన్ని దుర్వినియోగపరుస్తుంటారు.

మీకో నిజం తెలుసా? అర్థంపర్థంలేని ఈ పనులన్నీ మనస్సును సరిగా కేంద్రీకరించలేకపోతున్నారనడానికి ఉదాహరణ. ఇలా ఆలోచనలను ఛిన్నాభిన్నం



చేసే పనుల్లో శక్తిని పోగొట్టుకోకుండా, దాన్నే సరిగా వాడుకుంటే, ఎన్నో మార్పులు రావచ్చు. ఏదీ కఠినంగా తోచక, అనుకున్న సమయంకన్నా ముందే పూర్తవుతుంది.

సరే, మనసు ఎందుకు సంచలిస్తుంది? కోపం, ఉద్వేగం, బాధ, సంతోషం – అన్నీ భావాల వేరు వేరు రూపాలే?

చాలావరకు మీ భావాలు చుట్టూఉన్న పరిస్థితుల వల్ల ప్రభావితమవుతున్నాయి. వీటిని చెప్పుచేతల్లో ఉంచుకోలేకపోతే, ఆలచనల్నీ మీ చెప్పుచేతల్లో ఉంచుకోలేక బాధపడవలసి వస్తుంది.

పదవిలో పైకి ఎదగడానికి ఎన్నో అవాంతరాల్ని తట్టుకోవాల్సి ఉంటుంది. ఒక సాధారణ పౌరుడికన్నా దేశంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రులు బయటనుంచి వచ్చే ఎన్నో పరిస్థితుల్ని తట్టుకోవాల్సి ఉంటుంది.

స్థిమితంలేని మనసుకి చిన్న మట్టిబెడ్డకూడా పెద్ద బండరాయిలా తోస్తుంది. అదే మనసు స్థిరంగా వుంటే అన్ని అడ్డంకులు వచ్చినా వాటినే మెట్లుగా మార్చుకుని ముందుకు వెళ్లగలుగుతారు. దీనికి ఉదాహరణగా సరదాగా ఒక కథను చెపుతాను వినండి.

ఒక గురువు దగ్గర చాలామంది శిష్యులుండేవారు. వాళ్లల్లో ఇద్దరికి పొగతాగే అలవాటు ఉండేది. ఆశ్రమంలో పొగతాగే అవకాశం లేకపోవడంవల్ల, ధ్యానంలో మనసు నిలుపలేక అవస్థపడుతూ వున్నారు.

'ఇలా కష్టపడేకన్నా ఇక్కడ మేం పొగతాగవచ్చా అని అడిగేద్దామా?" అనుకున్నారు ఇద్దరూ!

మర్నాడు ఒకడు ముఖాన్ని ముడుచుకుని తోటలో కూర్చున్నాడు. మరొకడు, పొగతాగాలని వచ్చాడు. అతన్ని చూడగానే ఇతడు ఒక ఉదుటన లేచాడు.

"నువ్వు ఎలా పొగతాగుతున్నావ్? నేను అడిగితే గురువుగారు అనుమతించలేదే?' అన్నాడు.

"నువ్వు ఆయన్ని ఏమని అడిగావ్?"

"సరిగానే అడిగాను... ధ్యానం చేసేటప్పుడు పొగతాగవచ్చా? అని అడిగాను. అస్సలు వీల్లేదు! అన్నారు."

"నేను అదే కొంచెం మార్చి అడిగాను. 'పొగతాగేటప్పుడు ధ్యానం చేయవచ్చా?' అని. 'చక్కగా చేయవచ్చు' అని అనుమతినిచ్చారు' అంటూ నవ్వాడతను.

మనస్సు ప్రశాంతంగా వుంటే ఏదీ పెద్ద ఆపదగా తోచదు. మీరెప్పుడైనా ప్రశాంతతను అనుభవించారా?

కడుపునిండా తిన్నవాళ్లను చూడండి. అలసటగా పడుకుంటారు.

'ప్రశాంతంగా ఉండడానికి తాగుతున్నాను' అని కొందరు తప్పతాగి తెలివి తప్పి పడిపోతుంటారు.

అలా ఏం చేయలేకుండా పోవడం కాదు ప్రశాంతత అంటే! లోలోపల ప్రశాంతత ఉంటే, మనస్సు పూర్తిగా మెలుకువగా ఉండి ఏ ఆపదనైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉంటుంది.

పచ్చగావున్న కొండను చూస్తే, మనసు ప్రశాంతంగా వుంటుంది. అలా చూస్తున్నంతసేపూ హాయిగా వుంటుంది.

చటుక్కున ఆ చెట్ల వెనకనుంచి పొడుగైన దంతాలతో ఒక పెద్ద ఏనుగు బయటికొస్తే, అంత ప్రశాంతతా, హాయి పోయి గాభరా వస్తుంది, ఏం చేయాలో తెలీక తడబడతారు అవునా?

ఐతే లోపల మీ మనసు ప్రశాంతంగా వుంటే, ఏనుగును చూడగానే మనసు స్తంభించిపోదు. వెంటనే మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికి ప్రయత్నిస్తారు.

మామూలుగా ఎప్పుడు మీ ప్రశాంతతకు భగ్నం ఏర్పడుతుంది? మీరు ఎదురుచూసినట్టు ఎదుటివాళ్లు నడుచుకోకపోతే, కోపం, చిరాకు కలుగుతాయి. ఎవరూ మిమ్మల్ని ఎదిరించి ప్రశ్నించకుండా మీ ఆజ్ఞలకు లోబడి, అన్నింటినీ భరిస్తూ అణగిమణగి వుంటారో, అక్కడ ఆనందంగా వుంటారు. ప్రశాంతంగా ఉంటారు. అంటే, మీరు ప్రశాంతంగా ఉండాలంటే మీ అహంకారానికి తగ్గ ఎర కావాలి.



ఈ విషయాన్ని అర్థం చేసుకోండి. మీ అహంకారాన్ని, గర్వాన్ని తట్టుకునేవాళ్లు నిజానికి మీ స్నేహితులు కాదు. మిమ్మల్ని అజ్ఞానంలోనే ఉంచి మీరు ఎదగకుండా అడ్డుపడే నీచమైన శత్రువులు!

మీ మనస్సును నిశ్చింతగా ఉంచుకోకపోతేనే ఈ గొడవంతా! మీ శక్తిని మీ చెప్పుచేతల్లో ఉంచుకుని తగినట్లు వాడుకోవడం నేర్చుకోకపోవడం వల్లే ఈ గొడవంతా వస్తోంది. ఇన్ని కష్టాలూను.

మీ మనస్సు ప్రశాంతంగా వుంటే, చురుగ్గా ఉండగలుగుతారు. మీ మనస్సు ప్రశాంతంగా వుండాలంటే ఏం చేయాలి? సరైన యోగా, ధ్యానం మీ శక్తి చెదరకుండా ఒక కట్టుదిట్టంలో ఉండేలా చేయగలదు.

మనస్సును అలా ఒక నిగ్రహంతో ఉంచుకోగలిగితేనే, మీ శక్తియుక్తులు వాటంతట అవే బయటపడి మిమ్మల్ని ఎంతో ఉన్నతమైన స్థానానికి తీసుకెళ్తాయి.

## మత గ్రంథాలు చదివినంత మాత్రాన జ్ఞానులవుతారా? మహాపురుషులు చూపిన బాటలో మీ జీవితాలను మలచుకోలేరా?

ఓ ఊళ్లో భగవద్గీతో, ఖురానో, బైబిలో ఎవరైనా కాల్చేస్తే ఏమవుతుంది?

జవాబుగా కొందరు ఊరు కాలుస్తారు. కాని దేవుడు చెప్పినదన్న ఒక అచ్చువేసిన పుస్తకాన్ని చూస్తే దానికన్నా ఆ భగవంతుడు సృష్టించిన ఎందరో మనకు తేలికగా కనిపిస్తున్నారెందుకు?

దాంతో దేవుడు గురించి మాట్లాడిన వారంతా ఆ మహా గ్రంథాల గురించి గొప్పగా చెప్పి చెప్పి అవన్నీ ఒక పవిత్రమైనవని మిమ్మల్ని నమ్మించారు. దేవుడే అతడని చెప్పబడే ఆ పుస్తకాలలో పవిత్రత లేదని నేను అనడంలేదు. అవి నిజంకాదనీ చెప్పడంలేదు.



అయితే అందులోని రాముడినో, కృష్ణుడినో, ఏసునో ఒక ఆదర్శంగా పెట్టుకుని మీ జీవితంలో కొన్ని లక్ష్యాల్ని ఏర్పరచుకోవచ్చు అంటారు. అంతే! కాని, వాళ్లు చెప్పినది చదివినంత మాత్రాన మీరు ఉన్నతులైపోతారు అన్న అభిప్రాయం మూఢత్వం అని చెప్తున్నాను. అలా అయితే వాళ్లు మరి అవి ఎందుకు చెప్పినట్టు?

ఒక మంచి చోక్ వింటారు. ఓ మంచి పుస్తకం చదువుతారు, ఒక చక్కటి సినిమా చూస్తారు. వెంటనే మీరేం చేస్తారు? మీరు చూసి ఆనందించిన విషయాన్ని ఎవరితోనైనా పంచుకోవాలనుకుంటారు. ఆ ఆశ మీకొస్తుందా, రాదా? కలిగిన ఆనందాన్ని మీ మనసుకి దగ్గరైన వాళ్లతో పంచుకోవాలని మనస్సు తపనపడుతుంది. మీ మతగ్రంథాలు కూడా అలా తయారైనవే.

ఎవరో కొందరు చాలా గొప్ప అద్భుతమైన అనుభవాలను పొందారు. వాటిని మీతో పంచుకోవాలని ఆశపడ్డారు. ఆ ఆలోచనల్ని ఓ పుస్తకంగా రాశారు. శ్లోకాలుగా వాటికి రూపాన్నిచ్చారు. లేదా మరెలాగో వాటికో రూపం ఇచ్చారు. అవి మీ మనస్సు, బతుకు ఎలాగుండాలో చెప్పడానికి ప్రయత్నిస్తున్నాయి. అవన్నీ మరచిపోయి, ఆధారపూర్వకమైన ఆలోచనలు పక్కనపెట్టి, మీతో సహజీవనం చేసే సాటి మనుషుల్ని కాల్చేస్తున్నారు.

ఇది ఎలాంటి మూఢత్వం? రాముడో, కృష్ణుడో, ఏసునో తమ తెలివితేటలతో ఎంతో ఆలోచనావంతమైన రచనలు చేశారు. మంచి గొప్ప జీవితాన్ని గడిపారు. అందువల్ల ఎంతో ఉన్నతమైన స్థితిని పొందారు. మరి మీరో? భగవద్గీతను చదివి పూర్తిచేయగానే జ్ఞానం వచ్చేసినట్లు, జ్ఞానవంతులైనట్లు భావిస్తున్నారు. జ్ఞానం పొందినట్లు ఓ కబుర్లు చెప్తున్నారు. ఇది ఎలా ఉంటుందో తెలుసా?

శంకరన్‌పిళ్లై ఓ ఊళ్లో ఒక సముద్రతీరానికి వెళ్లాడు. అక్కడ చక్కగా చల్లగాలి వీస్తోంది. అతనికి వేరెక్కడా అంత సంతోషం దొరకలేదు. తన అనుభవాన్ని తన భార్యతో పంచుకోవాలని అనుకున్నాడు. అయితే, అతని భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చేర్చబడింది. శంకరన్‌పిళ్ళై ఒక శవపెట్టె కొన్నాడు. దాంట్లో కొంత సముద్రపు ఒడ్డున ఉండే ఇసుక పోశాడు.

గాలిని పట్టాననుకొని దాన్ని పెట్టెలో మూతపెట్టాడు. నేను పొందిన ఆనందాన్ని నువ్వు అనుభవించాలనే నీకు ఎంతో ప్రేమతో దీన్ని పంపిస్తున్నాను. ఈ పెట్టెలో పడుకొని గట్టిగా మూత వేస్కో. లోపలున్న సముద్రపు గాలి నీకు అనుభవానికొస్తుంది

**ఏదైనా కావాలని కోరుకోవడం వల్లే కదా మనకి కష్టాలొస్తున్నాయి?**

దేనిమీదైనా ఆశపడితే అది తప్పక అందాలన్న కోరిక మీలో భయాన్ని పెంచుతుంది. మీరు ఎదుర్కోలేని పరిస్థితులు వస్తే అవన్నీ కష్టాలని ముద్ర వేసేస్తున్నారు. నిజానికి గొడవలు బయటలేవు. మీ మనస్సులో ఉన్నాయి. ఓ రోజు భోజనం దొరకలేదా? ఆ రోజు ఏకాదశే అనుకోండి. ఇంక గొడవేది!

*అడ్డులే లేకపోతే జీవితం విసుగెత్తిపోదూ? రుచి తెలీకుండా భోజనం నేరుగా కడుపులోకి వెళ్లాలని ఇష్టపడతారా? బతుకుని రుచి చూసి, అనుభవించి, ఫలితాన్ని మాత్రం బహుమతులుగా కోరుకోవడం ఏంటి? అదేం న్యాయం?*

అని ఒక చిన్న కాగితంలో రాసి దాన్ని ఆ పెట్టెతో పాటు భార్యకు పంపించాడు. తర్వాత అతని గతేంటని వేరే చెప్పాలా?

పవిత్రగ్రంథాలను చదివినంత మాత్రాన ఆ అనుభవాలు మీకు ఏర్పడుతాయని అనుకోవడం ఎలా ఉందో, శంకరన్‌పిళ్ళై పెట్టెలో పడుకొని సముద్రపు గాలి అనుభవించ మనడమూ అలాగే ఉంది. రెండింటికీ పెద్ద తేడా లేదు. అతనికి ఏర్పడ్డ అనుభవం నిజంగా ఏర్పడాలంటే ఆ సముద్రపు ఒడ్డుకు చేరే మార్గాన్ని చూపించడమే దారి. ఆ విషయం గదా అసలు చెప్పాల్సింది?

మహాత్ములు తమ జీవితానుభవాలను జాగ్రత్తగా రాసి దాచిన పుస్తకాలే మతగ్రంథాలు. ఆ పవిత్ర గ్రంథాల్ని బట్టీపట్టి అప్పజెప్పినంత మాత్రాన జ్ఞానం వస్తుందా. వాళ్లు ఏం చెప్పి ఉంటారు అన్నదాన్ని మీరు అనుభవంలోకి తెచ్చుకుంటేనే అర్థం చేసుకోగలరు.

మీ జీవితాన్ని అనుభవించడం మీరు నేర్చుకోవాలి. నిజాన్ని మీరే తెలుసుకోవాలి. సరే నిజం తెలుసుకోవడానికి మొదటి మెట్టు ఏది? వచ్చేవారం చెప్తాను.



## ఎవరో చెప్పిన వేదాంతాన్ని గుడ్డిగా స్వీకరిస్తారా? మీకుగా మీరు జీవించడం నేర్చుకోలేరా?

నిజం తెలుసుకోవడానికి మొదటి అడుగు ఎక్కడ వెయ్యాలి. మీరు పక్కవీధికి వెళ్లాలన్నా, చంద్రుని పైకి వెళ్లాలన్నా మీ ప్రయాణాన్ని ఎలా ప్రారంభించాలి? ఇప్పుడు మీరున్న చోటునుండే కదా మొదటి అడుగువేయాలి. అక్కడ నుంచి మొదటి అడుగుపెడితే తర్వాత రెండో అడుగు. అదేగా ప్రయాణం అంటే, ఆధ్యాత్మిక ప్రయాణమైతే ఉన్న చోటునుంచి లేచినపుడే.

మీరు స్వర్గద్వారంలో నుంచున్నారని అనుకుంటే మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటున్నారని, మీరేదో ఊహించుకుంటున్నారని అర్థం. అసలు మీ ప్రయాణం ప్రారంభం అవనేలేదు.

**ఆనందాన్నిచ్చేపనులు చేయండి అంటున్నారు కదా! హింసే ఆనందం అనుకొనేవాళ్లు ఏం చేయాలి?**

మీరు సృష్టిలో ఆటలాడుకొంటున్నారు. దుఃఖాన్ని, బాధను తెచ్చిన ఏ విషయమైనా, ఏ పని అయినా మీకు సంతోషాన్నివ్వదు. మీకు, మీతోపాటే ఇతరులకు ఆనందాన్ని కలిగించే ఏవైనా పనులుచేయండి.

పోరు మీకు ఆనందాన్నిస్తోందా? ఆయుధాల్ని పట్టడమే ఆనందం కలిగిస్తోందా? తప్పేలేదు. ఎదుటివారిని మీరు కాల్చి చంపినపుడు మీకు ఏ ఆనందం, వారి గుండుకు మీరు బలవుతున్నపుడు కూడా మీకు అదే ఆనందం లభిస్తుంది అంటే ఆ పని కూడా చేయండి. తప్పేంలేదు. ఐతే మీరు మాత్రం కాల్చి ఎదుటివారిని చంపాలనుకోవడం అత్యాశ కాదూ?

ఏ రుంగుల్ని వేసుకోవాలి, ఏ గుణాల్ని అలవరచుకోవాలి, ఎటువంటి మాటల్ని మాట్లాడాలి, ఎంత ఎత్తుకు ఎదగాలి ఇలా ఒక్కొక్క దాన్ని మీ ఆశే నిర్ణయిస్తుంది. గట్టిగా ప్రయత్నిస్తే గెలుపు మీదవుతుంది. మీ వల్ల కాకపోతే వేదాంతం మాట్లాడతారు.

శంకరన్‌పిళ్ళై రోజూ వేదాంతం నేర్చుకునే క్లాసులకి వెళ్లేవాడు. అన్నీ మాయ, నువ్వు, నేను, వాడు ఏ తేడాలు లేవు. అన్నీ ఒకటే. నువ్వే నేను, నేను నువ్వు అని విని అంతా నేర్చేసుకున్నట్టే భావించాడు. వీథిలో నడిచి వెళ్లేటప్పుడు తానో పెద్ద వేదాంతి ననుకుని తలెత్తుకొని తిరిగేవాడు.

ఆకలేసి ఓ హోటల్లోకి వెళ్లాడు. కావలసిందంతా తీసుకుని త్రేన్చాడు. గల్లా దగ్గర కూర్చున్న వ్యక్తి చూస్తూనే ఉన్నాడు. అతన్ని చూసి అతడే నేను, నేనే అతడు కదా అనుకొని బిల్లు ఇవ్వకుండా బయటికి నడిచాడు. అతన్ని వెంబడించి పట్టుకొని న్యాయస్థానానికి తీసుకెళ్లారు.

'అయ్యా! అన్నీ నేనే, నేనేమీ కాను, మీరు నాతో వేదాంత పాఠాలు నేర్పించే క్లాసు కొచ్చుంటే ఇది అర్థమయ్యేది. ఈ కేసు జరిగేదే కాదు. నేను తింటానికి నాకు నేనే ఎందుకు డబ్బులిచ్చుకోవాలి'.

శంకరన్‌పిళ్ళై ఆ కేసుని తప్పుదారి పట్టించాలనుకుంటున్నాడని – న్యాయాధికారి అతనికి పది కొరడా దెబ్బలు ఇవ్వమని ఆదేశించాడు.



దెబ్బ తగలగానే శంకరన్‌పిళ్ళై నొప్పి వల్ల బాధపడ్డాడు. 'మీకు వేదాంతమే తెలీలేదు. చెయ్యని నేరానికి నన్నెందుకు కొడుతున్నారు' అని అడిగాడు.

వెంటనే న్యాయాధికారి 'నిన్నెందుకు కొట్టారు కొట్టేవాడు వేరు, నువ్వు వేరూనా. అతడే నువ్వు, నువ్వే అతడు కదా కనుక అతణ్ణి అతడే కొట్టుకుంటున్నాడు' అన్నాడు.

వెంటనే శంకరన్‌పిళ్ళై–

'నేను వేదాంతిని కాదు తిన్నదానికి డబ్బులు కట్టేస్తాను. ఈ కొరడా దెబ్బలు ఆపించండి' అన్నాడు.

ఇలా మనస్సును నిశ్చింతగా పెట్టుకోలేని వాళ్లందరూ తమ తెలివితేటలు, ఆలోచనలు, ఊహలు, చదివినవి, అర్థం చేసుకున్నవి, చేసుకోనివి అని మనస్సులోని వేరేవేరే స్థాయిల్ని ఒకటి కలుపుకొని ఆలోచనా అవగాహన లేకుండా అయిపోతుంటారు.

ఈ భూమి మీద భగవంతుడు 9 సార్లు అవతరించాడని చెప్తారు. అయితే మీ చుట్టు జాగ్రత్తగా పరికించి చూడండి. ఆయన రాకవల్ల ఏమైనా ఉపయోగాలు, మార్పులు జరిగాయా? ఎవరు వచ్చినా, పోయినా మాత్రం ఎదగడానికి తయారుగా లేనంతకాలం జీవితాన్ని ఎవరూ మార్చలేరు. మహాత్ముల రాకకు ముందే పూర్తి అవగాహనను, జ్ఞానాన్ని కల్గించలేదు. మీరు కావాలనుకుంటే మాత్రమే మార్పు ఏర్పడుతుంది.

మీ జీవితాన్ని మీరు జీవించడం సరిగానే వున్నా లాభమే తప్ప మీరు మారడానికి తయారుగా వున్నా పదోసారి భగవంతుడు అవతరించినా ఏ అర్థం లేకుండా పదివేలసార్లు మహాత్ములు వచ్చినా ఏ మార్పు జరగదు. అందుకే దేవుడికోసం ఎదురు చూడకండి. ఎవరి వేదాంతాన్ని అలాగే స్వీకరించండి.

మహాత్ముల గురించిన పుస్తకాలను ప్రోత్సాహకులుగా మాత్రమే వాడుకోండి. అదే మీ జ్ఞానంగా భావించి మనస్సుని మార్చుకోకండి. అక్కర్లేని చెత్తని మీరు మాత్రమే అక్కడ అవసరమైన సంపదని నింపుకొని తెలీదని అంగీకరించేటపుడే అహంకారం తొలగించుకోగలిగే అవకాశం ఏర్పడుతుంది.

## దేవుడు ఎలా వుంటాడు? ఆయన మీద పువ్వులు జల్లి పూజించినంత మాత్రాన మీ కోరికలు నెరవేరతాయా?

కళారంగానికి చెందిన ఒకరు నా దగ్గరకు వచ్చారు. "ధనవంతులైన ఒక వ్యక్తికి ఉండే గౌరవం, బ్రహ్మలా సృష్టి చేయగల కళాకారుడికి ఎందుకుండదు?" అంటూ చాలా బాధపడిపోతూ నన్ను అడిగాడు.

నిజానికి సృష్టి చేసే కళాకారుడెవరు? సృష్టి ఎప్పుడో కచ్చితంగా జరిగింది కదా! ఇక్కడున్నవాటినే ఇటూ అటూ మార్చి సర్ది ఏదో చేస్తున్నారే తప్ప మీరు నిజంగా సృష్టిస్తున్నదేం ఉంది? విజ్ఞానం గురించి మీరు ఒక కథను తెలుసుకోండి.

ఇప్పటికి యాభై ఏళ్ల తర్వాత ఓ రోజు ప్రపంచంలోని ప్రఖ్యాత విజ్ఞానవేత్తలందరూ భగవంతుడి ముందు కూడారు. "మరణాన్ని కొన్నాళ్లు ఆపగల మందులు కనుకొన్నాం. ప్రాణిని సృష్టించడం నేర్చుకున్నాం. తిండి, నీరు కావాల్సిన



మేరకు తయారు చేసుకున్నాం. ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతున్నా వెంటనే తెలుసుకోగల శక్తిని మేము సంపాదించుకున్నాం. దేవుడా! ఇప్పుడు నువ్వు చేసేవి అన్నీ మేం చేసుకుంటున్నాం. ఇంక నువ్వెందుకు? రిటైర్ అయిపోవచ్చు కదా!" అని అడిగారు.

భగవంతుడు నవ్వి, "దేన్నైనా ఒకదాన్ని సృష్టించి చూపించండి. నేను రిటైర్ అవుతాను" అన్నాడు. ఓ విజ్ఞానవేత్త తన పక్కనున్న బంకమట్టిని చేతిలోకి తీసుకుని, "దీన్ని ఒక ప్రాణిగా చేసి చూపించనా?" అని గర్వంగా తలపై కెత్తుకుని అడిగాడు.

"అది నేను ఇచ్చిన బంకమన్ను కదా! ముందు మీ బంకమన్నును మీరే స్వయంగా తయారు చేసుకుని చూపించండి" అన్నాడు దేవుడు.

విజ్ఞానవేత్తలందరూ తల దించుకున్నారు. ప్రకృతి ప్రసాదించిన దాన్ని ఆదిమానవుడు తన చేతనైనంత ఉపయోగించు కున్నాడు. ఆయుధాలు, మట్టి పాత్రలు చేయడం నేర్చుకున్నాడు. ఇళ్లు కట్టుకున్నాడు.

### దైవాన్ని ఎక్కడ దర్శించవచ్చు?

రవీంద్రనాథ్ ఠాగూర్ గొప్ప కవి. ప్రకృతిని గురించి, అందాన్ని గురించి, దైవాన్ని గురించి చాలా గొప్ప కవితలు రాశారు.

ఒకరోజు ఠాగూర్ దగ్గరకు అతని బంధువుల్లో ఒక ముసలాయన వచ్చి, "భాషమీద నీకున్న పట్టువల్ల మాటలు నీకు అసంకల్పితంగానే వచ్చిపడుతున్నాయి. అయితే, నువ్వు రాస్తున్న ఆ అనుభవాలు, అనుభూతులు నీకున్నాయా? నువ్వు పొందుతున్నావా?" అని అడిగాడు.

ఠాగూర్ జవాబివ్వలేక తలదించుకున్నాడు.

"అందుకు నువ్వింకా నీ జీవితాన్ని తీవ్రంగా జీవించడం నేర్చుకోవాలి" అని చెప్పి ఆ బంధువు నవ్వి వెళ్లిపోయారట.

వాన వెలసిన ఓ సాయంత్రం సూర్యాస్తమయం అందాన్ని చూడ్డానికి, ఠాగూర్ సముద్రతీరానికెళ్లారు. రోడ్డుమీద చిన్న గుంటల్లో మురికి నీళ్లు నిలిచి వుండటంతో జాగ్రత్తగా చూసుకుంటూ నడుస్తున్నారు ఠాగూర్.

చటుక్కున్న ఆశ్చర్యంతో నిలుచుండి పోయారు. సముద్రతీరంలో ఆయన చూడాలనుకున్న సూర్యాస్తమయం అక్కడ ఒఖ మురికిగుంటలో ప్రతిఫలిస్తోంది. ఠాగూర్ కళ్లల్లో ఉద్వేగం వల్ల కన్నీళ్లు చిప్పిల్లాయి.

ఆ క్షణంలో ప్రపంచానికి, సృష్టికి అర్థం తెలుసుకున్న సంతోషం ఆయన ముఖంలో వెల్లివిరిసింది. బంధువు ఇంటికి పరిగెత్తారు. ఠాగూర్‌ని చూడగానే ఆ బంధువుకు విషయం అర్థమైంది. "సత్యాన్ని నువ్వు దర్శించావు. అది నీ ముఖంలో అగుపిస్తోంది" అన్నారు.

ఇలా ప్రతిచిన్న విషయంలోనూ దైవత్వం దాగి ఉంటుంది. జీవితాన్ని సంపూర్ణంగా జీవించకపోవడంవల్ల మీరే దాన్ని గుర్తించడం లేదు.

మీరు? అదే ప్రకృతి ఇచ్చిన వేరే కొన్ని వస్తువుల ఆధారంగా అణ్వస్త్రాలు, అణువులు రాకెట్లు, శాటిలైట్లు తయారుచేస్తున్నారు. మీరు గుర్తించని ఉపయోగాల్ని మీ తర్వాతి తరంవారు గుర్తిస్తారు.

అంతే కదా!

భూమి తయారైన నాటినుండి గాలి ఉంది. ఎక్కడెక్కడో తేలిపోతున్న శబ్దాల్ని తనలో ఇముడ్చుకొని తరంగాలుగా అందించగల శక్తి ఆనాటినుంచీ పొందే ఉంది. ఆ శక్తిని గురించి దూరదర్శినిలో, సెల్‌ఫోన్‌లో తయారు చేసుకోడానికి మనిషికే కొన్ని కోట్ల సంవత్సరాలు కావాల్సి వచ్చింది.

ఉన్న వాటినే మీకు కావల్సిన వేరు వేరు విధాలుగా రూపుమార్చుకొని వాడుకుంటున్నారు. అంతే తప్ప, మీరు కొత్తగా ఏం సృష్టించారని గొప్పలు చెప్పుకోగలరు?

మీరు ఓ చిత్రకారులు కావచ్చు. రచయిత కావచ్చు. గాయకులు కావచ్చు. ఏ కళకు సంబంధించిన వారైనా కావచ్చు, మీరు చేసేది మొదట మీకు ఆనందాన్నివ్వాలి. అప్పుడే మీ చాకచక్యాన్ని మీకు నచ్చినట్లుగా వెలిబుచ్చగలరు. అలా వెలిబుచ్చేటప్పుడు మిగిలిన వాళ్లు సంతోషంగా ఉండడానికి మీరు తోడ్పడుతున్నారా?

భారంగా అణగదొక్కే బాధల్ని మర్చిపోయి, కొన్ని గంటలైనా వాళ్లు ఆనందంగా ఉండడానికి మీరు ఏ విధంగానైనా ఉపయోగపడు తున్నారా?

అదే చాలు కదా! మీరు గొప్ప సృష్టికర్త కళాకారుడు అనిపించు కునేకన్నా ఇది గొప్ప విషయం కదా! మీకన్నా మిగిలినవాళ్లు బాగా పేరు ప్రతిష్ఠలతో ఉంటే ఉండనివ్వండి. మిమ్మల్ని తక్కువ అంచనా వేస్తే వేయనివ్వండి.



మీది ఏ మతమైనా కానీ, మీ దేవుడు ఎలా ఉంటాడు? ఆయన మీద పువ్వులు జల్లి పూజించినంత మాత్రాన వెంటనే కోరికలు నెరవేరవు. ఆయన్ని పూజించనంత మాత్రాన మిమ్మల్ని దండించడు.

పొగిడినా తెగడినా లెక్క చేయకుండా, ఆయన చేయదలచుకున్నదాన్ని నూటికి నూరుపాళ్లు చేసుకుపోతుంటాడు. నిజంగా సృష్టికర్త అంటే అదీ! అదే అందం.

కళాకారుల జీవితమే కాదు, ఏ రంగంలో అడుగుపెట్టినా, మీకేకాక, చుట్టూ ఉన్నవాళ్లకూ ఆనందమయమైన పరిస్థితుల్ని తయారుచేయండి. ప్రేమను రంగరించి పూర్తి ఆసక్తితో మీ చాకచక్యాన్ని వెలిబుచ్చండి. పేరు, ప్రతిష్ఠలు తమంతట తామే మీ దరిచేరతాయి!

**నిజంగా భగవంతుణ్ణి మీకన్నా గొప్పవాడిగా అనుకుంటే,
మీరు అనుకున్నది జరగకపోయినా అంతా భగవంతుడి ఇష్ట ప్రకారమే
జరుగుతోంది' అని సంతోషపడాలి కదా!
కానీ మీరు అలా చేస్తున్నారా? చేయగలుగుతున్నారా?**

జీవితంలోని ప్రతి కోణాన్ని, సృష్టిలోని ప్రతి రహస్యాన్ని చాలా సునిశితంగా పరిశీలించిన సంస్కృతి మనదే! ఇలాంటిది మరొకటి లేదు. జీవితపు సంపూర్ణత్వాన్ని మూలాలదాకా గమనించి కూడా ప్రపంచంలో మనం విదూషకుల్లా (జోకర్ల) ఎందుకు మిగిలిపోయాం? దానికి కారణం ఏంటి?

జీవితంలో అత్యంత ఆధారభూతమైన భోజనానికి కూడా మనం మనల్ని నమ్మకుండా దేవుణ్ణి నమ్మడమే కారణం. ఈ లోకంలో తమకు కావాల్సిన వాటిని సంపాదించుకోవడానికి, వానపాము నుంచి పెద్ద ఏనుగుదాకా తమను తామే నమ్మి ఉన్నాయి. అవి ఎవరి సహాయాన్ని అర్థించవు.



వాటికన్నా చాలా తెలివైన మనిషిమాత్రం తనకు కావాల్సిన వాటికోసం దేవుణ్ణి ప్రార్థిస్తూ కూర్చుంటున్నాడు.

మీరు బతకడానికి మీకు ప్రసాదించబడ్డ కాళ్లూ, చేతులే చాలు! మీ శరీరాన్ని, మనస్సుని ఎలా శక్తివంతంగా బాగా ఉపయోగించుకోవాలో తెలుసుకుంటేనే చాలు. అది వదిలేసి, మీ బతుకు గడపడానికి కూడా దేవుణ్ణి తోడు పిలవడం ఎంతవరకు సబబో ఎప్పుడైనా ఆలోచించారా?

మీ రోజువారీ జీవితం గడపడానికి దేవుడు అక్కర్లేదు. ఎన్ని లక్షల గుళ్లు ఉన్నా, ఎటు చూసినా దుఃఖం గూడు కట్టుకున్న ముఖాలు ఎందుకు కన్పిస్తున్నాయి?

సత్యాన్ని, ఉపదేశాన్ని వేరువేరుగా అర్థం చేసుకోలేక మీరే తెచ్చిపెట్టుకొన్న గొడవే ఇది.

భగవంతుడు మీకంటే చాలా శక్తిమంతుడు. అతను లేకుండా అణువుకూడా చలించదంటారు. అయితే అతన్ని నమ్మి, మిమ్మల్ని నిజంగా అప్పగిస్తారా? లేదా? ఆయన తెలివితేటల మీద అనుమానంతో ప్రతిరోజూ ఆయన ముందు నిలుచుని ఆయనేం చేయాలో కూడా మీరే చెప్తారు కదా! కష్టపడకుండా తినాలి. చదవకుండా పరీక్షల్లో మంచి మార్కులు రావాలి, మీ దోషాలు గమనింపబడకుండా ఉండాలి. వీటికోసం భగవంతుణ్ణి మీకు తోడు రమ్మని కోరుకుంటారు.

జీవితం చటుక్కున తలక్రిందులైతే ఏం చేయాలో తెలీక భగవంతుణ్ణి ఒక ఇన్సూరెన్స్‌గా అనుకుంటారు. అందుకోసం ప్రతి గుడిలోనూ ప్రీమియం కడతారు. 'ఇవన్నీ తెచ్చిపెట్టు' 'వీటిల్లోంచి కాపాడు' అంటూ మీ సేవకుడిగా, మీ భద్రతాధికారిగా దేవుణ్ణి నియమించుకుంటున్నారు.

కేవలం బతుకు మీది భయమే దైవం మీద నమ్మకంగా మారితే మీకు దైవమూ దక్కదు, బతుకూ మిగలదు.

శంకరన్ పిళ్ళై దగ్గర ఒక పనివాడు ఉండేవాడు. ఒకసారి శంకరన్ పిళ్ళై ఉప్పు, పంచదార తెమ్మని అంగడికి పంపాడు. పనివాడు మొదట సంచినిండా చక్కెర కొన్నాడు. తర్వాత ఉప్పు కొనడానికి వెళ్లగానే, 'రెండింటినీ కలిపి తీసుకురాకు' అని పిళ్ళై చేసిన హెచ్చరిక గుర్తుకు వచ్చింది.

*జీవితంలో ఎదగాలంటే ఏం చేయాలి?*

*వ్యాపారం చేస్తున్నా, ఆధ్యాత్మిక పథంలో ఉన్నా, మీరేదన్నా కొత్తగా చేయాలని తలపెట్టినా, అందులో ఎంతో ఆసక్తి కనబరచాలి. ఇష్టంతో ప్రయత్నం చేయాలి.*

*చేపట్టిన పనిలో గెలుపు పొందాలంటే, మీ చాకచక్యాన్ని, శక్తిని పరిపూర్ణంగా కేంద్రీకరించాలి. అలవాటుపడిన పనే కదా అన్న భావనతో అశ్రద్ధ చేయడమో, తప్పనిసరనో చేయవద్దు.*

*ప్రతి క్షణం ఏదో కొత్త పని చేస్తున్నామన్న ఆసక్తితో చేయండి. మీ పూర్తి క్రియాశీలతను వెలువరించండి. ఆసక్తితో హృదయ పూర్వకంగా, శ్రద్ధగా చెయ్యండి. అప్పుడే మీ జీవితంలోని ప్రతి మెట్టునూ హాయిగా దాటుకుంటూ ముందుకు సాగిపోగల్గుతారు.*

సంచిని తలకిందులుగా తిప్పితే వేరొకటి అవుతుంది కదా అని తిప్పాడు. సంచిలోని పంచదారంతా మట్టిపాలయింది. సంచిలో ఉప్పు నింపుకొని వెళ్లాడు.

'ఉప్పు తెచ్చావు. చక్కెర ఏది?' అని అడిగాడు శంకరన్ పిళ్ళై. ఆ అతి తెలివోడు 'సంచిలో అటు వుంది' అంటూ మళ్లీ సంచిని తలక్రిందులు చేశాడు.

ఉప్పుకూడా మట్టిపాలయింది.

భయం, దైవం నమ్మకం ఇలాంటివే. రెండింటినీ మనస్సులో పెట్టుకొని కొట్టుమిట్టాడితే ఏదీ మిగలదు. దీనికి 'భక్తి' అనే పేరు పెట్టి మిమ్మల్ని మీరే మోసం చేసుకోకండి.

నిజంగా భగవంతుణ్ణి గొప్పవాడిగా అనుకుంటే, మీరు అనుకున్నది జరగకపోయినా 'అంతా భగవంతుడి ఇష్టప్రకారమే జరుగుతోంది' అని సంతోషపడాలి కదా! కానీ మీరు అలా సంతోషపడుతున్నారా? నిజానికి, ప్రార్థన పేరుతో జీవితాన్ని ఎలా నడిపించాలో భగవంతుడికి ఉత్తర్వులు జారీ చేస్తున్నాము. సందేహాలుండే మనస్సులో భక్తి నిలవదు. భగవంతుడి దగ్గర వినయం చూపిస్తున్నట్టు నటన మాత్రమే వస్తుంది. మీరు అనే ఆలోచన, గుర్తింపు లేకుండా, దేనితోనైనా మమేకమనుకునే స్థితి వచ్చినప్పుడే భక్తి నిరూపితమవుతుంది.

మీ తప్పుల్ని భరించడానికి, సహించడానికి మీ తోటి వారు తయారుగా లేనపుడు, భగవదేచ్ఛ అంటూ అన్నీ అతని మీదికి నెట్టేయడానికి తగిన తోడుగానే కదా భావిస్తున్నారు. అదిభక్తి ఎలా అవుతుంది?



మీ బతుకును, భగవంతుణ్ణి తోడు కోరకుండా బతకడాన్ని నేర్చుకుంటే, అలా పోరాటాన్ని సాగించగలిగితే మీ బతుకు గొప్పదవుతుంది. మీకు కావల్సిన తిండి మీకు దొరుకుతుంది. కావాల్సిన తోడు, పిల్లలు, అన్ని వసతులు లభిస్తాయి. అయినా, మనసు దేనికోసమో తపిస్తోంది కదా? దాని పేరేంటి?

ఈ సృష్టి మూలం ఏదో తెలుసుకోవాలన్న తపన అది, అది అప్పుడే తల ఎత్తుతోందని అర్థం. అదే నిజమైన ఆధ్యాత్మికత. అప్పుడే భగవంతుణ్ణి చూడడానికి మీరు నిజంగా తయారయ్యారని అర్థం. అంతవరకు ఆయన్ని తిట్టుకుంటూ కూర్చోకండి.. వదిలేయండి.

**సమాజంలో మంచివారని అనిపించుకోవాలన్న తపనలో తమ నైజాన్ని మార్చుకోవడానికో, దాచుకోవడానికో ప్రయత్నిస్తే ఏమవుతుంది?**

ఏది మంచి...? ఏది చెడు? దీన్ని నిర్ణయించగలిగింది మీ మనస్సు మాత్రమే. అయితే ఎవరు నిర్ణయిస్తున్నారు దీన్ని?

మీ మీద మీ కుటుంబం, చుట్టుపక్కల ఉన్నవాళ్లు ఎన్నో ఆశలు పెంచుకుంటున్నారు. అవన్నీ నెరవేర్చినపుడు మంచివారిగానూ, నెరవేర్చనపుడు చెడ్డవారిగానూ భావింపబడుతున్నారు.

జూదం ఆడటం తప్పని చిన్ననాటి నుంచే నేర్పి ఉంటే, దాన్ని గురించి మాటలాడడం కూడా నేరంగా తోస్తుంది. కానీ అదే పేకాట క్లబ్‌లో వెళ్లి కూర్చోగానే, ఆ ఆలోచన ఒక మాయలోపడ్డట్టు మరపుకు వస్తుంది. అక్కడ ఆడకపోతే బలహీనులుగా భావింపబడతారు.



దొంగతనం వృత్తికాగల కొందరు తమ పిల్లలకు చిన్నతనం నుంచే దొంగతనం చేయడం, కొల్లగొట్టడం నేర్పుతారు. ఆ పిల్లలు అలాగే పెరుగుతారు. అటువంటి చోట పెరిగినపుడు దొంగతనంలోని మెలకువలన్నీ కూడా నేర్చుకొన్నవాడే గట్టివాడు. మంచివాడు.

పెంపకంవల్ల, మళ్లీ మళ్లీ మంచి, చెడు అంటూ చెప్పించడంవల్ల మాత్రమే మంచి చెడు అంటూ విడదీసి చూడటం నేర్చుకొన్నారు. సమాజంలో మంచివారని అనిపించుకోవాలన్న తపనలో తమ నైజాన్ని మార్చుకోడానికో, దాచుకోడానికో ప్రయత్నిస్తే ఏమవుతుంది?

నిజానికి ఇలాగే జరిగింది. మంచిపనులు చేసేవాడు మాత్రమే స్వర్గానికి వెళతాడు అని అందరూ తెగ చెప్పడంతో శంకరన్ పిళ్ళై చాలా జాగ్రత్తగా జీవితాన్ని గడిపేవాడు. ఒకరోజు అతని జీవితకాలం పూర్తయింది. తర్వాతి సంఘటన స్వర్గద్వారంలో జరిగింది.

అతన్ని కాచుకుని కూర్చోమని అక్కడున్న దేవతలు కలిసి ఏదో చర్చించారు. తర్వాత అతని దగ్గరకు వచ్చారు. "ఒకే ఒక తప్పు చేసినవాడికి మొదటి అంతస్తు, రెండు చేస్తే రెండోది అంటూ స్వర్గంలో అంతస్తులు వున్నాయి. కానీ నీలా ఒక్క తప్పూ చేయనివాళ్లెవరూ ఈనాటి దాకా స్వర్గానికి రాలేదు" అన్నారు.

వాళ్ల మాటలకు శంకరన్ పిళ్ళై అదిరిపడ్డాడు. "మంచివాడిగా ఉన్నందువల్ల మా భూమిమీద నన్నెవరూ దగ్గర చేరనివ్వలేదు. ఇక్కడ కూడానా!" అన్నాడు.

"మూడు గంటలపాటు మీకు ప్రాణమిస్తాం. త్వరగా ఏదైనా ఒక తప్పు చేసిరండి" అన్నారు దేవతలు.

భూమి మీద శంకరన్ పిళ్ళై శరీరానికి మళ్లీ ప్రాణం వచ్చింది. తొందరగా చేయమంటే ఏ తప్పు చేయాలి? ఆలోచించాడు. పక్క వీధిలో ఉన్న ఓ వృద్ధకన్య అతన్ని చూసినపుడల్లా కళ్లతోనే పిలిచేది. భార్య ఉండగా మరొక స్త్రీని చూడటమే పాపమని ఆమెను పట్టించుకోకుండానే ఉండిపోయాడు. ఇప్పుడు అక్కడకు పరిగెత్తాడు.

"నీతో సంతోషంగా గడపాలనే వచ్చాను" అన్నాడు.

ఆమె ఆనందంగా అంగీకరించింది.

అంతా అయి బయలుదేరేటపుడు 'అమ్మయ్య! ఒక తప్పు చేసేశాను. స్వర్గంలో నాకు చోటుంది' అనుకుని శంకరన్ పిళ్ళై నిశ్చింత పొందాడు.

అయితే ఆమె ఆనందంగా అతని చేతులు పట్టుకుని "సంతోషం అంటే ఏంటో తెలియని ఆడదానికి మీరెంత గొప్ప ఆనందాన్నిచ్చారో తెలుసా" అంది.

స్వర్గద్వారం విసురుగా మూతబడ్డ చప్పుడు శంకరన్ పిళ్ళై చెవులకు ఇక్కడికే వినిపించింది.

మంచివాళ్లం అనుకునేవాళ్లు ఇలాగే ఇక్కడా సుఖపడకుండా, అక్కడా చోటు లేకుండా అయిపోతున్నారు. ప్రపంచంలో చాలా బాధలకు తాము మంచివాళ్లమని అనుకోవడమే కారణం. నిజానికి మంచిచెడులు ఏ పనిలోనూ లేవు. భావనలో ఉంటాయి.

రామకృష్ణ పరమహంసవారు మామూలుగా చెప్పే కథ ఒకటి గుర్తుకువస్తోంది. ప్రతివారం సెలవునాడు వేశ్యను కోరి వెళ్లే స్నేహితులు ఇద్దరుండేవారు. ఒకరోజు వాళ్ల ఊళ్లో భగవద్గీత మీద ఉపన్యాసం జరుగుతోంది. ఒకడు దానికి వెళ్లాలని నిశ్చయించుకున్నాడు.

మరొకడు ఎప్పటిలానే వేశ్య దగ్గరికెళ్లాడు.

ఉపన్యాసం వింటున్నవాడు ఒకటే మధనపడిపోతున్నాడు. 'మూర్ఖంగా ఇక్కడకు వచ్చి ఇరుక్కున్నానే, వాడక్కడ సంతోషంగా ఉంటాడే' అని.

అక్కడకు వెళ్లినవాడు 'ఛీ బతుకులో పైమెట్టు చేరడానికి భగవద్గీతలా మరేది ఉపయోగిస్తుంది. నా మిత్రుడిలా మనస్సును అరికట్టలేకపోయానే' అని బాధపడ్డాడు. వీళ్లల్లో మంచివాడెవరు? చెడ్డవాడెవరు?

గీత అంటే పుణ్యమని తన్ను తానే మోసం చేసుకొని, వేశ్యచింతలోనే ఉన్నవాడికన్నా, వేశ్యతో ఉన్నా భగవద్గీతనే ఆలోచించినవాడు మేలైనవాడు కదా!

వంచన, బాధ లేకుండా ప్రీతితో చేసే ఏ పనయినా మంచిదే. ఒక పులి జింకను వేటాడ్డానికి కారణం వంచన, క్రోధం కాదు. ఆకలివల్ల! అనవసరంగా ఒక వ్యక్తి మీద కోపం తెచ్చుకుని, విసుక్కుని బాధపెట్టడం అంతకన్నా క్రూరమైన పని కదూ! ఎదుటివారి దగ్గర మంచివాళ్లని అనిపించుకోడానికి ప్రయత్నించడం వదిలిపెట్టి, నిజంగా మీకు మీరు మంచివారుగా బతకండి.



## మీ గురించి మీకు తెలుసా?
## మీ చాకచక్యపు వేగం గురించి మీకు ఏమైనా తెలుసా?

చాకచక్యం గల వాళ్లెందరినో మీరు చూసి ఉండవచ్చు. వారు చూస్తూండగానే ఎదిగిపోతారు. చటుక్కున ఓ చోట స్థిరంగా నిలబడిపోతారు. ఆ తరువాత వాళ్లనుంచి ఏమీ ఎదురు చూడలేం! ఎందుకు? ఆ తర్వాత కూడా ఎదగాలన్న కోరిక వాళ్లకి ఉండదా? ఉంటుంది. అయినా, దక్కింది మళ్లీ పోతుందేమోనన్న బెంగతో గట్టిగా దాన్నే పట్టుకుని వేలాడతారు. ఇంక ఎదుగుదల ఎలా వస్తుంది?

మట్టిగోలెంలో వేళ్లతో నాటిన మొక్కను కొనుక్కొస్తారు. జాగ్రత్తగా నీడలో పెట్టి మరీ పెంచుకుంటారు. ఆ గోలెంలో మొక్క ఒక స్థాయివరకు వేగంగా పెరుగుతుంది. తర్వాత తగిన చోటులేక ఎదిగేదారిలేక దాని ఎదుగుదల ఆగిపోతుంది. అదే మొక్కను తెచ్చిన వెంటనే భూమి మీద నాటుంటే, అది ఒక పెద్ద మానుగా పెరిగి వుండేది. మిమ్మల్ని అన్ని దిశలా విశాలంగా వ్యాపింపజేసే విధంగా వుంటుంది.

మీ బతుకూ అలాంటిదే! కనుక మీలో భగభగమండే మంటలా మండుతూనే ఉంటుంది. ఇప్పుడు ఉన్న మంటల్లో పడి కొట్టుకోడానికి మీరు భయపడుతున్నారు. మీ జీవితంలో ఎదగలేక తత్తరపడు తున్నారు.

మీ చుట్టూ మీరే అల్లుకుపోతే ఎదుగుదల ఎలా సాధ్యమవుతుంది.

ఒక రాజును వెతుక్కుంటూ ఒకాయన అప్పుడప్పుడు వచ్చేవాడు. వాడికి రాచ నగరులో అడిగిన ధనాన్నిచ్చి పంపేవాడు రాజు. ప్రధానమంత్రి, రాజును మెల్లగా అడిగాడు... "రాజా! మీరిచ్చే డబ్బును ఇతడు చెడు స్నేహాలతో అనవసరంగా అతిగా ఖర్చు చేస్తున్నాడు. మీరెందుకు మళ్లీ మళ్లీ డబ్బిస్తారు?"

"మంత్రీ! నేను పుట్టినపుడే మా అమ్మ చనిపోయింది. అంతఃపురంలో పనిచేస్తున్న వీళ్ల అమ్మే ఇతనితోపాటు నాకూ పాలిచ్చి పెంచింది. అందువల్ల ఇతన్ని నా సోదరుడిగానే భావిస్తున్నాను" అని వివరించాడు.

ఆ తర్వాత ఒకసారి ఆ మూర్ఖుడు వచ్చినప్పుడు ఒక పిచ్చి కోరిక కోరాడు. "నీ చుట్టూ బుద్ధిమంతులు ఎక్కువగా వుండటంవల్లనే కదా నువ్వింత బాగున్నావ్? నీ మంత్రి నాతో ఉంటే నేనూ రాజ్యాన్ని ఏలగలను. అతన్ని నాతో పంపు" అని రాజును అడిగాడు.

రాజుగారు ఏం చేయాలో తెలీక తికమకపడ్డాడు.

"రాజా! మీతో పాలు తాగి పెరిగిన మీ సోదరుడికి తోడుగా నాతో పాలుతాగి పెరిగిన నా సోదరుణ్ణి పంపుతాను" అన్నాడు మంత్రి. సరే అన్నాడు రాజు.

మర్నాడు మంత్రి రాజసభకు ఒక దున్నపోతును తాడుపట్టి లాక్కొన్నాడు. అందరూ నవ్వారు. "ఎందుకు నవ్వుతున్నారు? వీడూ నేనూ ఒక గేదెపాలు తాగి పెరిగాం. అందువల్ల రాజుగారి సోదరుడికి మంత్రిగా నా ఈ సోదరుణ్ణి పంపుతున్నాను" అన్నాడు.

ఒకేతల్లి పాలు తాగినంత మాత్రాన అంతా ఒకటైపోరు. మన శక్తి, బుద్ధి, ఆలోచనలు, వాటి ఆచరణ మార్గాలూ మొదలైన వాటిని బట్టే కదా మనం ఎదిగేది!

మామూలుగా మీ స్నేహితుల్ని కలుసుకొనేటప్పుడు ఏమేం మాట్లాడతారు? బడ్జెట్‌లో ఏ పన్నులు అదనంగా వేయాలి... ఏఏ రాజకీయ పార్టీలు ఏకమైతే ఎన్నికల్లో



గెలుస్తాయి. పరిపాలన ఎలా జరగాలి అనే విషయాలన్నీ మాట్లాడతారు. ముషారఫ్, జార్జ్‌బుష్, బిన్ లాడెన్‌ల గురించి చర్చిస్తారు. ఇలా ప్రపంచంలోని విషయాలన్నీ వేళ్లకొనల్లో పెట్టుకొని మరీ మాట్లాడతారు కదా! వాటిని అలా వుంచితే మీ గురించి మీకు తెలుసా! మీ చాకచక్యపు వేగం గురించి మీకు తెలుసా?

**ఓడినప్పుడల్లా కుంగినట్లుగా అన్పిస్తుంది ఎదుకు?**

*"కదలి లోతుల్లో కుంగిపోయాక అంతకంటే కిందికి చేరలేంకదా! అక్కణ్ణించి పైకిమాత్రమే కదా రావాలి! అంటే ఓటమి తర్వాతి స్థానం గెలుపుది అన్నమాటే కదా!*

*ఓటమికి భయపడి అక్కడ స్థిరంగా నిలపడిపోక, ఒక్క ఊపుతో పైకెగసి గెలుపును ఎలా సాధించడం అని ఆలోచించండి.*

*మనస్సు మహత్తరమైన శక్తిగల ఒక గొప్ప ఆయుధం. శరీరం సాధించలేని ఎన్నింటినో మనస్సు మౌనంగా సాధించి చూపిస్తుంది.*

*ధైర్యంతో, జాగ్రత్తగా, ఎడతెగని కృషితో, చాకచక్యాన్ని, సామర్థ్యాన్ని అంతా ఏకీకృతం చేసి, ఆసక్తిగా ఏ పనైనాసరే చేసి చూడండి. గెలుపు మీ సొంతం అవుతుంది.*

కళ్లజోడు పెట్టుకొనే వాళ్లకు మొదటిసారిగా అది పెట్టుకునేటప్పుడు, అదొక అదనపు భారంగా అనిపిస్తుంది. అలవాటయ్యాక దాన్ని గురించిన ఆలోచనే రాదు. దాన్ని గురించి పట్టించుకోకపోయినా అది తన పని చక్కగా చేస్తూ పోతుంది. అలాటిదే మీ చాకచక్యం. 24 గంటలూ దాన్ని వాడిగా, వేడిగా ఉండేలా ముందు ఒక అలవాటు చేసుకోండి! ఆ అలవాటు మీ సహజగుణంగా మారిపోతుంది. మరింకేం, ఏ సందర్భంలోనూ అది వెంటనే మీకు అందుబాటులో వుంటుంది.

రోడ్డు మీద బండి నడిపేటప్పుడు మీ ధ్యాసంతా దాని మీదే ఉంటుంది. బాగా అలవాటయ్యాక ఆ ఆదుర్దా, భయంలేకుండా హాయిగా బండిని నడుపుతారు కదా! అలాగే! మోటారు వాహనాల పరిశ్రమలో గొప్ప విజయం సాధించిన హెన్రీ ఫోర్డు గురించి తెలుసుకదా!

"మీరు చాలా గొప్పవారు" అంటూ పొగిడినపుడు, ఆయన వాళ్లతో ఏమన్నారో తెలుసా!

"గొప్పతనమా! నా తలకాయా! మీకున్న తెలివితేటలే నాకూ ఉన్నాయి. ఏమాత్రం అలుపులేకుండా పాటుపడటంవల్ల, నేను దీన్ని సాధించాను. అంతే"

గిడ్డంగిలో చేర్చి పెట్టిన ధాన్యం వినియోగింపబడితే తప్ప ఎవరికీ పనికిరాదు. ఉత్త పుణ్యానికి మగ్గిపోయి ముక్కవాసనొచ్చి చివరికి పారేయాల్సి వస్తుంది.

చాకచక్యాన్ని మూటగట్టి పెట్టకండి. వాటిని సకాలంలో బయటకు తీసి వాడుతూ ఉంటేనే మంచిది.

కొత్త మార్పుల్ని ధైర్యంగా ఎదుర్కోగలిగితేనే, మీ చాకచక్యం, శక్తి పూర్తిగా వికసిస్తాయి. అవి మిమ్మల్ని పైపైకి తీసుకుపోతూనే ఉంటాయి.



## **మీరు** తప్పు ఒప్పుకోకుండా అదే సరైనదని వాదిస్తూ వుంటారా? అది ఎంత అపాయకరమైనదో మీకు తెలుసా?

మనిషన్నాక తప్పుచేయడం సహజం. అయితే, తప్పని తెలిశాక ఆ తప్పును ఒప్పుకుంటున్నారా లేదా అన్నదే, మిమ్మల్ని ఎదుటివాళ్లకన్నా వేరు అని చాటి చెబుతుంది. చేసింది తప్పా, కాదా అన్నది కాదు దాన్ని ఒప్పుకోవడమూ అన్న అహంకారం మాత్రమే ఈ గొడవలన్నిటికీ కారణం.

చిన్నప్పుడు ఎంత ఒదిగి ఉండేవారు? మిమ్మల్ని కొట్టినా ఏ ద్వేషం పెట్టుకోకుండా మళ్లీ వెళ్లి వాళ్ల దగ్గరకే చేరేవారు... అప్పటి ఆ ఆనందం ఎలా ఉండేది? మీరు పెరిగేకొద్దీ మీ మనసు, శరీరం రెండూ బిరుసెక్కిపోతాయి.

సమాజంలో మీకంటూ ఒక స్థానాన్ని, గుర్తింపును ఏర్పరచు కున్నారు. వాటిని దక్కించుకునే తపనలో మీ నిజాయితీని బలి పెట్టేశారు. అందువల్లే తప్పును అంగీకరించే అతి ప్రాథమిక విషయాన్ని వదిలిపెట్టారు.

“క్షమించు! తెలీకుండా పొరపాటున జరిగింది! చూసుకోకుండా అలా చేశాను! అనుకోకుండా అయింది! మరోసారి జరగకుండా చూసుకుంటాను” అని వినయంగా మాటలాడితే ఏం తగ్గిపోతారు? తప్పని తెలిశాక దాన్ని ఒప్పుకోకుండా అదే సరైనదని వాదించడమే పెద్దతప్పు.

ఒకసారి శంకరన్‌పిళ్ళై పక్కవాళ్లతోటలో దోర మాగిన పళ్లు కొమ్మలకు వేలాడటం చూశాడు. ఒక గోనెసంచి తెచ్చాడు. చెట్టు పళ్లనుకోశాడు. గోనెసంచీలో నింపుకున్నాడు. కంచె దాటబోతూ తోటమాలికి చిక్కాడు.

“ఎవరి అనుమతితో కోశావ్?”

“నేను కొయ్యలేదే! పెద్ద గాలివీస్తే అవే రాలి కింద పడిపోయాయి” అన్నాడు శంకరన్‌పిళ్ళై.

“మరదే నిజమైతే గోనెనెందుకు తెచ్చావ్?”

“ఓ... ఇదా? గాల్లో ఎక్కడి నుంచో ఎగిరొచ్చిపడింది”

“గాలికే పంళ్లు రాలి ఉండవచ్చు... గోనె కూడా ఎగిరి వచ్చి ఉండవచ్చు. కానీ, గోనెలో పళ్లు ఏరి నింపిందెవరు?” అంటూ ఆ కాపు కోపగించాడు.

“అదే నాకూ ఆశ్చర్యంగా ఉంది” అన్నాడు పిళ్ళై.

తప్పు చేసేవాళ్లు పిళ్ళైలాగే దొరికిపోయినా, తప్పు ఒప్పుకోకుండా అదే సరైనదని వాదిస్తూనే ఉంటారు. ఈ మనస్తత్వం చాలా అపాయకరమైంది!

స్నేహితులతో, సహోద్యోగులతో, పై అధికార్లతో, మీ దగ్గర పనిచేసేవాళ్లతో, ముందు, వెనుక ఏమాత్రం పరిచయం లేనివాళ్లతో నీ నా అనే భేదం చూడకండి. మీరు ఎలాంటి తప్పు చేసినా, దాన్ని నిజాయతీగా ఒప్పుకోండి. అందువల్ల మీకు మర్యాద కూడుతుంది.



బస్సులో ఒకడు పక్కవాడి కాలు గట్టిగా తొక్కాడు. తర్వాత ‘గమనించ లేదు’ అని కాలు వెనక్కి తీసుకున్నాడు. కాలు తొక్కినందువల్ల ఏర్పడ్డ నొప్పి భరిస్తున్న తను మాత్రం, “ఓ కాలా! అతను కారణం చెప్పాడు కదా? ఇంకా ఎందుకే నొప్పిచేస్తావ్?” అని అడిగాడట.

చూసి తొక్కినా, చూడకుండా తొక్కినా నొప్పి, నొప్పే కదా! క్షమార్పణ కోరడం మానేసి, ‘కావాలనే తొక్కాను’ అంటూ గొడవకు దిగడం ఏం బాగుంటుంది? అదేం న్యాయం? మన నిత్యజీవితంలో జాగరూకత లేకపోవడమే ఒక తప్పని తెలుసుకోకపోతే ఎలా?

జాగ్రత్త లేకపోవడం వల్ల అదే బాధను మరో వందమందికి కల్పించే అవకాశం ఉంది కదా!

జాగ్రత్త లేకుండా ఒకసారి తప్పుచేయవచ్చు. కానీ, తప్పును గురించిన ప్రజ్ఞేలేకుండా ఉంటే అది ఎదుగుదలకు గొప్ప అడ్డంకి అవుతుంది.

కొందరు మీ చిన్న తప్పును కూడా భూతద్దంలో చూడవచ్చు. చూస్తూ పోనీండి. మీరు క్షమార్పణలు అడగగానే యుద్ధం ముగిసిపోయింది. మిమ్మల్ని తప్పుపట్టిన వారు కదా ఆ తప్పులభారాన్ని మోస్తారు.

### ఎదుటివాళ్లపట్ల వినయం చూపడం బలహీనమేనా?

వినయం అవమానం కాదు... చాలా మృదువైన గౌరవం. కోవైలోని చెరసాలలో నేను ఉపన్యాసాన్నివ్వడానికి వెళ్లినపుడు, ఒక హంతకుణ్ణి చూపించారు. ‘చెరసాల్లో అతనే దాదా! పక్కవాళ్ల భోజనాన్ని కూడా లాక్కుంటాడు, తింటాడు. ఎదిరించినవాళ్ల కాళ్లు, చేతులు విరిచేస్తాడు’ అని చెప్పారు.

ఏమాత్రం ఇష్టంలేకపోయినా ఉపన్యాసానికి వచ్చాడు. అయితే, ఒక వారంలోపు అతను మొత్తం కరిగి నీరయిపోయాడు. ఆ తర్వాత చెరసాల్లో ఏదో దెబ్బలాట జరిగింది. అతడు తన బలాన్ని నిరూపించుకోగల స్థితిలో ఉన్నా మౌనంగా ఉన్నాడు. చిన్న చిన్న దెబ్బలతో నా ఎదుటకు వచ్చి నిలబడ్డాడు.

“ఇన్నాళ్లు ఎదిరించిన వాళ్లందరినీ చితక్కొట్టాను. అప్పుడంతా నాకన్నా బలవంతుడు ఎవడైనా వస్తాడేమోనని భయంగా ఉండేది. ఇవ్వాళ నేను ఎదిరించకుండా మౌనంగావున్నా, ముందుకన్నా శక్తిమంతుణ్ణి అన్పిస్తోంది” అన్నాడు. వినయం బలహీనం కాదు... అదే బలం! అంతేగాని మీ బలాన్ని నిరూపించు కోవాలనుకోవడమే బలహీనత!

అర్థం చేసుకోండి ఇది తలవంపో, ఓటమోకాదు! మీ మనసు పరిపక్వ మయిందనడానికి ఓ ఉదాహరణ.

వ్యాపారంలోనైనా, ఆటల్లో పాల్గొన్నా మీ తప్పును మీరు అంగీకరించినపుడే గెలుపుకు దగ్గరవుతారు. అలా ఒప్పుకోనంత వరకు, మనసులో శిలువలా ఆ అపరాధ భారాన్ని మీరు మోయాల్సి వస్తుంది.

తప్పు ఒప్పుకోవడమన్నది, శత్రువుల్ని మిత్రులుగా మార్చగల బలాన్నిస్తుంది. అది ఎదిరించి ఓడించలేని బలం. మిమ్మల్ని మరింత ఎత్తుకు చేర్చేబలం.



## గెలుపుకోసం అడ్డదారులు వెదకడం మానలేరా? మీ శక్తిని పూర్తిగా వినియోగిస్తే గెలుపు మీ సొంతం కాదా?

ఇటీవల నేను ఓ కాలేజీకి వెళ్లినపుడు “గెలుపుకు దగ్గరదారి ఏది?” అని కొందరు విద్యార్థులు అడిగారు. దగ్గరదారి గురించిన ఆలోచన ఎందుకు వచ్చింది? కోరుకున్నది పొందే విషయంలో యువత ఓర్పులేకుండా ఎందుకిలా తపిస్తున్నారు? అన్నది ప్రశ్న.

లోకాన్ని చూడాలన్న కోరికతో కారు ఎక్కుతున్నారనుకోండి. పెట్రోల్ ఉన్నంతవరకే కదా పరిగెడుతుంది? ఆ తరువాత కారు ఆగిపోతుంది కదా!

అలాగే మీ కోరికలు కూడా! మీ శక్తి ఎంతో, అంత వరకే కదా మీరు కోరినవేవైనా పొందగలరు.

ఒక పడుచు పిల్లకు ధనవంతు రాలైపోవాలని ఆశ. ఇది తెలిసిన ఓ యువకుడు "గంటలో పదివేలు సంపాదించుకోవాలని వుందా?"అని అడుగుతాడు.

ఆమె ఆశ్చర్యంగా 'అవును' అంది సందేహించకుండా.

"నాకు ఒక డజను ముద్దులు పెడితే నీకు పదిలేల రూపాయలు ఇస్తాను" అన్నాడు.

ఆమె ఆలోచించింది. ముద్దులే కదా ఏం పోతుందిలే అనుకొని ఒప్పుకుంది. అతణ్ణి ఓ గదిలోకి తీసుకెళ్లింది. తలుపు వేసింది. అతనికి ముద్దు పెట్టింది.

"భయంగా ఉంది" అన్నాడతను.

ఎక్కడ అతను వెనక్కి పోతాడో అని భయంపట్టుకున్న ఆమె "ఇందులో భయానికేం ఉంది? రా!" అంది.

ఆమె ఒక్కొక్క ముద్దూ పెట్టను అతడు భయం గురించి మాట్లాడటం, ఆమె సర్ది చెప్పడం జరుగుతూనే ఉంది. పన్నెండవ ముద్దు పెట్టగానే, "ఇప్పుడు నా భయం మరింత ఎక్కువయింది" అన్నాడతను.

"మన ఒప్పందం పూర్తయింది. నువ్వు డబ్బు ఇవ్వాలి. ఆ తర్వాత నువ్వుఎవరో, నేను ఎవరో! ఇంక భయం ఎందుకు?" అని ఆశ్చర్యంగా అడిగింది.

"నీకు ఇస్తానన్న పదివేల రూపాయలు ఎలా సంపాదించాలా అని భయంగా ఉంది" అన్నాడతను.

దగ్గరదారి వెతుక్కుంటే ఇలాంటి బాధలు తప్పవు.

అసలు గెలుపు మీద ఆశ ఎందుకు? అది గొప్ప ఉత్సాహాన్ని ఇస్తుందనేకదా! దాంతోపాటు గెలుపువైపుకు వెళ్లే దారికూడా ఉత్సాహవంతంగా ఉంటే, గెలుపుకుముందే ఆ ఉత్సాహాన్ని అనుభవించవచ్చు కదా? దగ్గరిదారి మీద ఆశతో దాన్నెందుకు పోగొట్టుకుంటారు?

కొబ్బరి పిలక నాటి అక్కడే కూర్చుని 'కొబ్బరికాయ, కొబ్బరికాయ' అని కేకలేస్తే కాయలు వస్తాయా?

ముందుగా ఆ కొబ్బరిచెట్టు పెరగడానికి చేతనయినదంతా చేయండి. ఆ చెట్టు చక్కగా, ఏపుగా పెరిగాక మీరు వద్దన్నా కొబ్బరికాయలు విరగకాస్తుంది.



శంకరన్‌పిళ్ళై దగ్గర ఒక చారియట్ బండి ఉండేది. ఒకరోజు ఇంట్లో పెరుగుతున్న పిల్లిపిల్లను లాక్కొచ్చి, ఆ చారియట్‌కి కట్టాడు. "లాగు, లాగు" అని పిల్లిపిల్లను తరిమాడు. జాటీతో కొట్టాడు. అది చూసి ఇరుగుపొరుగు వాళ్లు "ఇదేం మూర్ఖత్వం" అన్నారు.

"పెద్ద రథాల్ని గుర్రాలు లాగుతున్నాయే?" అన్నాడు.

"ఇది పిల్లి? మీరు గుర్రాన్ని వాడితే మంచిది!" అన్నారు.

"పిల్లి ఉండగా గుర్రం ఎందుకని అమ్మేశాను. అయినా, ఆ గుర్రాన్ని కొట్టడానికి నేను వాడే జాటీ ఇదే!" అన్నాడు.

మీ శక్తిని పూర్తిగా వినియోగిస్తే గెలుపు మీ స్వంతమవుతుంది. అలాంటిదానికి దగ్గరిదారి ఎందుకు? ఆ ఆశ రథానికి పిల్లిపిల్లను కట్టడం లాంటిదే కదా?

**ఎప్పుడూ సంతోషంగా వుండడానికి దారి ఏది?**

*అరటిపండు తొక్కమీద కాలువేసి జారిపడ్డారు ఎవరో. అంతా నవ్వారు. అదేచోట మీరు జారిపడ్డారు. బాధపడతారు.*

*ఒకటే చర్య. ఆనందం, దుఃఖం ఎవరిచేతుల్లో ఉన్నాయి? మీ చేతిలోనే కదా!*

*మామూలుగా, మీ మనసులో సంతోషాన్నిచ్చే ఆలోచనల కన్నా, బాధనిచ్చేవే గుర్తుంటాయి. బాధ ఉన్నక్షణాల్నే మళ్లీ మళ్లీ ఎందుకు నెమరువేసుకుంటున్నారు? పనికి వెళ్లినప్పుడు, కాళాశాలలో పాఠాల బరువుతో కాలం గడిపిన రోజులు, కళాశాలలో వుంటే, బళ్లో మాష్టారు దగ్గర దెబ్బలు తిన్న సంఘటనలు...*

*ఎందుకు ఎప్పుడూ జరిగినదాన్నే ఆలోచిస్తూ ఈ క్షణాన్ని గుర్తించడం మర్చిపోతున్నారు. ఒక్కొక్కక్షణాన్ని గుర్తించి అనుభవించగలిగితే, ప్రతిక్షణం సంతోషమే కదా?*

గెలుపుకు సరైన అర్థం తెలుసుకుంటే దగ్గరిదారి గురించి ఆలోచించరు. కొండకొమ్మకు ప్రయాణం మొదలుపెడతారు. మెత్తటిగడ్డి, గలగలపారే సెలయేరు, విరగపూసిన రంగురంగుల పూలు, వింతపక్షులు... మీ దారిలో ఆనందాన్నివ్వడానికి సిద్ధంగా వున్నాయి.

ఎక్కడో దూరంగా ఉన్న కొండకొమ్మ ధ్యాసలో నడిస్తే వంద అడుగులు పడేసరికి మీరు అలసిపోతారు. అలాగాక చేసే పనిని ఆనందంగా చేస్తే చుట్టూవున్న ఆనందాలతో పాటు విజయమూ మీ సొంతమవుతుంది.

## పనిలేనప్పుడు పనిదొరకడం లేదని బాధపడతారు. దొరికిన తర్వాత సంతోషపడటం మానేసి గాభరాపడతారెందుకు?

ఇప్పుడు అమెరికాలో ఎక్కువగా విన్పిస్తున్న పదాలు రెండు. ఒకటి ఒత్తిడి. మేనేజ్‌మెంటు రెండు నిర్వాహకాన్ని గురించి చెప్పే ప్రతిచోటా మానసిక ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలో నేర్పించడానికి కొందరు మనస్తత్వ శాస్త్రవేత్తలు బయలుదేరారు.

మీ వ్యాపారాన్ని, కుటుంబాన్ని, సంపదను ఎలా నిర్వహించుకోవాలనేది నేర్చుకోవాలని కోరుకోవడంలో అర్థం ఉంది. అయితే మానసిక ఒత్తిడిని వదిలివేయాల్సిన విషయం కదా! దాన్ని మీలోనే దాచుకొని ఎలా నిర్వహించాలో నేర్చుకోవడం అంత అవసరమా?

ఈ నవీన జీవన విధానంలో మానసిక ఒత్తిడి వదిలించుకోలేనిదై కూర్చుంది. కారణం, ఎదుగుదలను డబ్బుతో లెక్కకట్టడం వల్ల వచ్చిన చిక్కు ఇది.



జీవితంలోని చాలా ముఖ్యమైన ఎన్నో విషయాలను పక్కకుపెట్టి, డబ్బే మనిషిని ఆక్రమించుకోవడం వల్ల ఏర్పడ్డ కష్టం ఇది. నిర్వాహకం అంటే, దాన్ని డబ్బుతో ముడిపెట్టడంవల్ల ఏర్పడ్డ చింత ఇది.

ఎవరు గొప్ప నిర్వాహకుడు అన్పించుకోగలడు?

ఒక వాహనాన్ని సరిగా నడపడం మీకు వస్తేనేకదా దాన్ని మీరు మరొకళ్లకు నేర్పించగలరు?

శంకరన్‌పిళ్ళై తన కొడుకును పిలిచి, “నువ్వు మేజరవుతున్నావు. నా తర్వాత నిర్వాహకం నువ్వు చూసుకోవాలి. ఒక్కొక్కటిగా అన్నీ నేర్చుకో!” అన్నాడు.

ఆరోజు సాయంత్రం కొడుకును క్లబ్‌కు తీసుకుని వెళ్లాడు. అక్కడందరూ మత్తుపానీయాలూ తాగుతున్నారు. శంకరన్‌పిళ్ళై తానూ ఒక గ్లాసు అందుకున్నాడు. “నువ్వుతీసుకో” అన్నాడు కొడుకుతో.

ఒక గ్లాసు అతనికి ఇస్తూ, కొందరిని పరిచయం చేశాడు. “పెద్దమనుషులవల్ల అవ్వాల్సిన పనులు జరిగే చోటు ఇదే! మిగిలినవాళ్లను బాగా తాగనీ, నువ్వు నీ స్థిమితం కోల్పోయేలోపు ఆపేయి” అన్నాడు.

అంతకుముందు ఎప్పుడూ తాగకపోవడంవల్ల ఆ అబ్బాయి కాస్త తడబడ్డాడు. శంకరన్‌పిళ్ళై మాత్రం గ్లాసు తర్వాత గ్లాసు లాగించేస్తున్నాడు.

కొంత సేపయ్యాక కొడుకు అతణ్ణి ఆపాడు.

“నాన్నా...”

“ఏంటిరా?”

“స్థిమితం కోల్పోయానని తెలుసుకోవడం ఎలా?”

శంకరన్‌పిళ్ళై పక్కనున్న బల్లకేసి చూపించాడు. ‘అక్కడ కూర్చున్న నలుగురూ నీకు ఎనిమిదిమందిలా కన్పిస్తే ఆపెయ్యి, ఆ తర్వాత అడిగాడు. “అయితే, నాన్నా అక్కడ ఇద్దరేకదా ఉన్నారు” అని.

శంకరన్‌పిళ్ళై నిర్వాహకశక్తి ఎంతటిదో ఊహించండి. మిగిలినవారిని పాలించడం చేతకావాలంటే మిమ్మల్ని మీరు నిగ్రహించుకోవడం కదా మొదట

**ఏం చేస్తే ఆనందం లభిస్తుంది?**

*యాభై, అరవై సంవత్సరాల క్రితం ఒక కారును స్టార్ట్ చేయాలంటే తొయ్యడానికి ఇద్దరు పనివాళ్లు కావాల్సి ఉండేది.*

*ఆ తర్వాత ముందు భాగంలో ఒక ఇనుప కమ్మీ పెట్టి తిప్పడానికి ఒకడుంటే చాలనే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఎవరితోడూ లేకుండా బ్యాటరీ సహాయంతో బండి నడిపేలా కారు తయారీ ముందంజ వేసింది. అయితే, కారు మీద చూపించిన శ్రద్ధ, మనిషి తనమీద తాను చూపడం లేదు.*

*మనిషి సంతోషపడాలంటే దానికి కావల్సిన 'సెల్ఫ్‌స్టార్ట్' అతని దగ్గరలేదు. బంగళా, బిడ్డలు, ప్రమోషన్, బిజినెస్ అంటూ ఏదో ఒక ఊత బయటనుంచి అతనికి కావాలి. అవన్నీ లభించినా, మరోవిధంగా మానసిక ఒత్తిడి ఎక్కువవుతోంది.*

*జీవితంలో ఆనందం ఏం చేస్తున్నారన్న దాన్నిబట్టి ఉండదు. చేస్తున్న పనిని ఎంత ఇష్టంగా చేస్తున్నారన్న దాంట్లో ఉంటుంది. ఏ పనినైనా ఇష్టంగా, పరిపూర్ణమైన శ్రద్ధతో చేయండి. తప్పక ఆనందం లభిస్తుంది.*

నేర్చుకోవాలి. అది మీకు బాగా తెలిసుండాలి కదా?

మీ శరీరం, మనస్సు, భావోద్వేగాల్ని చాకచక్యంగా మీ చెప్పుచేతల్లో ఉంచుకోగలిగితే ఆ తర్వాత, మీరు ఇతరులకు ఎలా ఉండాలో చెప్పవచ్చు.

కొంతమంది పనిలేనప్పుడు, పనిదొరకడం లేదని బాధపడతారు. తీరా పని దొరికాక సంతోషపడటం మానేసి గాభరాపడి రక్తపోటు తెచ్చుకుంటారు.

మంచి పదవి దక్కేదాకా దానికోసమే పోరాడుతారు. ఇప్పుడేమో ప్రతినిమిషం టెన్షన్ అంటారు. ఇంకా పెద్ద పదవివస్తే ఏం చేస్తారు? "ముందే నిశ్చింతంగా ఉండేవాణ్ణి, ఇప్పుడు నిశ్చింత పోయింది" అంటారు. జీవితాన్ని పోగొట్టుకొని వసతుల్ని పెంచుకోవడం, చచ్చిపోయిన చిలుకకు బంగారు పంజరం చేయించినట్టు కదా!

ఓటమివల్ల వచ్చేబాధకైనా అర్థం చెప్పవచ్చు. అయితే, గెలుపు మీరు చెమటోడ్చి, కష్టపడి పోరాడికదా సంపాదించుకున్నారు? ఆ గెలువువల్ల కూడా బాధ కలిగితే మీలో అసలుకే ఏదో గొడవ ఉందనికదా అర్థం.

మీరు చేయలేనిదాన్ని ఎందుకు కోరుకుంటున్నారు? మీరు చిట్టచివరి బంట్రోతు అయితేనేం, అంతా మీ చేతుల్లో ఉండే అధికారి అయితేనేం? మిమ్మల్ని మీరు



సరిచూసుకునే శక్తిలేక, మీరు పై స్థాయికి రావాలని ప్రయత్నిస్తే అది ఒక ఆపదగానే పరిణమిస్తుంది.

చుట్టూ ఉన్న పరిస్థితులవల్ల బెదరకుండా, మీలోని మనస్సును ముందు సక్రమంగా ఉండేలా చూసుకోండి. చుట్టూ బురదే ఉన్నా దాన్నే ఎరువుగా వాడుకుని తామర పువ్వు తన అందాన్ని ఇనుమడింపచేసుకోవడం లేదా? సువాసనలు వెదజల్లడం లేదా?

మీ జీవితమూ అలాగే ఉండాలి. చుట్టూ ఎలా ఉన్నా, మనసారా దృఢనిశ్చయంతో కష్టపడి, అందులోంచి మీకు కావాల్సిన ఎరువునుమాత్రం తీసుకోండి.

మానసిక ఒత్తిడిలేకుండా, మిమ్మల్ని ఆనందంగా నిర్వాహకశక్తిని ఉపయోగించి నియంత్రించడం నేర్చుకుంటే, నమ్మలేని వాటిని సాధించి చూపవచ్చు.

**ఏ పని ప్రారంభించినా అది పూర్తవుతుందా,**
**లేదా అన్న ఆలోచన మిమ్మల్ని వెన్నాడుతుంది.**
**అందువల్ల జాతకాల్ని పట్టుకుని జ్యోతిష్యుల వద్దకు పరిగెడుతున్నారు.**
**అలా చేస్తే మీ పని అవుతుందా?**

వీధి మొదట్లో ఉండే బిచ్చగాణ్ణి చూడండి. ఎముకలు వెళ్లుకొచ్చి, కూర్చునే ఓపికలేక ముసుగుదీసుకుని పడుకునుంటాడు. అదే, తన చోటులో ఎవరైనా ఒక కొత్త బిచ్చగాడు వచ్చి కూర్చుంటే గావుకేకలు పెడతాడు. అక్కడ ఉండనీయడు. దెబ్బలాడతాడు.

ఇదంతా ఎందుకు?

శారీరకంగానూ, మానసికంగానూ శక్తిలేని వారుకూడా కోపం, అసహ్యం, విసుగు చాలా శక్తివంతంగా ప్రదర్శించగలరు. తన శక్తిని సంపూర్ణంగా ఉపయోగించుకోలేని వ్యక్తులు మాత్రమే ఉద్రేకానికి లోనవుతారు.



అందువల్ల వేలవేల మైళ్లదూరంలో ఉండేవాటిని చేజిక్కించుకోవాలని ఆశపడే వ్యక్తికి, మూడు అడుగులు దాటి ఆలోచించేశక్తి లేకపోతోంది. ఒక ప్రణాళిక ప్రకారం తన శక్తిని వాడుకోవడం చేతకావడంలేదు. ప్రతిదానికీ భయమే. ప్రతి అడుగుకూ సందేహమే!

ఉద్రేకపడటంలో చూపించేటంత తీవ్రత, బలమైన ఆలోచనలతో బరిలోకి దిగడంలో కనపడదు. అందువల్లే గెలుపు గురించి ఆలోచించేటప్పుడల్లా, ఓటమిని గురించిన సందేహం తలెత్తుతూనే ఉంటుంది.

నచికేతుడి గురించి వినే ఉంటారు. 5 ఏళ్ల ప్రాయంలోనే మరణం గురించి తెలుసుకోవాలన్న కోరిక పుట్టిందతడికి. మరణానికి నాయకుడు యముడు అని తెలుసుకుని, అతని లోకపు గుమ్మంలో కూర్చున్నాడు.

యముడు వచ్చాడు.

తిండి, నీరు లేకుండా ఒక పిల్లవాడు తన వాకిలిలో చాలారోజులుగా ఉండటం గురించి విని, కరిగిపోయాడు.

“ఏం వరం కావాలో కోరుకో అన్నాడు”.

“మరణం తర్వాత ఏం జరుగుతుంది? అది తెలుసుకోవాలనుకుంది” అన్నాడు నచికేతుడు.

“దేవతల దగ్గరుండేవన్నీ ఇస్తాను తీసుకో… వేరే ఏం కావాలో కోరుకో ఇస్తాను. ఐతే, మరణం గురించి మాత్రం అడగకు” అన్నాడు యముడు.

నచికేతుడు ఆశలకు లోనవలేదు. నచికేతుడినుంచి తప్పించుకోవాలని యముడు కొన్నాళ్లు తన వీధికే రావడం మానేశాడు. చిన్నపిల్లాడేకదా, ఎలాగూ ఆకలికి తాళలేక వెళ్లిపోతాడు అని యముని నమ్మకం.

చాలా రోజుల తర్వాత తిరిగి వచ్చి చూసినాకూడా, నచికేతుడు అదేచోట ఆకలి, నిద్ర మరచి ఎదురుచూస్తూనే ఉన్నాడు. యముడు దిగ్భ్రాంతుడయ్యాడు.

“దేవతలకు, భగవంతుడికి కూడా తెలీని రహస్యం అది. నువ్వా ఐదేళ్ల పసివాడివి. అది నీకు ఎలా చెప్పగలను?” అని అడిగాడు యముడు.

### సిగరెట్ మానాలంటే ఏం చేయాలి?

దేన్నైనా బలవంతంగా వద్దనిపిస్తే అదే బుర్రను ఆక్రమిస్తుంది. ఓ అయిదు నిమిషాలు కోతి అనే మాట నాలో మెదలకూడదని బలంగా ఆదేశించుకోండి... ఆ అయిదు నిమిషాలు కోతి మాత్రమే గుర్తుకొస్తుంది.

సిగరెట్టు, తాగుడు వదిలేయాలని అనుకోవడం మంచిదే! అందుకోసం బలవంతంగా ఏ ప్రయత్నమూ చేయకండి.

సిగరెట్టు, తాగుడు వల్ల మీ శరీరం, కుటుంబం, సమాజం ఏఏ రకాలుగా, ఎంతెంత నష్టపోతున్నాయని జాగ్రత్తగా పూర్తి మెలుకువతో ఆలోచించండి. అప్పుడు అక్కరలేని అలవాట్లు వాటంతట అవే పోతాయి.

నాకు జవాబు దొరకకపోతే కదిలేదిలేదని మొండిగా కూర్చున్నాడు నచికేతుడు. అతడి భావతీవ్రతవల్ల, యమ సదన ద్వారంలోనే అతనికి జ్ఞానం లభించింది. అతడు తెలుసు కోవలసినవన్నీ ఎరుకలోకి వచ్చాయి.

చివరివరకు యముడు సమాధానం చెప్పడేమోనన్న అనుమానం ఆ ఐదేళ్ల పిల్లాడికి రానేలేదు.

అతడికున్న సంకల్పబలం మీకు లేకపోవడంవల్లే భయం, అనుమానం వెంటాడివస్తున్నాయి. విపరీత ఆలోచనలలో తలకిందులవు తున్నారు. ఆలోచనల్లో కొట్టుకు పోతున్నారు. అయితే, వాటిని మీ చెప్పుచేతల్లో ఉంచుకోవడం తెలీక సతమతమవు తున్నారు.

మీమీద నమ్మకం లేనపుడే ముగింపును గురించి చింత ప్రారంభమవుతుంది. ఏది ప్రారంభించినా అది పూర్తవుతుందా అన్న ఆలోచన మిమ్మల్ని వెన్నాడుతుంది. అందువల్ల జాతకాల్ని పట్టుకుని జ్యోతిష్యుల దగ్గరకు పరిగెడుతారు. తిథి, వారం, నక్షత్రం, కాలం సరిగా లేవని మీలో కలిగిన కోరికల్ని దాటవేస్తున్నారు.

కృష్ణదేవరాయలు ఒకసారి శత్రువుమీదికి దండుతో వెళ్లాడు. ఒక ఏరు దాటవలసి వచ్చింది. అప్పుడు ఆస్థాన జ్యోతిష్కుడు "రాజా! ఈ రోజు బాగోలేదు. పై సోమవారం యుద్ధానికి వెళ్తే జయం నిశ్చయం" అన్నాడు.

కృష్ణదేవరాయలుకు ఒకటే తడబాటు. అన్నాళ్లు ఆగితే, శత్రువుకు వివరాలు తెలిసిపోతాయి. అతడు జాగ్రత్తపడతాడు. ఎదురుచూడనప్పుడు శత్రువును ఎదిరిస్తేనే



గెలుపు. అయితే, జ్యోతిష్కుడి మాటలతో దేవరాయలకు అనుమానం మొదలైంది. తెనాలిరాముణ్ణి ఏం చేద్దామని సలహా అడిగాడు.

తెనాలిరాముడు జ్యోతిషుణ్ణి పిలిపించాడు.

"అందరికీ జాతకం చెప్తారుకదా! మీరింకా ఎన్నేళ్లు బతికుంటారో చెప్పగలరా?" అని అడిగాడు.

"ఇంకా ఇరవైఏళ్లు బతికుంటాను" అన్నాడతను.

తెనాలి రాముడు చటుక్కున కత్తిలాగి అతని మెడకి ఆన్చాడు. "ఈ క్షణం మీ జాతకాన్ని నేను మార్చగలను, గలనా...? లేదా...?" అని అడిగాడు.

జ్యోతిష్కుడి కళ్లు వెళ్లుకొచ్చాయి.

"గలరు... గలరు..." అని అరిచాడు.

"అంతే రాజా జ్యోతిష్యమంటే! మీకు వ్యతిరేకంగా చెప్పబడే ఏ జ్యోతిష్కాన్నైనా మీరు క్షణంలో ఆబద్ధం చేయవచ్చు" అంటూ నవ్వాడు తెనాలి.

దేవరాయలు ఏరు దాటాడు, శత్రువుని గెలిచాడు.

మీరు గట్టిగా సంకల్పిస్తే, గ్రహాలు మిమ్మల్నేం చేయలేవు. అనవసరమైన సందేహాల్ని పక్కకుపెట్టి, మీమీద నమ్మకం పెంచుకోండి పూర్తిగా, శ్రద్ధగా ఒక పని చేయండి. తనకు తానుగా మీ ఒడిచేరుతుంది గెలుపు.

**మీకు తెలియకుండా మీ వాళ్లు ఒక్కపని చేసినా, అది మీకు తెలిస్తే చాలు,**
**వాళ్లమీద అప్పటివరకు ఉన్న నమ్మకం పోయి,**
**మనస్సులో ఏదో ఒక సందేహం చోటు చేసుకుంటుంది.**
**అయితే నమ్మకం, ఎదురు చూపు అనేవి లేకుండా ఎలా బతకగలం?**

గెలుపును గురించి ఆలోచించకుండా, చేయవలసినదాన్ని పరిపూర్ణమైన ఇష్టంతో చేయండి అని ఎందుకు చెప్తున్నాను? గెలుపుకోసం ఎదురుచూసేటప్పుడే, అది జరుగుతుందో, జరుగదో అనే భయం నీడలాగ మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది.

ఎదురుచూపు ఉంటే, అక్కడ తప్పక నిరాశ కూడా ఉండే తీరుతుంది. ఎక్కడ నిరాశ ఉందో, అక్కడ చిరాకు స్పీడ్ బ్రేకర్‌లాగ కూడానే ఉంటుంది. ఎదురుచూసే ఓపిక లేక మీ ధ్యానం చెదురుతుంది.

గెలుపుకు ఎందుకింత ప్రాధాన్యతనిస్తున్నారు?



ఏది చేయబోయినా, దీనివల్ల నాకేంటి లాభం అని మనసు లెక్కలు వేయడం మొదలుపెడుతుంది. గెలుపులాంటిదేదో ఒకటి మిమ్మల్ని ఆకర్షించి ముందుకు లాగాలి. లేదా ఓటమిలాంటిదేదో మిమ్మల్ని భయపెట్టి వెనుకనుంచి ముందుకు నెట్టాలి.

జాగ్రత్తగా గమనించండి. గెలుపు, ఓటమి ఒకే నాణేనికి బొమ్మ బొరుసు. విడివిడిగా రెండింటినీ విడదీయలేం. ఎగరేసిన నాణెం వేగం తగ్గి నేలమీద పడేటప్పుడు ఏ పక్క పడుతుందా అని ఎదురుచూస్తూ బతుకు గడపటం మీకు అలవాటయిపోయింది. ఆ గాభరాను ఇష్టపడటం బాగా నేర్చుకున్నారు, కానీ ముగింపు ఎలా ఉన్నా దాన్ని ఇష్టపడటం నేర్చుకోలేకపోతున్నారు.

మీకు చాలా దగ్గర అనుకున్నప్పుడు వారితో బతుకును పంచుకోడానికి కూడా ఇష్టపడతారు. అయితే దానికి బదులుగా వాళ్లు మీతో ఎలా నడుచుకోవాలనే విషయంలో మీరు ఏదో భావించడం మొదలుపెడితే అప్పుడు నిరాశకు అవకాశం పెరుగుతుంది.

ఒకే ఒక విషయం మీకు తెలియకుండా వాళ్లు ఒక్క పనిచేసినా, అది మీకు తెలిస్తే చాలు, వాళ్లమీద ఆనాటి దాకా ఉన్న నమ్మకంపోయి, మనస్సులో ఏదో ఒక సందేహం చోటుచేసుకుంటుంది. అందువల్ల మీ ఆత్మీయుల్నించి కూడా ఏమీ ఎదురు చూడకండి.

అయితే నమ్మకం, ఎదురుచూపు వంటివి లేకుండా ఎలా బతకగలం? అందులోనూ పరిపూర్ణంగా!

అందుకే ఒకే ఒక్కదారి ఉంది. దాని పేరే ప్రేమ. తల్లి తన బిడ్డపట్ల చూపే ప్రేమలో పరిపూర్ణత ఉంటుంది. అయితే ఎదురుచూపు ఉండదు.

రెండో ప్రపంచయుద్ధం రోజులు. చెరశాలలన్నీ నిండిపోయి ఉన్నాయి. ఒక చెరలో ఉన్న ఖైదీలలో కొంత మందికి మరణశిక్ష విధించి, చంపేసి ఖాళీలు ఏర్పరచబడతాయని నిర్ణయమయింది. ఖైదీలకు అంకెలు ఇవ్వబడ్డాయి. రోజూ కొన్ని అంకెల్ని పిలిచేవారు. ఆ అంకెవచ్చిన వాళ్లను తీసుకెళ్లి కాల్చి చంపేవారు.

అలా జరుగుతున్నప్పుడు ఒకరోజు రిచర్డ్ అన్న ఒక ఖైదీ నెంబరు పిల్వబడింది.

**ఆశపడ్డవి దొరికినట్టే ఉన్నా నాకు తృప్తి కలగడం లేదేం?**

*కారణం మీరు అడిగిన దానికి, మీకు దక్కిన దానికీ తేడా ఉంది. కలలు కనడం సులభం. దానికేపోరాటం అక్కర్లేదు. నొప్పిలేదు. ఏ వెల చెల్లించవలసిన అవసరం లేదు.*

*అయితే ఆ కలను నిజంగా మార్చుకోడానికి చాలా వాటిని వదులుకోవాల్సి ఉంటుంది. బాధల్ని, కష్టాల్ని, నొప్పిని తట్టుకునే ధైర్యం కావాలి. అంత వెల చెల్లించేటప్పుడు ఎదురు చూడలేకుండా ఎలా ఉంటుంది?*

*ఎదురుచూపు ఉండటంవల్ల, కోరినదే దక్కినా, మనం అనుకున్నట్టు దక్కలేదే అన్న నిరాశ ఏర్పడుతుంది. మీ బాధ రెట్టింపు అవుతోంది. ఎదురుచూపు లేకుండా చేసే పనిని సంతోషంగా చేసి చూడండి. దక్కేది ఏదైనా సరే అదే మీకు ఎంతో తృప్తినిస్తుంది.*

అతడు చావడానికి సిద్ధంగా లేడు. ఇష్టపడలేదు, అందువల్ల భయపడి నక్కి కూర్చున్నాడు.

అతని తోటి ఖైది, యువకుడైన ఒక ఫాదరియార్ "నీకు చావడం ఇష్టం లేదు, నీకంతగా భయమంటే మనం అంకెలు మార్చుకుందాం. నీకు బదులుగా నేను వెళ్తాను'' అన్నాడు చిరునవ్వుతో.

ఒప్పుకోడానికి బాధపడ్డా, ప్రాణం మీద తీపితో రిఛర్డ్ ఒప్పుకున్నాడు. ఫాదరియార్ ఏ మాత్రం సంకోచం లేకుండా తనను తీసుకెళ్లడానికి వచ్చిన వాళ్లతో వెళ్లాడు. కాల్చి చంపబడ్డాడు. ఆ రోజు రాత్రి జర్మనీ యుద్ధంలో ఓడిపోయింది. ఖైదీలందరూ విడిచిపెట్టబడ్డారు.

రిఛర్డ్ తర్వాత చాలా ఏళ్లు బతికాడు.

అయితే తన బతుకు మరొకళ్లు పెట్టిన ప్రాణభిక్ష అన్న నిజం మాత్రం అతన్ని బాధిస్తూనే ఉంది.

ఆ ఫాదరియా అతని మిత్రుడేం కాదు. అతని పేరు కూడా రిఛర్డ్‌కు తెలీదు. ఏ ఎదురుచూపూ లేకుండా తన ప్రాణాన్ని వేరొకళ్ల కోసం ఆ ఫాదరియా ఇచ్చేసాడే అంత ధైర్యం అతనికెలా వచ్చింది?

ఆ ఫాదరియార్ చనిపోయినా జీవితాన్ని సంపూర్ణంగా జీవించాడు. తాను ప్రాణాలతో ఉన్నా తన బతుకు సంపూర్ణం కాదని రిఛర్డ్ మనస్సు గుర్తించింది.



ఇలా చెప్పడంవల్ల, మిమ్మల్ని ఇలాగే ఎవరికోసమో ప్రాణం త్యజించండి అని నేను అనడం లేదు.

ఆ ఫాదరియార్ త్యాగం అనుకుని అలా చేయలేదు. ప్రేమ అంటే ఏంటో తెలుసుకున్న వాడిగా ఎదుటివాళ్ల భయాన్ని, కష్టాన్ని పోగొట్టడానికి తాను చేయగలిగిన దాన్ని ఏమాత్రం వెనుకాడకుండా చేశాడు.

ఎదురు చూడకుండా ఏదైనా ఒక పనిని చేయాలంటే, దానిమీద సంపూర్ణమైన ప్రేమ ఉండాలి. మీరు గమనించే ఉంటారు చాలా తెలివైనవాళ్లు మరొకళ్లతో నవ్వుతూ మాట్లాడటం కూడా చేతకాని వారై ఉంటారు. ప్రేమగా ఉండమంటే ఎందుకని అడుగుతారు. ఫలం ఏంటో తెలియకుండా ఏ పని చేయరు. ప్రేమగా ఉండటమే మౌలికమైన తెలివని వాళ్లకు తెలీదు.

ముగింపు ఎలా ఉంటుంది అన్న ఆలోచన చేయకుండా, చేసే పనిని సంపూర్ణమైన ఇష్టంతో చేసి చూడండి. గెలుపును లెక్కచేయకుండా, పూర్తి అర్పణభావంతో చేసి చూడండి. గెలుపుకోసం ఎదురు చూడకపోవడంవల్ల, ఓటమిని గురించిన భయం ఉండదు. భయంలేని చోట గాభరా లేదు. గాభరా లేకపోతే దృష్టి చెదరదు.

జాగ్రత్త కోల్పోనప్పుడు, చేసే పనిలో ఆనందం ఉంటుంది. ఆనందంగా పూర్తి చాకచక్యాన్ని, శక్తిని ఉపయోగించి చేసే పనిలో గెలుపు తప్పనిసరి.

## మీరు కోరుకునేటట్టు లోకం ఎందుకు నడుచుకోవాలి? మీరు కోరుకున్నట్లల్లా ఎదుటివాళ్లు ఎందుకు తమనుతాము దిద్దుకోవాలి?

కొన్నిసార్లు మీరే గమనించి ఉంటారు, దేన్ని చూసినా విసుగు వస్తుంది. ఎవరిని చూసినా చిరాకుగా ఉంటుంది. మనసులో ఎవరో తొప్పించినట్లు ఒక ఖాళీ ఏర్పడుతుంది. అంటే మనోవ్యాకులత అనే శత్రువును మనసులోకి అనుమతించారని అర్థం.

మనో వ్యాకులత ఎందుకు వస్తుంది?

అసలు మీకు ఏం జరుగుతుంది?

మీరు అనుకున్నట్టు ఎవరో నడుచుకోవడం లేదు. ఎదురుచూసినదేదో జరగలేదు. మీ ఆశలకు అనుగుణంగా మీ జీవితం అమరలేదు. నిజం చెప్పాలంటే, మీకు



లభించినదేదో దాన్ని అంగీకరించలేక మీలో మీరు బాధపడుతున్నారు. దాన్ని ఎదిరిస్తున్నారు.

మీరు మనో వ్యాకులతతో బాధపడుతున్నప్పుడు, ఎదుటివాళ్లు మిమ్మల్ని అర్థం చేసుకోవాలని ఆరాటపడతారు. మీతోపాటు కూర్చుని ఎదుటివాళ్లు కూడా ఏడవాలని కోరుకుంటారు. జాలిని యాచిస్తారు.

ఎంత పిచ్చితనం ఇది?

మీరు కోరుకునేటట్టు లోకం ఎందుకు నడుచుకోవాలి? మీరు కోరుకున్నట్టల్లా ఎదుటివాళ్లు ఎందుకు తమను తాము దిద్దుకోవాలి? అహంకారం తాము దిద్దుకోవాలి? అహంకారం ఎక్కడ ఉన్నా దానికి దెబ్బతగలకపోదు. అప్పుడు మనో వ్యాకులత పుట్టుకొస్తుంది. అది మీ నమ్మకాల్ని వమ్ముచేస్తుంది.

బయటనుంచి ఆయుధాలతో మిమ్మల్ని తాకడానికి వచ్చిన శత్రువుల్ని కూడా కాస్త జాగ్రత్తగా ఆలోచించి, ఒక ప్రణాళిక ప్రకారం చేస్తే అడ్డుకోవచ్చు. మనోవ్యాకులత మాత్రం లోపలే పుట్టి పెరిగి, మిమ్మల్ని ఎందుకూ పనికిరాని వారిగా చేసే విషంతో కూడిన ఆయుధం. మిమ్మల్ని మీరే నాశనం చేసుకునే మూర్ఖత్వం లాంటిది.

ఏదో తలచుకుంటూ ఊరికే ఏడుస్తూంటే, లాభం లేదు. బాధ, దుఃఖం మనిషి మనిషికీ మారుతూంటుంది. ఒకడు అగ్గిపుల్ల అంటుకోకపోయినా బాధ పడతాడు. మరొకడు ఇల్లే అంటుకుపోతున్నా చలించడు.

రెండో ప్రపంచయుద్ధం జరిగిన తర్వాత ఒకరోజు జనరల్ ఐసెనోవర్ స్వర్గానికి వెళ్లాడు.

"వారం చివర నరకాన్నంతా తిరిగి చూడ్డానికి నాకు అనుమతి కావాలి" అని దేవుణ్ణి అడిగాడు.

"నరకంలో ఉండేవాడు స్వర్గాన్ని చూడాలనుకుంటే దానికో అర్థం ఉంది. కాని నీకు నరకాన్ని చూడాలన్న కోరిక ఏంటి?" అని అడిగి, అలాగే వెళ్లమన్నాడు.

నరకంలో హిట్లర్ చిత్రవధ అనుభవిస్తున్న గుడారంలోకి ఐసెనోవర్‌ను పిలుచుకుని వెళ్లారు. అక్కడ అసహ్యించుకునే వాటితో నింపబడ్డ నిలువెత్తు తొట్లు

### నేను కోరుకునేది ఏదీ దక్కడం లేదే?

ఈ సృష్టిలో ఏ శక్తీ మీకు వ్యతిరేకమైంది కాదు. మీరు ఉపయోగించుకోడాన్నిబట్టే ఒక శక్తి మీకు లాభానికో, నష్టానికో, సృష్టికో, విధ్వంసానికో కారణమవుతుంది.

ఒకరోజు సూర్యోదయాన్ని ఫోటో తీయాలను కుంటారు. ఆ రోజు ఒకటే మబ్బులు, ముసురు, వాన పడుతుంది. మీ కోరిక నెరవేర లేదన్న కోపంతో, ప్రకృతిమీద అయిష్టంతో, మీ గదిలో ఓ మూల ముడుచుకుని కూర్చున్నంత మాత్రాన ప్రకృతి మారుతుందా?

అది కాదు మీరు చేయాల్సింది.

ఆ వానను ఆసక్తిగా గమనించండి. ఒక అత్యద్భుతమైన హరివిల్లు కనపడి మీకు ఆనందాన్నివ్వవచ్చు. ఎప్పుడో తప్పు కన్పించని పొగమండలం ఏర్పడవచ్చు. లేదా ఇంటిపని చేసుకోడానికి అది మీకో అవకాశం అనుకోండి.

ఒక బలమైన శక్తివల్ల మీరు అనుకున్నది జరగకుండా పోవచ్చు. అయితే చెయ్యదగ్గ, చేయగలిగినవాటిని చేయకుండా డీలా పడిపోవడం, చేతకానితనం, పిచ్చితనం అవుతుంది.

రెండింటిలో, ఒకదాంట్లో హిట్లర్‌ను ముంచారు. తొట్టిపైకి అగుపిస్తున్న హిట్లర్ ముఖంలో కన్పిస్తున్న చిరునవ్వు చూసి జసొనోవర్ ఆశ్చర్య పడ్డాడు.

‘‘తట్టుకోలేని కంపులో, సహించలేని అసహ్యంలో ముంచినా, దేన్ని తలచుకొని ఇలా నవ్వు తున్నావు?’’ అని హిట్లర్‌ని అడిగాడు.

‘‘నా కింద ఉన్నదెవరో తెలుసా? ముసోలిని. అతని భుజాల మీదనే నేను నిలుచుని ఉన్నాను. అతని పరిస్థితిని ఓసారి ఆలోచించి చూడు’’ అన్నాడు హిట్లర్ పొంగి వస్తున్న నవ్వుని ఆపుకుంటూ...

దుఃఖం, బాధ ఒకరిలాగ మరొకరికి వుండదు. మనిషి మనిషికీ మారుతుంది. ఎదుటి వాళ్లతో పోల్చుకున్నప్పుడు బాధ ఎక్కువో తక్కువో అవుతుందంటే, అవి బైట నుంచి వస్తున్నాయనా అర్థం?

కాదు అవి మీ మనసులోనే పుడుతున్నాయి.

మీ మనస్సును సంతోషంగా ఉంచుకోవడం, వ్యాకులతలోకి తోసేయడం రెండూ మీ చేతిలో ఉన్నవే.

మీరనుకున్నట్టు లోకం నడవాలి, ఎదుటివాళ్లు నడుచుకోవాలి అని ఎదురుచూడటం మీ అహంకారం, దాన్ని కాళ్లకింద తొక్కివేసి పైకి ఎదగలేదంటే,



మీరు వేసే ప్రతి అడుగూ బాధగా, ప్రతి మలుపూ భయాన్ని కలిగిస్తుంది. నమ్మకం తగ్గి మనోవ్యాకులత పీడిస్తుంది.

మనోవ్యాకులత కలిగినప్పుడల్లా ఇతరుల మీద విరుచుకుపడటం మానేసి, అందుకు కారణం మీరేనని అర్థం చేసుకోండి. లోకంమీద కోపం ఎందుకు? మీ లోపాన్ని తెలుసుకుని వాటిని దిద్దుకోడానికి మీకు దొరికిన అవకాశంగా దాన్ని మార్చుకోండి. బాధలూ, నొప్పి కలిగించే అనుభవాలే జీవిత పాఠాలుగా చేసుకుని, మీ మనసుని మరింత పరిపక్వత పొందే దిశగా మరల్చుకోండి. అందుకు ఇదో వరం అనుకోండి.

ఎదురుచూపు ఉంటేనే నిరాశ ఉంటుంది అని తెలుసుకోండి. అహంకారాన్ని వదిలేయండి. మీకు వ్యతిరేకంగా వచ్చే అభిప్రాయాల్ని కూడా ఆదరించడం నేర్చుకోండి. వాటిని మీకు తగ్గవిగా మార్చుకోవడానికి గల దారి ఏది అని ఆలోచించండి. ఏర్పడే ప్రతి చిన్న అనుభవాన్ని మీకు తగిన విధంగా మార్చుకోండి.

**మీ దేవుడు చాలా గొప్పవాడని లోకానికి చాటాలని,**
**మిమ్మల్ని మీరే ఆ పనికి నియమించుకుంటారెందుకని?**
**మీ దైవానికి గొప్ప శక్తి వుందని మీరు నమ్మడం లేదా?**

'లోకంలో గొప్పతనం ఏది?' అని కొంతమంది నన్నడిగారు. నిజానికి ఇప్పుడు మతాలు ఎక్కడున్నాయి? మతం పేరిట రాజకీయ పార్టీలు కదా చలామణీ అవుతున్నాయి? ఏ మతమయినా ఒక వ్యక్తి తనను గురించి తాను తెలుసుకునేలా, తనలోకి తాను తొంగి చూసుకోవడాన్ని నేర్పడానికే ఏర్పడింది.

అయితే, వ్యక్తి ఔన్నత్యం సాధించే ప్రయత్నం తప్ప మిగిలినవన్నీ చూడడానికేకదా నేటి మతప్రాతిపదిక ఉన్న రాజకీయ పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి?

ఒంటరి అయిపోకూడదన్న ఆలోచనలతో మీరూ అలాంటి ఒక పార్టీలో చేరిపోతున్నారు. అది పుట్టుకతో వచ్చిందైనా కావచ్చు లేదా మీరే కోరి మరీ చేరిందైనా కావచ్చు. ఏది ఏమైనా ఒక తరఫు వాళ్లతో మిమ్మల్ని జతపరచుకోగానే, 'నీ పార్టీ గొప్పదా, నా పక్షం గొప్పదా?' అనే గొడవలకు మీరూ లోబడక తప్పదు.



నిజానికి, మతం లోకానికి ఏ గొడవనీ బోధించలేదు. అన్ని బంధాల నుంచి విడివడి జీవితంలో హాయిగా వుండడాన్నే మతాలన్నీ నేర్పడానికి ప్రయత్నించాయి.

అయితే, అందుకు తలకిందులుగా కదా ఉంది ప్రపంచమంతా! మతమన్న పేరుతో ఒక పక్షంలో చేరి మీకు మీరే సంకెళ్లు వేసుకుంటున్నారు కదా!

శంకరన్ పిళ్ళైకి ఆధ్యాత్మిక జీవితం గడపాలన్న కోరిక వచ్చింది. ఉన్న వాటిల్లో మతం ఏదో తెలుసుకుని, ఆ మతగురువుకు శిష్యుడవ్వాలని నిర్ణయించుకున్నాడు. స్నేహితుల్ని అడిగాడు. ఒక స్నేహితుడు అతణ్ణి తన మత గురువు దగ్గరకు పంపాడు.

అక్కడకు వెళ్లగానే మొదట గుండు కొట్టించుకొని రమ్మన్నాడు. కుడిచెవి నొప్పి నొప్పి అంటున్నా వినకుండా కుట్టి ఒక వలయం తగిలించారు. కాషాయం బట్టలు కట్టుకోమన్నారు. అక్కడో నెలున్నాక తనలో ఏ మార్పూ రాలేదని గ్రహించి వేరే చోటుకు మారాలనుకున్నాడు.

మరొక స్నేహితుణ్ణి అడిగాడు. అతడు అడవిలోకి తీసుకువెళ్లి తన మతగురువు దగ్గర విడిచిపెట్టాడు. "ఇక్కడ పచ్చ బట్టలు మాత్రమే వేసుకోవాలి. జుత్తు కత్తిరించ కూడదు. గడ్డం ఎంత పొడుగు పెరిగితే అంత మంచిది. ఆభరణాలు వాడ కూడదు" అన్నాడా గురువు.

చెవికుట్టు ఆరకముందే వలయం తీసివేయబడింది. వారి మతాచారం ప్రకారం మరొకచోట కొంత కండ కోయబడింది. దాంతో అక్కడా పుండయింది. ఇక ఆ మతగురువు దగ్గర కూడా ఒక నెలకన్నా ఉండలేకపోయాడు శంకరన్ పిళ్ళై.

"ఆ కొండమీదున్న గురువు దగ్గరకు వెళ్లు. అతడే అసలైన గురువు" అని మరొక స్నేహితుడు అన్నాడు.

శంకరన్ పిళ్ళై కాళ్లు పడిపోయేలా ఆ కొండెక్కి ఆశ్రమం చేరాడు. అక్కడున్న శిష్యులు గుండు కొట్టుకున్నారు. గడ్డం మాత్రం పెంచుకున్నారు. రెండు చెవులకు వలయాలు, ముక్కు కూడా కుట్టుకున్నారు.

శంకరన్ పిళ్ళై స్పృహ తప్పి పడిపోయాడు.

మతాలు మారుతూపోతే, ఒక్కొక్క మతగురువు మీ శరీరంలో ఒక్కో పొడుపు పొడిచి, చిల్లులు చేయడమే మిగులుతుంది. అంతేతప్ప వేరే ఏ గొప్పతనమూ చేకూరదు.

మతాల వల్ల ఏ కష్టం లేదు. మతాల పేరిట రాజకీయ పక్షాలు నడిపే వారితోనే అసలు గొడవంతా!

రాజకీయ పార్టీలవాళ్లకి తమ పార్టీలో ఎంతమంది వున్నారు అనే లెక్క ముఖ్యం! మతానికి ఆ అవసరం ఎందుకొచ్చింది? మతం అనే ముసుగులో తన అహంకారాన్ని సంతృప్తిపరచుకొని, తన స్థానాన్ని పటిష్ఠం చేసుకోవాలనుకునే వారికే లెక్కలు అవసరం. తన లోపలికి చూసుకోకుండా, తమ మతంలో తమకు ఎంతమంది ఉన్నారు అని సంఖ్యాబలాన్ని లెక్క పెట్టుకోవడం ప్రారంభించారో అప్పుడే ఆ మతం చచ్చిపోయింది.

మీ దేవుడు చాలా గొప్పవాడని లోకానికి చాటాలని, మిమ్మల్ని మీరే ఆ పనికి నియమించుకుంటారెందుకని? మీ దైవానికి శక్తి వుందని మీరు నమ్మడం లేదా?

మీ బలం, బలవంతం, అహింసల్ని ఆధారం చేసుకునే మీ దేవుడి కీర్తి కొనియాడబడుతుందంటే, ఆయన మీకన్నా తక్కువవాడుగా, బలహీనుడుగా, శక్తిలేనివాడుగా అయిపోయాడని కదా అర్థం.

మీకు కావాల్సింది పొందడానికి, ఆయన్ని ఎందుకు మీ పార్టీ పక్షాన నిలబెడుతున్నారు?

మీరు దేవుడి పేరిట జరిపే అభిమాన సంఘాలకు ఆయన తోడుండాలని ఎందుకు కోరుకుంటారు?

ఆధ్యాత్మికత ఎంతో గొప్పది. మిమ్మల్ని గొప్ప స్థాయికి తీసుకొని వెళ్లగలది తన వెనుక వేలమంది వుంటే ఎంత, ఎవ్వరూ లేకపోతే ఎంత? నిజంగా ఆధ్యాత్మికతను భావించేవాడికి ఏ తేడా కనిపించదు.

నిజానికి, మీ మతానికి ఆధారభూతమైనదేదో తెలుసుకోండి. అది ముందు మిమ్మల్ని మీరు తెలుసుకోండి అనే చెప్తుంది. మీలో మార్పు రావడానికి ఏం చేయాలో చూడకుండా, ఎదుటివాళ్లను మీ మతానికి మార్చడానికి ప్రయత్నించడం మీ మత ఆశయాలకే అది విరుద్ధం కావచ్చు. అది అవమానం కూడా కావచ్చు!

లోకంలో వున్న ప్రతి వ్యక్తీ ఉన్నతమైనవాడైతే, మొత్తం ప్రపంచం అంతాచాలా గొప్పదవుతుంది. అందువల్ల, ఏ పక్షంలోనూ చిక్కుకోకుండా, మీ మతంలోని నిజాన్ని గ్రహించండి! మీరూ ఉన్నతంగా ఎదగవచ్చు.



## పురుషుడు తన బుద్ధిబలం మీదే ఆధారపడతాడు. కాని పురుషుడు గుర్తించలేని సూక్ష్మమైన భావాల్ని స్త్రీ గ్రహించగలదు. అలాంటి ఆడవాళ్లంటే మగవాళ్లకు భయం ఎందుకు?

వేల సంవత్సరాల క్రితం వేదాలు ఘోషించినప్పుడు, ఈ లోకంలో మగవాళ్లకు, ఆడవాళ్లకు మధ్య పెద్దగా తేడాలు లేవు. ఇద్దరూ అన్నిటా సమంగా ఉన్నారు.

జనకుడి సభలో యాజ్ఞవల్క్యుడనే పెద్ద పండితుడికీ, మైత్రేయి అనే స్త్రీకి మధ్య ఆధ్యాత్మిక వివాదం జరిగింది. యాజ్ఞవల్క్యుడి ప్రశ్నలకు మైత్రేయి జవాబులిచ్చింది. అయితే, మైత్రేయి అడిగిన కొన్ని సూక్ష్మమైన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక యాజ్ఞవల్క్యుడు తడబడ్డాడు. ఆమె పాదాలపై పడి నమస్కరించి తననొక శిష్యుడిగా స్వీకరించమని కోరాడని పురాణాలు చెప్తున్నాయి.

స్త్రీలకంత గౌరవం ఉండిన రోజులున్నాయి.

ఒక మగవాడు గుర్తించేలేని సూక్ష్మమైన భావాల్ని స్త్రీ గ్రహించగలదు. మగవాడు తన బుద్ధిబలం మీద మాత్రమే ఆధారపడతాడు. ఆడది తన అనుభూతుల మీద ఆధారపడుతుంది. బుద్ధి బయటనుంచి సేకరింపబడుతుంది. అది ఏ స్థాయిలో వచ్చి చేరుతుందో, అదే స్థాయిలో ఉపయోగపడుతుంది. అనుభూతులు బయటినుంచి వచ్చే అందచందాల్ని పోగుచేసుకోవు. అవి ఎంతో స్వచ్ఛమైనవి. బుద్ధికన్నా పై స్థాయికి చెందినవి. అందువల్ల, ఆడవాళ్లు మగవాళ్లకన్నా అనుభూతులకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. పై స్థాయికి చేరుకుంటారు.

మరి ఆడావాళ్లకు మర్యాద ఇవ్వడం లేదు ఎందుకని?

కాలం ఏదైనా మగవాడు, ఆడదాన్నికన్నా శారీరకంగా బలవంతుడే. అలాంటి ఆడవాళ్లను పరాయివాళ్లనుంచి కాపాడవలసిన బాధ్యత మగవారిపై ఉంటోంది.

మగవాడికి ప్రాధాన్యతనిస్తూ సమాజంలో విధులు ఏర్పరచారు. అధికారాన్ని రుచిమరిగాక వదులుకోవడం సాధ్యం కావడంలేదు. మగవాళ్లందుకు తయారుగా లేరు. ఒక స్త్రీ పుట్టుకముందే ఆమెకున్న అధికారాల్ని లాగేసుకునే శాస్త్రాల్ని మగవాడు రచించాడు.

భారతదేశంలోనే కాదు, లోకంలోని పలుచోట్ల మగవాడు తననుతాను ముందు నిలబెట్టుకున్నందువల్ల స్త్రీకి అన్యాయం జరిగింది. ఇలాంటి శాస్త్రాల్ని ఎందుకు రాశారు? ఆడవాళ్లు తమకంటే తక్కువన్న అభిప్రాయంతోకాదు. స్త్రీ తనకన్నా సున్నితమైన మనస్సుగలది అన్న నిజం బాగా తెలిసినందువల్ల ఏర్పడ్డ భయంవల్ల.

ఎందుకని ఆడవాళ్లంటే మగవాళ్లకు భయం?

గొప్ప తెలివితేటలున్న జ్ఞాని ఒక బడిలో చిన్నపిల్లలకు పాఠం చెపుతున్నాడు. తరగతిలో ఒకరోజు, 'ఈ భూమి గుండ్రంగా వుంది కదా దాని బరువు ఏమిటో ఎవరైనా చెప్పగలరా?' అని అడిగాడు.

పిల్లలు ఇంటికెళ్లి తల్లిదండ్రుల్ని ప్రశ్నలడిగి విసిగించడం ప్రారంభించారు. చాలామందికి సరైన జవాబు తెలీదు. ఏదో తోచిన జవాబు చెప్పి పంపారు.



మర్నాడు పిల్లలందరి సమాధానాలు విని "అన్నీ తప్పే!" అన్నాడా జ్ఞాని. నల్లబల్ల మీద చాలా అంకెలున్న ఒక సంఖ్యను రాసి 'ఇదే అసలు బరువు' అన్నాడు.

ఇంతలో ఓ అమ్మాయి లేచి "సార్ నాకో సందేహం. మీరు చెప్పిన బరువు దానిమీదున్న మనుషుల్ని కలుపుకునా లేక కలుపుకోకుండానా?" అని అడిగింది.

ఆ విజ్ఞాని సమాధానం చెప్పలేక తడబడ్డాడు. తలకిందులయ్యాడు. తలదించుకున్నాడు.

ఎంతటి జ్ఞానికైనా అర్థంకాని విషయాలు భూమిమీద ఎన్నో ఉన్నాయి. అందులో స్త్రీ ఒకటి.

లోకంలోని ఎన్నో విషయాల్ని బుద్ధి పూర్వకంగా ఆలోచించి, విశ్లేషించి తెలుసుకోగలిగాడు, మగవాడు. అయితే, అతని పక్కనే ఉండే సున్నితమైన అవగాహన ఉన్న స్త్రీని మాత్రం అర్థం చేసుకోలేకపోయాడు.

అర్థంకాని దానిమీద భయం సహజం.

ఆ భయాన్ని బయటపెట్టకుండా స్త్రీ తలెత్తి చూడకుండా, తన మొరటుతనంతో ఆమెను అణచి ఉంచాడు. తన శారీరకశక్తిని ప్రయోగించి, బుద్ధిని కుతంత్రంగా ఉపయోగించి, ఆమెను తన నీడలోనే ఉంచుకోవడానికి... చేయవలసినవన్నీ అతడు చేశాడు.

స్త్రీలైనా ఈ విధానాన్ని ధైర్యంగా ఎదుర్కొని అడ్డుకున్నారా? లేదు! స్వప్రతిభకన్నా, మగవాడి నీడలో హాయిగా ఉండటాన్నే వారూ ఎంచుకున్నారు.

నిజానికి స్త్రీ పురుషుల్లో ఎవరు తక్కువకాదు. మగ, ఆడ అని వేరుచేసి చూడాల్సిన పనేలేదు. ఇద్దరూ లేకుండా కుటుంబమో, సమాజమో, లోకమో గడవదు కదా!

**మగవాడు బుద్ధిపూర్వకంగానూ,**
**ఆడది అనుభూతిపూర్వకంగానూ జీవించడం తప్పుకాదు.**
**నిజానికి, ఇద్దరూ కలిసి పనిచేస్తే, ఎంతో ఉన్నతి లభిస్తుంది.**
**అద్భుతాలు జరుగుతాయి. మరి గొడవ ఎక్కడ వస్తోంది?**

ద్వీపకల్పం లాంటి ఒక దేశానికి వచ్చిన అమెరికా వీరుడు ఒకడు ఒక విచిత్రమైన సంఘటనను చూశాడు. ఆ దేశానికి చెందిన పురుషుడొకడు వస్తుంటే, అతడి వెనకాల, ఇరవై అడుగుల దూరంలో నలుగురు స్త్రీలు వస్తున్నారు. వారి వివరాలు అడిగాడు.

'నలుగురూ నా భార్యలూ' అన్నాడతడు.

"ఏంటీ... నలుగురా? పెట్టిపుట్టావయ్యా!" అనేసి "ఐనా అందంగా వాళ్లతో కలిసి నడవకుండా ఎందుకు విడిగా ముందు నడుస్తున్నావ్?" అని అడిగాడు.



"ఇక్కడ మగవాడితో సమానంగా ఆడవాళ్లు నడవకూడదు. వెనకాలే రావాలి" అన్నాడతను.

కొన్నాళ్లకు ఆ దేశానికీ, అమెరికాకీ యుద్ధం వచ్చే సూచనలు కన్పించాయి. అప్పుడు మళ్లీ అదే వ్యక్తి ఎదురయ్యాడు. అప్పుడు అతనికి ఇరవై అడుగుల ముందు ఆ ఆడవాళ్లు నడుస్తున్నారు. అమెరికా వీరుడు ఆశ్చర్యపడ్డాడు. "అదే, ఎప్పటినుంచి స్త్రీలకు ప్రాధాన్యతమివ్వాలని నిశ్చయించుకున్నావు?" అని అడిగాడు.

"ప్రాధాన్యతా! మట్టిగడ్డా! ఈ అమెరికావాళ్లు ఎక్కడ బాంబులు పూడ్చిపెట్టారో ఏమో! తెలీక తొక్కి చస్తే! అందుకే వాళ్లను ముందు పంపాను" అన్నాడు.

ఇదొక జోక్ అని విని నవ్వేస్తే ఏ గొడవా లేదు. అయితే, స్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని మీరు గుర్తించకమానరు. మగవాళ్లు ఏర్పరచిన శాస్త్రాలు, సంప్రదాయాలు అన్నిటినీ గుడ్డిగా నమ్మి తననుతానే ముంచేసుకునే ఏ స్త్రీకి నిజమైన స్వాతంత్ర్యం లభించదు.

మరోలా చెప్పాలంటే, మగవాళ్లలా బట్టలు వేసుకుని అధికారం చెలాయించడంవల్లో, మొరటుతనంగా పనిచేయడంవల్లో, స్వాతంత్ర్యం వస్తుందని కొందరు ఆడవాళ్లు భావించడాన్ని చూస్తే హాస్యాస్పదంగా ఉంటుంది.

మగవాళ్ల నకళ్లుగా, ప్రతిబింబాలుగా తమను మలచుకోవడంలో ఆడవాళ్లకేం గొప్ప ఉంది? వాళ్లు తమకన్నా మగవాళ్లు గొప్పని అనుకొని, ఆ స్థానాన్ని అందుకోడానికి ప్రయత్నిస్తున్నారని అర్థం.

నిజానికి, జీవితాన్ని బుద్ధిబలంతో ముందుకు నడపాలని ప్రయత్నించి, దాన్నించి మగవాడు చాలా దూరంగా వెళ్లిపోయాడు. జీవితాన్ని అనుభూతిపరంగా జీవించడం తెలియడం వల్ల, స్త్రీ అనుభవాలే లోతైనవిగా ఉంటాయి. అది మగవాడికి సులభంగా అందదు. అందువల్ల ఒక స్త్రీ ఎప్పుడూ తనతో ఉండాలన్న అవసరాన్ని మగవాడు గుర్తించాడు. ఇది అర్థంకాక, మగవాడి నీడలో ఉండటాన్ని ఆడది ఎంతో ఆనందంగా ఒప్పుకుంటోంది.

స్త్రీలను గౌరవించని ఏ కుటుంబం ఎదగదు. స్త్రీలు ఏ స్థాయిలో చూడబడతారో, అన్నదాన్ని బట్టే ఆ సమాజంలో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి.

గుడిలో స్త్రీని రానీయకుండా ఉండటానికి 'అంటు' అనే విధానాన్ని మగవాడు కనిపెట్టి అమలు పరిచాడు. ప్రకృతి ప్రసాదించిన మార్పుల్ని అసహ్యం అని భావించడమే నైచ్యం. జీవితంలో లభ్యమయ్యే దేన్నయినా మగవాడు బుద్ధిపూర్వకంగా ఆలోచించి పూర్తిచేసేలోపు, స్త్రీ ఆ విషయాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొని దాన్ని అనుభూతులుగా మలచుకుంటుంది.

మగవాడు బుద్ధిపూర్వకంగానూ, ఆడది అనుభూతి పూర్వకంగానూ జీవించడం ఏం పెద్ద తప్పుకాదు. నిజానికి స్త్రీ పురుషులు ఇద్దరూ కలిసి పనిచేస్తే, ఎంతో ఉన్నతి లభిస్తుంది. అద్భుతాలు జరుగుతాయి.

మరి గొడవ ఎక్కడ వస్తోంది? ఒకదానికన్నా మరొకటి గొప్పలేక తక్కువ అనుకునేటప్పుడు గొడవలు ప్రారంభమవుతున్నాయి. ఒక ఆడది ఆనందంగా ఉంటేనే ఆమె చుట్టూ ఉండేవాళ్లు ఆనందంగా ఉంటారు.

అలాగే, ఒక మగవాడు ఆనందంగా లేకపోతే అతని చుట్టూ ఉండేవాళ్లకు ఆనందం ఉండదు.

ప్రకృతి కారణాలవల్ల మగవాడికీ, ఆడదానికి రూపంలోనూ, శారీరక బలంలోనూ తేడాలొచ్చింది. ఇద్దరికీ శారీరకంగా వేరువేరు ఆనందాలుండవచ్చు.

అయితే నిశ్చింత, పరిపూర్ణమైన ఆనందం శారీరకమైనవి కావు. మగవాడికి వేరు సంతోషం, ఆడదానికి వేరే ఆనందం అంటూ ప్రకృతిలో భేదాలేం లేవు.

ఆనందం అనేది మానవులకు సహజం. దీన్ని అర్థం చేసుకుని నడుచుకుంటే, సమాజంలో స్త్రీ పురుషులకు తేడాలు, ఎక్కువ తక్కువలు ఉండవు.

స్వాంతంత్ర్యం దెబ్బలాడి తెచ్చుకునేది కాదు. మనసారా దాన్ని గుర్తించి అనుభవిస్తే చాలు, నగలు, బట్టలు, అలంకారం, ఆడంబరాలు అనే వాటిల్లో లభించే ఆనందాన్ని వదిలేసి గొప్పవాటిని స్త్రీలు కోరుకోవాలి.

సమాజంలో మగవాళ్ల ఆధిపత్యానికి స్త్రీ ఎందుకు లోనవ్వాలి. అలా కాకుండా జాగ్రత్తగా నడుచుకోకూడదా? ప్రకృతి స్త్రీలను శారీరకంగా, బలహీనంగా అనేక కారణాలవల్ల చేసింది. దాన్ని మార్చాలనే ప్రయత్నం చేయడం ఎందుకు? ఆమెలా



ఏ పనీ చేయలేక మగవాడు వెనుక బడుతున్నాడన్నదే నిజం. అతడిలా ఉండాలని ఆమె ఎందుకు వెనకడుగేయాలి?

మగవాడిని ముందు నిలుచోబెట్టి అతనిలా నడుచుకోవడమా స్వాతంత్ర్యమంటే? అక్కడా మొదటిస్థానం స్త్రీలోని మార్ధవానిదే! ఒక స్త్రీ పూర్తిగా స్త్రీగా ఉండటమే కదా స్వాతంత్ర్యం? స్త్రీ లేకపోతే ఈ లోకమే లేదు. స్త్రీలు తమను శరీరంతోనే గుర్తించుకోవడం మాని, తమలోని శక్తిని గుర్తించుకోవడం నేర్చుకోవాలి.

**కంప్యూటర్ ముందు కూర్చుని మీ జీవితంలోని ఒక్కో ఘట్టాన్ని నిర్ణయించడం తప్ప భగవంతుడికి మరేం పనిలేదా! ఈ కథల్ని నమ్మడానికి మీరేమన్నా చిన్నపిల్లలా?!**

మిమ్మల్ని తమ చెప్పుచేతల్లో వుంచుకోవాలని రాజకీయవాదులే కాదు. జ్యోతిష్కులు, స్వాములు ఆశపడుతున్నారు. తమ ప్రేమతో మిమ్మల్ని బంధించలేక, మీలో ఒక భయాన్ని, నేరభావాన్ని తయారుచేసి, పాపం-పుణ్యం, మంచి-చెడు అని చెప్పి, మిమ్మల్ని తత్తరబిత్తర చేస్తున్నారు. 'మీ గెలుపు, ఓటములు నిర్ణయించేది మీ తలరాతే!' అని నమ్మిస్తారు.

మీరు అనుకున్నది జరగకపోతే దానికి పూర్తికారణం మీరే! జీవితం ఎంలా ఉండాలన్నదాన్ని మీరే సరిగా నిర్ణయించుకోవడం లేదు. ఆశపడ్డదాన్ని పొందడానికి తగినట్లు మిమ్మల్ని మీరు తయారు చేసుకోలేదు. అది మీ తప్పే తప్ప, విధి ఆడే



ఆటకాదు. తన కంప్యూటర్ ముందు కూర్చుని మీ జీవితంలోని ఒక్కో ఘటాన్ని నిర్ణయించడం తప్ప భగవంతుడికి మరి వేరే పనేం లేదా! ఈ కథల్ని నమ్మడానికి మీరేమన్నా చిన్నపిల్లలా?!

కొండమీద వాన కురుస్తుంది. జలపాతంగా మారుతుంది. సెలయేరవుతుంది. పల్లానికి పరుగులిడి చివరగా కడలిలో కలుస్తుంది. 'పుట్టినక్షణం నుండే కడలిలో చేరాలని ప్రయత్నిస్తుంది నది' అని చెప్పడం కవితలో బాగుంటుందే కానీ, అది నది తలరాత కాదు కదా!

శంకరన్ పిళ్ళై అతని భార్య ఒక నదిలో స్నానం చేస్తున్నారు. భార్య కాలుజారింది. నీళ్లలో ఆమె కొట్టుకుపోయింది. శంకరన్ పిళ్ళై నీటివాలుకు ఎదురుగా వెతుక్కుంటూ వెళ్లసాగాడు. ఎవరో అడిగారు. అతడు వెంటనే "నా భార్య గురించి నాకు తెలీదా? అందరిదీ ఒక దారైతే దానికి పూర్తిగా వ్యతిరేకం ఆమె. ఆమెను నీరుపైకి నెట్టి ఉంటుందే తప్ప పల్లానికి కాదు" అన్నాడు.

అతిగా కూర్చి చెప్పబడే కథలు, కవితలూ ఆనందానికే పనికివస్తాయి. అవే నిజమని నమ్మితే మూర్ఖులైపోతారు. విధిని గురించిన కథల్ని విసిరిపారేసి దేన్నయినా జాగ్రత్తగా గమనించి, కుశలతతో చేసుకుని పోయే నేర్పును గనుక సాధిస్తే ఏ తలరాత కూడా మిమ్మల్ని అణచలేదు! జాగ్రత్తగా మీరు పనిచేస్తే, తలరాత అని ఒకటి ఉన్నా దాన్ని మీరు మార్చిరాసుకోవచ్చు.

తనకు అన్నీ తెలుసు అన్నీ అనుకునే ఒక విజ్ఞాని దగ్గరకు శంకరన్ పిళ్ళై వెళ్లాడు.

"నాకొక అందమైన అమ్మాయి ఉంది. చురుకైనది. అయితే, పొద్దున్నే లేచి తిన్నదంతా వాంతి చేసుకుంటుంది. ఇందుకు ఏంటి కారణం?" అని అడిగాడు.

ఆ విజ్ఞాని కొంచెం సేపు కళ్లు మూసుకుని "నీ కూతురు పాలు తాగుతుందా?" అని అడిగాడు.

"అవును. ప్రతిరోజూ మేలు జాతి ఆవు పాలే తాగుతుంది" అన్నాడు శంకరన్ పిళ్ళై.

"అదే అసలు గొడవంతా. కడుపులోకి వెళ్లగానే పాలు పెరుగవుతుంది. నీ కూతురు రాత్రి నిద్దర్లో జారేటప్పుడు, వెన్న తయారవుతుంది. ఒంటి వేడికి ఆ వెన్న నెయ్యిగా, ఆ నెయ్యి రసాయన చర్యవల్ల చక్కెరగా మారిపోతుంది. అది రక్తంలో కలిసేటప్పుడు ఒక మత్తు పుడుతుంది. ఆ మత్తు వీడేలోపు పొద్దుటే నిద్రలేచి ఉంటుంది. వికారంతో వాంతులయ్యాయి" అని చెప్పాడు.

అర్థంకాని విషయాల్లో తప్పును విధి మీదకు తోయడం కూడా ఈ విజ్ఞాని చెప్పిన కారణం లాంటిదే. ఏ మాత్రం అర్థంలేనిది. అంతా విధి ప్రకారం జరుగుతుందని, కొందరు పెద్దలు చెప్పినదాన్నిబట్టి, అదే నమ్మి, మీలో చూపును కుదించుకుంటారా? మీ నమ్మకాన్ని వమ్ము చేసుకొంటారా? ఎవరికీ, పరిస్థితులన్నీ ఎప్పుడూ నూటికి నూరుశాతం ఇష్టపడే విధంగానే అమరవు.

మార్చలేని పరిస్థితిని ఎదిరిస్తే, ప్రశాంతత లేకుండాపోతుంది. అయితే, మీరు విధిపేరిట అన్నింటినీ భరిస్తూ ఏం చేయకుండా ఉండిపోవడం అని తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను మిమ్మల్ని ప్రతి విషయాన్ని భరిస్తూ ఉండిపొమ్మనడం లేదు. అందువల్ల దాన్ని వదిలేసి, దేన్నయినా తొందరపాటుతనం లేకుండా భరించి, విధిని మీకు తగినట్లుగా మార్చుకోవడం ఎలా అని ఆలోచించి ఆ రకంగా ముందుకు సాగండి. మీరు ఎదగాలంటే, విధి అనే భయం నుంచి బయటపడాలి.

"భగవంతుడే వచ్చి చెప్పినా సరే నా విధిని నేనే నిర్ణయించుకుంటాను" అనే ధైర్యం మీకు లేకపోతే మీ జీవితం దానిష్టం వచ్చిన రీతిలో నడుస్తుంది. కావాలనుకున్నది పొందాలన్న తీవ్రవాంఛ మీలో ఉంటే, మీ విధిని భగవంతుడి నుండి తీసుకుని, మీరే దాన్ని నడపండి.



**ప్రకృతి ప్రసాదించిన శక్తి నీరులా ఒకచోట నిల్వ ఉంది. దాన్ని వాడుకోనీయకుండా మీ గుర్తింపే మీకు అడ్డయి నిలుచుంది. మరి ఆ శక్తిని చక్కగా మరింత వేగంగా వినియోగించుకోవాలంటే ఏం చేయాలి?**

పసిప్రాయంలో మీ మనసూ, శరీరం మీరెలా కావాలంటే అలా ఒంగుతాయి. పెరగను, పెరగను మిమ్మల్ని మీరే పెళుసుగా మార్చేసుకుంటున్నారు. ఇది ఎదుగుదల కాదు. నిజానికి ఇది మీ తిరోగతి. పుట్టినప్పుడే మీకున్న ఒక గుణాన్ని పెంపొందించుకోకుండా, అలక్ష్యపరచి పోగొట్టుకున్నారు. కారణం ఏమిటి?

పుట్టినప్పుడు, ఒక కొత్తజీవిగా, ప్రాణశక్తిగా తొణికిసలాడారు. ప్రకృతిని ఏ భేదం లేకుండా చూస్తున్నారు. అన్నింటినీ మనసారా అనుభవించారు.

వయస్సు పైబడుతుండగా మీ గొప్పతనాన్ని మరచి, "నేను డాక్టర్, నేను ఇంజనీర్, నేను వ్యాపారి, నేను రాజకీయవేత్తను" అంటూ సమాజంలో ఓ గుర్తింపు

ఏర్పరుచుకుంటున్నారు. ఎక్కడికెళ్లినా ఈ గుర్తింపునే మోసుకెళ్లడంవల్ల, మీ అసలు గుణాన్ని పోగొట్టుకుంటారు. ప్రముఖులు రోడ్డుపై హాయిగా నడవాలన్నా తమను గుర్తించలేని చోటు వెతుక్కోవాల్సి వుంటుంది.

మీ గుర్తింపు ఎక్కడనుంచి వస్తోంది! అది మీ గడిచిన కాలపు అనుభవాల్ని ఆధారం చేసుకునే ఏర్పడుతుంది. అనవసరంగా దాన్ని మోసుకు తిరగడంవల్ల, ఒక స్థాయిలో ఆ దుర్వాసన భరించలేక శ్వాస ఆడక తపిస్తారు.

శంకరన్‌పిళ్లై తన గురువు దగ్గరకు వెళ్లి "నేను ఒక వ్యక్తికి ఎంతో మేలు చేశాను. అయితే, ఏ మాత్రం కృతజ్ఞత లేకుండా నడుచుకుంటున్నాడు. వాణ్ణి చూస్తే నాకు నిశ్చింత తొలగిపోతోంది" అన్నాడు.

గురువు చిరునవ్వు నవ్వి "జరిగింది మంచైనా, చెడైనా దాన్ని మోసుకుని తిరగనక్కర్లేదు. ఇక నీకు ఎవరైనా చెడుచేస్తేనో, నువ్వు మంచి చేస్తానో వెంటనే దాన్ని బావిలో పారేయి. నిశ్చింతగా ఉంటుంది" అన్నాడు.

శంకరన్‌పిళ్ళై తలూపి ఇంటికెళ్లిపోయాడు. దారిలో ఒక ముసలిది నడుస్తుంటే రోడ్డు దాటడానికి సహాయం చేసి ఆమెను పక్కనేవున్న బావిలో విసిరేశాడు.

నేను చెప్పేదాన్ని శంకరన్‌పిళ్ళైలాగా అర్థం చేసుకోకండి! మీ గుర్తింపును తయారుచేసేది మీ మనసే! మనసంటే ఏంటి? జీవితం గురించి ఎవరో చెప్పినవి, మీ అనుభవాల్ని ముక్కలుముక్కలుగా చేసి, దాచి పెట్టుకునే కుప్పతొట్టి. అంతే తప్ప దానికే ప్రాముఖ్యత లేదు.

మీరు యజమాని కావచ్చు. మీ దగ్గర పనిచేసే వాడొకడు చెప్పిన మాటలకు, జోక్‌కు మనసారా నవ్వలేకుండా మీరు యజమానిననే గుర్తింపు అడ్డువస్తే మీరు జాలిపడవలసిన స్థితిలో ఉన్నారన్నమాట. మీ గుర్తింపుతో అధికంగా ముడిపడితే, ఎందులోనూ ఒదగలేక, గంభీరంగానే ఉండిపోతారు. మీ అహాన్ని పోషించే దేన్నీ వదులుకోక ఇలాగే ఉంటే, గొప్పవాటినెన్నిటినో మీరు కోల్పోతారు.

సంతకు పువ్వులు తీసుకెళ్లే బండిని లాక్కెళుతున్న ఓ గుర్రం, మరొక గుర్రం కట్టెల బండిని లాక్కురావడం చూసింది. "నా చుట్టూ వున్న వాసన నీకు ఉందా!" అని హేళనగా అడిగింది.



పువ్వుల్ని దింపేసి సంతనుంచి వెనుదిరిగాక, తన ఇంటికి కావాల్సిన పేడను నింపుకున్నాడు బండివాడు. అప్పుడు మళ్లీ ఎదురైంది ఆ కట్టెల బండి గుర్రం. ఈ గుర్రం సిగ్గుతో తలదించుకుంది. మీ గుర్తింపు ఆ బండిలో ఎక్కించన బరువులాంటిదే! బండిలోంచి వచ్చేవాసన మీదేననే పిచ్చి మమకారానికి లోనుకావద్దు.

ఆయా సందర్భానికి తగినట్లుగా ఒక తండ్రిగా, తల్లిగా, యజమానిగా, వాణిజ్యవేత్తగా, అధికారిగా... ఇంకా ఏవేవో ముసుగులు వేసుకుని, ఈ లోకంలో మీరు కొన్ని పనులు సాధించాల్సి ఉంటుంది. అంతవరకే దానికి ప్రాముఖ్యతనివ్వడం నేర్చుకోండి. ముఖానికి ముసుగేశాననే గుర్తులేకుండా, అదే మీ ముఖమనుకుంటే ఆపదే!

ప్రకృతి ప్రసాదించిన శక్తి నీరులా ఒక చోట నిల్వ ఉంది. దాన్ని వాడికోనీకుండా మీ గుర్తింపే మీకు అడ్డయి నిలుచుంది. మీ ముసుగును తొలగిస్తే ఆ శక్తిని గుర్తించవచ్చు. మీ గుర్తింపు వదిలేసుకోవడానికి తయారయితే, ప్రాణశక్తిని మీరు తెలుసుకోగలుగుతారు.

**కలలకు ఎరువువేసి పెంచి పోషించడం**
**తెలిసినవాళ్లు మాత్రమే చక్కగా జీవించగలరు.**
**మిగిలనవారు ఈ లోకంలో ఏదో అలా బతికేస్తున్నారు.**
**ఒక తరం అంతా కలలు కనడం మానేస్తే...?**

యవ్వనంలో ఉన్నప్పుడు, తర్వాత ఎలా ఉండాలో మీకు కొన్ని కలలుండేవి. మీ జీవితాన్ని ఎలా అమర్చుకోవాలో ఒక లక్ష్యం ఉండేది. 18, 20 ఏళ్ల మధ్య కన్న కలలన్నీ బ్రహ్మాండమైనవే! 25వ ఏట నుండి జీవితానికి అవసరమయ్యే వాటి గురించే కలలు వస్తాయి. ముప్పై దాటాక కలలన్నీ వట్టిపోయి, "గొప్పగా ఏదీ సాధించాల్సింది, సాధించేదీ లేదు. ఉన్నదాంతో బతికేస్తే సరి" అనే సర్దుబాటుకు తయారైపోతారు.

ఏమని అడిగితే, వయసు ఎదగను, ఎదగను జీవితంలో సాధ్యాసాధ్యాలు అర్థమవుతున్నాయని అంటారు. కాదు, నిజానికి కలగనడానికి కూడా గుండెల్లో ఒక



ధైర్యం కావాలి. అది పోగొట్టుకోవాలి. దానిని చేజిక్కించుకునే శక్తిలేక బేలలైపోయారు. ఏ కలయికా అది నిజమవుతుందా, అవదా అనే సందేహం, భయంతోనే మీరు కంటున్నారు. అందువల్ల మీ ప్రయత్నాలు కూడా సరిగా ఉండవు.

చైనాలో ఒక జెన్ గురువు ఉండేవాడు. ఒకరోజు వారు తన శిష్యుణ్ణి పిలిచారు. "నా స్నానానికి తొట్టెలో నీరు నింపు" అన్నారు. "అలాగే" అంటూ బావిలోంచి నీరు తోడిన శిష్యుడు, భుజాల మీద మోసుకుని వెళ్లి, స్నానాల తొట్టెలో నింపాడు. బొక్కెనలో ఉన్న కొంచెం నీటిని కింద పోసేసి వెంటనే బావి దగ్గరకు వెళ్లాడు.

గురువుగారు ఒక బెత్తం తీసి శిష్యుణ్ణి కొట్టాడు. 'ఎందుకని నీళ్లు పారబోశావు? ఆ నీళ్లు ఏ చెట్టుకైనా పోసి ఉండవచ్చుకదా!" అని అడిగాడు.

శిష్యుడు కన్నీళ్లతో కోపంగా తలెత్తాడు. "కింద పోసినవి ఒక గ్లాసుడు నీళ్లు కూడా ఉండవు. అవి పోస్తే చెట్టు ఆకాశం ఎత్తుకు ఎదగదు కదా!" అన్నాడు.

"మూర్ఖుడా! నేను చెట్టు ఎదగడం కోసం చెప్పానా? నువ్వు ఎదగడం కోసం చెప్పాను. రెండు చుక్కలైనా కూడా, వాటిని కూడా దండగ చేయకుండా, ప్రతిదాన్ని జాగ్రత్తగా చూసుకుంటేనే, నువ్వు ఎదగగలవు."

ఆ జెన్ గురువు చెప్పింది అతడి శిష్యుడికి మాత్రమే కాదు. మీకు కూడా! మీ కలలు నిజమవ్వాలంటే, ఎంత చిన్న అవకాశాన్నయినా కూడా నిర్లక్ష్యం చేయకుండా ఉపయోగించుకోడానికి తయారుగా ఉండాలి.

కలలకు ఎరువువేసి పెంచి పోషించడం తెలిసినవాళ్లు మాత్రమే చక్కగా జీవించగలరు. మిగిలనవారు ఈ లోకంలో ఏదో అలా బతికేస్తున్నారు. ఒక తరం అంతా కలలు కనడం మానేస్తే సమాజంలో ఏం అద్భుతాలు జరిగినా అవన్నీ దండగే! జీవితాన్ని సుఖంగా జీవించలేని వాళ్లకు ఏమిచ్చినా అర్థం లేదు.

స్వతంత్రానికి ముందు అందరికీ కలలుండేవి. ఆ కలలు ఫలించాలని తమ జీవితాల్నే పణంగా పెట్టడానికి తయారయ్యారు. అంత తీవ్రత ఉండటం వల్లే స్వతంత్రం అనే కల ఫలించింది. ఇప్పుడు పురోగతి గురించి, అంత తీవ్రంగా కలలుకనేవాళ్లు లేరన్నదే బాధంతా!

మీ భిక్షాపాత్రలో ఏం పడుతుందో అని తల పైకెత్తి చూస్తూ కూర్చోవాలని ఎందుకనుకుంటున్నారు? మీ కలలు నిజం కావాలని అంకితభావంతో ప్రయత్నించండి. ఆశ్చర్యకరమైన ఎత్తుకు మీరు ఎదగగల్గుతారు!

రష్యాలో బాలేడాన్స్ చాలా ప్రాధాన్యత పొందింది. లిన్‌కిన్‌స్కీ అనే కళాకారుడు బాలే నాట్యం కోసం తన జీవితాన్ని అర్పించాడు. అతను ఆడే ప్రతి ఆటలోనూ గిర్రున తిరుగుతూ, గెంతుతూ చాలా ఉత్సాహంగా ఆడేవాడు. భూమ్యాకర్షణ శక్తి అందరికీ సమానమే. అయితే, లిన్‌కిన్‌స్కీ, విజ్ఞానుల అంచనాను మించిన ఎత్తు ఎగిరి అందరినీ ఆశ్చర్యపరిచేవాడు.

దీన్ని గురించి అడిగితే "నా వల్ల అవుతుందా అని నేను ఆలోచించని సమయాల్లో నన్ను మించిన ఏదో శక్తితో నేను పనిచేయగలుగుతున్నాను" అనేవాడు.

లిన్‌కిన్‌స్కీ చెప్పేది నిజం. వందశాతం ప్రయత్నించేటప్పుడు మిమ్మల్ని మించిన ఏదో శక్తి మీలో ఉత్పన్నమవుతుంది. దాంతో మీరు ఏదైనా సాధించగలరు!

మీ కలను నిజం చేసుకోవాలంటే ఏం చేయాలి? రాబోయే ఐదేళ్లలో మీరు ఏం సాధించాలనుకుంటున్నారో తీర్మానించుకోండి. దానికి చక్కని ప్రణాళిక నిర్మించుకోండి. అటు దిశగా అడుగుపెట్టండి. ప్రతి అయిదేళ్లకు మీ కలల్ని పెంచుకుంటూ వెళ్లండి.

అత్యున్నత స్థాయిని చేరుకోవాలనుకుంటే, మెట్లెక్కే వెళ్లాలి. కాళ్లు నొప్పిచేస్తాయి. అలసట వస్తుంది. 'ఇది నీ వల్లకాదు, నువ్వు సాధించలేవు' అని మనస్సు భయపెడుతుంది. 'కాస్త విశ్రాంతి తీసుకో' అని చాపల్య పెడుతుంది. సందేహించకండి. చేసేదాన్ని మనస్ఫూర్తిగా చేస్తే ఏ బాధా, వేదనా రాదు. అత్యున్నత స్థాయికి చేరుకోగానే పడ్డ అలసటంతా మరపుకొస్తుంది.



**జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించాలనుకుంటే,**
**హద్దులు లేని ప్రేమను పంచి చూడండి.**
**అలాకాక జీవితాన్ని ఇచ్చిపుచ్చుకోవడమేనని ఆలోచిస్తే ఏమవుతుంది?**

ఈషాయోగా సెంటర్ గ్రామీణ పురోభివృద్ధి విషయంలో ఇంత ఆసక్తి చూపుతోంది కదా! దాని మర్మం ఏంటి? మీకు ఏదైనా రాజకీయ పార్టీలలో చేరాలని ఉందా?" అని నన్ను ఓ యువకుడు అడిగాడు.

ఆ ప్రశ్న ఎంత వేడుకగా అన్పించిందో, అంత వేదనగానూ అనిపించింది.

"ఇంటికి వెళ్లి మీ అమ్మను అడగండి. మిమ్మల్ని కని, మీకు పాలిచ్చి పెంచిందే అందులో ఏదైనా మర్మం ఉందా? అని. అటువంటి మర్మమే నాది కూడా!" అని ఆ యువకుడికి చెప్పాను.

ఇందులో అతని తప్పు కూడా ఏం లేదు. ఆదాయం లేకుండా ఏదో లాభం ఆశించకుండా ఏదీ చేయడానికి తయారవని వాళ్లతో ఈనాటి సమాజం నిండిపోయి ఉంది. అందువల్ల అన్నింటినీ అనుమానంతో చూడటం సమాజానికి అలవాటయి పోయింది.

జీవితాన్ని క్షణక్షణం పరిపూర్ణంగా అనుభవించాలనుకుంటే, హద్దులు లేని ప్రేమను పంచి చూడండి.

అలాకాకుండా, జీవితం అంటే ఇచ్చి పుచ్చుకోవడాలనే ఆలోచిస్తే, నెమ్మది అనేదే ఉండదు. ప్రతీదాంట్లో మీకు ఆదాయం ఏంటని ఆలోచిస్తూపోతే, మీ మనసులోకి సాతానును ప్రవేశించనిచ్చారనే అర్థం!

దేవాలయంలో ప్రతి నిమిషం ప్రేమను బోధించే ఒక ఫాదర్ రోడ్డు మీద వెళ్తున్నాడు. దారిలో ఒకడు రక్తం కారుతూ బాధతో గిలగిలలాడటం చూశాడు. ఆత్రుతతో అతణ్ణి తిప్పి చూసి ఆశ్చర్యపోయాడు.

అక్కడ ప్రాణాపాయస్థితిలో ఉన్నది మరెవరో కాదు సాతాను! ఫాదర్ కాస్త వెనుకడుగేశాడు.

'నన్ను ఎలాగైనా కాపాడండి' సాతాను వేడుకుంది.

"ఏంటి నిన్ను కాపాడాలా? నిన్ను ఈ లోకం నుంచి వెళ్లగొట్టాలనే కదా ఈ లోకంలోని ఫాదర్‌లంతా పోరాటం సలుపుతున్నాం?" అనడిగాడు ఫాదర్.

"పగవారిని కూడా ప్రేమించమని కదా మీ ఏసు చెప్పాడు! అది మరిచిపోతావా?"

"సాతాను కూడా ప్రవచనాలు చేయవచ్చు. అయితే, అది విని మోసపోవడానికి నేను తయారుగాలేను"

"నాకోసం కాదు. మీ కోసమే చెబుతున్నాను. నన్ను కాపాడలేకపోతే మీరే నష్టపోతారు. సాతాను లేకపోతే, దేవుడిని వెదుక్కుని ఎవరు వస్తారు?"

ఫాదర్ మనసులో కలత ప్రారంభమయింది.

"ఆలోచించండి. దేవాలయానికి భక్తులు రావడం ఆగిపోతే, మీ బతుకులు ఏమవుతాయి?"



ఇక ఏం మాత్రం ఆలస్యం చేయకుండా ఫాదర్ ఆ సాతానును ఆసుపత్రిలో చేర్చాడు. ఫాదర్‌ని కూడా ఒప్పించగల ఇచ్చిపుచ్చుకోవడమే సాతాను చేసిన వ్యాపారం. జీవితాన్ని ఇచ్చిపుచ్చుకోవడంగా మాత్రమే చూస్తే, మీ మనస్సును సాతానుకు వశం చేశారని అర్థం. ఆ తర్వాత లోపల, బయట అంతా నరకమే! ఎప్పుడూ పోరాటమే!

మీకు అసలైన గౌరవం మీరెంత సంపాదించగలిగారు వ్యాపారంలో అని కాదు. ఏమాత్రం మానవత్వంతో నడుచుకున్నారు అన్నదాంట్లోనే ఉంటుంది.

శంకరన్ పిళ్ళై తన దుఃఖాన్ని మర్చిపోవడానికి సారాయి కొట్టుకెళ్లాడు.

అతని భార్యకోపంగా ఇన్స్యూరెన్స్ కంపెనీకి వెళ్లింది. ఓ పెద్దగాలివానలాగ మేనేజరు గదిలోకి దూసుకెళ్లింది.


"మా ధాన్యపు గిడ్డంగిని ఐదు లక్షలకు ఇన్స్యూరెన్స్ చేశాం. ఆ డబ్బును మాకు లెక్క పెట్టి ఇవ్వండి" అంది.

"అమ్మా! మీరు ఇన్సూరెన్స్ చేశారా లేదా అన్నది మాత్రమే ముఖ్యం కాదు. నిజానికి ఆ వస్తువుకు అంత విలువ ఉందా అని తీర్మానించాకే మేము ఆ డబ్బు ఇవ్వగలం" అన్నాడు మేనేజర్.

శంకరన్‌పిళ్ళై భార్య కాసేపు ఆలోచించి, "అదే కానీ మీ కంపెనీ రూల్ అయితే నా భర్త మీద ఉన్న ఇన్స్యూరెన్స్ వెంటనే రద్దు చేయించండి" అంది.

చూశారా... మీ నిజమైన గొప్పదనం బయటకు మీరెంత విజయం సాధించారన్న దాంట్లో లేదు. మీలోని మీరు ఎటువంటి వారు అన్నదాంట్లోనే ఉంది!

మీకు ఆదాయం అనుకుని మరొకళ్లను పీడించాలనుకుంటే, మీ శక్తినంతా వాళ్లను పీడించడానికే నాశనం చేసుకుంటారు. దాన్ని వదిలిపెట్టి, మీరు ఏ వృత్తిలో ఉన్నా ఎదుటి వాళ్ల మీదున్న అభిమానాన్ని చాటడానికి దాన్నొక సాధనంగా, ప్రతీకగా అనుకోండి. విజయంతోపాటు సంతృప్తి, నిశ్చింత, ఆనందం మీ స్వంతమవుతాయి. మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి వరిస్తాయి.



**బయట ఉండే నీరు, మన్ను, గాలి అన్నీ కలిసే మీరు తయారవుతున్నారు. అంటే, అన్నింటిలోనూ మీరున్నారనే కదా? ప్రపంచంలో మీరొక భాగం అన్నట్లే ఈ ప్రపంచం కూడా మీలో ఒక భాగమే అని అర్థం చేసుకోగలుగుతున్నారా?**

మీరు పుట్టినప్పుడు మీ శరీర ప్రమాణం ఎంతుండేది? ఇప్పుడు ఎంతుంది? మధ్యలో అది ఎదిగి ఇలా అవడానికి ఏం చేశారు? తిండి పెట్టారు!

మీకు భోజనం ఎక్కడి నుండి వచ్చింది? ఈ నేల మీద నుంచి, మీరు తినే ప్రతి కాయా, ధాన్యం ఈ నేల, ఈ నీరు వల్లా తయారయినవే కదా!

మీరు మాంసాహారులయితే, మీరు తినే కోడి, మేక ఈ భూమిమీదున్న వాటిని తినే కదా పెరిగాయి. తర్వాత మీ ఆకలిని తీర్చాయి. అంటే, మొత్తానికి ఈ మట్టివల్లే



మీ శరీరం పెరిగింది. మీలో మన్ను చేరను చేరను దాన్ని 'నేను' అని మీరు అంగీకరిస్తున్నారు.

ఒక ముంతలో నీరుంది. మీరూ అదీ ఒకటా? కాదు. అంటారు. ఆ నీళ్లు తాగేయండి. అవి మీ శరీరంలో కలిసిపోగానే ఏమంటారు? మీరు అనే కదా! అంటే, మీ అనుభవంలోకి వచ్చేదాన్ని మీరు అని గుర్తిస్తున్నారు. బయట ఉండే దాకా అది వేరు, మీరు వేరు అనుకుంటారు.

బయట ఉండే నీరు, మన్ను, గాలి, వేడి అన్నీ కలిసే మీరు తయారవుతున్నారని అర్థం చేసుకోగలుగుతున్నారా? అవి మీలో కలిసిపోయాక వాటిని వేరువేరుగా విడదీసి చూపించడం అనేది సాధ్యం కాదు.

మీ పూర్వీకులు చనిపోయిన తర్వాత ఎక్కడికి పోయారు? పూడ్చినా, కాల్చినా ఈ మట్టిలోనే కదా! వాళ్లమీదే మీరు రోజూ నడుస్తున్నామని మర్చిపోకండి. మీరు మాత్రం ఎక్కడికెళ్తారు? మీ మూల వస్తువైన ఈ మట్టిలోకే! కొంచెం మన్ను మీ రూపంతో శ్వాసిస్తోంది. మరి కొంచెం మట్టి మీ తోటలో చెట్టుగా పెరిగింది. ఇంకాస్త మీరు కూర్చున్న కుర్చీగా మార్పు చెందింది.

ఈ మన్నే మార్పు చెంది మామిడిచెట్టుగా, వేపచెట్టుగా, గడ్డిగా, పువ్వుగా, వానపాముగా, మనిషిగా... ఇలా ఎన్నో అవతారాలు ఎత్తుతోంది. ఇంకా ఎత్తుతుంది. బిందెలో ఉన్నా, చిన్న ముంతలో వున్నా నీరనే కదా పిలుస్తాం? అది న్యాయమే కదా! అలాగే మీరునూ?

సేకరించబడ్డ వస్తువులు వేరు వేరయినా, అన్నింటిలోనూ ఉండే మూల వస్తువు మాత్రం మన్నే కదా? నీరే కదా? ఇదీ గాలే కదా? ఇదీ వేడే కదా?

అంటే, అన్నింటిలోనూ మీరున్నారనే కదా అర్థం?

సూక్ష్మంగా చెప్పాలంటే, ఈ ప్రపంచంలో మీరొక భాగం అన్నట్లే ఈ ప్రపంచం కూడా మీలో ఒకభాగమే అని అర్థం చేసుకోగలుగుతున్నారా? ఇది బుద్ధిపూర్వకంగా ఆలోచిస్తే ఆశ్చర్యకరంగా ఉండవచ్చు. అంతే! అయితే అందుకు బదులుగా, మీ ఆలోచనల్లో ఇది కలిసి విరిస్తే, మీలో ఒక పెద్ద మార్పు ఫెటిల్లుమనవచ్చు.

ఇదే అసలైన ఆధ్యాత్మికత.

అంతే తప్ప ఆధ్యాత్మికతంటే గుడికెళ్లి కొబ్బరికాయ కొట్టడం కాదు. కొవ్వొత్తి వెలిగించడం కాదు. మోకాళ్లమీద కూర్చుని ప్రార్థించడం కాదు. ఇది అర్థం చేసుకోండి.

భగవంతుడి కోసం ఎదురుచూస్తూ వుండకుండా, మీ స్వర్గాన్ని మీరే నిర్ణయించుకోవచ్చు.

ఒక యోగి ప్రాణావసానస్థితిలో ఉన్నాడు. శిష్యులతో తాను స్వర్గానికెళ్లాలని నిశ్చయించినట్లు చెప్పాడు.

"మీకు స్వర్గమో, నరకమో భగవంతుడు ఏం నిశ్చయించాడో ఎవరు చూడవచ్చారు? మీకు మాత్రం అది ఎలా తెలుసు?" అని అడిగాడు ఒక శిష్యుడు.

"భగవంతుడి మనసులో ఏం ఉందో నాకు తెలియదు. నిజమే! అయితే, నా మనసులో ఏముందో నాకు తెలుసుగా! నరకం అని అందరూ అనుకునే చోటికి నన్ను పంపినా దానినే స్వర్గంగా మలచుకోగలిగే నేర్పు నాకు వుంది!" అని సమాధానం చెప్పాడు గురువు.

నిజమే. మీ మనసు కోరుకుంటే దేనినైనా స్వర్గంగా మార్చవచ్చు. లేదా నరకంగా! అది బయటనుంచి రాదు. మీరూ, మీ పక్కన ఉన్నదీ ఒకటే అనుకుంటే, ఆ విషయాన్ని గుర్తిస్తే ఆ తర్వాత ఎవరితో దెబ్బలాడతారు? ఎవరితో పోటీ పడతారు? ఎవరి మీద పగసాధిస్తారు?

మీలో ఈ అనుభవం వచ్చాక, బయట ప్రపంచం ఎలా ఉన్నా మీలో మీకు ఎప్పుడూ స్వర్గమే.



**అలలపై తేలే వస్తువు అలలతోపాటు పైకిలేచి మళ్లీ కిందపడుతుంది.**
**అలాగే, సమాజంలో ఏ అల చెలరేగుతుందో,**
**దానికి తగ్గ చదువు చదివిన వాళ్లను అది పైకి తీసుకెళుతుంది.**
**అయితే, అది నిజమైన గెలుపేనా?**

యౌవనమనేది ప్రకృతి ఇచ్చిన అద్భుతమైన అవకాశం. కొందరు దాన్ని చక్కగా వినియోగించుకొని గొప్పవాళ్లయ్యారు. కొందరు దాన్నికల్లోలపరచి పనికి రాకుండా చేశారు. మరికొందరు మార్పురావడానికి అవకాశం లేనంతగా, కఠినంగా గడ్డకట్టుకు పోయారు.

ఇప్పుడున్న యువతరం కొత్తగా తయారవుతున్న వాళ్లు, లేతపాకంగా ఉండటం వల్ల వాళ్లను తమ ఇష్టప్రకారం రూపుదిద్దడానికి రాజకీయవేత్తలు, ఆధ్యాత్మికవాదులు

ఇలా అందరూ అనుకుంటున్నారు. యువతను తమ అధీనంలో ఉంచుకోవాలని ఏవేవో తంత్రాలు పన్నుతారు. యువత ఈ ప్రపంచానికి శాపంగానో, వరంగానో తయారవడం వాళ్ల చేతుల్లోనే వుంది.

మట్టిలో నాటబడ్డ రెండు విత్తనాలు, ఆ మన్నునే తిని ఆ నీటినే తాగి పెరుగుతాయి. అయితే మామిడిపళ్లనిచ్చే చెట్టుకూ, వేపపళ్లను ఇచ్చే చెట్టుకూ రుచిలో ఎంత తేడా? మనమంతా ఒకే మూలవస్తువు నుంచి రూపుదిద్దుకున్నాం. ఆ మట్టినే తింటున్నాం. ఆ నీటినే తాగుతున్నాం. ఆ గాలినే శ్వాసిస్తున్నాం. అయితే, దానిలో దేన్నంతా సేకరించి మనలో మనం చేర్చుకుంటున్నామో, దాన్ని బట్టే మనకు అసలైన గౌరవం లభిస్తుంది.

నగరం మధ్యలో ఇద్దరు ఎదురెదురుగా వస్తూవున్నారు. ఒకడు తన కుడికాలును ఈడుస్తూ నడుస్తున్నాడు. ఎదురుగా వస్తున్నవాడూ అలాగే తన కుడికాలును ఈడుస్తూ నడుస్తున్నాడు. వాళ్లిద్దరూ దగ్గరగా వచ్చారు.

మొదటివాడు తన కుడికాలును గర్వంగా తట్టి చెప్పాడు. “భారతీయ సైన్యంలో వాణ్ణి. సరిహద్దుల్లో వచ్చిన యుద్ధంలో కాలులో గుండు దూసుకుపోయింది.”

ఎదుటివాడు ఏమాత్రం వెనుకాడలేదు. అతడు తన కాలిని తట్టి చెప్పాడు. “వీథి వీథినా అడుక్కుంటా. ఏభై అడుగుల ముందే... కాలితో తొక్కాగేదెపేడ”.

దూరం నుంచి చూస్తే ఇద్దరూ పాదాన్ని ఆన్చలేక నడవడం మాత్రమే తెలుస్తుంది. అయితే, కారణం తెలుసుకున్నాక ఇద్దరినీ ఒకేలా గౌరవిస్తామా?

గమనించకుండా అన్నిటినీ సేకరించడంవల్లే మనిషి తనకు సంబంధంలేని గుణాలనన్నింటినీ కూడా స్వంతం చేసుకుంటున్నాడు. సరికాని దారిలో తాను కోరకనే పయనిస్తున్నాడు. ప్రయాణం మొదలుపెట్టబోయే యువత కాస్త జాగ్రత్తగా వుంటే, దారిలో దేన్ని సేకరించుకుంటారు. అల్పమైన విషయాన్నా... అద్భుతాన్నా?

కడలి అలలు ఒక కాగితాన్ని ఎత్తుగా తీసుకెళ్తాయి. కిందపారేస్తాయి. ఒక కర్రను ఎత్తుతాయి. దాన్నీ పారేస్తాయి. ఏదో చెత్తనూ అంతే...

అలలపై తేలే వస్తువు అలలతోపాటు పైకిలేచి మళ్లీ కిందపడుతుంది. అలాగే, సమాజంలో ఏ అల చెలరేగుతుందో, దానికి తగ్గ చదువు చదివినవాళ్లను అది పైకి



తీసుకెళుతుంది. సాపాటుకు సులభమైన మార్గమవుతుంది. అయితే, అది నిజమైన గెలుపేనా? కాగితమో, చెత్తో పైకి లేచినంతమాత్రాన అది గెలుపనగలమా? కిందకుపడటం ఓటమి అని చెప్పగలమా?

అదేవిధంగా ఈనాటి యువత గెలుపు ఓటములు అర్థంపర్థంలేకుండా తయారయ్యాయి.

చదువు ఎక్కడంలేదా? వ్యాపారంలో మెళకువలు అర్థం కాలేదా? ఏదైనా మీ చేయి జారిపోతుందనిపిస్తోందా? యువతరమా! ఇక వాటికంతా భగవంతుడిని తోడు పిలవకండి. మన బుద్ధిలేనితన్నాన్ని సరిదిద్దడానికి ఆయన ఖాళీగా ఏమీ కూర్చుని లేడు.

ఏది అవసరమో, ముందు దానిమీద ఆశను పెంచుకోండి. ఇష్టంగా తింటేనే రుచి తెలుస్తుంది. ఇష్టంతో చేస్తేనే అందం అగపడుతుంది. ఇష్టం సంతోషాన్ని ఇస్తుంది. ఏ పనైనా ఇష్టపడి చేస్తే మన శక్తి అంతా ఉపయోగపడుతుంది. ఇష్టాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవడం నేర్చుకోండి. అంటే, వాటిని నెరవేర్చడానికి దేవుడు అక్కర్లేదు.

మీ శరీరం ఎక్కడనుంచి తెచ్చుకున్నారు? ప్రతి రోజూ మీరు పీల్చుకునే గాలి, తాగేనీరు, తినే తిండి వీటి కలయికే శరీరం. వద్దని ఒక్కరోజు కూడా ఈ కూర్చుకొన్న వాటిని శరీరంలోంచి తీసి పారేయలేరు. అందువల్ల రోజు గడిచే కొద్దీ వయసు ఎదుగుతుంది.

ఆరోగ్యంగా శరీరాన్ని ఉంచుకోవచ్చు కాని, వయస్సులోని ఒకరోజుని కూడా వద్దని పారేయలేం.

మనస్సు ఎక్కడి నుంచి తెచ్చుకున్నారు? పుట్టినప్పటి నుంచి నీ చుట్టూ ఉన్నవన్నీ నీమీద విసిరేసిన భావాలు, మీరు చదువుకొన్న చదువు, మీరు పొందిన అనుభవాలు, సమాజం మోపిన అభిప్రాయాలు, అన్నింటినీ పోగు చేసుకొన్న కుప్పతొట్టిలాంటిది మనసు.

అన్నింటినీ అలాగే దాచుకోవాలన్న నిర్బంధం ఏం మీకు లేదు. ఏవేవి వదిలించుకోవచ్చు అని మీరే ఆలోచించుకోవాలి. అది మీ చేతిలోనే ఉంది.

సేకరించుకొన్నవాటన్నింటినీ మీరు తలచుకుంటే ఒక్కక్షణంలో అవతలికి విసిరిపారేయవచ్చు.

అవసరం లేని వాటన్నింటినీ వదిలేసి, మనస్సును ప్రతి రోజు అప్పుడే కొత్తగా పుట్టినట్లు చేయగల స్వాతంత్ర్యం దాని వయసు పెరగకుండా దాన్ని యౌవనవంతంగా ఉంచుకునే అవకాశం మీకు ఉంది.

యోగా వల్ల ఇది సాధ్యమే! అదే రహస్యం. ఆ అవకాశాన్ని మాత్రం పోగొట్టుకోకండి.



**ఆశ అన్నది బయటనుంచి వచ్చే ఒక అవస్థలా కాకుండా, మీ మానసిక భావనే అవుతుంది. ఆశ మిమ్మల్ని నడిపించడం కాదు. మీరే మీ ఆశను నడుపుతారు. ఎలా?**

మీకు ఎంత గొప్ప సామ్రాజ్యం దక్కినా, పూర్తి తృప్తి లేక ఏదో ఒక కొరతతో మీరు బెంగపడటాన్ని గుర్తించారా? ఎంత దక్కినా సరే, ఇంకా ఇంకా కొంచెం.. ఇంకా ఏదైనా అని ఎప్పుడూ ఏదో ఒక ఆశ ఒక జ్వాలలా మీలో మండుతూనే ఉండటాన్ని గమనించారా?

ఎందుకిలా జరుగుతుంది?

కొలవగల దేన్నిచ్చినా మీకు సంతృప్తి రావడం అన్నది అబద్ధం. నిజానికి, మీ బాధంతా దొరికిన దాన్ని ఎలా దక్కించుకోవాలా అన్న ఆలోచనతో వచ్చింది కాదు.

మరి? ఎల్లలులేని ప్రపంచంలో భాగమైన మీరు, అర్థం లేకుండా మిమ్మల్ని ఒక ఎల్లలో ఉంచుకోవడాన్ని అలవాటు చేసుకొని, అణచి ఉంచుకోవాలని అనుకోవడం వల్ల వచ్చిన గొడవే ఇదంతా.

ఎదిగి ఎదిగి ఎల్లలులేని దానితో కలసిపోవాలని తపించడం వల్ల, వేరే ఏది ఇచ్చినా మీ ఆశ పూర్తిగా తృప్తి పడక ఏదో కొరతను అనుభవిస్తోంది. ఈ విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే, బాధకు అవకాశమే లేదు.

ఈ ప్రపంచం, మీరూ ఒకటే అన్న విషయాన్ని అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నాక, ఆశ తన బెంగను తానే వదిలేస్తుంది. ఆ తర్వాత ఆశ అన్నది బయట నుంచి వచ్చే ఒక అవస్థలా కాకుండా, మీ మానసిక భావనే అవుతుంది. ఆశ మిమ్మల్ని నడిపించడం కాదు. మీరే మీ ఆశను నడుపుతారు. అదెలా?

క్రికెట్ ఆడాలనుకుంటున్నారా? ఆ ఆశను పూర్తిగా పడండి. వ్యాపారంలో గెలవాలనుకుంటున్నారా? ఆ ఆశను వాడుకోండి. ఏది చేసినా, దానితో ఉండే క్షణాలన్నీ అదే మీ జీవితం అన్నట్టు పరిపూర్ణమైన ఆశతో ప్రయత్నం చేయండి. ఆ ఆటలు పూర్తయ్యాక, దాని మీద ఆశను మూటకట్టి ఓ పక్కన పెట్టేస్తారు.

గుర్రానికి వెనుక బండిని కడితే అది ఏ బాధ లేకుండా లాగుతుంది. అలాకాకుండా, బండిని గుర్రానికి ముందు కట్టి, లాగమంటే? గుర్రం ఎంత బలమైనదైనా, సామర్థ్యమున్నదైనా బండి తలక్రిందులవుతుంది.

సంతోషం, ఆశ కూడా గుర్రం బండిలాంటివే! ఆశ వల్ల సంతోషం వస్తుంది అనుకోకుండా, మీ సంతోషాన్ని బయటపెట్టే దారిగా ఆశను వాడుకుని చూడండి.

శంకరన్‌పిళ్ళైకు పెద్ద గుండెజబ్బు వచ్చింది.

"తెల్లారితే గొప్ప విషయమే!" అన్నారంట డాక్టర్లు.

శంకరన్‌పిళ్ళై భార్య కొంచెంసేపు ఏడ్చింది. తన భర్తకు క్యారట్ హల్వా అంటే ఇష్టమని ఆమెకు గుర్తు వచ్చింది. మర్నాడు ఆ అవకాశం ఉంటుందో లేదో! అతని ఫోటో ముందు నైవేద్యం పెట్టడానికి తయారుచేసి ఫ్రిజ్‌లో పెట్టింది. తర్వాత ఏడిచి, ఏడిచి నిద్రపోయింది.



శంకరన్‌పిళ్ళైకు మధ్య రాత్రి మెలకువ వచ్చింది. ఫ్రిజ్ తెరిచాడు క్యారట్ హల్వా చూడగానే నోట్లో నీళ్లూరాయి. ఆశగా ఒక చెంచా తీసుకున్నాడు.

టప్‌మని అతని చేతిమీదో దెబ్బపడింది. వెనక్కి తిరిగాడు. భార్య కోపంగా "మీకు నైవేద్యం పెట్టాలని చేసిన దాన్ని ఇలా తింటే ఏంటి అర్థం?" అని విసుక్కుంది.

కోరినదాన్ని పొందే ప్రయత్నం చేస్తేనే ఆనందం లభిస్తుంది. అనుకోకుండా, అది పూర్తి అయ్యాక ఆనందం లభిస్తుందని ఎదురుచూడటం, ప్రాణాలతో ఉండగా తినకుండా, ప్రాణంపోయాక నైవేద్యం పెడితే ఎంతో అంతే!

ముగింపు ఏంటి అనే ఆశ వదిలి, చేయడానికే ప్రయత్నించండి. ఆనందాన్ని నిశ్చయమైన ఆశగా పెంచుకోండి దుఃఖం అన్న మాటకే అర్థముండదు.

మీ సంతోషం ఆ తర్వాత గెలుపా? ఓటమా? అనే ప్రశ్నను కూడా ఎదురుచూడదు!

**ఆశ పడకు అని బుద్ధుడు చెప్పాడు.**
**అన్నింటికీ ఆశపడు అని మీరు చెపుతున్నారు.**
**మేము ఈ అజ్ఞానాన్ని పోగొట్టుకోవడం ఎలా?**

'ఆశపడకు' అని బుద్ధుడు చెప్పాడు. అయితే, మీరో? 'అన్నిటికీ ఆశపడు' అని చెప్తున్నారు. ఏంటి ఎందుకొచ్చిందీ తేడా?' అని నన్ను చాలామంది అడిగారు. తన జీవితకాలంలోనే అందరికీ జ్ఞానాన్ని పంచాలని ఆశపడ్డాడు బుద్ధుడు. మరి మిగిలిన వాళ్లను ఆశపడవద్దని ఆయన అని ఉంటాడా?

అస్సలు కాదు. మీ కోరికలు చాలా పెద్దవే కానీండి. వాటిని పొందడానికి మీరు చాలా జాగ్రత్తగా ప్రయత్నించండి. జాగ్రత్తతో మీరు కోరుకున్న దాన్ని సాధించడానికి ప్రయత్నిస్తే అనుకున్నది సాధించవచ్చు!

ఆశ దుఃఖం కాదు. దాన్ని గురించి తెలీని అజ్ఞానమే దుఃఖం! ఇది అర్థం చేసుకోకుండా, ఆ ఆశను వ్యాపారం మీదో, భూమిమీదో, ఎదుటివారిమీదో, ఆధ్యాత్మికత



మీదో, అధికారం మీదో నిలిపి దానిని గుర్తిస్తే మీకు తృప్తి వుండదు. చివరకు అసంతృప్తే మిగులుతుంది.

ఈ అజ్ఞానాన్ని పోగొట్టుకోవడం ఎలా?

చక్కటి యోగావల్ల ఈ ఇరుకు ఎల్లల్ని పగలగొట్టొచ్చు. మహదానందాన్ని అనుభవించి రుచి చూడవచ్చు. మీలో దాగివున్న శక్తిని పూర్తిగా వినియోగిస్తే, ఆ తర్వాత వ్యాపారమో, కుటుంబమో, ఆధ్యాత్మికమో ఏది కావాలన్నా ఏ గాయాలూ లేకుండా, ఒక మంచి ఆటాడి చూడవచ్చు. మీ మనసుకు ఈ అనుభవం ఏర్పడే వరకూ, బయటనుండి సేకరించిన కుశలతల వల్ల ఆటాడగలరేమో! చూడండి!

ఎంత కోరుకున్నా, మీ నేర్పుకు తగినంత మాత్రమే దక్కుతుంది. అయితే, ఆశతో మీరు ఏదైనా చేయడం ప్రారంభిస్తే, అదే మీకు సంతోషాన్నిస్తుంది. ఓటమి కూడా దుఃఖాన్నివ్వదు. లభించిన వందలాది వాటిని మర్చిపోయి, దొరకని ఏదో ఒక విషయంకోసం ఆత్మహత్యలాంటి మూర్ఖపు ఆలోచనలు మీ దరి చేరకుండా ఉంటాయి.

అందరికీ ఒకే స్థాయిలో డబ్బో, పదవో, అధికారమో, వసతులో లభించడం అంటే సాధ్యం కాకపోవచ్చు. అయితే, అందరికీ మనసులో ఒకేరకమైన, ఒకే స్థాయిలో ఆనందం అనుభవించడాన్ని ఎవరు కాదనగలరు? ఆశ అనేదాని అసలు రూపం, తత్త్వం తెలియనివాళ్లే ఈ వ్యాపారం కావాలి, ఈ ఇల్లు కావాలి, ఈమె కావాలి అనే ఇరుకుల్లో అణగి అల్పమైన ఆశలను పెంచుకుంటారు.

అలా, ఏదో ఒకదానిమీద ఆశ పెంచుకోకుండా, అన్నిటిమీదా మీరు ఆశను పెంచుకోవాలనుకుంటే, అది పూర్తి జాగరూకతతో మాత్రమే చేయగలరు.

అలా పూర్తిగా జీవించడం ప్రారంభిస్తే, దీన్నే మీది అని స్వంతం చేసుకోవాలన్న ఆలోచనను వదిలేసి, అన్నీ మీరే అని అర్థం చేసుకోగలుగుతారు. అందుకే, అన్నిటి మీదా ఆశపడమని మీకు చెప్తున్నాను. జాగ్రత్త వహించండి. అన్నిటిమీదా ఆశ పెంచుకుంటే, మీ జీవితాన్ని పరిపూర్ణంగా మీ ఇష్టప్రకారం ఏర్పరచుకోగలుగుతారు.

ఆశ పెరిగి పెరిగి ప్రపంచాన్నే తనలో లీనం చేసుకుంటుంది. ఆ తరుణంలో అంతులేని ఆనందాన్ని మీరే అనుభవించగలుగుతారు. బుద్ధుడికి అందిన జ్ఞానం, నాకు లభించిన ఆనందం ఇక్కడున్న ప్రతి ఒక్కరికీ సాధ్యమే! అందుకే, అన్నిటిమీదా ఆశ పడండి.

# సద్గురుతో ముఖాముఖి

**స్థిరంగా ఉండని మన మనసును నియంత్రించడం ఎలా?**

ఏది వద్దనుకుంటారో అదే కోరుకుంటుంది మనసు. మీకు ఎర్రరంగు ఇష్టం లేదనుకోండి. ఎక్కడికెళ్లినా అదే రంగు మీ కళ్లకు కనిపిస్తుంది.

చిన్నతనం నుండి మనసును నియంత్రించుకోవాలని పెద్దలు, చెప్పగా వినివుంటారు. చెడు ఆలోచించవద్దంటారు. చివరికి ఎప్పుడు ఏది చేయకూడదో, ఏది ఆలోచించకూడదో నేర్చుకోవడం జరుగుతుంది. ఏది చెయ్యాలో, ఏది ఆలోచించాలో తెలుసుకునే సమయముండదు.

ఫలితంగా మనసంతా చెడు ఆలోచనలతో నిండిపోతుంది. మీ మనసులో భాగాహారాలు, తీసివేతలే వుండవు. హెచ్చవేతలు, కూడికలే వుంటాయి.

బలవంతంగా ఏ ఆలోచనయినా మనసులో నుండి తొలగించగలరా? ప్రయత్నించి ఫలానాది తొలగించామని చెప్పండి. మీరు మనసుకు సంబంధించిన ప్రాథమిక అంశాలు అర్థం చేసుకోకుండా సంక్లిష్ట అంశాల గురించి ఆలోచిస్తున్నారు అనిపిస్తున్నది.

**వాస్తు అంటే ఏమిటి? ఒక్కొక్కరు ఒకలాంటి వాస్తు సూచిస్తున్నారు. ఎవరిని నమ్మాలి. నిజమైన వాస్తు ఏది?**

వాస్తు అనేది గృహనిర్మాణ విజ్ఞానంలో భాగం. స్థలం ఎంతవుంటే అంత ఇల్లు కట్టుకోవచ్చు. ఆ స్థలంలో వీచేగాలి, అక్కడి వాతావరణం బట్టి ఎన్ని కిటికీలు, తలుపులు వుండాలి, ఎంత ఎత్తు గోడలు వుండాలి వంటి విషయాల్ని తెలియజెపుతుంది.

వాస్తు ఒక ప్రదేశానికి మరో ప్రదేశానికి భిన్నంగా వుంటుంది. తుఫాన్లు వచ్చే సముద్రతీరంలో ఇళ్ల నిర్మాణం కోసం వాస్తు ఒకరకమైన సూచనలు చేస్తుంది. కొండలమీద ఇళ్ల నిర్మాణం మరో రకంగా వుండాలంటుంది. లోయ, గుట్ట, మైదానం... వంటి భౌగోళిక ప్రాంతం బట్టి వాస్తు మారుతుంది.



అందుకే భిన్న వాస్తులు వున్నట్టు అనిపిస్తుంది. ఇది ప్రాంతీయం.

అయితే గత రెండు దశాబ్దాలుగా వాస్తును పెద్ద వ్యాపారంగా మార్చారు. వాస్తును అర్థంలేని విధంగా చెపుతున్నారు. ఆరోగ్యం, ఆయుష్షు, విద్య, ధనం, సంతానం... అన్నింటికీ వాస్తుతో ముడిపెడుతున్నారు. అందుకే వాస్తు పిచ్చి అనే పదం పుట్టింది.

మనిషిలోని భయాన్ని వాస్తు పేరుతో డబ్బు చేసుకుంటున్నారు. భయపడుతున్న వారిని నమ్మించడం సులభం. ఇంటి కొలతలు, కిటికీలు, తలుపులు నన్ను రూపుదిద్దుతాయని అనుకోవడం మూర్ఖత్వం. ప్రాణంలేని చెక్క, ఇనుము, సిమెంట్‌ల వల్ల మన జీవితం మారిపోతుందా! ఆ విధంగా మారే జీవితం అవసరమా మనకు.

మన జీవితాన్ని మానవత్వమే రూపుదిద్దాలి. ఇంటి మూలలు, కొలతలు జీవితాన్ని మార్చలేవు. భయం పోయి జ్ఞానం సంపాదించుకుంటే మేలు.

**మా ఊర్లో నా మాటను ఎవరూ జవదాటరు. సమస్యలేమయినా ఉంటే పంచాయతీ పెట్టి తీర్పు చెబుతారు. కాని నా కుమార్తె నా మాట లెక్క చేయకుండా కొన్ని పనులు చేస్తుంది. నా కూతురికి ఎలా నచ్చచెప్పాలో తెలియడం లేదు? నన్నేం చేయమంటారు?**

ఇండియా ప్రధాని మరియు అమెరికా ప్రెసిడెంటు ఇరువురు ఒక హోటల్‌లో కలిశారు. అప్పుడు ఇంగ్లాడు ప్రధాని అనుకోకుండా వచ్చి వీరిద్దరినీ చూసి ఇక్కడ మీ ఇద్దరి కలయికకు కారణం – ఏమిటని అడిగారు.

అప్పుడు ఇండియా ప్రధాని ఇలా అన్నారు. 'తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ మీద అణ్వాయుధాలను ప్రయోగించి 14 మిలియన్‌ల ప్రజలను వారితో పాటు ఓ గుడ్ల వ్యాపారిని చంపాలనుకుంటున్నాము' అని.

ఇది విని ఇంగ్లండు ప్రధాని ఖంగుతిని– 'గుడ్లు అమ్మేవాడా' అనడిగారు.

ఇండియా ప్రధాని, అమెరికా ప్రెసిడెంటు వైపు తిరిగి 'నేను ముందుగానే చెప్పాను కదా! పాకిస్థాన్ గురించి చెబితే ఎవరు పట్టించుకోరని' అన్నారు.

అలాగే మనకు కావలసిన వారైతే ఒక విధంగానూ, బయటివాళ్లైతే మరో విధంగానూ మనసు తీర్పు రాస్తుంది. ఆ బాంధవ్య మోహాలలో చిక్కుకోవద్దు. అన్ని సందర్భాల్లో మీకు అనుగుణమైన నిర్ణయం తీసుకోకూడదు. అవసరాన్ని బట్టి నిర్ణయం తీసుకోవాలి.

ఒక మహావృక్షాన్ని అడ్డంగా గొడ్డలితో మాత్రమే నరకగలము. అలాగే దాన్ని సాధారణ బ్లేడుతో నరకలేము. కొన్ని సందర్భాలలో మనం ఎలా నడుచుకోవాలో నిర్ణయించాల్సి నీవు కాదు. ఆ సందర్భం యొక్క అవసరమే దాన్ని నిర్ణయించు కుంటుంది.

నా భార్యా పిల్లలని... భావావేశాలతో నిర్ణయం తీసుకుంటే, అది బుద్ధిహీనతగా తీసుకున్న నిర్ణయమని, అపాయమని తర్వాత తెలుస్తుంది.

**ఈ రోజుల్లో కూడా ఆడవారిపై మగవాళ్లు అధికారం చలాయించడం ఎందుకు అనుమతిస్తున్నారు?**

మగవారికి శరీరపరంగా కోరికలను పంచుకోవడానికి, ప్రేమను పంచుకోవ డానికి, ఒక స్త్రీ అవసరం. లేకుంటే మగవానిలోని మొరటుతనానికి ఆడజాతి ఎప్పుడో అంతరించిపోయేది.

నిజానికి మగవానికి ఆడవాళ్లపై ఎటువంటి ద్వేషాలూ లేవు. వారి పెద్దలు చెప్పిన విధంగా ఆడవారిపై ఆధిపత్యం చలాయించమని చెప్పిన సూత్రాలనే అతను అవలంభిస్తున్నాడు.

ఆడవారిని మగవారు కామవాంఛలకు మాత్రమే కాకుండా, తనూ మనిషేనన్న మానసిక పరిపక్వత ఎప్పుడు కలుగుతుందో అప్పటివరకు ఆడవాళ్లపై ఆధిపత్యం జరుగుతూనే ఉంటుంది.

మగవారిలో అభిప్రాయాలకు మించి, ఒక ఆడది పైచేయిగా ఉంటేనే, మగవారికి మించి, ఆడవారికి పూర్తి స్వాతంత్ర్యం లభిస్తుంది.



**ఏవి పాపపు పనులు?**

ప్రపంచంలో ఉన్న అయిదు ప్రముఖ మతాలను తీసుకుని, ఆ మతాలు పాపంతో కూడినవి అని పేర్కొన్న అంశాల జాబితా తయారుచేసి గమనిస్తే అర్థమయ్యే అంశం అసలు బతకడమే ఒక పాపంగా ఆ మతాలు పేర్కొన్నాయని అర్థమవుతుంది.

ఏదో ఒక అంశం మీద మీకు పాపభీతి కలిగించకపోతే మీరు మసీదుకో, మందిరానికో, చర్చికో వెళ్లరు.

పాపం, భయం... ఈ రెండు అంశాలతోనే మతాలు ప్రజలపై పెత్తనం చేస్తున్నాయి. భయం, పాపచింతన అనేవి తొలగిపోతే ప్రార్థనాలయాలకు వెళ్లేవారు ఎవరుంటారు?

మతాలు నిర్దేశించిన వాటికి తోడు మనిషిలోవున్న అత్యాశ అతణ్ణి దేవాలయాలవైపు నెడుతున్నది.

చాలామంది ప్రార్థనలో కోరుకునేది "నాకు అదివ్వు... ఇదివ్వు... నన్ను రక్షించు అనేగా! స్వార్థం, భయం, పాప చింతననుండి వచ్చిన కోర్కెలే అవి.

జీవితమే పాపం అని చెప్పి ప్రతిక్షణం పాపిలాగా బతకమంటుంది మతం. ప్రతిక్షణం భగవంతుని తలచుకోవాలి. ప్రతిరోజు మసీదు, మందిరం, చర్చికి వెళ్లి కానుకలు, డబ్బు లేదా సేవ రూపంలో సమర్పించుకుని, అక్కడి మత పెద్దలకు అణికిమణిగి ఉండేలా చేస్తున్నారు. కాదంటారా?

నేను చెప్పేది ఏమిటంటే...

మీరు ఏమి చేయదలచుకున్నారో అది చేయండి. అయితే ఆ పని చేయబోయే ముందు ఆ పనిఫలితం ఆలోచించండి. ఆ ఫలితం ఎలా వున్నా ఆనందంగా స్వీకరించగలిగితే ఆ పని చేయండి. ఆ పనివల్ల దుష్ఫలితాలు వచ్చి అవి తట్టుకోలేక చింతించేవారు ఆ పనులను చేయకుండా వుండాలి.

మీరు చేసిన పనికి మర్నాడే ఉరితీస్తారని తెలిసినా ఆ పని చేసి ఉరితాడును ముద్దాడగలిగిన మనస్తత్వం మీదైతే ఆ పనిని భయపడక చేయండి. భగత్‌సింగ్ అలాంటి వాడే.

జీవితంలో మీరు చేసే ఏ అంశం చేపట్టినా అది ఆలచోన, భావోద్రేకమైనా, వాస్తవ పని అయినా దానికి ఏదో ఒకరకమైన ఫలితం ఉంటుంది. ఆ ఫలితం అందుకునేందుకు మీరు సిద్ధమా! సగటు మానవుడిగా మీకు ఆ ముందు ఆలోచన ఉండి తీరాలి.

పాపమనేది లేదు. దాని అర్థం ప్రతి పని పుణ్యమనేనా! కాదు... పాపం లేదు పుణ్యమూ లేదు. మనుషులకు నియంత్రించేందుకు పెట్టినదే పాపపుణ్యాలు. నిజానికి మీ జ్ఞానం మిమ్మల్ని నియంత్రించాలే కాని అపరాధ భావన కాదు.

మనుషుల విచక్షణాజ్ఞానం మీద నాకు విశ్వాసముంది. ఆ విశ్వాసం మీకూ వుంటే మిమ్మల్ని నియంత్రించేందుకు వేరే దేవుడు అవసరం లేదు.

మీలో జ్ఞానముంటే అదే మిమ్మల్ని నియంత్రిస్తుంది. ఆ జ్ఞానమే మీ జీవితానికి ఒక మార్గం చూపుతుంది. అందుకే జ్ఞానమే ప్రధానం.

**ప్రపంచమే ప్రకృతిలోని ఉద్యానవనంలా మారితే బాగుంటుంది కదా?**

నిజానికి మన చూపులతో చూసే ప్రశాంతత ఏదీ నిజంగా ప్రశాంతంగా ఉండదు. చల్లగాలి వీచే ఉద్యానవనాన్ని చూసి మనం నిర్ణయం తీసుకోవడం చాలా తప్పు. భూభాగపు లోపలి పొరల్లో చూస్తే మట్టికి, వేరుకి, భూపొరల్లో జీవించే పురుగులకి అనుక్షణం యుద్ధం జరుగుతూనే వుంటుంది.

ఈ ప్రక్రియవల్ల ప్రతిక్షణం కొన్ని వేల జీవరాసులు పుడుతూ ఉంటాయి. మరణిస్తూ ఉంటాయి. ఈ జీవన్మరణ యుద్ధంలో, హింసే జీవితంకాదు. అలాగని అహింసా జీవితం కాదు. జీవులు పుట్టుట – గిట్టుట జీవిత పరమార్థం అని తెలుసుకోవాలి.

**నాకు సంస్కృత భాష రాదు. శ్లోకాలకు అర్థం తెలుగులో వున్నవి చదువుకోవచ్చా? అలా చేస్తే నాకు పుణ్యం వస్తుందా?**

మంత్రమంటే ధ్వని. ఆ ధ్వని ప్రాముఖ్యతను అర్థం చేసుకుని ఉచ్ఛరిస్తేనే ప్రయోజనం. ఆ ధ్వనిని ఎలా ఉచ్ఛరించాలో తెలియకుండా చదివితే అందులో స్వచ్ఛత ఉండదు. ఏ మాత్రం ఉపయోగం వుండదు.



సంస్కృత భాష ధ్వని ప్రాధాన్యమైనది. అయితే సంస్కృత ఉచ్ఛారణ మీద ప్రాంతీయ భాషల ప్రభావం లేకపోలేదు. బెంగాలీలు 'వా' బదులు 'బా' పలుకుతారు. తమిళులు 'ఘా' పలకలేరు. 'ఖా' పలుకుతారు. ఇక విదేశీయులు మంత్రాలు చదివితే మరింత భిన్నంగా ఉంటుంది.

సంస్కృత మంత్రాలను చదవాలంటే ముందుగా ఆ భాషమీద పట్టువుండాలి. సంస్కృతం నేర్చుకునేందుకు ఓపిక, పట్టుదల అవసరం.

కేవలం ఏదో ఒక భాషలో మంత్రాలు కనిపించాయి కదా అని చదవడం దండగ. దానివల్ల ఉపయోగం లేదు. ఒక్కొక్క తరహా మంత్రం జపిస్తే ఒక్కో ప్రత్యేకమైన దాడి ఉత్తేజితమవుతుంది. అది ఒకరకమైన శక్తిని ఇస్తుంది.

ప్రతి మంత్రం శరీరంలోని ఒక ప్రత్యేక భాగం మీద ప్రభావం చూపుతుంది. అర్థం తెలియకుండా, పద్ధతి పాటించకుండా చదివే మంత్రం వల్ల మెదడు మరింత పాడవుతుంది. సరిగా చదివినపుడే మంత్రం ఫలిస్తుంది. లేకపోతే నష్టాలు కలుగుతాయి.

**ప్రస్తుతం ఉన్న చదువుల పద్ధతిలో ఎటువంటి లోటు ఉంటుందని మీరు అనుకుంటున్నారు?**

నేటి విద్య తనకు అనుగుణంగా ఎలా ఉపయోగపడుతుందో అలా మలచుకుంటున్నారు నేటి సమాజం. ఒక ఆకుని చూపినా కూడ, ఈ ఆకు వల్ల తనకు ఏమైనా ఉపయోగం ఉందా! అనే స్వార్థానికి ఆలోచిస్తున్నారు.

చెట్లు, గాలి, భూమి అడుగున ఉన్న ఖనిజ సంపద ప్రకృతి... దేన్నీ మానవుడు వదలిపెట్టడం లేదు.

చీమకు ఒక లోకం ఉంది. అలాగే ఏనుగుకు కూడా ఒక లోకం ఉంది. ప్రతి జీవరాశికి ఒక లోకం ఉంది. ప్రకృతిపరంగా మనిషి కూడా మిగిలిన జీవరాసుల వలే ఒక జీవరాశే.

కాకి, సీతాకోకచిలుక, మనిషికి ముగ్గురికీ ఒకేసారి మరణం సంభవించింది. పై లోకానికి వెళ్లారు. బ్రహ్మ ముందు నిలబడ్డారు. బ్రహ్మ, సీతాకోకచిలుకను ఉద్దేశించి, నీకు ఎక్కడ చోటు కావాలి? అని అడిగారు.

దానికి సీతాకోకచిలుక నేను పుష్పాలలోని మకరందం సేకరించేదాన్ని కదా! అందుకని నాకు స్వర్గంలో చోటుకావాలి అని అడిగింది.

కాకినీ అలాగే అడిగాడు బ్రహ్మ. నేను విత్తనాలను ఒకచోటు నుండి అన్ని చోట్లకు బదిలిచేయడం వల్లనే అడవులు ఉత్పత్తి చెందుతున్నాయి. అందువల్ల నాకు కూడ స్వర్గంలోనే చోటు కావాలి అని అడిగింది.

మనిషిని కూడా అడిగాడు బ్రహ్మ.

అప్పుడు మనిషి, 'హలో మీరు కూర్చుంది నా కుర్చీలో, లేవం'డని చెప్పేసరికి బ్రహ్మ ఖంగు తిన్నాడు.

భగవంతుడు తనకులాగే స్వరూపం ఉన్నవాడు కాబట్టే, మానవునికి అంతులేని అహం. మిగిలిన జీవరాశులకన్నా, తనను ఎంతో తెలివిగలవాడినని అనుకుంటున్నాడు కాబట్టే అతనికి అహంకారం ఎక్కువగా ఉంది.

తనకు ఉపయోగపడేవాటినే ఉంచుకొని, మిగిలిన వాటిని అంతం చేయాలనుకుంటున్నాడు మానవుడు. దీనికి అనుగుణంగా ప్రస్తుతం అందుతున్న విద్య అదీ ఒక కారణమే.

ఇతరుల వల్ల మనకు ఎటువంటి ఆదాయం లభిస్తుంది అని నేర్పించే విద్య మంచి విద్య కాదు. విద్య అంటే ఇతరులను కూడా మనలో ఒక్కరిగా చూడాలని నేర్పించాలి. అలాంటి విద్య అందరికీ దొరికితే మానవబంధాలు అమృతంగా మారుతాయి.

**శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదంటారు కదా. మరి ఈ ప్రపంచంలో జరిగే ఘోరాలు, పాపాలు అన్యాయాలకు మూలం ఏమిటి?**

ఈ సమస్య మన అంచనాల నుండి సృష్టించుకున్నది. మనం ఏం చేయగలమో అది చేయం. కాని మన చేతిలో లేనిదాన్ని సరిదిద్దాలనుకుంటాం. అదే మన జీవితంలోని అసలు సమస్య.

ఈ దేశానికీ సమస్య ఇదే. ఈ దేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య దేశ సమస్యలను మన చేతిలోకి తీసుకోక భగవంతునికి వదిలేయడం.



ఈ లోకంలో హాయిగా జీవించాలంటే భగవంతుడు అక్కరలేదు. ఆధ్యాత్మికత అసలే అక్కరలేదు. కేవలం నీ మెదడును, అంగాలను సక్రమంగా వినియోగిస్తే నీ జీవితం గడిచిపోతుంది. తమ శక్తిని సక్రమంగా ఉపయోగించుకున్న వారంతా హాయిగా బతుకుతున్నారు. అంతా ఆ భగవంతుడే చూసుకుంటాడని తమవంతు కృషి చేయనివారే కష్టాలు పడుతున్నారు. అందుకు మన దేశమే సాక్ష్యం.

ఒకవైపు ముక్కోటి దేవతలున్నారు, మరోవైపు సగం జనాభా అర్ధాకలితో గడుపుతున్నారు. ప్రజలు తమ శక్తిని సరిగా వాడటంలేదనే దానికి ఇంతకన్నా ఏం నిదర్శనం కావాలి. మనసు, శరీరం సక్రమంగా వాడితే హాయిగా జీవించగలుగుతారు.

దేవుడి పేరుతో మానవత్వానికి దూరమవుతున్నారు. దేవుడి గురించి తక్కువ మాట్లాడి ఇరుగు పొరుగుల గురించి ఎక్కువగా ఆలోచించడం ప్రజలు మొదలుపెట్టాలి. మానవత్వం వెల్లివిరిస్తే దైవత్వం వెంట నిలుస్తుంది. కాని నేటి సమాజంలో దైవం పేరుతో మానవత్వం హత్య చేయబడుతున్నది.

**ప్రేమ ఒకవైపు. బుద్ధి మరోవైపు రెండింటి సంఘర్షణ మధ్య నలుగుతున్న నేను ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో తెలియజేయండి?**

మీ ఆత్మీయుల గురించి నిర్ణయం తీసుకునేటప్పుడు మీరు ప్రేమావేశాలకులోనై అప్పుడప్పుడు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటారు.

జీవితాన్ని మనకి తగినట్టుగా కాకుండా, జీవితాన్ని జీవితంగానే భావించండి. మీరు చదువుకున్న వారైతే, మీ చదువుబట్టి కొన్ని అభిప్రాయాలు ఉంటే తెలివిగా మసలుకోలేం. మనసులోని ఆదుర్దాన్ని విస్మరించి చూస్తే మీకు స్పష్టత తెలుస్తుంది. మీకు స్పష్టత తెలిస్తే బుద్ధి బాగా పనిచేస్తుంది.

జీవితమనే బాటలో స్పష్టమైన – అడుగులు వేస్తేనే మన ప్రయాణం సజావుగా సాగుతుంది. ఎటువంటి ఒడుదుడుకులు లేకుండా – ప్రమాదాలు లేకుండా, స్వతంత్రంగా సరైన మార్గంలో నడవగలుగుతాము.

**అందుకు ఈ కథ ఉదాహరణ:**

నా జీవితాన్ని నేను ఎలా నిర్ణయించుకోవాలి అని శిష్యుడు గురువుని అడిగాడు. నీ ప్రశ్నకు రేపు సమాధానం చెబుతామని చెప్పి ఓ టేబుల్ తయారు చేయమని చెప్పి వెళ్లిపోయాడు గురువు.

మరునాడు టేబుల్ తయారుచేశాడు శిష్యుడు. ఒక కాలు మాత్రమే బిగించాలి. కాలుని మేకుతో బిగించేటప్పుడు ఒక్క మేకు మాత్రం దిగడం లేదు.

గురువు చూస్తున్నారని ఎక్కువ బలంతో మేకుని కొట్టాడు. అప్పుడు అది కొద్దిగా పగిలింది. గురువు చిరునవ్వు నవ్వాడు. అప్పుడు గురువు నీవు ఒకే బలంతో అన్ని మేకులు బిగించావు. కాని చివరగా ఒక మేకు విషయంలో అతిగా బలం చూపడం వల్ల ఆ టేబులు చెక్క కొంచెం పగిలింది.

అంటే అర్థం... ఒక్కో పనిని ఒక్కోవిధంగా ఆ సందర్భాన్నిబట్టి జాగ్రత్తగా చేయాలి. ఆవేశంలోనో, అలవాటు ప్రకారంగాను చేయడంవల్ల, దాని ఉద్దేశ్యం మారుతుంది. అలాగే కొన్ని సందర్భాలలో పిల్లలను సున్నితంగా వ్యవహరించాలి. కొన్ని సందర్భాలలో కఠినంగా వ్యవహరించాలి.

ఆ చిన్నారి మన ఆత్మీయులా కాదా! అది ఆలోచించకూడదు. ఆ సందర్భంలో ఎటువంటి తీర్పును ఇవ్వగలరో కాలమే నిర్ణయిస్తుంది.

కొంచెం అమృతం. కొంచెం విషం. రెండింటి రుచులను జీవితంలో ఆస్వాదించాలి.

**ధనవంతుడు, జ్ఞానులు, మహాత్ములు ఎందరోవుండి కూడా మానవునికి ఆకలిదప్పికలు, వ్యాధులు ఎందుకు ఉంటున్నాయి?**

ఈ దేశంలో ఆకలిదప్పికలకు ఎవరు కారణం, బాధ్యతారహితంగా జనాభాను పెంపొందించింది దేవుడా? మీరా?

లెక్కలేకుండా పిల్లలను కనేసి దేవుడిచ్చాడని చెప్పుకోకండి. బుద్ధుడు మహావీర్ వంటివారు జ్ఞానాన్ని ఇవ్వడానికొచ్చారు. అన్నం పెట్టడానికి రాలేదు.



మీకు అవయవాలు ఎందుకున్నాయి. అవయవాలను తెలివిగా ఉపయోగిస్తారనే నమ్మకంతోనే, దేవుడు మిమ్మల్ని సృష్టించి, ఈ భూమిపైకి పంపాడు. కాబట్టి తప్పు మీలోనే వుంది. మీలో మార్పు వచ్చే వరకు, మిమ్మల్ని ఏ మత బోధన కూడా మార్చలేదు.

దేవుడిని ప్రార్థిస్తూ, ఆకాశంవైపు చూస్తూ నడిస్తే, కిందనున్న ఏ మురికి గుంటలోనైనా పడే అవకాశం ఉంది. దయచేసి మీ జీవితాన్ని మీ చేతిలోకి తీసుకోండి. దేవునిపై భారం వేయకండి.

**దేవుడున్నాడనేందుకు నిదర్శనాలున్నాయా! మీరు ఆ భగవంతుడిని చూశారా?**

నేను దేవుణ్ణి చూశానా అని గడచిన విషయం అడుగుతున్నారా! ఇదివరలో ఏమిటి నేను ఇప్పటికీ దేవుడిని చూస్తూనే ఉన్నాను. మీరు దేవుడని ఎవరిని అనుకుంటున్నారో అదే సృష్టి. అదే నేను భగవంతునిగా చూస్తున్నాను. జీవిని ఏది చూసినా భగవంతుని భావమే కలుగుతుంది. మీ శరీరాన్ని చూసుకోండి లేదా మీ ఆలోచన, మీ సంభాషణ, మీలోని ప్రాథమిక అంశాలు వగైరాలన్నీ సృష్టికి మూలం.

మీ శరీరమే ఒక మహాద్భుతం. నోటిలో నుండి లోపలికి ప్రవేశించిన పదార్థం మరుక్షణం ఏమవుతున్నది. జీర్ణమై మనిషిలో భాగమవుతున్నది. ఆహార పదార్థంలో నుండి మనిషిని తీసుకురావడం అంత సులభమైన విషయం కాదు. కాని ఆ పని ప్రతి మనిషి శరీరం చేస్తోంది. అంటే సృష్టికర్త ఏం చేస్తాడో అది మీ శరీరం చేస్తోంది. శరీరంలో సృష్టి జరుగుతోంది. అది ప్రతిక్షణం నేను గమనిస్తున్నాను.

కాబట్టి దేవుణ్ణి చూశారా అన్నది ప్రశ్నకాదు. ఎందుకంటే నేను ప్రతిక్షణం చూస్తూనే వుంటాను.

జ్ఞానాంగాలు తమ చుట్టూ జరిగే వాటిని గమనిస్తాయి. అవి గమనించేవన్నీ జ్ఞానాంగాలన్నింటినీ సృష్టించిన సృష్టికర్త గురించి మీరు తలచుకుంటున్నారా! ఆ భగవంతుణ్ణి మానవుని పంచేంద్రియాలు పట్టలేవు. ఎందుకంటే పంచేంద్రియాలకు అందనటువంటిది ఆ బ్రహ్మ పదార్థం.

*జ్ఞానాంగాలకు ఆవల వున్న ఆ భగవంతుని చూసేందుకు వీలుగా మన శరీరాన్ని మార్చుకోవాలి. అది యోగాభ్యాసం ద్వారానే సాధ్యం. ఆ స్థాయికి చేరితే ఆధ్యాత్మిక స్థాయికి చేరినట్టే. ఆధ్యాత్మికత అంటే భౌతిక అంశాలకు అతీతమైనది. ఆ స్థాయిలో, ఆ దశలో మనకు కలిగే అనుభవమే భగవద్దర్శనం అనుకుంటాం. అటువంటి అవకాశం కల్పించే శక్తి శరీరంలో ఉంది. అయితే ఆ శక్తిని మనం అనుభవంలోకి తీసుకొస్తామా లేదా అన్నదే ప్రశ్న.*

**మీ సంస్కృతిలో, మీ భగవంతుడు ఎందుకు ఆయుధాలు ధరించాడు, అని నా మిత్రులు కొంతమంది అడుగుతున్నారు? ఏం చెప్పాలి?**

*మన సంస్కృతిలో భగవంతుడే ఆయుధాలతో కనిపిస్తున్నాడు. కాని మానవుడే నిరాయుధుడై ఉన్నాడు. నేడు ఎదుగుతున్న దేశాలన్నీ ఆయుధాలు తయారు చేస్తున్నాయి. నేడు ప్రపంచంలో ఆయుధ విక్రయమే పెద్ద వ్యాపారంగా తయారైంది.*

*మన దేశం వద్ద ఆయుధాలు వుంటేనే పొరుగు దేశస్తులు మనల్ని ప్రశాంతంగా బతకనిస్తారు. ఆ ఆయుధాలే లేకుండా మనపై యుద్ధానికి దిగి మన దేశాన్ని ఆక్రమించుకోవాలని చూస్తారు.*

*ప్రతి జీవి, ఇతర జీవులతోకాని, మన తోటి మానవులతోకాని, సహోదరభావంతో మెలగితే అసలు ఆయుధాలతో అవసరం వుండదు కదా!*

*మానవుడు తనకు మంచి జరగాలని, తనను ఎల్లప్పుడూ కాపాడుతూ ఉండాలని కోరుకునే కదా దైవసన్నిధికి వెళ్లి కోరుకుంటాడు. దుష్ట శిక్షణ – శిష్టరక్షణ కొరకే ఆయన ఆయుధాలు చేతబట్టింది. మానవునికి ఏదైనా ఆపద కలిగినప్పుడు ఆయుధం చేత పట్టవచ్చున్నది భగవంతుడి సందేశం.*

**మరణానంతరం కూడా మరో జీవనవిధానం ఏమైనా వుందా? చనిపోయిన వారితో మాట్లాడటానికి ప్రత్యేక శిక్షణ ఏదైనా వుందా?**

*మరణం లేని జీవితం ఉండదా అనే మనిషిలోని ఆత్రుతే ఇలా ప్రశ్నగా బయటపడుతుంది.*

*మరణం అనేది జీవితానికి ముగింపు కాదు. దాని తర్వాత కూడా జీవితం వుంది అని నమ్మితేనే మనం ప్రశాంతంగా జీవించగలుగుతాం.*



*60, 70 సంవత్సరాల ఈ జీవితంలోనే, నేను ఎలా జీవించాలి అని అనుకుంటున్నారు, అలాంటిది మరణానంతరం కూడా మీ జీవితాన్ని మీరే ఎంచుకుని ఎలా జీవించాలని బాధపడటం ఎందుకు?*

*ముందుగా ప్రాణంతోనే జీవించాలని ఆశపడండి. ప్రేమను, ఆనందాన్ని అనుభవించడాన్ని నేర్చుకోండి. వచ్చే ఆదివారం ఏమి చేయాలి అని ఇంతవరకు ప్లాన్ చేసుకోలేదు. మరణానంతరం ఏమి చేయాలనేది ఇప్పటినుండే ఎందుకు ఆలోచిస్తున్నారు.*

*మీ ఇరుగుపొరుగు వారితో గొడవలు లేకుండా ప్రేమగా మసలుకోండి. చనిపోయినవాళ్ల గురించి మాట్లాడి ఏమి చేయగలుగుతారు? అది చెయ్యవా? ఇది చెయ్యవా అని అడుగుతారు అంతే కదా?*

*మీ బాధ్యతలను చనిపోయినవారిపై మోపడం అసహ్యించుకోవలసిన విషయం కదా! పాపం చనిపోయిన వాళ్లనైనా ప్రశాంతంగా ఉండనివ్వండి.*

**ప్రస్తుత రోజుల్లో మనుషులు నైతిక విలువలను పూర్తిగా వదిలేస్తున్నారు. నైతిక విలువలను వీరు పాటించేలా చేయడం ఎలా?**

*మనుషులలో సహజంగా వుండే మానవత్వపు విలువలను నాశనం చేసినందుకే లోకంలో ఇంత గందరగోళం నెలకొన్నది. తిరిగి జీవితాలకు ఒక క్రమబద్ధత రావాలంటే తిరిగి మానవతా విలువలను తీసుకురావాలి. నైతిక విలువలు లేకుంటే ఈ లోకంలో మనిషికి, పశువుకి తేడా ఉండదు.*

*ఇక్కడ నైతికవిలువలు వదిలేయడం కాదు మానవత్వాన్ని వదులుకోవడం జరిగింది. మానవత్వం ఉంటే నైతిక విలువలు వాటంత అవే వస్తాయి. కాబట్టి కావాల్సింది మానవత్వం. మానవత్వం ఉంటే నైతిక విలువల గురించి విడిగా ఆలోచించనక్కరలేదు. ఎవరైనా ఒకరు నైతిక విలువలను పాటిస్తుంటే వారిని అనుసరించేందుకు ఎక్కుమంది వుండరు.*

*మనుషులకు ముందుగా మానవత్వం అవసరం. ఆపైనే నైతిక విలువలు. నేడు ఎక్కువమంది నైతిక విలువలు వున్నట్టు నటిస్తున్నారు. వారిలో మానవత్వం మచ్చుకైనా కనిపించదు. మనుషుల్లో మానవత్వం పెరిగితే లోకం ఆనందంగా ఉంటుంది.*

**మానసిక ప్రశాంతత అంటే ఏమిటి? అలాంటి ప్రశాంతతను అందుకోవడం ఎలా?**

ఆనందం, ప్రశాంతత, ప్రేమ అంటే ఏమిటి? అవన్నీ మన కోరికలు. జీవితమంతా వుండాలనుకుంటాం. కాని మనసు వుండనీయదు. ఫలితంగా ప్రశాంతత ఉండదు. మనం ప్రేమను కోరుకుంటాం. కాని ఎక్కడి నుండో, ఎవరితోనో శతృత్వం వస్తుంది.

మానసిక ప్రశాంతత లేదని వైద్యుడి దగ్గరికి వెళతారు. ఆయన మందులిస్తాడు. మాత్రవేసుకుంటే కొద్దిసేపు ప్రశాంతత వస్తుంది. అంటే శరీరంలోకి మాత్ర ద్వారా రసాయనం చేరగానే మార్పు వచ్చి ప్రశాంతత వచ్చింది. ప్రశాంతత అనేది శరీరంలోని రసాయనమే. ప్రేమ ఒక తరహా రసాయనం. మానసిక ఆందోళన ఒక తరహా రసాయనమే.

బయటకు కనిపించే భావం ఏదైనా దానికి తగిన రసాయనం లోపల వుంటుంది. ప్రశాంతత ఏదో ఒక సమయంలో అనుభవిస్తున్నామంటే అందుకు తగిన రసాయనం మనలోనే దాగుందన్నమాట. ఒకవేళ లేకుంటే మనం ఆ రసాయనం తయారుచేసుకుని ప్రశాంతతను సంపాదించుకోవాలి.

యోగాను సరిగా సాధన చేయగలిగితే మన శరీరంలో శక్తియుక్తులను, రసాయనాలను బయట కలిగే అనుభవాలకు అతీతం చేయగలుగుతాం. అప్పుడు బయట జరిగే సంఘటనలు, భావాలు లోపల ప్రశాంతతను అలాగే నిలిపివుంచుతాయి. ఆందోళనలు కలగవు. అటువంటి స్థితినే ఆధ్యాత్మికస్థితి అనవచ్చు.

**నేను దేవుడిపై భక్తిగానే ఉంటున్నాను. కానీ ఆయన నాపై కరుణ చూపడం లేదు?**

మీ సమస్య అదే కదా! చూడనప్పుడు ఆయనని ప్రేమిస్తున్నారు. ఆయన మీ ఇంటికోపూట భోజనానికి వచ్చినప్పుడు ఆయనపై ద్వేషాన్ని పెంచుకోవడంతో మీ ప్రేమ ఆవిరిగా మారిపోతుంది.

మీరు భగవంతుణ్ణి మీ పెంపుడు కుక్కలా భావిస్తున్నారు. దానికేసే బిస్కట్లులాగా దేవుని కూడా మొక్కుబడులు చెల్లిస్తారు. కుక్కకు మీరు పారవేసిన దాన్ని తీసుకురమ్మని చెబుతారు. దేవుని దగ్గర అది ఇవ్వు, ఇది ఇవ్వు అని కోరతారు. ఇదేనా భక్తి.



మన చుట్టూ వున్నవారు దేవునిసృష్టే. జీవించివున్న పక్కవారిని అసహ్యించుకుంటున్నారు. వారి మరణానంతరం వారి సమాధులపై కవితలు రాస్తున్నారు. సృష్టిని అసహ్యించుకుని, సృష్టించేవాడిపై మాత్రం భక్తి వుందనడం ఆయనని అవమానపరచడంలాంటిది. ఆ భక్తిని ఆయనెలా చూడగలడు.

మీ ప్రతి శ్వాసలోను, ప్రతి పనిలోను ప్రేమ వుండాలి. అప్పుడే ఆ ప్రేమ తనంతట తానుగా మిమ్మల్ని భగవంతుని వద్దకు చేరుస్తుంది.

**సమాజం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా అత్తాకోడళ్ల సమస్య తీరనే తీరదా?**

స్త్రీలకు తమ గొప్పతనం తెలియకపోవడంవల్లే ఈ గొడవంతా! సమాజంలో ఈ రోజు మీరు ఏ అంతస్తులో ఉన్నా, వీధిలోపడి గొడవల్లోకి దిగితే మీ మర్యాద ఏం నిలుస్తుంది? మిమ్మల్ని మీరే కించపరచుకున్నట్లు వుంటుందే తప్ప మరేం అవుతుంది?

స్త్రీలు నడుచుకునే విధానాన్ని బట్టి వాళ్ల మర్యాద ఉంటుంది. ముఖ్యంగా, ఒక స్త్రీ మరొక స్త్రీని గౌరవంగా చూడటం నేర్చుకోవాలి. అలాగాక తనకు మాత్రమే మర్యాద దక్కాలని అనుకున్నా అందులో అర్థంలేదు. అది జరగదు. మీ కూతుళ్లు, కోడళ్లను ఈ పిచ్చితనం నుంచి కాపడకపోతే రేపటి తరం బాగుపడదు.

**ఏ పత్రికలు చూసినా దొంగతనాలు, హత్యలు వంటి వార్తలే కనిపిస్తున్నాయి. ఎందుకని?**

దేశమంతటా మంచి కార్యక్రమాలు జరుగుతూ ఉంటున్నా మంచిని మంచిగా చెప్పుకునే కార్యక్రమాలు ఏమీ జరగడం లేదు. సమాజానికి ఎంతో ఉపయోగకరమైన సేవా కార్యక్రమాలను చేసే వాళ్లని ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఒక జేబుదొంగ బస్సులో దొంగతనం చేస్తే అతను వెంటనే ఫేమస్ అయిపోతున్నాడు. చరిత్రలో హిట్లర్ గురించి, యుద్ధాల గురించి చెప్పుకునేలా, బుద్ధుడు గురించి మహాత్ముల గురించి చెప్పుకోవడం లేదు. మరచిపోవాలనుకునే వాళ్లని గుర్తుచేస్తుంది ఈ సమాజం. కాని గుర్తుంచుకోవలసిన వాళ్లని మాత్రం అసలు పట్టించుకోవడం లేదు.

ఇటువంటి తప్పుడు పద్ధతులను విడనాడినప్పుడే మన సమాజం కూడా మారుతుంది.

**సముద్రపు ఉప్పెన ఎన్నో ప్రాణుల్ని బలితీసుకోవడం అనేది దేవుని నిర్లక్ష్యమేనా?**

దైవత్వాన్ని అవసరానికి మించి చర్చించి, ముఖ్యమైన మానవత్వాన్ని మరచిపోయాం.

దైవత్వం అనేది ఒక పూల చెట్టువంటిది. చెట్టు నిండా పువ్వులు పూయాలంటే దానికి తగిన ఎరువు వేయాలి. నిజమైన మానవత్వమే, మానవులకు మంచి ఎరువులాంటిది. మానవత్వం లేనిచోట ఎన్ని దేవాలయాలు కట్టినా, దైవత్వం వుండదు.

ప్రకృతి భీభత్సం కూడా మానవుల యొక్క మానవత్వాన్ని పరీక్షించడానికే వస్తుందని అనుకోండి! అన్నింటినీ పోగొట్టుకున్నవారిని, మీకు సంబంధం లేనివారు అని వారిని తరిమి వేయకుండా, మీ కుటుంబంలో ఒకరుగా అనుకొని ప్రేమించండి. మానవత్వంలో నుంచి దైవత్వంలో అడుగిడటానికి ఇది మీకు దొరికిన మంచి సందర్భంగా భావించండి.

**కచ్చితంగా** ఉండడమెలా?

'ఓ ఆయనా... ఆయన్ని చూసి గడియారంలో ముళ్లను దిద్దుకోవచ్చే!' అని ప్రతి ఒక్కరూ అనే ఒక వ్యక్తిని మీరు చూసి ఉండవచ్చు. చాలా కచ్చితమైన వ్యక్తి అని మీరూ అనుకుని ఉంటారు.

నిజానికి అతడు కచ్చితమైన వ్యక్తి మాత్రమే కాదు. రాయి, బండ, మార్పుకు చోటివ్వనంతగా తన అభిప్రాయాల్ని, భావాల్ని లొంగదీసుకుని, వాటి గొంతు పిసికేసినవాడు. కొత్త భావాలకు చోటివ్వకుండా, తనకుతానే సంతోషంగా సంకెళ్లు వేసుకుని తికమకపడేవాడు. ప్రకృతి సహజంగా లభించే ఆనందాన్ని అనుభవించడం, ఈ కచ్చితమైన వాళ్లకు కష్టంగానే ఉంటుంది.

నలుచదరంగా ఉండే మంచుముక్కను, గుండ్రటి పాత్రలో పెట్టాలని ప్రయత్నిస్తే, అది పగిలిపోతుంది. రూపం మారిపోతుంది. అదే నీరైతే ఏ పాత్రలో వుంచినా



తన రూపాన్ని ఆ పాత్రకు తగ్గట్టు మార్చుకుంటుంది. అందువల్ల నీటిగుణం మారదు. అలాగే పరిస్థితుల్ని బట్టి మీరూ మారండి.

**భగవంతునికి చేరువలో వుండాలంటే, అల్పమయిన దినసరి చర్యలకు దూరంగా వుండాలా?**

నా దుస్తులను నేను ఉతుక్కుంటున్నాను. అది దినసరి చర్య కదా! కొబ్బరిచెట్లకు నేనే నీళ్లు పోస్తాను. నాకు ఇష్టమైన భోజనాన్ని నేనే తయారుచేసుకుంటున్నాను. ఇవన్నీ అల్పమైన కార్యక్రమాలా! వీటిని వీడి మనము ఎలా జీవించగలము.

మీరు రాజకీయాలలో వుండవచ్చు. గణాంకాల వారై వుండవచ్చు. ఒక పెద్ద సంస్థ నిర్వాహకులై వుండవచ్చు. రహదారులు శుభ్రపరిచే పనివారై వుండొచ్చు. ఎవరైనా సరే ప్రపంచంలో జీవించడానికి కొన్ని పనులు చేయవలసిందే. దానిని అల్పమైన పని అనుకుంటేనే ఆపద వస్తుంది.

మీకు ఇష్టమైనపని ఏమిటో! ఆ పనిని పరిపూర్ణంగా చేసిననాడే దేవునికి దగ్గరగా వున్నారని అర్థం. మరొకరిలా జీవించాలని అనుకుని, తీర్మానించుకొని, అనవసరంగా బాధలు పంచుకోవద్దు.

**నాకు తగిన గురువును కలుసుకోవడమెలా?**

గురువుకోసం వెతుక్కుంటున్న నీవు ఎటువంటి గురువును ఎంచుకుంటావు? నీకు ఎవరు నచ్చుతారో వారిని గురువుగా ఎంచుకుంటావు. నీకు ఎవరు నచ్చుతారు? ఎవరూ నచ్చరు. నీకు తగిన మాటలు చెప్పేవారిని ఎంచుకుంటావు. అవతలి వ్యక్తి మంచి చెపుతున్నా, ఆ మాటలు నీకు నచ్చకపోతే ఆ క్షణంలో అవతలి వ్యక్తి మంచివాడిగా అనిపించడు.

స్నేహితులను మన ఇష్టాలకు తగినట్టే ఎంచుకుంటాం. నువ్వు తప్పుమార్గంలో వెళుతున్నావని ఎవరైనా చెపితే వారిని శత్రువులుగానే భావిస్తాం.

కాబట్టి నీకు నచ్చిన మాటలు చెప్పేవాడిని గురువుగా ఎంచుకుంటే అది సరైన నిర్ణయం కాదు.

నిజమైన గురువు అంటే నీలోని చెడును పోగొట్టేవాడు. నిన్ను నిరంతరం విమర్శించేవాడు. కాబట్టి గురువు కోసం ప్రత్యేకంగా వెదకకు. తగిన గురువు దొరకాలనే కోరికను నరనరాల నింపుకో. తప్పకుండా దొరుకుతాడు. గురువూ తనకు తగిన శిష్యులకోసం నిరంతరం వెతుకుతుంటారు. తగిన శిష్యుడు దొరకడం కష్టమని గురువుకూ తెలుసు.

నీవు కలిసిన వ్యక్తి తగిన గురువు అవునో కాదో నీకు ఎలా తెలుస్తుంది? నువ్వు ఎవరి పాదాలచెంత కూర్చున్నావో అతణ్ణి చూసినపుడు భయం కలుగుతుంది. దూరంగా వెళ్లాలనిపిస్తుంది. కాని వెళ్లబుద్ధికాదు. మరికొంచెం సేపు చూద్దామనిపిస్తుంది. అటువంటి భావం కలిగించినవాడే తగిన గురువు.

తొలి పరిచయంలోనే నీతో నవ్వుతూ మాట్లాడి బుట్టలో వేసుకునేవాడు అసలు గురువే కాదు.

**ఆడ మగల మధ్య ఆకర్షణ సరైందా? కాదా?**

యవ్వనంలో ఉన్నప్పుడు ఆడ మగల మధ్యలో ఏర్పడే ఆకర్షణ మీరు వద్దని అనుకున్నా వదలలేరు. అది సృష్టిధర్మం. అది సరైందా! కాదా! అని ఆలోచించనవసరం లేదు. పాశ్చాత్య దేశాలలో విశృంఖలంగా శృంగారాన్ని పాటిస్తున్నారు. కుటుంబం, కట్టుబాట్లు, అనే సమస్యల్లో ఇరుక్కుపోకుండా సంతోషంగా జీవించాలనుకుంటున్నారు. యవ్వనంలో ఉన్నప్పుడు అది ఒక మధురానుభూతిగా వుంటుంది. కాని వృద్ధాప్యంలో నిజమైన ఆత్మీయులు లేకుండా మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.

బాధ్యతారహితంగా కాకుండా శృంగారానికి ప్రేరేపితులైన, అనుభవించి వదిలేసిన, ఒక వారసత్వమే గుర్తింపులేని అనాథలుగా పుడుతున్నారు. శరీర పరమైన ఆశలను దాటి ఒక జీవితముందని మరచిపోవద్దు, అతి శృంగారం ఆపద, అందుకని శృంగారము లేకుండా జీవించడం కూడా ఆపదే.

బాధ్యత, పట్టుదల, కోరికలు ఇవి లేకుండా అసలు సంతోషమే లేదు. మీ జీవితం పక్కదారి పట్టకుండా ఈ మూడింటికే స్థానం ఇవ్వండి.



**రష్యాలోని ధ్యానలింగం మరొక హిందూ దేవాలయమా?**

కాదు. నిజానికి దీన్ని గుడిగా చూడనవసరం లేదు. గొప్పశక్తికి మూర్తిమత్వం కల్పించాలంటే మిగిలిన అన్ని రూపాలకన్నా లింగరూపం మంచిదని విజ్ఞానపరంగా ఋజువైంది. ఇక్కడ లింగం అనేది కావాల్సిన ఒక రూపం కోసం ఉపయోగించబడిందే తప్ప, ధ్యానలింగం అనేదానికి ఏ మతంతోనూ ఏ అనుబంధమూ లేదు.

ధ్యానలింగం ఉట్టి రాతితో చేసిన శిల్పం కాదు. అది ప్రాణమున్న గురువుగా భావింపబడుతుంది. అందులో పెద్ద ప్రాణశక్తి ఉంది.

మీరు ధ్యానం గురించి ఏ అనుభవం లేని వారే అయినా, కొంచెంసేపు కొన్ని నిమిషాలు ప్రశాంతంగా దాని ముందు కూర్చుంటే చాలు, పూర్ణ ఆనందాన్ని అనుభవించి అర్థం చేసుకోగల అవకాశంగా ఒక మెత్తని విత్తు మీలో పాతుకుంటుంది. ధ్యానలింగంలో ఉన్న ప్రాణశక్తికి అనుభవపూర్వకంగా మీరు తెలుసుకోగలుగుతారు.

మీరు ఏ దేశస్థులైనా, ఏ మతానికి చెందినవారైనా, మగవారయినా, ఆడవారయినా ధ్యాన లింగం మీకు ఒకే రకమైన జ్ఞానాన్నిస్తుంది, ఒక అద్భుతమైన అనుభవాన్నే కలిగిస్తుంది.

**యోగా చేయడం వల్ల మంచి జరుగుతుందని కచ్చితంగా మాటివ్వగలరా?**

పరిపూర్ణంగా! యోగా అంటే తలకిందులుగా నిల్చోడమో, పలుకోణాల్లో శరీరాన్ని ఒంపులు తిప్పడమో కాదు. అది యోగాసనం, అది యోగాలో ఒక చిన్నభాగం. అంతే! యోగా అంటే, తేడాల్ని తెగనాడి, అన్నిటితోనూ ఐక్యమవడం!

40 వేల ఏళ్ల క్రితమే యోగా నేర్పబడేదనడానికి ఆధారాలున్నాయి. నిజమైన, మంచి మార్పు లేకుండానే ఇన్నేళ్లుగా యోగా ఒక స్థానాన్ని నిలుపుకోగలిగేదా? గడిచిన వందలాది తరాల్లో నాగరికతలు, సంస్కృతి, భాష ఎన్నో విధాల మార్పుకు లోనయ్యాయి. ఐతే, యోగా ఏమాత్రం మార్పు చెందలేదు. సరైన యోగా ఒక విజ్ఞానం!

బల్బు ఎలా వెలుగుతుందని బళ్లోపాఠాలు నేర్చుకోనివాడు స్విచ్ వేసినా బల్బు వెలుగుతుంది. యోగా కూడా అలాంటిదే. చదువు, నిరక్షరాస్యతతో దానికి సంబంధం లేదు. ఏదో ఒక సంస్కృతికో, ఓ మతానికో అది బానిసకాదు. ఏ వర్గానికీ అది స్వంతం కాదు. ఏ దైవ నమ్మకం అక్కర్లేదు.

'ఈషా' లో యోగా అలాగే నేర్పబడుతోంది. దేనితోనూ తనను కలుపుకోకపోవడం వల్ల దాని మాహాత్మ్యం దానికే మిగిలి వుంటుంది. మీరు ఆడా, మగా, తెలుపా, నలుపా, భారతీయులా, అమెరికావాళ్లా... అని యోగా అడగదు. మీరు ఏ పరిస్థితిలో ఉన్నా యోగా బాగా పనిచేస్తుంది.

ప్రపంచ చరిత్రలో అది ఎప్పుడూ ఓడిపోలేదు. అది లెక్కలేనంతమంది మీద బాగా పనిచేసింది. నాకూ పనికొచ్చింది. మీకూ తప్పక పనిచేస్తుంది! యోగా తోడుంటే, మీరు కోరుకున్నదాన్ని కోరుకున్నట్టు తయారు చేసుకోగలరు. ఇంకా ఆలోచనలెందుకు? రండి. యోగా తన విశాలమైన వాకిళ్లు తెరచుకొని మీ రాకకోసం ఎదురుచూస్తోంది!

❑